# ప్రభాత్

**ఈ సంచికలో....**


- కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ... 5
- శవాల గుట్టలపై సాగుతున్న హిందూ ఫాసిస్టుల 'గౌరవయాత్ర' ... 7
- అమరులకు శ్రద్ధాంజలి ... 11
- కంపోసా రెండవ వార్షిక సమావేశంపై ... 18
- సిద్ధాంత వ్యాసం అనుభవవాదాన్ని అధిగమించడం ... 20
- పోరుపథంలో ఛత్తీసగఢ్ రైతాంగం ... 22
- సిపిఎం ఉక్కుపాదాన్ని ధిక్కరిస్తూ ... 40



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక**

**సంపుటి - 15** | **సంచిక - 4** | **అక్టోబర్ - డిసెంబర్ 2002** | **వెల - 10 రూపాయలు**


## అటవీ భూముల నుండి ఆదివాసులను వెళ్లగొట్టే ప్రభుత్వ కుట్రను ఓడించండి !

## 'అడవిపై హక్కు ఆదివాసులదే' నని ఎలుగెత్తి చాటండి !!

ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల మూలంగా ప్రజలు ఎన్నో దుష్ఫలితాలు అనుభవిస్తున్నారు. ఈ విధానాలు సమాజంలోని అన్ని పీడిత వర్గాలకూ తీరని హాని కల్గిస్తూ, పిడికెడు మందికి ఎనలేని లాభాలు సమకూరుస్తున్నాయి. సామ్రాజ్యవాదుల ఆదేశాలకు లోబడి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మూలంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా దాదాపు కోటిన్నర మంది ఆదివాసుల్ని వాళ్ల భూముల్నుండి వెళ్లగొట్టడానికి రంగం సిద్ధమైంది. అక్రమ కలప వ్యాపారంలో పేరు మోసిన మాఫియాలనూ, వారితో కుమ్మక్కైన దోపిడీ నాయకులనూ చూసీ చూడనట్లుండే కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అడవుల మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్స్ - ఎంఓఇఎఫ్), ఇప్పుడు 12.5 లక్షల హెక్టార్ల అటవీ భూముల్ని అతి వేగంగా ఖాళీ చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనితో ఆర్థికంగా బలహీన స్థితిలో, రాజకీయంగా అసంఘటితంగా ఉన్న కోట్లాది ఆదివాసుల మనుగడే ప్రశ్నార్థకం కానున్నది.

> ### ప్రజలారా !
>
> - మన భూముల్ని కబ్జా చేసుకోవడానికి వచ్చే అటవీ అధికారులనూ, పోలీసులనూ తన్ని తరమండి !
> - ఈ అడవి మాదేనని ప్రకటించండి !
> - ప్రభుత్వ పట్టాలను కాలదన్ని అధికారం మాదేనని చాటండి !
> - దండకారణ్యం బాటే దేశంలోని ఆదివాసులందరి బాట అని నలుదిశలా చాటండి !
> - ప్రభుత్వ కుట్రలను ఓడించడానికి ప్రజాస్వామిక శక్తులందరినీ కలుపుకొని విశాల ఐక్యవేదిక నిర్మాణానికై సన్నద్ధంకండి !
>
> **– దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**
>
> **సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]**

ఎంఓఇఎఫ్, మే 3న విడుదల చేసిన తన సర్క్యులర్లలో రెగ్యులరైజ్ చేయడానికి అనర్హులైన అక్రమ కబ్జాదారులందరినీ అటవీ భూముల్నుండి వెంటనే ఖాళీ చేయించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలనూ కోరింది. ఇందుకు సెప్టెంబర్ 2002ను తుది గడువుగా నిర్ణయించింది. ఈ సర్క్యులర్ అటవీశాఖ అధికార్లకు కబ్జాదారులపై విచారణ జరిపే అధికారాన్నిచ్చింది. ఆదివాసులను ఖాళీ చేయించే ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకుగాను విచారణల్ని వేగంగా పూర్తి చేయాలని అది ఆదేశించింది. ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పరిశీలనా కమిటీలను ఏర్పాటు చేయాలనీ, అటవీ పరిపాలనా స్థాయిలో ఫారెస్ట్ కన్జర్వేటర్‌నూ, పోలీసు సూపరింటిండెంట్‌నూ, జిల్లా కలెక్టర్‌నూ కలుపుకొని ఒక ద్వితీయ కమిటీని ఏర్పాటు చేయాలనీ అది సూచించింది.

చూడడానికి పర్యావరణాన్నీ, అడవులనూ పరిరక్షించడానికే ఈ ఆదేశాలు జారీ చేసినట్టు కనిపించినప్పటికీ దీని వెనుక పెద్ద కుట్ర ఉంది. ఎందుకంటే తొలి నుండీ, ఆదివాసుల మూలంగానే అడవులూ, ఇతర అటవీ సంపదా నాశనమవుతోందని నిరూపించడానికి పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే ఇప్పటికే ఎందరో ప్రజాస్వామిక దృష్టి గల సామాజికవేత్తలూ, పర్యావరణ నిపుణులూ ఈ వాదనల్లో ఏ మాత్రం నిజం లేదని నిరూపించారు. నిజానికి ఆదివాసులే అడవులకూ, పర్యావరణానికీ నిజమైన మిత్రులని కూడా వాళ్లు నిరూపించారు. అసలు ప్రభుత్వం అనుసరిస్తున్న దివాళాకోరు ఆర్థిక విధానాల వల్లనే అడవుల వినాశనం జరుగుతోంది. గనుల తవ్వకం, భారీ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి చర్యల మూలంగానే అడవులు ఎక్కువగా అంతరించిపోతున్నాయి. ఇకపోతే, అటవీ అధికార్లతోనూ, రాజకీయ నాయకులతోనూ చేతులు కలిపిన కలప స్మగ్లర్ల అక్రమ నరికివేత మూలంగా కూడా అడవులు పెద్ద ఎత్తున్నే నాశనమవుతున్నాయి. ఈ కారణాలన్నింటినీ పక్కకు బెట్టి అడవుల వినాశనానికి ఒక్క ఆదివాసులే కారణం అన్న తీరులో వ్యవహరించడం ప్రభుత్వ ఆదివాసీ వ్యతిరేక స్వభావానికే చిహ్నం.

ఈ సర్క్యులర్ ప్రకారం ఏ రకమైన అటవీ భూమిలోనైనా సరే నివసించే ఆదివాసులందరినీ అక్రమ కబ్జాదార్లుగానే గుర్తిస్తారు. ఇది అడవులకూ, ఆదివాసులకూ మధ్య గల అవినాభావ సంబంధాన్ని ఏ

మాత్రం లెక్కలోకి తీసుకోదు. ఇది స్వయంగా ఎంఓఇఎఫ్ సెప్టెంబర్ 1990లో ప్రకటించిన కార్యక్రమాన్ని తిరగదోడడానికి ప్రయత్నిస్తుంది. ఈనాటికీ అమలుకు నోచుకోని అప్పటి కార్యక్రమాన్ని షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (ఎస్.సి., ఎస్.టి.) కమిషన్ 29వ రిపోర్టుపై ఆధారపడి రూపొందించారు. ఆదివాసులను పీడించే, భయభ్రాంతుల్ని చేసే తన విధానాలను మరింత ముందుకు తీసుకుపోతూ ఎమ్ఓఇఎఫ్ తన సర్క్యులర్‌కు తోడుగా సిఇసి (సెంట్రల్లీ ఎంపవర్డ్ కమిటీ - కేంద్రీకృత అధికార కమిటీ) చేసిన సిఫారసులను కూడా జత చేసింది. అడవుల కబ్జా సమస్యను పరిశీలించేందుకై సుప్రీంకోర్టు జూన్ 2002లో సిఇసిని ఏర్పాటు చేసింది. ఎంఓఇఎఫ్‌కు చెందిన పి.వి. జయకృష్ణన్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన మొత్తం ఐదుగురు ప్రతినిధులున్నారు. ఇందులో అదివాసులకు ఎలాంటి ప్రాతినిధ్యమూ లేదన్నది దృష్టిలో ఉంచుకోవాలి. ఈ కమిటీ చేసిన సిఫారసులు 1990 నాటి మార్గదర్శక సూత్రాలకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. అప్పటి మార్గదర్శక సూత్రాలు అటవీ భూముల కబ్జాకు సంబంధించిన సమస్యను సమగ్రమైన దృక్పథంతో చూడాలనీ, ఆచరణాయుత పరిష్కారానికి రావాలనీ నిర్దేశించాయి. ఆదివాసుల సంక్షేమం పేరిట ఇప్పటి దాకా చేపడుతూ వస్తున్న కంటితుడుపు చర్యలను కూడా ఈ కమిటీ తోసిపుచ్చింది. ప్రభుత్వం 1980లో అటవీ సంరక్షణ చట్టాన్ని రూపొందించడానికి ముందు ఆదివాసీ ప్రజలకు ఎన్నో వాగ్దానాలిచ్చింది. 1988లో రూపొందించిన తన అటవీ విధానంలో కూడా అడవులకూ, ఆదివాసులకూ మధ్య గల ప్రత్యేకమైన అవినాభావ సంబంధాన్ని గుర్తించింది. ఎస్.సి., ఎస్.టి. కమిషన్ రూపొందించిన డాక్యుమెంట్ కూడా ఒక మేరకు ఆదివాసుల ప్రయోజనాలకు అనుగుణమైందనే చెప్పుకోవచ్చు.

1980 నాటి అటవీ సంరక్షణా చట్టం రూపొందడానికి ముందూ, ఆ తర్వాతా జరిగిన కబ్జాలకు సంబంధించిన సమస్యతో వ్యవహరించడానికి స్పష్టమైన విధానాన్ని ఎస్.సి., ఎస్.టి. కమిషన్ రూపొందించింది. 1980కి ముందు జరిగిన ఆక్రమణలన్నింటినీ చట్టబద్ధమైనవిగా గుర్తించాలనీ, 1980 తర్వాత జరిగిన ఆక్రమణల కేసులన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలనీ కమిషన్ పరిష్కారమార్గాన్ని సూచించింది. కమిషన్, ఆదివాసులు తమవిగా ప్రకటించుకున్న భూముల కేసుల్ని ఇతర కబ్జాదారుల కేసుల నుండి విడదీసి చూసింది. ఈ రిపోర్టు, వనరుల్ని కోల్పోతున్న ప్రజలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ సాధనాల్ని కల్పించాలని ఆదేశించడంతో పాటు వివాదాల పరిష్కారానికీ, శాశ్వత పరిష్కారాలకూ గ్రామ సమాజాలను భాగస్వాముల్ని చేయాలని కూడా కోరింది.

తర్వాతి పరిణామాల్లో కమిషన్ మార్గదర్శక సూత్రాలపై ఆధారపడి ఎంఓఇఎఫ్ 1990 సెప్టెంబర్ 18న ఆరు సర్క్యులర్లు జారీ చేసింది. 1980 అక్టోబర్ 23కు ముందు ఆదివాసులు ఆక్రమించుకున్న అటవీ భూములను రెగ్యులరైజ్ చేయడానికి అది ఈ సర్క్యులర్లు జారీ చేసింది. ఆదివాసీ జనావాసాలకూ, అడవులకూ, అడవులుగా గుర్తించే వాటికీ, పట్టాలకూ, లీజులకూ సంబంధించిన చాలా విషయాలను ఈ సర్క్యులర్లలో పేర్కొన్నారు. ఇవి ఒక మేరకు సమగ్రమైన ఆదేశాలేనని చెప్పొచ్చు. అయితే ఏ రాష్ట్రంలోనూ అటవీ శాఖ వీటిని అమలు చేయలేదు. ఇప్పుడు ఈ కొత్త ఆదేశాలతో వీటన్నింటినీ తిరగదోడడానికి ప్రయత్నిస్తున్నారు. మేలో జారీ చేసిన ఈ కొత్త ఆదేశాల్లో అటవీ భూముల నుండి ఆదివాసులను వెంటనే ఖాళీ చేయించాలని కోరారు. ఇందులో మొత్తం 16 సిఫారసులున్నాయి. ఇవన్నీ ఆదివాసీల ప్రయోజనాలకు తీరని విఘాతం కల్గించేవీ, వాళ్ల మనుగడనే ప్రమాదంలో పడవేసేవే.

సుప్రీంకోర్టుకు నివేదించిన దీని సిఫారసులలో మొదటి దాని ప్రకారం ఇకపై ఏ రకమైన అటవీ భూమినైనా సరే రెగ్యులరైజ్ చేయడాన్ని ఆపివేస్తారు. అంటే ఆదివాసులు ఇప్పుడు సేద్యం చేస్తున్న అటవీ భూములకు పట్టాలివ్వడం ఇక నుంచి ఉండదన్న మాట. అయితే సెప్టెంబర్ 1990 అదేశాల ప్రకారం రెగ్యులరైజ్ చేయడానికి అర్హమైన ఆక్రమణలకు సంబంధించిన కేసుల్ని మినహాయించాలని ఇందులో పేర్కొన్నారు. కానీ 1990 సెప్టెంబర్ మార్గదర్శక సూత్రాలు ఇప్పటి దాకా అసలు అమలుకే నోచుకోలేదన్న చేదు వాస్తవాన్ని సిఇసి ఉద్దేశ్యపూరితంగా మరుగుపర్చింది.

అటవీ భూముల కబ్జా జరిగింది 1980 అక్టోబర్ 23కు ముందుగానా లేక తర్వాతనా అన్న విషయాన్ని నిర్ధారించుకోవడం కోసం అటవీ శాఖ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ప్రాతిపదికగా తీసుకోవాలని సిఇసి సిఫారసుల్లో ఉంది. అవినీతికీ, అక్రమార్జనలకూ ఆలవాలమైన అటవీశాఖ నమోదు చేసే ఎఫ్ఐఆర్‌లకు విశ్వసనీయతను ఆపాదించడం కష్టమే. అసలు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే ఆదివాసులు సేద్యం చేసుకుంటున్న అటవీ భూములు ఎన్నో ఉన్నాయి. అంటే వాటన్నింటినీ ఇప్పుడు అక్రమ కబ్జాగా గుర్తిస్తారన్న మాట. ఎస్.సి., ఎస్.టి. కమిషన్ తన రిపోర్టులో అటవీ భూములపై యాజమాన్యానికి సంబంధించిన కేసుల్ని గ్రామంలో ప్రజల జ్ఞాపకాన్ని ప్రాతిపదికగా తీసుకొని పరిష్కరించాలని కోరింది.

జయకృష్ణన్ కమిటీ చేసిన మరో సిఫారసు ప్రకారం రెగ్యులరైజేషన్‌కు అనర్హులైన కబ్జాదారులందరినీ అటవీ భూముల నుండి వెళ్లగొట్టాలి. రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆదివాసులు ముందుకు తెచ్చిన కేసులన్నింటినీ ఇంకా పరిశీలించకుండానే, చాలా రాష్ట్రాల్లో అటవీ శాఖ వందలాది ఆదివాసుల్ని బలవంతంగా వెళ్లగొట్టే ప్రక్రియను ప్రారంభించింది. అలాగే, నిరాశ్రితులైన ఆదివాసులు తమకు జరిగిన అన్యాయాలపై ఫిర్యాదు చేసుకోవడం విషయంలో కూడా ఈ కమిటీ పూర్తిగా అప్రజాస్వామికమైన పద్ధతిని రూపొందించింది. దీని సిఫారసు ప్రకారం అన్యాయం జరిగిందని భావించేవాళ్లు సిఇసికి చెప్పుకోవాలి. అప్పుడు సిఇసి వాళ్ల తరఫున సుప్రీంకోర్టు తలుపు తడుతుందట! ఈ విధంగా ఆదివాసులు తమకు జరిగే అన్యాయం విషయంలో కోర్టుకెక్కే హక్కును కూడా కోల్పోతారన్న మాట.

ఇక పునరావాసం విషయంలో ఈ కమిటీ చేసిన ఏకవాక్య సిఫారసు దాని బాధ్యతలేనితనానికీ, అమానవీయతకూ అద్దం పడుతుంది. "సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం కబ్జాదార్లకు, ముఖ్యంగా ఆదివాసులకు తగిన పునరావాసాన్ని ఏర్పాటు చేసే స్వేచ్ఛను కలిగి ఉంటుంది." కానీ వాస్తవం ఏమిటంటే చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదివాసుల పునరావాసానికి సంబంధించిన ఏ విధమైన ఏర్పాట్లు చేయకుండానే, వాళ్లను అటవీ భూముల నుండి వెళ్లగొట్టడం మొదలుపెట్టాయి. ఆదివాసుల భూములు పరాయిపరం కావడాన్ని నిరోధించడంలో గానీ, పరాయిపరం అయిన ఆదివాసీ ప్రజల భూముల్ని తిరిగి వాళ్లకు అప్పగించడంలో గానీ ఏ మాత్రం శ్రద్ధ చూపని ప్రభుత్వాలు, ఇప్పుడు ఆదివాసుల్ని అటవీ భూముల్నుండి బేదఖలు చేసే చర్యలను మాత్రం చాలా శ్రద్ధగానూ, వేగంగానూ అమలు చేస్తున్నాయి.

సిఇసి చేసిన మరో మతిలేని సిఫారసు ప్రకారం ఆదివాసులను వాళ్ల భూముల నుండి వెళ్లగొట్టడానికి కనీసం వారం రోజుల ముందుగా స్థానిక దినపత్రికల్లో గానీ, మరే యితర భారతీయ భాషల దినపత్రికల్లో గానీ అందుకు సంబంధించిన వివరాల్ని ప్రచురించాల్సి ఉంటుంది. లోతట్టు అడవుల్లో ఎలాంటి దినపత్రికలనూ చూడకుండా జీవించే ఆదివాసులు, సంవత్సరాల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి గురై ఎలాంటి

## ప్రభుత్వం పట్టాలిస్తాననడం కూడా కుట్రే !

*దండకారణ్యంలోని మాడ్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల భూములకు పట్టాలిస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని ఆదివాసులందర్నీ అటవీ భూముల్లోంచి వెళ్లగొట్టడానికి కంకణం గట్టుకున్న ప్రభుత్వం మాడ్ ఆదివాసుల భూములకు పట్టాలిస్తామనడంలో పెద్ద కుట్ర వుంది. మాడ్‌లోని మూలవాసుల్లో చాలా వరకు స్థిర వ్యవసాయం చేయరు. ప్రధానంగా 'పేంద' (పోడు) వ్యవసాయమే చేస్తారు. ప్రతి రెండేళ్లకొకసారి కొత్తగా అడవుల్ని నరికి సేద్యం చేస్తారు. ఇక్కడి ప్రజలు నిజంగా అడవికి యజమానుల్లా అడవిలో జీవనం గడుపుతారు. వదిలివేసిన భూముల్లో మళ్లీ అడవులు పెరుగుతాయి. స్థిరంగా ఒకచోట వ్యవసాయం చేయని ప్రజలకు ప్రభుత్వం ఏ హద్దుల్ని నిర్ణయించి పట్టాలిస్తుంది? ఒకవేళ వీళ్లకు పట్టాలిస్తే వాటిపై రాసిన హద్దుల మేరకే వారికి భూమిపై యాజమాన్యం వుంటుంది. మిగతా అడవిపై వాళ్ల హక్కును ప్రభుత్వం గుంజుకుంటుంది. కాబట్టి పైకి ఇది వాళ్ల పట్ల ఉదారంగా పట్టాలిస్తున్నట్టుగా కనిపించినప్పటికీ అడవిపై వాళ్ల హక్కులను కాలరాచివెయ్యడమే దీన్లోని ఉద్దేశ్యం. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా 'అడవిపై ఆదివాసులదే హక్కు కావాల'ంటూ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొంటున్న ఆదివాసీల్ని పోరాటం నుండి పక్కదారి పట్టించడానికీ, అలాగే గ్రామీణ ప్రాంతంలో కోల్పోతున్న తన పునాదిని తిరిగి నిలబెట్టుకోవడానికీ, వివిధ రకాల సంస్కరణల ద్వారా ప్రజల్లోంచి ఒక సెక్షన్‌ను తనకు అనుకూలంగా మల్చుకుంటూ, కూలిపోతున్న తమ గ్రామ పంచాయితీ వ్యవస్థను కాపాడుకోవడానికి పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నాల్లో ఇదొకటి.*

*మాడ్ ప్రాంతంలో మూలవాసులతో పాటు చాలా ఏళ్లుగా స్థిరపడిపోయిన కాంకేర్ గోండులు, దండామి మాడియాలా జనాభా కూడా చాలానే పెరిగింది. వీళ్లు ఆర్థికంగా, సామాజికంగా మూలవాసులకంటే కొద్దిగా మెరుగ్గా కూడా ఉన్నారు. ఈ పరిస్థితిలో పట్టాలిస్తాననే ఆశల ద్వారా ఒక సెక్షన్‌ను తన వెనుక నిలబెట్టుకొని మెజారిటీ ఆదివాసీల హక్కుల్ని హరించివేసి మరింత దోపిడీ, అణచివేతలకు గురిచేయడమే సర్కారు కుట్ర. దీని మూలంగా మెజారిటీ ఆదివాసుల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ దివాళాకోరు పట్టాల నాటకాన్ని గట్టిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం యిచ్చే పట్టాలతో మాకు ఒరిగేది ఏమీ లేదనీ, అడవిపై హక్కు మాదేనని నినదించాల్సిన అవసరం ఉంది.* ❑

చదువుసంధ్యలకూ నోచుకోని ఆదివాసులు పత్రికల్లో వచ్చే ప్రకటనలను ఎలా తెలుసుకోగల్గుతారో ప్రభుత్వానికే తెలియాలి! ఈ సిఫారసులన్నీ ప్రభుత్వ అప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనంగా నిలుస్తాయి.

ఈ కమిటీ 2002 సెప్టెంబర్ 9న తన సిఫారసులను సుప్రీంకోర్టులో ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు తన ఆదేశాలను అక్టోబర్ 22 వరకు వాయిదా వేసింది. తర్వాత సుప్రీంకోర్టు ఆదివాసులను అటవీ భూముల్నుండి వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఈ సిఫారసులు అమలయితే అడవిపై ఆధారపడి బతుకుతున్న 1½ కోట్ల ఆదివాసీ కుటుంబాలు బజారున పడడం ఖాయం.

ఈ సిఫారసులను అతి వేగంగా అమలు చేయాలని ఎంఓఇఎఫ్ కంకణం కట్టుకున్న తీరు ఆశ్చర్యం కలిగించక మానదు. ఎందుకంటే ఎంఓఇఎఫ్ తన సర్క్యులర్‌నూ, సిఫారసులనూ తయారు చేయడానికి ముందుగా కనీసం ఆదివాసీ వ్యవహారాల మంత్రిత్వశాఖను గానీ, జాతీయ ఆదివాసీ కమిషన్‌ను గానీ మాటమాత్రంగా కూడా సంప్రదించలేదు. దిలీప్ సింగ్ భూరియా అధ్యక్షతన జూలై 2002లో ఏర్పాటైన జాతీయ ఆదివాసీ కమిషన్ కర్తవ్యాల్లో ఆదివాసులకూ, అడవికీ సంబంధించిన వివాదాల్ని పరిశీలించడం కూడా ఒకటని చెప్పారు.

ఈ సర్క్యులర్ ప్రకారం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఆదివాసులపై ఇంతకన్నా క్రూరమైన దాడి మరొకటి ఉండబోదు. దీని దుష్ఫలితాలను అర్థం చేసుకోవడానికి ఈ సర్క్యులర్ విడుదల కాగానే ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఒక పరిణామాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కొద్ది నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అటవీ శాఖ ప్రపంచబ్యాంకు ప్రారంభించిన ఒక ప్రాజెక్టు కోసం 32,000 హెక్టార్ల అటవీ భూముల్నుండి ఆదివాసులను వెళ్లగొట్టడానికి ఆదేశాలు జారీ చేసింది. తర్వాత ఒక స్థానిక ఎన్‌జీఓ ఈ కేసును చేపట్టిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసుల్ని అటవీ భూముల నుండి వెళ్లగొట్టనని హామీ ఇచ్చింది. అయితే ఈ క్రమంలోనే ఎంఓఇఎఫ్ సర్క్యులర్ వెలువడడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసుల్ని వాళ్ల భూముల నుండి ఖాళీ చేయించడానికి గ్రీన్ సిగ్నల్ (అనుమతి) దొరికినట్టయింది.

ప్రభుత్వ అంచనా ప్రకారమే, ఈ ఆదేశాలను అమలు పరిస్తే గనుక దండకారణ్యంలోని అవిభాజిత బస్తర్‌లో దాదాపు 30 వేల ఆదివాసులు నిరాశ్రయులవుతారు. కానీ వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటుంది. ఆదేశాలు అందడంతోనే ప్రభుత్వ, పోలీసు అధికార్ల మద్దతుతో ఆదివాసుల్ని వెళ్లగొట్టడానికి అటవీ శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా గడ్చిరోలి జిల్లాలో ఆదివాసుల్ని వాళ్ల భూముల్నుండి వెళ్లగొట్టే చర్యలు మొదలు పెట్టింది. ఈ ప్రక్రియను చాలా వేగంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి గాను ఈ పోరాట జిల్లాల్లో కలెక్టర్, ఎస్.పి., తదితర అటవీ అధికార్లతో అప్పుడే టాస్క్‌ఫోర్స్ దళాలను కూడా ఏర్పాటు చేశారు. ఇక ఆదివాసులను వెళ్లగొట్టడమే మిగిలింది.

ఇదే సమయంలో, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం దండకారణ్యంలోని మాడ్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల భూములకు పట్టాలిస్తామని ప్రకటించింది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని రాజనాంద్‌గాం, కవర్ధ జిల్లాల్లో నివసించే బైగా ఆదివాసులు తమ భూముల్ని గుంజుకోరాదని కోరుతూ ముఖ్యమంత్రి అజిత్ జోగికి విజ్ఞప్తి చేయగా, ఆదివాసులను మైమరపించి మాయజేయడంలో సిద్ధహస్తుడైన జోగి బైగ ఆదివాసుల భూముల్ని స్వాధీనం చేసుకోబోమని ప్రకటించాడు. దీనిపై కొందరు ప్రజాస్వామికవాదులు ప్రతిస్పందిస్తూ మరి మిగతా ఆదివాసులందరి మాటేమిటి అని ప్రశ్నించారు. చాలా ఎన్‌జీఓలూ, ఇతర ప్రజాస్వామిక సంఘాలూ ఆదివాసులకు తగిన పునరావాసాన్ని కల్పించాలనీ, గ్రామసభలను సంప్రదించి అటవీ భూములకు సంబంధించిన వివాదాల్ని మానవీయ దృక్పథంతో పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ఇవన్నీ తమ తమ వర్గ దృక్పథాన్ని స్పష్టంగానే బైటపెట్టుకుంటున్నాయి. వీటి బలహీనతల్ని వీటి వర్గ పరిమితుల కోణం నుండే అర్థం చేసుకోవాలి. ***(తరువాయి 19వ పేజీలో .....)***

# ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీనీ, దాని నూతన ప్రజాసైన్యాన్నీ టెర్రరిస్టు సంస్థలుగా ముద్రవేసిన అమెరికన్ సామ్రాజ్యవాదుల దుశ్చర్యలను ఖండించండి !

## కామ్రేడ్ జోస్ మారియా సిజాన్‌కు పౌరహక్కుల్ని నిరాకరించడాన్ని ఖండించండి !!

అమెరికన్ యుద్ధోన్మాదులు తమ యుద్ధాన్నిప్పుడు ఫిలిప్పీనీ ప్రజలకు వ్యతిరేకంగా ఎక్కుపెడుతూ ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ (సిపిపి)నీ, నూతన ప్రజాసైన్యం (ఎన్‌పిఏ)నూ "విదేశీ టెర్రరిస్టు సంస్థలు"గా ప్రకటించారు. ఇస్లాం ఛాందసవాద అబూ సయ్యాఫ్ గ్రూపుకు వ్యతిరేకంగా పోరాడే సాకుతో ఫిలిప్పీన్స్‌లో తిష్టవేసిన అమెరికన్ సైన్యం ఇప్పుడు తన తుపాకుల్ని ఫిలిప్పీన్స్‌లోని మావోయిస్టులకు వ్యతిరేకంగా గురిపెట్టింది.

నెదర్లాండ్స్‌లో జరుగుతున్న శాంతి సంప్రదింపులలో ఎన్‌డిఎఫ్‌పికి ప్రధాన రాజకీయ సలహాదారుగా ఉన్న ప్రొఫెసర్ జోస్ మారియా సిజాన్ ఆగస్టు 9, 2002న ఒక ప్రకటన జారీ చేస్తూ ఫిలిప్పీనీ ప్రభుత్వం అనుసరిస్తున్న కవ్వింపు చర్యల మూలంగా సంప్రదింపుల్ని ఆపుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ ప్రకటనలో ఆయనిలా పేర్కొన్నాడు: *మెకపగల్ ప్రభుత్వం శాంతి సంప్రదింపుల్ని చాలా కాలంగా "నిలిపివేసి" తనకు ఇకపై సంప్రదింపుల పట్ల ఎలాంటి ఉత్సాహం లేదని చాలా సార్లు స్పష్టం చేసింది. అది ఎన్‌పిఏ లొంగిపోవాలనీ, దాన్ని రద్దు చేయాలనీ మాత్రమే కోరుకుంటున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ మొండివైఖరి విప్లవ శక్తులా, ప్రజలా సమగ్రతనూ, అలాగే ఫిలిప్పీన్స్ ప్రభుత్వానికీ, ఎన్‌డిఎఫ్‌పికీ మధ్య కుదిరిన లాంఛనమైన ఒప్పందాలన్నింటినీ ఉల్లంఘించడమే.*

ఈ ప్రకటన వెలువడ్డ రోజునే అమెరికన్ ప్రభుత్వం సిసిపినీ, ఎన్‌పిఏనూ "విదేశీ టెర్రరిస్టు సంస్థలు"గా ప్రకటించింది. ఆ మరుసటి రోజున, అంటే ఆగస్టు 10న అమెరికన్ ప్రభుత్వ చర్యను గర్హిస్తూ మరో ప్రకటన జారీ చేశాడు. ఆ ప్రకటనలో సిజాన్ ఇలా పేర్కొన్నాడు:

*ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్ర విభాగపు విద్యార్థులా, పరిశోధకులా బృందమొకటి ఇటీవలే వేసిన ఒక లెక్క ప్రకారం అమెరికన్ సామ్రాజ్యవాదపు దురాక్రమణ బలగాలు 1899 నుండి 1914 మధ్య 14 లక్షలకు పైగా ఫిలిప్పీనీ ప్రజలను హతమార్చాయి. రక్తపాతంతో ఫిలిప్పీన్స్‌ను జయించిన అమెరికా, స్థానిక అభివృద్ధి నిరోధకులతో కుమ్మక్కయి ఫిలిప్పీనీ జాతి మూలుగుల్ని పీల్చివేసింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కునే సాకుతో బుష్ ప్రభుత్వం అమెరికాలోనూ, ప్రపంచమంతటా ఫాసిజాన్ని నెలకొల్పుతోంది. అది యూరప్‌నూ, జపాన్‌నూ, అదే విధంగా నయా వలస రాజ్యాలనూ తమ దేశాల ప్రజలపైనా, ప్రత్యేకించి ప్రవాసీయులపైనా మరిన్ని అణచివేత చర్యలు చేపట్టాల్సిందిగా వత్తిడి చేస్తున్నది. అమెరికాలోనూ, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ తీవ్రతరమవుతున్న సంక్షోభం మూలంగా పెరుగుతున్న సామాజిక ఆందోళననూ, ప్రతిఘటననూ అణచిపెట్టేందుకు అది స్టేట్ టెర్రరిజాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నది... సిసిపినీ, ఎన్‌పిఏనూ టెర్రరిస్టులుగా ప్రకటించడం వాటిని లొంగిపోయేలా భయపెట్టి, వాటిపై వత్తిడి తెచ్చే నిరర్థకమైన మానసిక యుద్ధ ప్రయత్నమే తప్ప మరేమీ కాదు. దీనికి పథకాన్ని అమెరికన్, ఫిలిప్పీనీ ప్రభుత్వాలు రెండూ జమిలిగా రచించాయి. సిసిపినీ, ఎన్‌పిఏనూ, ఎన్‌డిఎఫ్‌పినీ ఎవరూ భయపెట్టజాలరు... అమెరికాయే ఎడతెగని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని ఉందనీ, ఆర్థికంగా, మిలిటరీపరంగా దాని ఖర్చులు బాగా పెరిగిపోయాయన్న సంగతి అమెరికా సామ్రాజ్యవాదానికీ, దాని తొత్తులకూ వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్న వారందరికీ స్పష్టంగా తెలుసు. వాళ్లు తమ విప్లవ పోరాటాన్ని పురోగమింపజేయడానికి మరింత అనుకూలంగా ఉన్న నేటి పరిస్థితులను చక్కగా వినియోగపెట్టుకుంటున్నారు. వాళ్లు తమ శక్తిని పెంపొందించుకుంటూ సమీప భవిష్యత్తులో రానున్న గొప్ప వెల్లువలకు సిద్ధమవుతున్నారు.*

ఈ ప్రకటన వెలువడ్డ వెంటనే ఆగస్టు 12, 2002న అమెరికా కోశాగార శాఖ జోస్ మారియా సిజాన్‌ను 'టెర్రరిస్టుల' లిస్టులో చేర్చింది. ఇలా ప్రకటించిన వాళ్లందరి ఆస్తులను స్తంభింపజేయాల్సి ఉంటుంది. ఆ వెంటనే డచ్ ప్రభుత్వం అమెరికా ఆదేశాన్ని శిరసావహిస్తూ ఆగస్టు 13న "టెర్రరిజంపై ఆంక్షల చట్టం 2002-III"ను జారీ చేసింది. అతని బ్యాంకు ఖాతాలన్నింటినీ స్తంభింపజేసింది. ఆహారం, గృహవసతి, ఆరోగ్య భీమా, ఇంకా సామాజిక సంక్షేమ శాఖ నుండి లభించే ప్రాథమిక అవసరాలన్నింటిపైనా ప్రభుత్వ సబ్సిడీల్ని ఎత్తివేశారు.

వెంటనే, బడా బూర్జువాల నియంత్రణలో గల నెదర్లాండ్స్, ఫిలిప్పీన్స్, అమెరికా తదితర దేశాల మీడియా సిసిపినీ, సిజాన్‌నూ నిందిస్తూ పెద్ద ఎత్తున దుష్ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభించాయి. ఆయనపై ఫిలిప్పీన్స్‌లో సైతం ఎలాంటి కేసూ లేనప్పటికీ, వెనుకట ఎప్పుడో 1989లో మనీలాలో జరిగిన ఒక సిఐఏ ఉద్యోగి హత్యతో సంబంధం ఉందని ఆరోపిస్తూ ఇప్పుడు ఆయనపై తప్పుడు కేసు మోపడానికి ప్రయత్నిస్తున్నారు.

అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రపంచమంతటా ప్రజా ఉద్యమాలకు, ప్రత్యేకించి నిజమైన విప్లవోద్యమాలకు వ్యతిరేకంగా బరితెగించి జోక్యం చేసుకుంటున్నారన్న విషయం స్పష్టమే. దీన్ని ఫిలిప్పీన్స్‌లోనే కాదు, నేపాల్‌లోనూ, భారతదేశంలోనూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోనూ గమనించవచ్చు. నేపాల్‌లో మావోయిస్టులను అణచివెయ్యడానికి అమెరికా 2 కోట్ల డాలర్లు మంజూరు చేసింది. అలాగే, పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా ఇజ్రాయిలీ జియోనిస్టులకు పూర్తిగా మద్దతునిస్తున్నదీ, అనేక ఇతర దేశాలపై దురాక్రమణ యుద్ధానికి కాలుదువ్వుతున్నదీ అమెరికాయే. కామ్రేడ్ సిజాన్ వంటి పౌరుడికి అన్ని హక్కుల్నీ వెంటనే పునరుద్ధరించాలని సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులన్నీ సమైక్యంగా డిమాండ్ చేయాల్సిన అవసరం ఉంది. అలాగే అమెరికన్ సామ్రాజ్యవాద ప్రజావ్యతిరేక విధానాలకూ, దాని యుద్ధ పన్నాగాలకూ వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి సమైక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.❑

### *కొత్త శీర్షికను ప్రారంభిస్తున్నాం ...*

పత్రిక ఒక ఆర్గనైజర్ అనే విషయం మనందరికీ తెలిసిందే. ఒక ఆర్గనైజర్‌కు తన కేడర్లతోనూ, ప్రజలతోనూ సజీవ సంబంధాలుండడం ఎంత అవసరమో పత్రికకూ తన పాఠకులతో సజీవ సంబంధాలుండడం అంతే అవసరం. అలా లేనప్పుడు పత్రిక తన కేడర్ల మనోభావాలు తెలియని, కింది నుండి ఎన్నడూ విమర్శల్ని ఎదుర్కోనని ఆర్గనైజర్ పనిలా తయారవుతుంది. అందుకోసం పత్రికకు తన పాఠకులతో నిరంతర సంభాషణ చాలా అవసరమని భావించి మేం వచ్చే సంచిక నుండి 'ఉత్తరాల శీర్షిక'ను ప్రారంభించబోతున్నాం. పాఠకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మాకు తప్పక ఉత్తరాలు రాస్తారని ఆశిస్తున్నాం. ప్రధానంగా పత్రికలో వస్తున్న వ్యాసాలపైనా, రాస్తున్న భాషపైనా మీ నిర్మొహమాటమైన విమర్శల్నీ, సలహాల్నీ, సూచనల్నీ ఆహ్వానిస్తున్నాం. 'ప్రభాత్'ను మంచి ఆర్గనైజర్‌గా తీర్చిదిద్దడానికి మీ వంతు సహకారాన్ని తప్పక అందిస్తారు కదూ!

*– సంపాదకవర్గం*

అసెంబ్లీ ఎన్నికలు



# ఎన్నికలతో కాశ్మీర్ సమస్యకు పరిష్కారం జరగదు!

రాజకీయ వాతావరణం అత్యధికంగా ఉండే కాశ్మీర్‌లో గత అక్టోబర్ నెలలో ఎన్నికల తతంగం ముగిసింది. రాష్ట్రంలో ఇప్పటికే గల 6 లక్షల సైనిక బలగాలకు తోడుగా, మరో 400 కంపెనీల అర్ధసైనిక బలగాల్ని దింపి భయానక వాతావరణం మధ్యన ఎన్నికల నాటకం ఎలాగోలా ముగిసిందనిపించారు.

పోలింగుకు కొద్ది రోజుల ముందు నుండే కాశ్మీర్‌లో అత్యధికంగా మోహరించబడిన సైనిక బలగాలు పలు ప్రాంతాలలో ఓటర్లను ఓట్లేయమని బలవంతపెట్టడమే కాకుండా హింసించాయి. ఓటర్ల గుర్తింపు కార్డులను ముందే గుంజుకొని పోయి పోలింగ్ బూతుల్లో జమచేసి పెట్టారు. బూతుల వద్దకు వచ్చి ఓట్లేసిన వాళ్లకే గుర్తింపుకార్డులు వాపస్ ఇస్తామనే షరతు విధించారు. రోజువారీ అవసరాలకు ఉపయోగపడే (మల్టిపర్పస్) గుర్తింపు కార్డులు లేకుండా ప్రజలు ఉండలేరు కాబట్టి చచ్చినట్టు ఓట్లేయడానికి వస్తారని ఈ రకమైన ఎత్తుగడ వేశారు. అనేక చోట్ల పోలీసుల కనుసన్నలలోనే రిగ్గింగ్ జరిగింది. దొంగ ఓట్లు పోలయిన ఘటనలు చాలానే నమోదయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక్క ఓటరు కూడా హాజరు కాని ఒక పోలింగ్ బూత్‌లో ఓట్లు ముగిసే సమయానికి 211 ఓట్లు పోలయినట్టు నమోదయిందంటే ప్రభుత్వం చెబుతున్న పోలింగ్ శాతంలో విశ్వసనీయత పాలు ఎంతో పాఠకులు ఊహించుకోవచ్చు.

ఇంత చేసినా ప్రభుత్వం పేర్కొన్న అధికారిక లెక్కల ప్రకారమే పోలయిన ఓట్లు 44 శాతమే. మిగతా 56 శాతం ఓటర్లు ఈ ఓట్ల ప్రక్రియలో పాల్గొననేలేదు. అంటే మెజారిటీ కాశ్మీరీయులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో దేనిపైనా నమ్మకం లేదు. భారతదేశం ఒక ప్రజాతంత్ర దేశమనీ, కాశ్మీరీయులు తమ ఇష్టాన్ని బ్యాలెట్ ద్వారా వ్యక్తీకరించే మార్గాన్ని ఇవ్వగల సామర్థ్యం ఈ వ్యవస్థకి ఉన్నదని రుజువుపర్చుకోవాలనీ పాలకవర్గాలు ఊదరగొట్టాయి. ఏదో ఒక రకంగా ఎన్నికల తంతు ముగిస్తే కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నదని ప్రచారం చేసుకోవచ్చని సంబరపడ్డ పాలకవర్గాలకు కాశ్మీరీల స్పందన ఒక చెంపదెబ్బే అయింది.

ఇంత నిర్బంధం అమలు జరిపినప్పటికీ 1996లో జరిగిన ఎన్నికలతో పోల్చి చూస్తే ఈసారి బహిష్కరణ ఎక్కువగా జరిగింది. వివిధ నియోజక వర్గాల్లో, వేర్వేరు సెక్టార్లలో ఓట్లు బహిష్కరించిన వారి సంఖ్య 40 శాతం నుండి 100 శాతం దాకా ఉంది. హుర్రియత్ కాన్ఫరెన్స్‌కు బలమైన ప్రాంతాల్లోనయితే, వారి ఉన్నత స్థాయి నాయకుల్లో చాలా మందిని జైళ్లల్లో పెట్టినప్పటికీ బహిష్కరణ ఎక్కువగానే జరగడం విశేషం.

ఎన్నికల సమయంలో వివిధ వార్తాపత్రికలూ, బిబిసి జరిపిన ఇంటర్వ్యూలలో ఓటర్లు పలు రకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రజలపై కొనసాగుతున్న రాజ్యహింస, భారత్ దురాక్రమణ, కాశ్మీర్ స్వాతంత్ర్యం, లంచగొండితనం, నిరుద్యోగం మొదలగు విషయాలపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎంత స్వచ్ఛంగా జరుగుతాయనేది అంత ముఖ్యం కాదనీ, కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం కావాలనేది అసలు సమస్య అనీ అన్నారు. కాశ్మీర్ సమస్యను ఎన్నికలు పరిష్కరిస్తాయని మేము అనుకోవడం లేదని ఎక్కువ మందే అభిప్రాయపడ్డారు. (ఈ అభిప్రాయం వ్యక్తం చేసిన వాళ్లలో ఓట్లేసిన వాళ్లూ, బహిష్కరించిన వాళ్లూ రెండు రకాల వాళ్లూ ఉన్నారు.)

మరి కొద్ది మంది భద్రతా దళాలకూ, మిలిటెంట్లకూ ఇరువర్గాలకూ భయపడుతున్నట్టు చెప్పారు. ఓట్లేసిన వాళ్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాదుకుపోయిన లంచగొండితనం, అది ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకపోవడం, పాలనా మార్పు అవసరంలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో పోలింగ్ జరిగిన నాలుగు రోజుల్లోనూ సాధారణ సమ్మెలు జరిగాయి. కొన్ని చోట్ల మూకుమ్మడి ప్రదర్శనలు జరిగాయి. మరికొన్ని చోట్ల భద్రతా దళాలతో ప్రజలు బాహాబాహీగా తలపడ్డారు. ఈ మొత్తం ఎన్నికల కాలంలో వందలాది మిలిటెంట్ చర్యలు జరిగాయి. ఈ మొత్తం ఘటనల్లో 160 మందికి పైగా భద్రతా దళాల సభ్యులూ, 250 మందికి పైగా మిలిటెంట్లూ మరణించారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాల మోహరింపు మధ్య కూడా ఇవన్నీ ఘటనలు జరగడం చూస్తే ప్రజల్లో ఎన్నికల పట్లా, ప్రభుత్వ పరిపాలన పట్లా ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.

## అవకాశవాద కలయికకు దారితీసిన (అ)ప్రజాతంత్ర వ్యవస్థ

రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించాలన్న ఆర్ఎస్ఎస్ డిమాండ్ ఫలితంగానూ, తన దుర్మార్గమైన ముస్లిం వ్యతిరేక ప్రచారం మూలంగానూ ఈ ఎన్నికల్లో బిజెపి చాలా వరకు తుడిచిపెట్టుకుపోయింది. ఆర్ఎస్ఎస్ డిమాండును బిజెపి బహిరంగంగా సమర్థించకపోయినప్పటికీ, తన జమ్మూ-కాశ్మీర్ వ్యతిరేక పాత్ర మూలంగా అది ప్రజల వ్యతిరేకతకు గురైంది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు కూడా బలహీనపడ్డాయి. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో చివరికి అవకాశవాద పొత్తులతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు దారితీసింది.

కాశ్మీర్ ప్రజలకు శాంతినీ, రాజకీయ పరిష్కారాన్నీ తెస్తానన్న నినాదంపై ఎన్నికల్లో పోటీ చేసిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) 87 స్థానాలు గల అసెంబ్లీలో 16 సీట్లు మాత్రమే సంపాదించుకోగల్గింది. అయినప్పటికీ అది అధికారదాహంతో కాంగ్రెస్‌తో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవి విషయంలో బేరసారాలు సాగించింది. 15 రోజులు గడిచినా అవకాశవాద కూటమిలో ముఖ్యమంత్రిగా ఎవరుండాలనే విషయం ఎటూ తేలకపోవడంతో, రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చింది. ఆ తర్వాత కొద్ది రోజులకు నాలుగు పార్టీల పొత్తు కుదిరి, ఇద్దరు సభ్యుల బొటాబొటి మెజారిటీతో పిడిపి ప్రతినిధి ముఫ్తీ మహ్మద్ సయీద్ ముఖ్యమంత్రిగా పరిపాలన మొదలైంది. 16 స్థానాలకు ప్రాతినిధ్యం వహించే పిడిపి నాయకుడు మెజారిటీ ప్రజలను ముఖ్యమంత్రిగా పరిపాలిస్తున్నాడంటే ప్రజాస్వామ్యం ఎంత గొప్పగా వర్ధిల్లుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ అధికార కూటమికి మెజారిటీని సమకూరుస్తున్న రెండు సీట్లు ఎన్నో ఏండ్లుగా భారత పాలకవర్గాల సేవలో తరించిన మార్క్సిస్టు పార్టీకి చెందినవే. అట్లాగే, ఈ కూటమిలో ప్రధాన భాగస్వామియైన కాంగ్రెస్ పార్టీకి నెహ్రూ కాలం నుండి నేటి వరకూ, దశాబ్దాలుగా కాశ్మీర్

ప్రజల్ని మోసగిస్తూ వారిపై నిరంకుశ ప్రభుత్వాల్ని రుద్దిన కాశ్మీర్ వ్యతిరేక చరిత్ర ఉంది. భారత పాలకవర్గాల ఏజెంటైన షేక్ అబ్దుల్లా కుటుంబాన్ని కాశ్మీరీ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా అనేక ఏండ్లు అధికారంలో నిలబెట్టింది కూడా కాంగ్రెస్ పార్టీనే. అలాంటి కాంగ్రెస్‌తో, కేవలం అధికారదాహంతో చేతులు కలిపిన పిడిపి ప్రజలకు ఏమి ఒరగబెడుతుందో ఊహించవచ్చు. నాలుగు పార్టీలతో కూడిన ఈ అవకాశవాద కూటమి తమ పరిపాలనకు ప్రాతిపదికగా రూపొందించుకున్న కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) డాక్యుమెంట్‌ను పరిశీలిస్తే దాని నిజస్వరూపం ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది.

ఎన్నికలకు ముందు పిడిపి చేసిన బహిరంగ వాగ్దానాలనూ, అదే సమయంలో భారత పాలకుల దురాక్రమణ అవసరాలనూ కలగలిపి రూపొందించిన సిఎంపి డాక్యుమెంట్‌లో రెండునాల్కల ధోరణి స్పష్టంగా వ్యక్తమవుతున్నది. ద్వంద్వార్థాలతో కూడుకున్న ఈ డాక్యుమెంట్ ఈ అవకాశవాద కూటమి అవసరాలను సరిగ్గా ప్రతిబింబించేదిగా ఉంది. డాక్యుమెంట్‌లోని కొన్ని ముఖ్య విషయాలను గమనిద్దాం.

*“గత 14 ఏండ్లుగా మిలిటెంట్ల హింస కలిగించిన భౌతిక, మానసిక, ఉద్రేకపూరిత గాయాలను మాన్పించి జమ్మూ-కాశ్మీర్‌లో పరిపాలనా వ్యవస్థను నెలకొల్పడం, ఎన్నికలతో మొదలైన రాజకీయ పునరుద్ధరణా క్రమాన్ని పరిపూర్తి చేయడం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ ఎలాంటి షరతులూ లేకుండా చర్చలు కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం సంకీర్ణ ప్రభుత్వం లక్ష్యం.”*

*“రాష్ట్రం లోపలి నుండీ, బయటి నుండీ కొనసాగుతున్న మిలిటెంట్ల హింస నుండి జమ్మూ-కాశ్మీర్ ప్రజలను రక్షించడానికి సాధ్యమైన అన్ని చర్యలను తీసుకుంటుంది. ఇప్పటి వరకూ మిలిటెన్సీకి ఒడిగట్టిన యువకులందరికీ చట్ట ప్రకారం రక్షణా, న్యాయం లభిస్తాయని హామీ ఇస్తూ లొంగుబాట్లకై ప్రోత్సహిస్తుంది.”*

*“విచారణ లేకుండా దీర్ఘకాలంగా నిర్బంధంలో ఉన్న వారి కేసులన్నీ సమీక్షిస్తాం.”*

*“నిర్బంధంలో జరిగిన హత్యలనూ, మానవ హక్కుల ఉల్లంఘన కేసులన్నింటినీ విచారిస్తాం. వాటికి బాధ్యులైన వారిని శిక్షిస్తాం.”*

పై విషయాల్ని గమనిస్తే, గాయాలు కల్గిస్తున్నది పోరాటకారులేననీ, ఉద్రేకపూరిత వాతావరణానికి కారణం పోరాటకారులేననీ చెబుతూ, అడ్డూఆపూ లేకుండా సాగిన రాజ్యహింసను మరుగుపర్చి రాజ్యం తనను నిరపరాధిగా పేర్కొనడమే కనిపిస్తుంది. చర్చలు సాగించే విషయంలో కూడా హుర్రియత్ కాన్ఫరెన్స్ పేరు గానీ, మరే ఇతర సంస్థల పేర్లు గానీ పేర్కొనకపోవడంతో దాన్నిపై అపనమ్మకం కల్గుతోంది. అది పోరాటకారులను లొంగుబాటు మార్గంలోకి తేవడం ద్వారా కేంద్రం దగ్గర మెప్పులు పొందాలనుకుంటున్నది. విచారణ లేకుండా నిర్బంధించిన వాళ్ల కేసుల్ని సమీక్షిస్తానంటుందే గానీ విచారణ లేకుండా ఎవరినీ జైళ్లో నిర్బంధించమని మాత్రం గట్టిగా చెప్పడం లేదు. అంటే పాత ఆచరణే కొనసాగుతుందన్న మాట. ఇక మానవ హక్కుల ఉల్లంఘన కేసులన్నింటినీ విచారించి, శిక్షిస్తామనడం ఒట్టి బూటకం. ప్రధానంగా మానవ హక్కుల ఉల్లంఘన కేసులన్నీ రాజ్యం కొనసాగించినవే. పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, ఆంధ్ర, బీహార్, ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కడైనా వీటిపై న్యాయవిచారణ జరిగి దోషులకు శిక్షలు విధించిన దాఖలాలున్నాయా? అలాంటప్పుడు కాశ్మీర్‌లో దీనికి భిన్నంగా జరుగుతుందని ఎలా నమ్మగలం?

మరో విచిత్రమైన విషయం ఏమిటంటే, ఎన్నికల సమయంలో పిడిపి ప్రత్యేక సాయుధ బలగాల్ని (ఎస్‌ఓజి) రద్దు చేస్తానని వాగ్దానం చేసింది. ఇప్పుడు దాన్ని రెగ్యులర్ పోలీసు వ్యవస్థలో కలిపి వేస్తానంటోంది. ఎన్నికలకు ముందు స్టేట్ టెర్రరిజాన్ని అంతమొందిస్తాననే పేరుతో ఓట్లడిగిన పిడిపి ఇప్పుడేమో మిలిటెన్సీనే ప్రధాన సమస్యగా చూపిస్తోంది. అంటే అప్పుడే దాని వాగ్దానాల్లోని బూటకత్వం ఏమిటో ఒక్కొక్కటి రుజువవుతూనే ఉందన్న మాట.

నిజానికి, గద్దెనెక్కడం కోసం కాంగ్రెస్ పెట్టిన షరతులన్నింటినీ ఆమోదించిన పిడిపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం జమ్మూ-కాశ్మీర్ ప్రజలకు చేసే మేలు ఏమీ లేదు. అది రూపొందించుకున్న ‘కనీస ఉమ్మడి కార్యక్రమం’ (సిఎంపి) అంతా కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యోద్యమానికీ, పోరాటకారులకూ వ్యతిరేకమైందే. పార్లమెంటరీ వ్యవస్థ చేసిన ‘ప్రజాతంత్ర కసరత్తు’ ప్రజలకు తెచ్చిందేమీ లేదు. కాశ్మీర్‌లోని ప్రజాతంత్ర క్రమం కొత్త సీసాలో పాత సారాను అందించడమే తప్ప మరేం కాదు. కాశ్మీర్‌లో ఇప్పటి దాకా కొనసాగిన పాత చరిత్రే పునరావృతమవుతుంది.

## కాశ్మీర్ సమస్యకు ఎన్నికలు పరిష్కారం కాదు !

ఎన్నికలు బహిష్కరించిన కొంత మంది కాశ్మీరీ ఓటర్లు ఈ విధంగా అభిప్రాయపడ్డారు : **“కాశ్మీర్ సమస్యంతా స్వతంత్ర కాశ్మీర్ కావాలనేదే. దీన్ని పక్కకు బెట్టి భారతదేశంలో అంతర్భాగంగా ఉండడానికి కాశ్మీరీలంతా ఆమోదం తెలిపినట్లుగా తామే నిర్ణయించి ‘మిమ్మలను ఏ పార్టీ పరిపాలించాలో ఎన్నుకోండి’ అంటూ ఈ ఎన్నికల తతంగం ఏమిటి?”**

కాశ్మీరీలు భారత్‌లో అంతర్భాగంగా ఉండదల్చుకున్నారా? లేదా స్వతంత్రంగా జీవించదల్చుకున్నారా? అనే విషయాన్ని తేల్చడానికి ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) జరపాలని ఎన్నో ఏండ్లుగా అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ దానికి సిద్ధపడని పాలకవర్గాలు “*మిమ్మలను పులి తింటే బాగుంటుందా? తోడేలు తింటే బాగుంటుందా? దేని చేతిలో చావడం మీకిష్టమో మీరే నిర్ణయించుకోండి*” అన్నట్టుగా వాళ్లు కోరుకోని ఎన్నికల్ని వాళ్లపై రుద్దుతున్నారు.

ఇప్పుడున్న దోపిడీ పాలకవర్గ పార్టీల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కాశ్మీరీల సమస్య పరిష్కారం కాదు. విడిపోయే హక్కు సహా జాతుల స్వయంప్రతిపత్తిని గ్యారంటీ చేసే నూతన ప్రజాస్వామిక విప్లవమొక్కటే కాశ్మీర్ సమస్యకు నిజమైన పరిష్కారం కాగలదు.

ఎన్నికల సందర్భంగా తీవ్ర నిరసనను వ్యక్తం చేసి తమ చైతన్యాన్ని ప్రదర్శించిన కాశ్మీర్ ప్రజలు, అనేక ఏండ్లుగా తమ స్వాతంత్ర్యం కోసం నెత్తురు చిందిస్తూ పోరాడుతున్న కాశ్మీర్ ప్రజలు, పిడిపి-కాంగ్రెస్ పార్టీల నేతృత్వంలోని అవకాశవాద సంకీర్ణ ప్రభుత్వంపై తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారా దానికి తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆశిద్దాం! ❑

*జనవరి 26న బూటకపు గణతంత్ర దినాన్ని బహిష్కరిస్తూ*

**నిరసన దినం పాటించండి !**

**గుజరాత్**

# శవాల గుట్టల మీదుగా హిందూ ఫాసిస్టుల 'గౌరవ' యాత్ర

పెద్ద ఎత్తున కొనసాగిన హింస ఆగిపోయినప్పటికీ గుజరాత్‌లో శాంతి ఇంకా నెలకొనలేదు. ఒకవేళ ఏదైనా ఉంటే మాత్రం అది స్మశాన శాంతే. ఫిబ్రవరి 27 గోధ్రా ఘటనను సాకుగా తీసుకొని హిందూ ఫాసిస్టులు పథకం ప్రకారం మొదలుపెట్టిన ముస్లిం వ్యతిరేక మారణహోమంలో వేలాది ముస్లిం ప్రజలు ప్రాణాలు కోల్పోగా లక్షలాది మంది నిరాశ్రయులుగా మారి బతుకు వెళ్లదీస్తున్నారు. దాడులూ, విధ్వంసం, గౌరవయాత్రలూ, ఎన్నికలూ అన్నీ ఫాసిస్టులు ఆశించిన ప్రకారమే, అనుకున్న విధంగానే సాగుతున్నాయి. ఇప్పుడు గుజరాత్ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించడంతో సంఘ్‌పరివార్ తన దాచిపెట్టిన ఎజెండాను పూర్తిగా బయటికి తేవడానికి రంగం సిద్ధం చేసుకుంది. దేశవ్యాప్తంగా మైనారిటీల మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడింది. విజయగర్వంతో విర్రవీగుతున్న సంఘ్‌పరివార్ తన హిందూ రాజ్య స్థాపన లక్ష్యాన్ని మరింత నగ్నంగా ముందుకు తేవాలని చూస్తున్నది. దానికే ఇప్పుడు 'సాంస్కృతిక జాతీయవాదమ'ని పేరు తగిలించుకుంది. ఈ నేపథ్యంలోనే గుజరాత్ పరిణామాలను అర్థం చేసుకోవాలి. సంఘ్‌పరివార్ గుజరాత్‌ని ఒక ప్రయోగశాలగా మల్చుకొని ఫాసిస్టు పాలనను నెలకొల్పే లక్ష్యంతో ఎత్తులు వేస్తూ ఎలా పావులు కదుపుతూ ఉందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. హిందూ ఫాసిజం దేశ ప్రజలకు అతి పెద్ద ప్రమాదంగా ఎలా ముందుకు వస్తున్నదో తెల్సుకోవాల్సిన అవసరం ఉంది.



## దాడులూ - విధ్వంసం

దేశవిభజన సందర్భంగా జరిగిన అల్లర్లను కూడా మరిపించే విధంగా జరిగిన గుజరాత్ నరమేధం మానవజాతి చరిత్రలోనే మాయని మచ్చగా మిగిలిపోతుంది. ప్రాణాలు కోల్పోయింది కొన్ని వేల మందే, కానీ లక్షలాది మంది జీవచ్ఛవాలయ్యారు. తమ కుటుంబ సభ్యులను కోల్పోయి, ఎలాంటి రక్షణా లేకుండా బతకలేక బతుకుతున్నారు. పెద్దెత్తున చెలరేగిన హింస ఆగినట్టుగా కనిపించినప్పటికీ అడపాదడపా వేర్వేరు పట్టణాలలో, వివిధ సందర్భాలలో ముస్లింలపై దాడులు సాగుతూనే ఉన్నాయి. ఈ విధంగా ముస్లిం ప్రజల్లో అభద్రతా భావాన్ని బాగా పెంచి వాళ్లు నిలదొక్కుకోలేని పరిస్థితిని సృష్టించడం, వారు ఆర్థికంగా కూడా కోలుకోలేని విధంగా దాడులకు పాల్పడడం ఈసారి అల్లర్లలో ప్రత్యేకత. ముస్లిం ప్రజల ఆస్తులను పథకం ప్రకారం ధ్వంసం చేశారు. చాలా చోట్ల వాళ్ల ఇళ్లు కూలగొట్టి ఆ స్థానాల్లో దేవాలయాలను నెలకొల్పారు. దానితో అల్లర్లు సద్దుమణిగిన తర్వాత కూడా తమ స్వస్థలాలకు పోయే అవకాశం లేకుండా పోయింది. ఇంకా చాలా చోట్ల హిందువుల బస్తీలలో నివసించే ముస్లింలు అల్లర్ల తర్వాత వెనక్కి వెళ్లగలిగే పరిస్థితి లేదు. ప్రజల్లో ద్వేషాన్ని ఉన్మాదపుటంచుల దాకా రెచ్చగొట్టినందున సాధారణ హిందువులు కూడా తమ పొరుగున ముస్లింలు ఉండటాన్ని ఆమోదించలేక పోతున్నారు. అభద్రతా వాతావరణంలో జీవిస్తున్న ముస్లింలు కూడా అందుకు సిద్ధపడడంలేదు. "లౌకిక రాజ్యం"గా చెప్పుకునే మన 'ప్రజాస్వామ్యపు' వికృత రూపాన్ని గుజరాత్‌లో చూడొచ్చు.

ఇకపోతే అల్లర్ల మూలంగా నిరాశ్రయులైన ముస్లిం ప్రజల పట్ల ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏ మాత్రం మానవత్వం, జాలీ లేనిదిగా ఉంది. తాత్కాలిక షెల్టర్లలో తల దాచుకుంటున్న ముస్లింలకు నష్టపరిహారాన్ని చెల్లించడంలో ప్రభుత్వం దారుణమైన నిర్లక్ష్య వైఖరిని చేపట్టింది. ఒక వైపు వర్షాకాలం మొదలవుతున్నా చేతిలో చిల్లిగవ్వ కూడా లేని ముస్లింలు చెప్పనలవిగాని బాధలకు గురయ్యారు. ప్రభుత్వం ముస్లింలు నష్టపోయిన ఆస్తులను సర్వే చేసినప్పటికీ 75-80 శాతం బాధితులకు ఇంకా నష్టపరిహారం అందనేలేదు. సహాయం అందిన వాళ్లలో చాలా మందికి 2,000 నుండి 5,000 రూపాయల లోపే అందింది. ఒక వ్యక్తికి అందింది కేవలం 250 రూపాయలేనంటే ప్రభుత్వం ఎంత అమానవీయంగా వ్యవహరించిందో తెలుసుకోవచ్చు. సర్వస్వం కోల్పోయి వీధుల పాలైన వాళ్లకు ఇది ఏ మూలకూ రాదన్నది స్పష్టమే. ఇక వర్షాలు మొదలవడంతో బాధితుల కష్టాలు రెట్టింపయ్యాయి. శుభ్రమైన నీరు, ఆహారం, బట్టలు వంటి కనీస సౌకర్యాలే సరిగా లేవంటే వర్షాలు రావడంతో తలదాచుకునే చోటు కూడా కరువైంది. అర్ధరాత్రి వర్షం రాగా ఒక శిబిరంలోని శరణార్థులు పక్కనే ఉన్న కాలూపూర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నీడన తలదాచుకుందామని పోతే రైల్వే పోలీసులు వారిని లాఠీలతో కొట్టి తరిమారు. గుజరాత్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని బైటికి చూపించడానికి ప్రభుత్వం బాగా ప్రయత్నించింది. అందుకే రైల్వే స్టేషన్ల పరిసరాల్లో శరణార్థుల చాయ కూడా పడకుండా జాగ్రత్త పడింది.

## అసెంబ్లీ రద్దు - ఎన్నికలు

ముందుగా ఊహించినట్లుగానే, రాష్ట్రంలో మతతత్వ ఉన్మాదం పతాక స్థాయికి చేరుకుందని భావించిన వెంటనే నరేంద్ర మోది తన పదవికి రాజీనామా యిచ్చి గడువుకు ముందుగానే అసెంబ్లీని రద్దు చేశాడు. హిందూ మత విద్వేషాన్ని రగిల్చి ఆ బూడిదలో ఓట్ల పంట పండించుకోవడం బిజెపికే చెల్లుతుందనవచ్చు. అయితే సిఇసి (చీఫ్ ఎలక్షన్ కమిషన్) లింగ్‌డోహ్ బిజెపి ఎన్నికల పథకానికి సైంధవుడిలా అడ్డుపడ్డాడు. గుజరాత్‌లో మామూలు పరిస్థితి ఇంకా నెలకొనలేదని ప్రకటించి ఎన్నికలను వాయిదా వేశాడు. దానితో బిజెపికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యింది. మత విద్వేషపూరిత వాతావరణంలో ఓట్లు రాల్చుకోవాలన్న దాని పథకానికి తాత్కాలికంగా ఎదురుదెబ్బ తగిలింది. దానితో బిజెపి కేంద్ర నాయకత్వం ఎన్నికలు వాయిదా వేయడానికి సిఇసికి గల అధికారాన్ని సవాల్ చేస్తూ కోర్టుకెక్కింది. లింగ్‌డోహ్ 'క్రైస్తవుడైనందున' బిజెపికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నాడంటూ కరుడుగట్టిన మతద్వేషి నరేంద్రమోడి ఎదురుదాడికి దిగాడు. ఇంకా అతను కాంగ్రెస్ సమర్థకుడు కూడా అంటూ, అలాగే సోనియా కూడా క్రిష్టియన్ కాబట్టి అలాంటి నిర్ణయం తీసుకున్నాడని ప్రచారాన్ని లంకించుకున్నాడు. బూర్జువా ప్రజాస్వామిక చట్రంలోనే అయినా పీడితులకు అనుకూలమైన నిర్ణయం ఏదైనా జరిగితే – అదీ తాము నమ్ముతున్న

రాజ్యాంగం నుండి అధికారాలు పొందిన ఎన్నికల కమిషన్ వంటి అత్యున్నత సంస్థే చేసినా సరే – ఈ ఫాసిస్టులు తీవ్రమైన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. తాము నమ్ముతున్నామని చెప్పుకుంటున్న రాజ్యాంగానికే కట్టుబడి ఉండడం లేదు. అయితే ఎన్నికల కమిషన్ యిలా దేశ రాజకీయాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని అసాధారణ నిర్ణయాలు తీసుకోవడం కొత్తేమీ కాదు. ఇవన్నీ యిప్పటికే ప్రజల దృష్టిలో పూర్తిగా భ్రష్టు పట్టిపోయిన పార్లమెంటరీ వ్యవస్థపై తిరిగి నమ్మకాలు చిగురింపచెయ్యడం కోసం బ్యూరాక్రసీ లోని ఒక సెక్షన్ చేసే వృధా ప్రయత్నాలే తప్ప మరేమీ కాదు. అయితే ఈ నిర్ణయంతో ఒక మేరకు డిఫెన్స్‌లో పడిన మోది ఆపద్ధర్మ ప్రభుత్వం బైటికి నమ్మించడం కోసమే ఐనప్పటికీ కొన్ని చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కంటితుడుపుగా బాధితుల్లో కొందరికి నష్టపరిహారం చెల్లించింది. నామమాత్రంగానైనా అల్లర్లకు పాల్పడిన కొందరిపై కేసుల్ని నమోదు చేసింది. అయితే అల్లర్లకు ప్రధాన బాధ్యులనెవరినీ ముట్టుకోనైనా ముట్టుకోలేదు – అది వేరే విషయం. ఈ లోగా అక్షర్‌ధాం మందిరంపై కొందరు ముస్లిం ఛాందసవాదులు దాడి చేయడం హిందూ ఫాసిస్టులకే ఉపయోగపడ్డది.

## అక్షర్‌ధాంపై దాడి – హిందూ ఫాసిస్టుల మితిమీరిన దుశ్చర్యలకు ఫలితం

సెప్టెంబర్ 24న ఇద్దరు ముస్లింలు గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉన్న అక్షర్‌ధాం మందిరంపై దాడి జరిపి 37 మంది ప్రజల ప్రాణాలు బలిగొన్నారు. మరో 81 మందిని గాయపర్చారు. గుజరాత్‌లోని ఉన్నత కులమైన పటేళ్లకు సంబంధించిన స్వామి నారాయణ అనుయాయులకు చెందిన ప్రఖ్యాతి గాంచిన హిందూ ఆలయం అక్షర్‌ధాం. అక్షర్‌ధాం సంఘటన గురించి తెలవగానే ఢిల్లీ నుండి హోంమంత్రి హుటాహుటిన గాంధీనగర్‌కు వచ్చి వాలాడు. ఎన్ఎస్‌జి కమాండోలను దింపారు. రాత్రంతా జరిగిన 'ఆపరేషన్' తెల్లవారు జామున దాడికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులనూ చంపెయ్యడంతో 'విజయవంతం'గా ముగిసింది. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. అయితే ఈ ఘటనను అనేక ఇతర విషయాల సంబంధంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఈ ఘటన జరగ్గానే ప్రధాని వాజ్‌పేయి మాల్దీవుల పర్యటనను అర్ధాంతరంగా ముగించుకొని 24 గంటల లోపు గాంధీనగర్‌లో దిగాడు. పోయిన ఫిబ్రవరిలో అల్లర్లు మొదలైె ముస్లిం ప్రజల ఊచకోత జరుగుతుంటే గుజరాత్‌కు రావడానికి వాజ్‌పేయికి 35 రోజులు పట్టింది. అప్పటికే వందలాది ముస్లింల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇద్దరు నాయకులూ అమాయక ప్రజలు చనిపోయినందుకు చలించే వచ్చారనుకుంటే పొరపాటే. అక్షర్‌ధాం విజయాన్ని ఎన్నికల్లో విజయంగా మల్చుకోవడానికే వాళ్లంత త్వరగా స్పందించారు. కమాండో ఆపరేషన్ 'విజయవంతం'గా ముగియగానే అక్కడ చేరిన సంఘ్ పరివార్ నేతలంతా ''భారత్ మాతా కీ జయ్'' అంటూ ఉత్సాహంగా నినాదాలు చేశారు. వాళ్లకు ఎన్నికల్లో విజయం తథ్యం అన్న నమ్మకం ఈ దాడితో మరింతగా బలపడింది. ఈ ఘటన తర్వాత విహెచ్‌పి భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారిపోయింది. అయితే దీన్ని సాకుగా తీసుకొని వెంటనే అల్లర్లు చెలరేగకుండా అన్ని చర్యలూ చేపట్టారు. అవును మరి, చక్రం తిప్పేది వాళ్లే అయినప్పుడు అల్లర్లు సృష్టించడం, అల్లర్లను నిరోధించడం రెండూ చేయగలరు. ఈ ఘటన జరగ్గానే ఇది పాకిస్తాన్ జరిపిన దాడి అని ప్రచారం ప్రారంభించారు. మోదీ భాషలో 'ఇది మియా ముషర్రఫ్ దుశ్చర్య' అని ప్రచారం మొదలైంది. ఎలాంటి ఆధారం లేకుండానే ముందే తయారు చేసుకున్న ప్రకటనలు చేయడం గోబెల్స్ వారసులైన హిందూ ఫాసిస్టులకు కొత్తేమీ కాదు. ఈ ఫాసిస్టులు బరితెగించి జరుపుతున్న దుష్ప్రచారంలో గొంతు కలపడానికి ఆఖరుకు స్వామి నారాయణ సమాజం ప్రముఖుడు నారాయణ స్వరూప్‌దాస్ కూడా సిగ్గుపడిపోయాడు. ఏ ఆధారం లేకుండా దీనికి మియా ముషర్రఫ్, ఐఎస్ఐలు బాధ్యులని అభాండం వేయలేనని ఆయన మోదికి తెగేసి చెప్పాడు.

మరుసటి రోజు సోనియా గాంధీ కూడా అక్షర్‌ధాంను సందర్శించింది. సోనియా రాక హిందూ ఓటుబ్యాంకును వదులుకోవడానికి కాంగ్రెస్ కూడా సిద్ధంగా లేదన్న విషయం చెప్పకనే చెప్పింది. వాజ్‌పేయి ఈ ఘటన పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాడు. ఉగ్రవాదులు మతపరమైన ప్రదేశాల్లోకి ప్రవేశించడాన్ని ఖండించాడు. కానీ వాజ్‌పేయి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘ్ పరివార్ గూండాలు గుజరాత్‌లో ఫిబ్రవరి 27 నుండి జరిపిన నరమేధంలో భాగంగా మొత్తం 209 మసీదులనూ, దర్గాలనూ పూర్తిగా నేలమట్టం చేశారు. 18వ శతాబ్దానికి చెందిన సూఫీ మత ప్రబోధకుడైన వలీ గుజరాతీ స్మారక చిహ్నాన్ని ఆనవాళ్లు కూడా లేని విధంగా కూలగొట్టి ఆ స్థలం మీదుగా రోడ్డును వేశారు. స్వయంగా అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషనే ఆ రోడ్డును నిర్మించింది. వడోదరాలో హిందుస్తానీ సంగీత విద్వాంసుడు ఫయాజ్ ఖాన్ సమాధిని మండే టైర్లతో కాల్చి కూలగొట్టారు. అహ్మదాబాద్‌లో 15వ శతాబ్దంలో రాతితో నిర్మించిన మలిక్ ఆసిన్ స్థూపాన్ని బుల్‌డోజర్లతో కూల్చారు. ఈ కూల్చివేతలకు బాధ్యులైన ''ఉగ్రవాద'' మూకలను శిక్షించడం గురించి వాజ్‌పేయి పల్లెత్తు మాట కూడా మాట్లాడలేదు.

అక్షర్‌ధాం దాడికి పాల్పడ్డ వారి వద్ద దొరికిన కొన్ని కాగితాలను బట్టి వాళ్లు కాశ్మీరీ మిలిటెంట్ల సంస్థయైన లష్కర్-ఏ-తయ్యిబాకు చెందిన ఒక గ్రూపు తహరీక్-ఏ-కసాస్ హింద్ వాళ్లు అయి ఉంటారని చెప్పారు. తాను ముషర్రఫ్‌కు వ్యతిరేకంగా మాట్లాడడాన్ని సహించలేక పాకిస్తాన్ ఈ దాడికి పథకం రచించిందని నరేంద్ర మోది చెబుతున్నాడు. కానీ 2,000కు పైగా అమాయక ముస్లిం ప్రజలను చంపివేసి, ఎందరో మహిళలపై అత్యాచారాలు జరిపి లక్షలాది మందిని నిరాశ్రయులుగా మార్చిన ఫలితంగా ముస్లింలు ప్రతీకారానికి పాల్పడే అవకాశం ఉంటుందన్న వాస్తవాన్ని కావాలని మరుగుపరుస్తున్నారు. మన దేశ చరిత్రను పరిశీలిస్తే హిందూ ఫాసిస్టులు మైనారిటీ మతస్థులపై, ముఖ్యంగా ముస్లింలపై పెద్ద ఎత్తున దాడులకు పూనుకున్న ప్రతి సందర్భంలో కూడా ముస్లిం మత దురహంకార సంస్థలు పుట్టుకురావడం, ప్రతీకార దాడులకు పాల్పడడం జరుగుతున్నదన్న విషయం అర్థమవుతుంది. 1985 నుండి ఇవి మనకు బాగా కనిపిస్తాయి. ముస్లింలపై నరమేధం సాగుతున్న నేపథ్యంలో అహ్లే-ఏ-హదీస్ అనే ఛాందసవాద సంస్థ 1985లో పుట్టుకొచ్చింది. ఇది ముస్లింలు సాయుధ ప్రతిఘటనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఆ తర్వాత బాబ్రీ మసీదు విధ్వంసం దరిమిలా ముస్లింలపై జరిగిన దాడులను ప్రతిఘటించేందుకు కొన్ని సంస్థలు ఏర్పడ్డాయి. వీటిలో కొన్ని లష్కర్-ఏ-తయ్యిబా సంస్థకు అనుబంధంగా పనిచేశాయి. వీటితో మాఫియా ముఠాలకూ, ఐఎస్ఐకీ గల సంబంధాలను కూడా నిరాకరించలేం. అయితే ఇవి ఉనికిలోకి రావడానికి ప్రాతిపదికను కల్పిస్తున్నది మాత్రం హిందూ ఫాసిస్టులే. సంఘ్ పరివార్ ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న హత్యాకాండలనూ, అవమానాలనూ తట్టుకోలేని పరిస్థితిలోనే ముస్లింలలో ఒక సెక్షన్ ఇలా మత దురహంకార సంస్థల్లో చేరిపోయి తమ శత్రువులెవరో గుర్తించకుండా విచక్షణ లేని దాడులకు పాల్పడుతున్నది. మత దురహంకారులు చేసే దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. అయితే హిందూ ఫాసిస్టులు చేస్తున్న దాడులనూ, వాటికి ప్రతిగా ముస్లిం మత దరహంకారులు చేస్తున్న దాడులనూ ఒకే గాటన కట్టి చూడడంలో అర్థం లేదు. ప్రస్తుతం హిందూ ఫాసిస్టులు ముస్లింల అవశేషాలు కూడా మిగలవద్దనే లక్ష్యంతో పథకం ప్రకారం పాల్పడుతున్న హింసను చూస్తుంటే అక్షర్‌ధాం తరహా దాడులు ఇంకా జరుగవచ్చుననే అనిపిస్తోంది.

అయితే ఈ సందర్భంగా ప్రభుత్వం, పోలీసు బలగాలు అనుసరించిన తీరుతో ఈ దాడిపై అనేక సందేహాలు కలుగుతున్నాయి. అక్షర్‌ధాం దాడికి పాల్పడ్డ ఇద్దరు ఉగ్రవాదులను చంపకుండా సజీవంగా బంధించడానికి పోలీసులు గానీ, ప్రభుత్వం గానీ ఎలాంటి ఉత్సాహం చూపలేదు. ఆ ప్రయత్నం ఎందుకు చెయ్యలేదు అని అడగడమే దేశద్రోహం అనే రీతిలో వినవచ్చిన ప్రతిస్పందనల్ని చూస్తే ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. గుజరాత్ హోంమంత్రి గోవర్ధన్ జఫడియా "మేం వాళ్లను చంపకుండా ఎందుకు వదులుతాం" అని ప్రశ్నించడం దేశ రాజకీయాలు ఎంత అప్రజాస్వామికంగా మారాయో అర్థం చేసుకోవడానికి ఒక చిన్న ఉదాహరణ. అలాగే దాడి ముగిసిన కొద్ది గంటల్లోనే వాళ్లు పాకిస్తానీయులని ప్రకటించారు. ఆ తర్వాత, ట్రెయిన్‌లో వచ్చి దాడికి పాల్పడి ఉంటారని ప్రకటించారు. ఆ తర్వాత వాళ్లు తొడుక్కున్న లోదుస్తులను బట్టి అహ్మదాబాద్‌కు చెందిన ముస్లింలే అయి ఉంటారని నిర్ధారణకు వచ్చారు. ఎలాంటి ఆధారం లేని ఒక రేడియో ప్రసారాన్ని బట్టి వీళ్లు కాశ్మీరీ మిలిటెంట్లు అయి ఉంటారనీ, కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యానికి లభించిన ఘన విజయానికి కన్నుకుట్టి ఈ దాడికి పాల్పడి ఉంటారనీ చెప్పారు. ఉద్దేశ్యపూరితంగా, ఇది గుజరాత్‌లో ముస్లింల ఊచకోతకు ఫలితంగా జరిగిన ప్రతీకార దాడి అయి ఉండొచ్చన్న అవకాశాన్ని నిరాకరించడమే ఈ ప్రకటనల ఉద్దేశ్యం. రా (ఆర్ఏడబ్ల్యు) వంటి భారతదేశ గూఢచార సంస్థలే స్వయంగా ఈ తరహా దాడులకు పథకం తయారుచేసి ఉంటాయని వినవస్తున్న ఆరోపణలు కూడా నిజం కావచ్చు. ఎందుకంటే గతంలో చాలాసార్లు కాశ్మీర్‌లో ఇలాంటి దాడులను ప్రభుత్వ సాయుధ బలగాలే చాటుమాటుగా జరిపాయి. భారత పాలకవర్గాలకు ఇలాంటి చరిత్ర చాలానే ఉంది. గోధ్రా ఘటనకు బాధ్యులెవరు అన్న విషయంలో ఇంకా మిస్టరీ వీడిపోనట్టుగానే, బహుశ అక్షర్‌ధాం దాడి వెనుక ఉన్నదెవరో కూడా ఎన్నటికీ తెలవకుండానే ఉండిపోవచ్చు. లేదా అవకతవకల విచారణ పూర్తిచేసి ఎవరో కొందరిని దోషులుగా తేల్చవచ్చు. పోటా కింద ఉరికంబాన్నెక్కించవచ్చు కూడా.

## ఉన్మాదం హద్దుల గుండా సాగిన 'గుజరాత్ (అ)గౌరవ యాత్ర'

మన దేశంలో ఇప్పటి దాకా జరిగిన దాదాపు అన్ని యాత్రలూ ప్రజల ప్రాణాల్ని బలిగొనే 'జగన్నాథ రథయాత్ర'లుగానే ముగిసాయి. గుజరాత్‌లో ముస్లింల ఊచకోత మొదలైన తర్వాత ప్రజలు ప్రశాంతంగా పండుగలూ పబ్బాలూ కూడా జరుపుకోలేని స్థితి. జూలై 14న అహ్మదాబాద్‌లో జరిగిన జగన్నాథ యాత్ర సందర్భంగా ముస్లింలు ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని గడిపారు. అప్పుడప్పుడే అల్లర్లు సద్దుమణిగి తమ తమ ఇళ్లకు వెళ్లడానికి సిద్ధమవుతున్న పరిస్థితిలో జగన్నాథయాత్ర ముందుకు రావడంతో ముస్లింలు తమ శిబిరాల్లోనే ఉండిపోయారు. ఆ తర్వాత గణేష్ నిమజ్జనం, జన్మాష్టమి వంటి హిందూ పండగల సందర్భంగా గుజరాత్‌లోని వివిధ చోట్ల అల్లర్లు చెలరేగాయి. అనేక మంది ముస్లిం ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గుజరాత్ గౌరవాన్ని చాటిచెప్పడం కోసమని అంటూ నరేంద్ర మోది ఎన్నికల ప్రచార రథం తయారు చేసుకొని పర్యటన ప్రారంభించాడు. గుజరాత్‌లో నెలకొని ఉన్న ఉద్రిక్త పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గౌరవయాత్రను వాయిదా వేయాలని పలు రాజకీయ పార్టీలూ, సంస్థలూ చేసిన విజ్ఞప్తులను తుంగలో తొక్కి, అక్షర్‌ధాం విజయంతో తలకెక్కిన మత్తుతో మోది ఈ యాత్రకు శ్రీకారం చుట్టాడు. బిజెపి కేంద్ర నాయకత్వం, ప్రత్యేకించి అద్వానీ, వాజ్‌పేయిలు తమ విదేశీ పర్యటనల సందర్భంగా గుజరాత్‌లో జరిగిన సంఘటనల్ని 'జాతి మొఖంపై మాయని మచ్చ'గా పేర్కొన్నారు. వీటి పట్ల తమ 'విచారాన్ని' కూడా వెలిబుచ్చారు. మరి అదే బిజెపికి గుజరాత్‌లో యాత్ర జరపడం 'గౌరవం' ఎలా అయ్యిందో! బిజెపి రెండు నాల్కల ధోరణికి ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కర్లేదు. ఈ యాత్రను 'గౌరవ' యాత్ర కాదు, 'గాలీల' (తిట్ల) యాత్ర అని మామూలు పత్రికలు సైతం అభివర్ణించాయి. 'అసలే కోతి, ఆపై కల్లు తాగింది' అన్న చందంగా నరహంతకుడైన నరేంద్ర మోది వెర్రి ఉన్మాదంతో ఊగిపోతూ కనీసం బూర్జువా మర్యాదలను కూడా లెక్కచేయని విధంగా క్యాంపెయిన్ నిర్వహించాడు. సోనియా గాంధీ, లింగ్‌డోహ్, మియా ముషరఫ్‌లను టార్గెట్ చేస్తూ అసభ్య పదజాలంతో ప్రచారయుద్ధం మొదలెట్టాడు. తాను కావాలో మియా ముషరఫ్ కావాలో తేల్చుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చి తనకు తాను ముషరఫ్‌ను ఎదిరించే వీరుడిగా ఫోకస్ చేసుకున్నాడు. ప్రజల్లో ఇప్పటికే పాదుకుపోయిన పాకిస్తాన్ వ్యతిరేక భావనలను రెచ్చగొట్టి ఓట్లు రాబట్టడానికి ప్రయత్నించాడు. మొత్తంగా క్రైస్తవులకూ, ముస్లింలకూ వ్యతిరేకంగా విషం గక్కుతూ ప్రచారం చేశాడు. మధ్యమధ్యన మోది చేసిన వ్యాఖ్యలతో బిజెపి కేంద్ర నాయకులే ఇరకాటంలో పడే పరిస్థితి కూడా తలెత్తింది. అయినా బిజెపి తనకు అలవాటుగా ఉన్న నయవంచనతో ఇలాంటి ఇరకాటాల నుండి తేలిగ్గానే తప్పించుకుంది. కొంపాగోడూ కోల్పోయిన ముస్లింలు విధిలేక శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటూంటే వాటిని 'పిల్లల్ని ఉత్పత్తి చేసే కార్ఖానాలు' అని మోది వ్యాఖ్యానించాడు. వీటిని మూసేస్తామని బహిరంగంగా ప్రకటించాడు. ముస్లింలను 'హమ్ పాంచ్, హమారే పచ్చీస్' (మేం ఐదుగురం, మాకు ఇరవయ్యైదుగురు) అని నమ్మేవాళ్లంటూ విద్వేషాన్నీ, హేళననూ మేళవించి ప్రచారం చేశాడు. వీటి గురించి పత్రికల వాళ్లు కేంద్ర నాయకుల్ని అడిగినప్పుడు మోది మాట్లాడింది జనాభా పెరుగుదల సమస్య గురించి అనీ, మీడియాలో తప్పుగా ఉటంకించారనీ బుకాయించారు.

## అసలు సమస్యలు కనుమరుగు

'గుజరాత్ గౌరవ యాత్ర'కు ముస్లింలపై సాధించిన 'విజయాలే' ప్రేరణ. గుజరాత్ ప్రజలెదుర్కొంటున్న లెక్కలేనన్ని సమస్యలు మర్చిపోయేలా చేయడంలో హిందూ ఫాసిస్టులు చాలా వరకు సఫలమయ్యారనే చెప్పొచ్చు. గుజరాత్ వరుసగా మూడేళ్ల నుండి తీవ్రమైన కరువుతో విలవిలలాడుతున్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించలేదు. ఉద్యోగాలు కోల్పోయిన వాళ్లకు, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న వాళ్లకు ఎలాంటి సహాయ కార్యక్రమాలూ ప్రకటించలేదు. ఈ సంవత్సరం 80 శాతానికి పైగా ప్రాంతాలలో సగటు వర్షపాతంలో సగమైనా వర్షాలు పడలేదు. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన 1,000 కోట్ల రూపాయల బకాయిలు ఇంకా అలాగే ఉన్నాయి. అహ్మదాబాద్ (గ్రామీణ) జిల్లాలోని సానంద్‌లో 25 మంది రైతులు పంటల్ని కోల్పోయి నిరాశానిస్పృహలకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గుజరాత్‌లోని చిన్నా, మధ్య తరహా పరిశ్రమల్లో 60 శాతం దాకా మూతబడిపోవడమో లేదా నష్టాల్లో కూరుకుపోవడమో జరిగింది. గుజరాత్‌లో ప్రధానమైన ఉపాధి వనరు ఈ పరిశ్రమలే. కో-ఆపరేటివ్ బ్యాంకుల కుంభకోణం బిజెపి అసలు రూపాన్ని బయటపెట్టింది. లక్షలాది మంది ప్రజలు శ్రమచేసి సంపాదించి దాచుకున్న డబ్బును అవినీతిపరులైన అధికార్లూ, నాయకులూ కలిసి కాజేశారు. పోయిన సంవత్సరం వచ్చిన తీవ్ర భూకంపం మూలంగా సర్వస్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ సమస్యలన్నీ బిజెపి అసమర్థ అవినీతి పాలనకు సాక్ష్యాలుగా నిలిచాయి. అయితే బిజెపి వీటన్నింటినీ పక్కకు పెట్టి విద్వేషాగ్నికి ఆజ్యం పోయడమనే ఒకే ఒక్క ఆయుధాన్ని ఉపయోగించుకొని ఎన్నికల్లో విజయం దిశగా సాగింది.

బిజెపిని కాంగ్రెస్ మతతత్వ పార్టీ అని విమర్శిస్తూ వుంటుంది. కాంగ్రెస్‌ను బిజెపి కుహనా లౌకికవాది అంటూ విమర్శిస్తూ వుంటుంది. ఈ రెండు పార్టీలు తమ ప్రత్యర్థుల గురించి చెప్పేది ఒక మేరకు కరెక్టే. నిజానికి ఈ రెండు పార్టీలూ మతతత్వ పార్టీలే – రెండూ హిందూత్వ సిద్ధాంతాలపై నడుచుకునేవే. కాకపోతే బిజెపిది 'గరం' (ఉగ్ర) హిందూత్వ అయితే కాంగ్రెస్‌ది 'నరం' (మెతక) హిందూత్వ. గుజరాత్ నరమేధం నుండి ఇప్పటిదాకా కాంగ్రెస్ అనుసరిస్తూ వస్తూన్న విధానాలే ఇందుకు చక్కని ఉదాహరణ. ముస్లింల ఊచకోత జరుగుతూ ఉంటే మోదిని గద్దె దించాలని డిమాండ్ చేయడానికి అది చాలా టైం తీసుకుంది. అక్షరధాం దాడి తర్వాత క్షణాల్లో సోనియాగాంధీ గాంధీనగర్ వెళ్లి తాను హిందువుల ఓట్లను పోగొట్టుకోవడానికి సిద్ధంగాలేనని స్పష్టం చేసింది. ముస్లింలను ఆఖరుకు కాంగ్రెస్ కార్యాలయాల చుట్టుపక్కలకు రాకుండా కాంగ్రెస్ అనేక జాగ్రత్తలు తీసుకుంది. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అంబాజీ అనే హిందూ పూజాస్థలం నుండి ప్రారంభించడం దాని అవకాశవాదానికి ఓ మచ్చుతునక. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు అక్షరధాం దాడిని ఖండిస్తూ మాట్లాడారే తప్ప నరోడా-పాటియా ఉదంతాన్ని మాటమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. మొత్తం గుజరాత్ విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు ఎలా వుండిందంటే దానికి ముస్లింల ఓట్ల గురించి ఎలాంటి చింతా లేదు. ఎందుకంటే ముస్లింల ముందు కాంగ్రెస్‌కు ఓట్లేయడం తప్ప మరో మార్గం లేదని దానికి తెలుసు. కాబట్టి బిజెపి ఉపయోగిస్తున్న మతతత్వ విధానాన్నే అది కూడా ఆశ్రయించింది – అయితే బైటికి కనపడకుండా. వీలైనన్ని ఎక్కువ హిందూ ఓట్లు రాబట్టుకోవడమే దాని ఎత్తుగడ. అయితే ప్రజలు ఒక హిందుత్వ పార్టీకే ఓట్లేయాలనుకుంటే సహజంగానే కాంగ్రెస్‌కన్నా బిజెపి వైపే మొగ్గు చూపిస్తారు. ఎందుకంటే అదే కల్తీలేని 'హిందుత్వ' పార్టీ అన్న విషయం అందరికీ తెలుసు. గుజరాత్‌లో అదే జరిగింది. మతతత్వ ప్రభావంలో ఉన్న ఓటర్ల ముందు బిజెపికన్నా మరో ప్రత్యామ్నాయం ఎలాగూ లేదు. రాష్ట్రంలో బిజెపి పాలనలో ప్రజలెదుర్కుంటున్న సమస్యల గురించి మాట్లాడే పార్టీకి ఓట్లేద్దామని అనుకున్న ఓటర్లకు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలన్నీ నిరాశనే మిగిల్చాయి. కాంగ్రెస్ తన ఎన్నికల క్యాంపెయిన్‌లో బిజెపి అసమర్థ పాలనను, అవినీతినీ, రాష్ట్రంలో నెలకొని ఉన్న సమస్యలు వేటినీ ప్రధానాంశంగా చేసుకోలేదు. లౌకిక, ప్రజాస్వామిక, విప్లవకర శక్తులు లేకపోవడం గుజరాత్‌లో బిజెపికి లాభదాయకంగా పరిణమించింది.

## మోది/బిజెపి విజయం - ప్రమాదానికి సంకేతం

తాను పాల్పడ్డ ఘోరమైన హత్యాకాండలకు గాను ఉరితీయాల్సిన ఒక వ్యక్తి ఈ రోజు అట్టహాసంగా మరో ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలిస్తానని ప్రమాణ స్వీకారం చేస్తున్నాడు. ఇది బిజెపికి కేవలం ఎన్నికల విజయం మాత్రమే కాదు, అది తన హిందుత్వ విధానాలపై చేసిన ఒక ప్రయోగంలో సాధించిన విజయం. అందుకే ఇప్పుడు గుజరాత్ అనుభవాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలలో అమలు చేస్తామని బిజెపి నాయకులు బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఇక ముసుగులో గుద్దులాటతో పని లేదు, రెండు ఎజెండాలతో పని లేదు. ఎన్నికల్లో విజయం సాధించేదాకా కొంత సంయమనాన్ని పాటిస్తూ 'గోధ్రా సంఘటనను ఎన్నికల్లో ఉపయోగించుకోం' అంటూ నసుగుతూ వచ్చిన అద్వానీ, వాజ్‌పేయిలు ఎన్నికలు ముగియగానే 'ముస్లింలు గోధ్రా ఘటనను మరింతగా ఖండించాల్సి ఉండె, క్షమాపణలు చెప్పుకోవాల్సి ఉండె. అయినా గోధ్రాను ఎలా మర్చిపోగలం?' అంటూ తీవ్ర స్వరంతో మాట్లాడారు. ఇప్పటికీ గోధ్రా ఘటన గురించి న్యాయ విచారణ పూర్తవనేలేదు. ఇంకా దోషులెవరనేది ఇదమిద్ధంగా తేలనే లేదు. ముస్లింలు మతస్థులంతా దానికి క్షమాపణ చెప్పుకోవాలట! మరి వేలాది మంది ముస్లింలను హతమార్చి, ఎందరో మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడి, కడుపులో ఉన్న శిశువుల్ని కూడా త్రిశూలాలతో పొడిచి చంపి, నరోడా పాటియా లాంటి చోట్ల సామూహిక నరమేధానికీ, సామూహిక మానభంగాలకూ పాల్పడి, లక్షలాది మందిని నిలువనీడ సైతం లేకుండా చేసిన పచ్చి దుర్మార్గ చర్యలకు మొత్తం హిందుత్వ పరివార్ కనీసం క్షమాపణ చెప్పుకోవడానికైనా సిద్ధంగా ఉందా? తాము నమ్ముతామని చెప్పుకుంటున్న రాజ్యాంగం ప్రకారమే నేరస్తులందరిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవడానికి ముందుకు రాగలదా? అసలు విషయం ఏమిటంటే గోధ్రాలో గానీ, అక్షర్‌ధాంలో గానీ ప్రాణాలు కోల్పోయిన సాధారణ హిందూ ప్రజల గురించి సంఘ్ పరివార్‌కు ఏ మాత్రం పట్టింపూ లేదు. ఆ సంఘటనలను ఆధారం చేసుకొనీ గుజరాత్‌లో మరో ఐదేళ్లపాటు అధికారం ఎలా చేజిక్కించుకోవచ్చో, ఈ పథకాన్ని విస్తరింపజేసి 2004లో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్త విజయం ఎలా సాధించవచ్చో దానికి తెలిసినంత బహుశ మరెవ్వరికీ తెలువకపోవచ్చు.

## హిందూ ఫాసిజాన్ని సంఘటితంగా ఎదుర్కొందాం !

హిందూ ఫాసిజం పెట్రేగి పోవడానికి వివిధ పార్లమెంటరీ పార్టీలు అనుసరిస్తున్న కుహనా లౌకికవాద-అవకాశవాద విధానాలు కూడా ముఖ్యమైన కారణమే. కాంగ్రెస్ పూర్తిగా అవకాశవాదంగా వ్యవహరిస్తూ బిజెపి హిందుత్వ విధానాల ముందు లొంగుబాటును ప్రదర్శిస్తుండగా, బిఎస్‌పి, తెలుగుదేశం, ఏఐడిఎంకె వంటి ప్రాంతీయ పార్టీలూ, బడుగువర్గాల ప్రతినిధులమని చెప్పుకునే పార్టీలూ పూర్తిగా అవకాశవాద రాజకీయాల్లో కూరుకుపోయి హిందూ ఫాసిజానికి పూర్తిగా మద్దతునిస్తున్నాయి. సిపిఐ, సిపిఎం తదితర 'వామపక్ష' పార్టీలు హిందూ ఫాసిజాన్ని దృఢంగా ఎదుర్కొనే వైఖరిని తీసుకోకుండా కాంగ్రెస్‌కు బిజెపి అనుసరిస్తున్న విధానాలనే అనుసరించడం తగదంటూ విజ్ఞప్తులు చేస్తూ దాని దిక్కే చూస్తూ లొంగుబాటు విధానాలను ప్రదర్శిస్తున్నాయి. విశాలమైన ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటనకు పూనుకునే చొరవను ఏ మాత్రం ప్రదర్శించడం లేదు. సంఘ్ పరివార్ ఫాసిస్టు విధానాలను నామమాత్రంగానే విమర్శిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ఫాసిజాన్ని ఎదుర్కొనే బాధ్యత ప్రధానంగా విప్లవ శక్తులపైనా, నిజమైన ప్రజాస్వామ్య-లౌకికవాద శక్తులపైనా ఉంటుంది. ఇందుకు కార్మికవర్గమే చొరవ తీసుకొని నాయకత్వం వహించాల్సి ఉంటుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున కేంద్రీకృతమై ఉన్న కార్మికవర్గం చాలా వరకు మతతత్వ భావనల ప్రాతిపదికగా చీలిపోయి ఉంది. అలాగే రాష్ట్రంలో ప్రజాస్వామ్య శక్తులు, విప్లవకర శక్తులు చాలా బలహీనంగా ఉన్నాయి. ఈ స్థితి హిందుత్వ శక్తులకు అనుకూలంగా ఉంది. అయితే హిందుత్వ శక్తుల మద్దతుతో అమలవుతున్న ప్రపంచీకరణ విధానాల మూలంగా పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం రాజకీయ సంక్షోభానికి దారితీయక తప్పదు. మరింత పెద్ద సంఖ్యలో నిరుద్యోగానికి దారితీయక తప్పదు. అలాగే దేశంలోని పలు ప్రాంతాల్లో విప్లవ పార్టీల నాయకత్వంలో పురోగమిస్తున్న ప్రజాయుద్ధం దేశవ్యాప్తంగా ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయ మార్గంగా వస్తున్నది. హిందూ ఫాసిజాన్ని వీధుల్లో పోరాడి ఓడించకుండా నిర్మూలించలేమని మైనారిటీ ప్రజలూ, ఇతర పీడిత ప్రజలూ గుర్తించాలి. హత్యాకాండలకు పాల్పడే ఫాసిస్టు నాయకులపై కేంద్రీకరించి దాడులు జరపాలే తప్ప అమాయక హిందూ ప్రజలపై దాడులు చేయడం తప్పని ముస్లింలు అర్థం చేసుకోవాలి. మత ఛాందస సంస్థలు హిందూ ఫాసిజాన్ని ఎదిరించలేవు, సరికదా అవి అంతిమంగా దానికే ఉపయోగపడతాయి. కార్మికవర్గ నాయకత్వంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం కావడం ద్వారానే పీడిత ముస్లింలు తమపై సాగుతున్న హింస, అణచివేతల నుండి విముక్తిని పొందగలరు. ❑

*22 డిసెంబర్ 2002*

శ్రద్ధాంజలి

# పోలీసులతో పోరాడుతూ నేలకొరిగిన యోధుడు
# కామ్రేడ్ కోవాసి జోగ (తిరుపతి - సన్నూ)కు అరుణారుణ జోహార్లు !

ఆగష్టు 31, 2002న పిజిఏ గెరిల్లాల డిటాచ్‌మెంట్ ఒకటి పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని వెదిరె పోలీసుస్టేషన్‌పై షార్ట్ సర్‌ప్రైజ్ అటాక్ చేసింది. రాత్రి 10 గంటల నుండి తెల్లవారు జామున 5 గంటల వరకూ కొనసాగిన ఈ దాడిలో పిజిఏ దక్షిణ కమాండ్ కింద గల పిఎల్-2 సెక్షన్ కమాండరూ, ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడూ అయిన కా. కోవాసి జోగ అమరుడయ్యాడు. ఆయన తన దగ్గరున్న ఎల్ఎమ్‌జితో శత్రువుపై నిప్పుల వర్షం కురిపిస్తూ శత్రు బలగాలను బెంబేలెత్తిస్తూ, ఆ క్రమంలో పొజిషన్ మార్చుకుంటూండగా శత్రు తూటాకు టార్గెట్ అయ్యి అమరుడైనాడు.

దాడి విఫలమవడంతో గెరిల్లాలు తమ సహచరుడి మృతదేహాన్ని తీసుకుని రిట్రీట్ అయ్యారు. ఆ తర్వాత విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. అయితే పోలీసు అధికారులు మాత్రం ఈ దాడిలో ఆరుగురు నక్సలైట్లు చనిపోయారనీ, మరెందరో గాయపడ్డారనీ తప్పుడు ప్రచారానికి లంకించుకున్నారు.



కా. జోగ దంతెవాడ జిల్లాలోని కరకనార్ గ్రామంలోని నిరుపేద కుటుంబంలో పుట్టాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లితో పాటు వేరే గ్రామానికి (తుమ్‌నార్-దాంపార) పోయి పెరిగి పెద్దైనాడు. తర్వాత అతని మేనత్త జోగాను యిల్లరికం (లాం) పెట్టుకుని నెల్లిమడుగు గ్రామానికి తెచ్చుకున్నది. చిన్నతనం నుండీ కష్టాల్లో పుట్టి పెరిగిన వాడవడం వల్ల కష్టాలు పోయే మార్గాన్ని వెదకసాగాడు. ఆ సమయంలో ఆ గ్రామానికి వచ్చిపోతుండే గెరిల్లా దళంతో అతనికి పరిచయం ఏర్పడింది. క్రమంగా అతను విప్లవ రాజకీయాలను అర్థం చేసుకోసాగాడు. దళం ఎప్పుడు ఆ గ్రామానికి వెళ్లినా దళానికి అన్నం, నీళ్లూ తెచ్చిపెడ్తూ పార్టీ పట్ల అభిమానాన్ని పెంచుకున్నాడు. ఆ క్రమంలో అతను విప్లవంలోనే పూర్తికాలం పని చేయడానికి నిశ్చయించుకొని 1997లో గెరిల్లా దళంలో సభ్యుడిగా చేరాడు. దళంలో అతను తన పేరును తిరుపతిగా మార్చుకున్నాడు. ఆ తర్వాత సన్నూ అనే పేరుతో పని చేశాడు.

1998లో కా. సన్నూను పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్‌లోని ఎస్‌జిఎస్‌కు బదిలీ చేసింది. ఆ తర్వాత ప్లటూన్ సభ్యుడిగా ఎంపికై ఆఖరు దాకా అందులోనే పనిచేశాడు. కా. సన్నూ దక్షిణ బస్తర్‌లోని తొర్రెం గ్రామం వద్ద జరిగిన అంబుష్‌లో సీజింగ్ పార్టీ సభ్యుడిగా పనిచేశాడు. 2000 సంవత్సరంలో జరిగిన బాకుల్‌వాహి అంబుష్‌లో సన్నూ పోలీసులకు ఎరవేసి ఆకర్షించే టీం సభ్యుడిగా చొరవతో పాల్గొన్నాడు. 24 మంది పోలీసులను హతమార్చిన ఈ సంఘటన పాలకవర్గాల కిరాయి పోలీసు బలగాలను గడగడా వణికించింది. అలాగే 2001లో దక్షిణ బస్తర్‌లోని తీగెల వద్ద జరిగిన అంబుష్‌లోనూ, ఒరిస్సాలోని మోటు రెయిడ్‌లోనూ ఎల్ఎమ్‌జి ఆపరేటర్‌గా అతను నిర్వహించిన పాత్రను ఎన్నటికీ మర్చిపోలేం. మోటు రెయిడ్‌లో సర్‌ప్రైజ్ ఫెయిల్ కావడంతో శత్రువు గుండ్ల వర్షం కురిపించసాగాడు. అయినప్పటికీ కమాండర్ ఆదేశంతో కా. సన్నూ తన ఎల్ఎమ్‌జితో 180 పైగా తూటాలు కాల్చి శత్రువుని వణికించాడు. దానితో మన కామ్రేడ్స్ సురక్షితంగా రిట్రీట్ కావడానికి వీలయింది.

కా. సన్నూ మంచి పోరాట యోధుడు. ఒక నిపుణుడైన ఎల్ఎమ్‌జి ఆపరేటర్. దృఢమైన శరీరం గల కా. సన్నూ ఎల్ఎమ్‌జిని ఒక రైఫిల్ లాగా ఆపరేట్ చేసేవాడంటే అతిశయోక్తి ఏమీ లేదు. దాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటూ అన్ని సమయాల్లోనూ దాన్ని యుద్ధానికి సిద్ధంగా ఉంచేవాడు. అందుకే అతను ఆపరేట్ చేసినంత కాలం ఎల్ఎమ్‌జిలో ఎలాంటి స్టాపేజీ రాలేదు.

కా. సన్నూ స్నేహశీలి. అందరితోనూ ఎంతో కలుపుగోలుగా ఉండేవాడు. అతనిపై దళ సభ్యులకు ఎనలేని విశ్వాసం. వాళ్లతో బాగా కలగలిసిపోయి వాళ్ల నుండి నేర్చుకుంటూ వాళ్లకు నేర్పేవాడు. పార్టీ 9వ కాంగ్రెస్ తర్వాత అతన్ని ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగానూ, సెక్షన్ కమాండర్ గానూ ఎన్నుకున్నారు. అతను తన బాధ్యతలకు న్యాయం చేశాడు.

కా. సన్నూ క్రమశిక్షణకు పెట్టింది పేరు. పార్టీ నిర్ణయాలనూ, తీర్మానాలనూ అమలు చేయడంలోనూ శక్తివంచన లేకుండా పాటుపడేవాడు. మానసికంగా, శారీరకంగా ఎన్ని యిబ్బందులున్నప్పటికీ తన బాధలు తనలోనే దాచుకొని పనిచేసేవాడు. తన మూలంగా దళం పనికి ఏ విధమైన అడ్డంకీ రాకూడదని భావించేవాడు. తనతో పాటే ప్లాటూన్‌లో సభ్యురాలిగా పని చేస్తున్న ఒక మహిళా కామ్రేడ్‌ను కా. సన్నూ తన జీవిత సహచరిగా ఎంచుకొని పార్టీ పద్ధతుల ప్రకారం పెళ్లి చేసుకున్నాడు. విప్లవకారుల జీవితంలో సంతానం మూలంగా ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకొని చైతన్యవంతంగా పిల్లలు కలుగకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు. స్వంత కోరికల కంటే విప్లవ ప్రయోజనాలే ఉన్నతమైనవిగా భావించి ప్రతి పనీ దానికి లోబడే చేసేవాడు.

కా. సన్నూ మరణంతో ప్లాటూన్-2 ఒక సమర్థుడైన సెక్షన్ కమాండర్‌ను కోల్పోయింది. మొత్తంగా పిజిఏ ఒక ఎదుగుతున్న వీర యోధున్ని కోల్పోయింది. దండకారణ్య పార్టీ ఒక విలువైన భూమి పుత్రున్ని కోల్పోయింది. బస్తర్ ప్రజలు ఆయన మరణానికి కన్నీరు పెట్టారు. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తామని శపథం పూనారు. పిజిఏ కా. సన్నూకు ఘనంగా నివాళులర్పించి ఆయన లేని లోటును పూడ్చుకోవడానికి వందల వేల వారసుల్ని సృష్టించేలా ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకునిపోయే కర్తవ్యానికి పునరంకితమయ్యింది. ❑

# అమరుడు కామ్రేడ్ దధీచి రాయ్ (పటేల్‌జీ)కి లాల్ సలామ్ !

*(గత సంచికలో పార్టీ బీహార్-ఝార్ఖండ్ సంయుక్త రాష్ట్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ దధీచి రాయ్ అమరత్వం గురించి సంక్షిప్తమైన రిపోర్టు వేశాం. ఆయన జీవిత చరిత్ర గురించి ఇప్పుడు వివరమైన రిపోర్టు అందినందున ఈ సంచికలో వేస్తున్నాం. కామ్రేడ్ దధీచి రాయ్‌కూ, ఆయనతో పాటు ఆ ఎన్‌కౌంటర్లో వీరమరణం పొందిన కామ్రేడ్స్ రామ్‌కేశ్, రామదయాళ్, రౌతిన్‌లకు వినమ్రంగా జోహార్లర్పిస్తూ వారి ఆశయసాధనకై పాటు పడతామని శపథం చేస్తున్నాం.*

*- సంపాదకులు)*

ఝార్ఖండ్ రాష్ట్రంలోని పలామూ జిల్లాలోని బిశ్రాంపూర్ వద్ద 2002 మే 26న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ దధీచిరాయ్, మరో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆయనను ప్రజలు పటేల్‌జీగా పిల్చుకునేవారు. కామ్రేడ్ పటేల్‌జీ అమరత్వంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) [పీపుల్స్‌వార్] ఒక సమర్థుడైన నాయకున్ని కోల్పోయింది. మార్చి 2002లో బీహార్-ఝార్ఖండ్ సంయుక్త రాష్ట్రకమిటీలోకి కో-ఆప్ట్ చేసుకున్న కామ్రేడ్ పటేల్‌జీని కోల్పోవడం ఆ రెండు రాష్ట్రాల్లోని పార్టీకి ఎంతో నష్టం.

వైద్య పరీక్ష కోసం బయటకు వెళ్లిన కామ్రేడ్ పటేల్‌జీ మే 25న రైల్లో పాట్నానుండి తిరిగి వచ్చాడు. పటేల్‌జీని రిసీవ్ చేసుకోవడం కోసం ప్లటూన్-1కు చెందిన రెండు సెక్షన్లు రాత్రే స్టేషన్‌కు వెళ్లాయి. ఆ మరుసటి రోజు ప్లటూన్ పటేల్‌జీని కలిసి దగ్గర్లోని గ్రామానికి తీసుకువెళ్లింది. ఈ లోగా పక్కనే ఉన్న ద్వారపార్ గ్రామంలోకి రెండు ఖాళీ పోలీసు వ్యాన్‌లు వెళ్లాయన్న వార్త తెలిసింది. దాని వివరాలు తెలుసుకు రమ్మని గ్రామస్థులను పంపారు. అయితే మరో ఊళ్లో ఒక పత్రికా విలేఖరితో పటేల్‌జీ ముందే పెట్టుకున్న అపాయింట్‌మెంట్‌కు అందరూ వెళ్లారు. అక్కడే ఉండి సమాచారం తేవడానికి వెళ్లినవారి కోసం ఉదయం 9 గంటల వరకు ఎదురుచూశారు. అయితే ప్లటూన్ వచ్చిందన్న సమాచారం పోలీసులకు ముందు రోజు రాత్రి గానీ, ఆ రోజు ఉదయం గానీ తెలిసి ఉంటుంది. దానితో ప్లటూన్‌ను పక్కనే ఉన్న మర్నాఘాట్ గుట్టల వద్ద ఆంబుష్ చేయడానికి నిర్ణయించుకుని బలగాలను వేర్వేరు దిశల గుండా పంపించి అక్కడ మొహరించారు. ఈ విషయం అర్థం కాని ప్లటూన్ కొండవైపుగా వెళ్లి ఆంబుష్‌లో చిక్కుకుంది. కామ్రేడ్ దధీచి రాయ్ సహా కొందరు సభ్యులు పోలీసులు పన్నిన పద్మవ్యూహంలో చిక్కుకుపోయారు. పోలీసులు కురిపించిన గుండ్లవర్షంలో కా. పటేల్‌జీ నేలకొరిగాడు. ఆయన్ని తీసుకెళ్లే ప్రయత్నంలో మరో ఇద్దరు కామ్రేడ్స్ కూడా అమరులయ్యారు. గాయపడ్డ మరో కామ్రేడ్ రామ్‌కేష్‌ను పోలీసులు పట్టుకొని చంపేశారు. ఈ బ్యాచ్‌లో మిగిలిన నలుగురు కామ్రేడ్స్ పోలీసులపై కాల్పులు జరుపుకుంటూ బైటపడ్డారు. ప్లటూన్ కమాండర్ ఉన్న మరో బ్యాచ్ పోలీసుల ఎన్‌సర్కిల్‌మెంటును ఛేదించుకుంటూ క్షేమంగా రిట్రీట్ అయ్యింది.

## కామ్రేడ్ పటేల్‌జీ రాజకీయ జీవితం

రాజపూత్ (క్షత్రియ) కులానికి చెందిన కామ్రేడ్ దధీచి రాయ్ (45) ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టాడు. బి.ఏ. వరకు చదివి బతుకుదెరువు కోసం కరంచాట్ (రోహతస్)లోని దుర్గావతి ఇరిగేషన్ ప్రాజెక్టులో దినసరి వేతన కార్మికుడుగా పనిచేశాడు. ఆ సమయంలోనే డెహ్రీలో ఇరిగేషన్ మెకానికల్ వర్క్‌షాప్ కార్మికులలో ఒక మిలిటెంట్ కార్మిక సంఘం (ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్) ఏర్పడింది. దుర్గావతిలో కూడా దాని శాఖ ఏర్పడింది. దానిలో కామ్రేడ్ పటేల్‌జీ ఒక మిలిటెంట్ నాయకుడిగా ఎదిగాడు. కార్మిక సంఘంలో పనిచేస్తున్న ఒక పార్టీ ఆర్గనైజర్ ద్వారా 1980ల కాలంలో ఆయన పార్టీ సంబంధాల్లోకి వచ్చాడు. కార్మికులకు సారథ్యం వహిస్తుండగా పాట్నాలో మొదటిసారి అరెస్టయ్యాడు. ఇతర కార్మికులతో పాటు ఆయనను భాగల్పూర్ జైల్లో నిర్బంధించారు. విడుదల తర్వాత కార్మిక సంఘంలో చురుగ్గా పనిచేస్తూనే రైతాంగాన్ని ఎంకేఎస్ఎస్‌లో కూడగట్టే పని కూడా చేశాడు. 1987లో ఆయనను ఎంకేఎస్ఎస్ రాష్ట్రకమిటీలోకి ఎన్నుకున్నారు. ఎంకేఎస్ఎస్‌లో పార్టీ అనుచరులకూ, అవకాశవాద వినయన్ ముఠాకూ మధ్య అంతర్గత పోరాటం జరిగినప్పుడు కామ్రేడ్ పటేల్‌జీ పార్టీ వైపు దృఢంగా నిలబడ్డాడు. ఎంకేఎస్ఎస్ ను నిషేధించిన తర్వాత అనేక జిల్లాల్లో వేర్వేరు పేర్లతో రైతు సంఘాలు వెలిశాయి. 1988లో రోహతస్ జిల్లాలో ఏర్పడిన జన సంగ్రామ్ సమితికి ఆయన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అదే సంవత్సరంలో ఏర్పడిన జనరల్ డెమోక్రటిక్ ఆర్గనైజేషన్ రాష్ట్రకమిటీలోకి ఆయన్ని ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆయన ఆ సంస్థ కోయెల్-కైమూర్ బ్రాంచ్ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 1990ల నుండి ఆయన ఈ సంస్థలో చురుగ్గా పనిచేయసాగాడు. అలాగే రోహతస్ జిల్లాలోని ఆమ్‌జోర్, కైమూర్, బంజారీ గనుల్లోనూ, ఫ్యాక్టరీల్లోనూ పనిచేసే కార్మికుల్లో ఆర్గనైజర్‌గా చురుగ్గా పనిచేశాడు. ఆయన ఆరాపూర్, పలామూ గనుల్లోనూ, అలాగే లాతేహార్ జిల్లాలోని చాంద్వా దగ్గర సిక్కి బొగ్గు గనుల్లోనూ ఆర్గనైజర్‌గా పనిచేశాడు. ఈ కాలంలోనే కోయెల్-కైమూర్ ప్రాంతమంతటా ఆయన ఒక మిలిటెంట్ ప్రజా సంఘ నాయకుడిగా పేరు గాంచాడు. ఆయన 1988లో పార్టీ రోహతస్-భభువా ఏరియా కమిటీకి ఎన్నికయ్యాడు. 1990లో పార్టీ కోయెల్-కైమూర్ ప్రాంతీయ మహాసభలో రీజనల్ కమిటీకి ఎన్నికయ్యాడు.

ఈ కాలంలో పోలీసులు 'ఆపరేషన్ అగ్నిదూత్' పేరుతో నిర్బంధాన్ని తీవ్రపర్చారు. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న క్రమంలో ఆయన రెండోసారి అరెస్టయ్యాడు. జైలు నుండి విడుదల కాగానే పోలీసులు ఆయనపై టాడా కేసు మోపారు. ఆ తర్వాత పార్టీ ఆయనను రహస్య జీవితానికి రమ్మని కోరింది. ఆయన వెంటనే ఎలాంటి సంకోచం లేకుండా రహస్య జీవితానికి వెళ్లాడు.

ఆయన 1995 నుండి ఆర్.సి. సభ్యుడిగా ఉంటూనే ఏరియా కమిటీ సభ్యుడిగా జాప్లా-నవీనగర్ ప్రాంతంలో సాయుధ రైతాంగ పోరాటాన్ని ఆర్గనైజ్ చేశాడు. తర్వాత ఏసి కార్యదర్శి అయ్యాడు. ఏరియాలో పోలీసు నిర్బంధం కూడా తీవ్రమైంది. కామ్రేడ్స్ అజయ్, అనిరుద్ధ్, రాధేశ్యాం వంటి సమర్థులైన కమాండర్లను పార్టీ కోల్పోయింది. పార్టీకి అవి చాలా కష్టతరమైన రోజులు. కామ్రేడ్ పటేల్‌జీ ఈ పరిస్థితిని చాలా దృఢంగా ఎదుర్కొని క్రియాశీలంగా నాయకత్వం వహించాడు. ఆయన జాప్లా-నవీనగర్, విశ్రామ్‌పూర్-ఛతర్‌పూర్-పాట్నా ఉమ్మడి ఏసికి కార్యదర్శిగా సమర్థవంతంగా నాయకత్వం వహించాడు. పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా 2001లో ఏర్పరచిన ఉత్తర పలామూ-గఢ్వ డివిజనల్ కమిటీకి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 2001 మార్చ్‌లో ఆయన్ను బీహార్-ఝార్ఖండ్ రాష్ట్ర కమిటీలోకి కో-ఆప్ట్ చేసుకున్నారు.

కామ్రేడ్ పటేల్‌జీ రహస్య జీవితానికి వెళ్లడానికి ముందే మిలిటెంట్ ప్రజా నాయకుడిగా పేరుగాంచాడు. ఆయన కొంత ఎక్కువ వయస్సులో రహస్య జీవితానికొచ్చి సాయుధ పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం

వహించాల్సి వచ్చినప్పటికీ చాలా నిలకడగా, ఓర్పుగా పనిచేశాడు. తుది శ్వాస విడిచే వరకూ కేడర్లతో, దళాలతో, ప్లటూన్లతో నిలిచి పోరాడాడు. లాంగ్ రేంజ్ పెట్రోలింగ్ (ఎల్ఆర్పి), తదితర పద్ధతుల ద్వారా ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేస్తుండగా దాన్ని ఎదిరించడంలో ఆయన ముందు నిలిచాడు. ఆయన సాయుధ పోరాట ఆచరణకు కొంత కొత్తే అయినా, సైనిక వ్యవహారాల్లో అంతగా నైపుణ్యం లేకపోయినా పట్టుదలగా తన కర్తవ్యాన్ని నెరవేర్చేవాడు. అదే ఈ కామ్రేడ్లోని ప్రత్యేకత.

జూన్ 1 నాడు మర్నాఘాట్లో నిర్బంధం నడుమనే జరిగిన సంస్మరణ సభలో వందలాది మంది ప్రజలు పాల్గొని తమ ప్రియతమ నాయకునికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఎడల తమకు గల ప్రేమను ప్రకటించడంతో పాటు తమ మిలిటెంట్ తత్వాన్ని కూడా చాటుకున్నారు.

పార్టీ పిలుపుకు స్పందించిన ప్రజలు పలామూ డివిజన్లోని ఐదు జిల్లాల్లో జూన్ 7న బంద్ పాటించారు. కామ్రేడ్ పటేల్జీ హత్యకు ప్రతీకారంగా పిజిఏ ప్లటూన్ పలామూ పోలీసు స్టేషన్ ఏరియాలో మందుపాతర పేల్చి పోలీసు జీపుపై ఆంబుష్ చేసింది. ఈ ఆంబుష్లో పిజిఏ సైనికులు కామ్రేడ్ పటేల్జీ హత్యకు కారకులైన ఇద్దరు పోలీసు అధికార్లను - డిఎస్పీ డి.కె. రాయ్, మరో ఇన్స్పెక్టర్ అరుణ్ ప్రసాద్లను - మట్టిగరిపించారు. మరో నలుగురిని గాయపర్చారు. ఈ ఘటనతో బీహార్-ఝార్ఖండ్ ప్రజానీకంలో, ముఖ్యంగా కోయెల్-కైమూర్ ప్రాంతంలోని పీడిత ప్రజల్లో సంతోషం వెల్లివిరియగా శత్రుమూకల్లో భయప్రకంపనలు వ్యాపించాయి. ❑

## *పోలీసు హింసలకు భయపడి ఆత్మహత్య చేసుకున్న*

# కామ్రేడ్ తోడ్సం గోపాలరావుకు లాల్ సలాం!

పశ్చిమ బస్తర్ డివిజన్లోని నేషనల్ పార్క్ ఏరియ్జా ఫర్సగఢ్ దగ్గరలోని రానిన్బోదిలి గ్రామంలో కామ్రేడ్ తోడ్సం గోపాలరావు ఒక పేద రైతు కుటుంబంలో పుట్టాడు. అతనికి భార్యాపిల్లలున్నారు. బస్తర్ జిల్లాలో పార్టీ అడుగిడిన నాటి నుండి ఈ గ్రామం విప్లవ రాజకీయాలకు పెట్టని కోటగా ఉంటూ వస్తున్నది. తమ బాల్యం నుండీ పార్టీ గెరిల్లా దళాలను చూస్తూ వస్తున్న యువతీయువకులెందరో సంఘాల్లో చేరి క్రియాశీలంగా పనిచేస్తున్నారు. అలాంటి వారిలో కామ్రేడ్ గోపాల్ ఒకరు. ఆయన గ్రామ సంఘంలో పని చేస్తూ క్రమంగా కుట్రు రేంజ్ డిఏకెఎంఎస్ నాయకుడిగా ఎదిగాడు. వివిధ సమస్యలపై ప్రజా పోరాటాలు లేవదీసి వాటికి నాయకత్వం వహించాడు. ఆ విధంగా అతను ప్రజల తలలో నాలుకయ్యాడు. అతని అంకితభావాన్నీ, క్రమశిక్షణాయుత ఆచరణనూ చూసి స్థానిక పార్టీ కమిటీ అతనికి పార్టీ సభ్యత్వం ఇచ్చింది. గత జూన్ నెలలో పిజిఏ బలగాలు ఈ గ్రామం దగ్గరలోనే పోలీసులపై ఆంబుష్ చేసి ఇద్దరు పోలీసులను హతమార్చి, ఒక ఠానేదార్ను గాయపర్చి వారి నుండి మూడు ఎస్సెల్లార్లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఆంబుష్ను విజయవంతం చేయడానికి కామ్రేడ్ గోపాలరావు ఎంతగానో సహకరించి అందులో క్రియాశీల పాత్ర పోషించాడు. సహజంగా మితభాషి, మృదుస్వభావి అయిన కా. గోపాలరావు సంఘం పనులను ఎంతో శ్రద్ధగా, పట్టుదలగా పూర్తి చేసేవాడు. జూలై 28, మార్చ్ 8 వంటి కార్యక్రమాలను విజయవంతం చేయడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలను కదిలించడానికి ఆయన బాగా కృషి చేసేవాడు. ఆ ఏరియాలో జరిగిన ప్రజా కార్యక్రమాలన్నింటి వెనుకా కామ్రేడ్ గోపాలరావు కృషి ఉండేది. పోయినేడు తునికాకు సీజన్లో కూలిరేట్ల పెంపుదల కోసం జరిగిన పోరాటంలో ఆయన ప్రజలకు నాయకత్వం వహించాడు. అతని నాయకత్వంలో ప్రజలు ఆ పోరాటంలో విజయం సాధించారు. 1999లో డిఏకెఎంఎస్ కుట్రు రేంజ్ మహాసభ జరగ్గా దానికి అతను ప్రతినిధిగా హాజరయ్యాడు. ఆ మహాసభలో అతన్ని రేంజ్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

జూన్ ఆంబుష్ తర్వాత కుట్రు పోలీసులు రానిన్బోదిలి గ్రామంపై మూడు సార్లు దాడి చేసినప్పటికీ తప్పుకొని కొద్ది రోజులు దళం వెంటే తిరిగాడు. తరువాత ఇంటి దగ్గరే ఉండసాగాడు. పోలీసులు ఆ గ్రామంలోని ముగ్గురు యువకులను అరెస్టు చేసి తీవ్రంగా హింసించి తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారు. గోపాలరావు కోసం పోలీసులు తీవ్రంగా గాలించసాగారు. దానితో గోపాలరావు మనోస్థైర్యం దెబ్బతినింది. పోలీసుల చేతికి దొరికితే తీవ్రమైన హింసలకు గురి కావల్సి ఉంటుందని బాగా భయాందోళనకు గురయ్యాడు. ప్రజల సహకారంతో పోలీసు నిర్బంధాన్ని ఎదిరించవచ్చన్న విశ్వాసం కోల్పోయాడు. తీవ్రమైన మానసిక ఆందోళన మూలంగా అతను ఆత్మహత్య చేసుకోవాలనే పొరపాటు నిర్ణయానికి వచ్చాడు. ఆయన మరణంతో కుట్రు ప్రాంత ప్రజలు అంకితభావంతో పనిచేసే ప్రజా నాయకుణ్ని కోల్పోయారు. పార్టీ ఒక నమ్మకమైన సభ్యున్ని కోల్పోయింది. ఆయన తన బలహీనత మూలంగానే ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పటికీ అందుకు ప్రేరేపించిన పరిస్థితులు మాత్రం ఈ క్రూరమైన రాజ్యం సృష్టించినవే. పోలీసులు ప్రజల జీవించే హక్కును సైతం కాలరాస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చట్టవిరుద్ధంగా అమాయక ప్రజలను చిత్రహింసలకు గురి చేస్తున్నారు. గోపాలరావు ఆత్మహత్య ప్రజల్లో రాజ్యం సృష్టిస్తున్న భయోత్పాతానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. అలాగే ఎంతటి క్రూర నిర్బంధాన్నయినా ప్రజల మద్దతుతో ఎదిరిస్తూ శత్రువుతో పోరాడుతూ అవసరమైతే ప్రాణత్యాగం చేయాలే తప్ప ఆత్మహత్యకు పాల్పడకూడదన్న గుణపాఠాన్ని కూడా అందిస్తుంది. కామ్రేడ్ గోపాలరావు అమరత్వానికి వినమ్రంగా జోహార్లు తెలుపుదాం. ఆయన కలలు గన్న దోపిడీపీడనలు లేని, ఎలాంటి అసమానతలూ, భయాందోళనలూ లేని, అందరూ స్వేచ్ఛగా, సుఖసంతోషాలతో బతుకగల నవ భారతాన్ని నిర్మించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దాం. ❑

*(..... 14వ పేజీ తరువాయి)*
జీవించే నిరాడంబరతా ఆ కామ్రేడ్ నుండి మనం నేర్చుకోవాల్సిన సుగుణాలు. పొదుపును పాటించడం, తాను ఎంచుకున్న ఆదర్శాల్ని విధిగా పాటించడం కూడా శ్రీను నుండి నేర్చుకోవాల్సిన మంచి అంశాలు. అతను గెరిల్లా జీవితంలో వాడే ప్రతి వస్తువునూ పూర్తిగా పాడయ్యేపోయే వరకు ప్రయోగించుకునేవాడు. వస్తువులను జాగ్రత్తగా వాడుకునే లక్షణాన్ని కూడా శ్రీను నుండి మనం నేర్చుకోవాలి.

ఉపాధ్యాయ వృత్తిని వదిలి, పూర్తి కాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో 9 సంవత్సరాల పాటు వివిధ రకాల బాధ్యతలు నిర్వహించి ప్రజల కోసం ప్రాణాలర్పించిన కా. సురేష్ సారు నేటి ఉపాధ్యాయులందరికీ అనుసరణీయుడు. 5 సంవత్సరాలు పత్రికా రంగంలో పనిచేసి విప్లవ పాఠకులకు తన సేవలందించిన 'ప్రజావిముక్తి' శ్రీనుకు 'ప్రభాత్' వినమ్రంగా జోహార్లర్పిస్తోంది.❑

# 'ప్రజావిముక్తి' కోసం ప్రాణాలర్పించిన

# కామ్రేడ్ సురేష్ (శ్రీను) కు అరుణారుణ జోహార్లు !

కామ్రేడ్ సురేష్(32) పోరాటాల గడ్డైన వరంగల్ జిల్లాలోని హన్మకొండ పట్టణంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు విప్లవ మేధావి కా. వరవరరావు ఇంటికి దగ్గర్లోనే కా. సురేష్ ఇల్లు ఉండడం వల్ల అతను చిన్నతనం నుండే విప్లవ రాజకీయాలతో పరిచయం ఏర్పర్చుకోగలిగాడు. ఇంటర్మీడియట్ వరకు వరంగల్‌లోనే చదువుసంధ్యలు కొనసాగించిన సురేష్ ఉన్నత చదువులకై హైదరాబాద్‌కు వెళ్లాడు. వరంగల్ నుండి సురేష్ హైదరాబాద్ వెళ్లాక విప్లవ సాహిత్యం చదవడంతో పాటు విరసం నిర్వహించే అన్ని సెమినార్లకూ, సభలకూ తప్పకుండా హాజరయ్యేవాడు. విప్లవకర ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగే ఊరేగింపులు, ప్రదర్శనలు, సభలు మొదలగు అన్ని కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు. కళల పట్ల మంచి అభిరుచి కల్గివుండి ఏ కొత్త పాటనైనా ఒక్కసారి వినగానే దాని బాణీని పట్టుకొనేవాడు. ఆయన సెమినార్లలో నిర్మొహమాటంగా చర్చించడం, పాటలు పాడడం అందరినీ ఆకట్టుకొనేది.

1990లో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం దొరకడంతో వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామపంచాయితీలోని కొత్తూర్ ప్రాథమిక పాఠశాల టీచర్‌గా పనిచేశాడు. ఉపాధ్యాయ రంగంలోని ప్రగతిశీల సంస్థ అయిన ఏపిటిఎఫ్‌లో సభ్యుడిగా చేరి ఆ తర్వాత ఏపిటిఎఫ్ తాడ్వాయి మండల శాఖ బాధ్యుడిగా కూడా పని చేశాడు. ఆయన ఆ గ్రామంలోని ప్రజలతో ప్రేమగానూ, ప్రజాస్వామికంగానూ వ్యవహరించేవాడు. పిల్లలకు అకడమిక్ విద్య బోధించడమే గాకుండా సమాజంలో జరుగుతున్న వివిధ విషయాల్ని చిన్న చిన్న కథల రూపంలో చెప్తూ వారిలో హేతుబద్ద దృష్టిని పెంచడానికి కృషి చేసేవాడు. గ్రామస్థుల కష్టసుఖాల్ని తెలుసుకోవడం, వాటిని పరిష్కరించుకోవడంలో తనవంతు సహకారం అందించడం చేసేవాడు. వాళ్ల కష్టాలకు సామాజిక కారణాల్ని అర్థం చేయిస్తూ అందరితో కలిసి పోయేవాడు. దీనితో అనతి కాలంలోనే 'సురేష్ సారు' ప్రజలకు తలలో నాలుకయ్యాడు.

కేవలం ఈ కార్యాచరణకే పరిమితం కావడంతో సంతృప్తి చెందని కా. సురేష్ ఏటూరునాగారం ఏరియాలో కొనసాగుతున్న పీపుల్స్‌వార్ ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధాలు నెలకొల్పుకొని పూర్తికాలం కార్యకర్తగా రావడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాడు.

అది ఏటూర్‌నాగారం ఉద్యమంపై తీవ్ర నిర్బంధం కొనసాగుతూ దళం తిరగడమే కష్టంగా వున్న కాలం (1992-93). అలాంటి సమయంలో దళంలోకి రావడం కంటే ఉపాధ్యాయరంగంలోనే పని చేయడం మంచిదని పార్టీ సలహా ఇచ్చినప్పటికీ ఆయన పట్టుబట్టి 1993లో పూర్తికాలం విప్లవకారుడిగా ఉద్యమంలో అడుగుపెట్టాడు.

'93 నుండి '96 వరకు 3 సంవత్సరాల కాలం ఉత్తర తెలంగాణా ఫారెస్టు డివిజన్ లోని మహదేవ్‌పూర్ దళంలో దళ సభ్యుడిగా, పార్టీ సభ్యుడిగా, ఏసిఎమ్‌గా పని చేశాడు. దళంలోని కామ్రేడ్స్‌కు చదువు నేర్పడానికి బాగా కృషి చేశాడు.

1995లో ఉత్తర తెలంగాణా ఉద్యమాన్ని ఆంధ్ర రాష్ట్ర పరిధిలోంచి వేరు చేసి రాష్ట్ర స్థాయి స్పెషల్ జోన్‌గా గుర్తించారు. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ మహాసభ జరిపి ఎస్‌జెడ్‌సిని ఎన్నుకున్నారు. దీనితో ఉత్తర తెలంగాణాకు ప్రత్యేకంగా ఒక మాస్ పత్రిక (ప్రజావిముక్తి) అవసరమయ్యింది. తర్వాత మరికొంత కాలానికి మహిళా పత్రిక 'మహిళా విముక్తి,' సాహితీ పత్రిక 'నెత్తుటి గోదావరి' లను కూడా ప్రచురించాలని ఎస్‌జెడ్‌సి భావించడంతో ఉత్తర తెలంగాణాలో ప్రత్యేకంగా పత్రికా మెకానిజాన్ని ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పార్టీ ఈ అవసరాన్ని కా.సురేష్ (శ్రీను) ముందుంచగా అతను అంగీకరించి పత్రికా మెకానిజాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడు. పత్రిక బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలానికే టెక్నికల్ పనులు, డి.టి.పి. పనులు వగైరా నేర్చుకుని, క్రమం తప్పకుండా పత్రికను తీసుకురావడంలో ఎంతో సహాయపడినాడు. పత్రికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం కోసం ఆయన ఎంతో తపన పడేవాడు. కంప్యూటర్ నడపడంలో పట్టు సాధించి పత్రికలో పేజీలను ఆకట్టుకునేలా డిజైన్ చేసేవాడు. అతనిలో సహజంగా ఉండే కళాదృష్టికి, కంప్యూటర్ పరిజ్ఞానం తోడై పత్రిక విలక్షణంగా రావడానికి ఉపయోగపడేది. చక్కని చేతిరాత గల శ్రీను వివిధ కార్యక్రమాల సందర్భంగా బ్యానర్లు, పోస్టర్లు అందంగా రాసిపెట్టేవాడు. క్రమంగా 'ప్రజావిముక్తి' ఎడిటోరియల్ బోర్డు (ఇబి) సభ్యుడిగా ఎదిగి పత్రికకు రిపోర్టులు రాయడం, వ్యాసాలు రాయడం చేస్తుండేవాడు. 1996 నుండి 2001 మధ్య వరకు కా. శ్రీను పత్రికా రంగంలో ఎంతో కృషి చేసి అందరి హృదయాల్లోనూ 'ప్రజావిముక్తి శ్రీను'గా స్థిరపడ్డాడు.

ఒక్కొక్కసారి ప్రింటింగ్ పనులు ఎక్కువగా వుండి, టైం తక్కువగా వున్నప్పుడు రాత్రంతా నిద్రపోకుండా కూడా టైప్ చేసి సమయానికి అందించేవాడు. పనిపట్ల అతని బాధ్యతకు, పట్టుదలకు ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇంగ్లీష్ భాషలో మంచి ప్రవేశం ఉన్న శ్రీను ఎన్నో ఇంగ్లీష్ వ్యాసాలను తెలుగులోకి అనువదించాడు. పత్రికారచనకు అవసరమయ్యే విషయాల్ని సేకరించడం కోసం ఎంతో శ్రమ పడేవాడు. ఉత్తర తెలంగాణా అమరవీరుల జీవిత చరిత్రలను పుస్తకాల రూపంలో తేవడానికి శ్రీను చేసిన కృషి కొనియాడదగినది. నెలల పాటు నిర్విరామంగా పనిచేసి అమరుల జీవిత చరిత్రలను చక్కగా ఎడిట్ చేసి పుస్తకాలుగా కూర్చాడు. ఇప్పుడు తనే అమరత్వపు శిఖరాలకు ఎదిగి ఆ పుస్తకాల్లో ఒక అధ్యాయంగా చేరిపోవడం మనకు బాధాకరమే అయినా, ఆయన త్యాగం మనందరికీ ప్రేరణ.

2000 సంవత్సరంలో పార్టీ కా.శ్రీనును డిసిఎమ్‌గా ప్రమోట్ చేసింది. 2000 నవంబర్‌లో జరిగిన ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ 2వ మహాసభకు కా. శ్రీను ప్రతినిధిగా హాజరయ్యాడు. 2001 సంవత్సరం మధ్య భాగంలో ఉద్యమ అవసరాల రీత్యా పత్రికా రంగం నుండి ఆర్గనైజేషన్ రంగానికి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడిగా బదిలీ అయ్యాడు. జిల్లా కమిటీ సభ్యుడిగా వుంటూనే తూర్పు సబ్ జోనల్ కమాండ్ సభ్యుడిగా కూడా పని చేశాడు. స్టేషన్‌ఘన్‌పూర్-జనగాం ఏసి పరిధిలో గల దామెర గుట్టల్లో ద్రోహంతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆగస్టు 2న కా. శ్రీను అమరుడయ్యాడు. శ్రీనుతో పాటు నవీన్ (ఏసిఎస్), జ్యోతి (ఎల్‌జిఎస్ కమాండర్), మొత్తం ఐదుగురు కామ్రేడ్స్ అమరులైనారు.

నిరంతరం నేర్చుకోవాలనే తపన, తను నేర్చుకోవాలనుకున్న విషయాల్ని నేర్చుకునే వరకు వదలకుండా కృషి చేసే పట్టుదలా, అవసరమైప్పుడు నిద్రాహారాలు మాని కూడా కష్టపడి పనిచేసే తత్వం, శత్రువు అంటే ఎలాంటి జంకూ లేకుండా శత్రు దాడుల్ని ఎదిరించడంలో చూపే తెగువా, అందరితో కలిసిపోతూ సాదాసీదాగా ***(తరువాయి 13వ పేజీలో .....)***

# అమరుల ఆశయాల్ని కొనసాగిస్తామని శపథం పూనుతూ విజయవంతంగా జరిగిన జులై 28 అమరవీరుల సంస్మరణ సభలు

*(గత సంచికలో అమరవీరుల వారానికి సంబంధించిన రిపోర్టుల్ని చాలా వరకు వేశాం. అయితే కొన్ని డివిజన్ల/ఏరియాల నుండి రిపోర్టులు ఆలస్యంగా అందినందున ఈ సంచికలో వేస్తున్నాం. – సంపాదకులు)*

## దక్షిణ బస్తర్ డివిజన్

ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడు కూడా అమరవీరుల వారాన్ని దక్షిణ బస్తర్ ప్రజలు విప్లవ సాంప్రదాయాలతో జరుపుకున్నారు. 1980లో దక్షిణ బస్తర్‌లో ప్రవేశించిన విప్లవోద్యమం గత 22 ఏళ్లలో ఎంతో ఎదిగి నేడు విముక్తి ప్రాంత నిర్మాణ లక్ష్యంతో వడివడిగా పురోగమిస్తున్నది. గ్రామ స్థాయిలో రాజ్యాధికారాన్ని ప్రజల చేతుల్లోకి తీసుకుంటూ "నాటెన సర్కార్" సంస్థలను కూడా ఏర్పర్చుకుంటున్నారు. ఈ అభివృద్ధి క్రమం వెనుక ఎందరో అమరుల రక్తతర్పణం ఉంది. రక్తసిక్త త్యాగాల చరిత్ర ఉంది. పార్టీ కేంద్ర నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల నుండి సానుభూతిపరులూ, సాధారణ ప్రజలు దాకా ఎందరో కామ్రేడ్స్ ఉన్నతమైన త్యాగ సాంప్రదాయాలను నెలకొల్పుతూ పార్టీ జెండాను ఎరుపెక్కించారు. అమరుల వారం సందర్భంగా పార్టీ, ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగిన అనేక కార్యక్రమాల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని అమరులకు అత్యంత శ్రద్ధాసక్తులతో నివాళులర్పించారు. స్మారక సభల్లో అమరుల ఆశయాల్ని కొనసాగిస్తామని నినదించారు. వివిధ ఏరియాల్లో జరిగిన కార్యక్రమాల వివరాలు ఈ విధంగా వున్నాయి.

**కిష్టారం ఏరియా:** కిష్టారం ఏరియాలోని కొమ్మపాడు, డబ్బకుంట, పాలెడమా గ్రామాల్లో పెద్ద బహిరంగ సభలు జరిగాయి. *(ఇక్కడ బహిరంగసభలంటే రహస్యంగా జరిగే సభలే. అయితే ప్రజలకు ఇవి బహిరంగంగా తెలిసే సభలుగానూ, శత్రువుకు ఏ మాత్రం తెలవకుండానూ జరుగుతాయి. – సం.)* పాలెడమాలో జరిగిన సభకు డిఏకెఎంఎస్ రేంజ్ కమిటీ సభ్యుడు కా. గంగాల్ అధ్యక్షత వహించాడు. గ్రామ డిఏకెఎంఎస్ నాయకుడు కా. దేవాల్ పార్టీ జెండానెగురవేసి అమరుల త్యాగాలను కొనియాడాడు. ఈ సందర్భంగా అమరుడు కా. సుఖదేవ్ స్మృతిలో నిర్మించిన స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. సిమెంట్‌తో నిర్మించిన ఈ 24 ఫీట్ల స్థూపానికి ఎర్రరంగు పూసి, తోరణాలతో అలంకరించారు. ఈ సభలో ప్రజా మిలీషియా సభ్యులు రక్షణ బాధ్యతలు నిర్వహించారు. మొత్తం 1,500 మంది ప్రజలు పాల్గొన్నారు.



మీరొడ్డిన నెత్తురింక ఇంకనివ్వ నేలలోన !

కొమ్మపాడులో జరిగిన స్మారక సభకు కా. సీతారాం అధ్యక్షత వహించాడు. కెఏఎంఎస్ రేంజ్ కమిటీ సభ్యురాలు మంగిడి ఎర్రజెండా ఎగురవేసింది. ఈ మీటింగ్‌లో మొత్తం 1,218 మంది పాల్గొన్నారు. డబ్బకుంటలో జరిగిన సభలో 440 మంది పురుషులు, 930 స్త్రీలు పాల్గొన్నారు. ఈ మీటింగ్‌లకు దాదాపు 20 బ్యానర్లు రాసి పెట్టారు. సంత సెంటర్లో జరిగిన ఈ సభకు వర్షం వల్ల అంతరాయం కల్గినప్పటికీ ప్రజలు విజయవంతం చేశారు.

**కుంట ఏరియా:** అమరవీరుల సంస్మరణ వారానికి ముందే 6 క్యాంపెయిన్ బ్యాచీలు మూడేసి రోజులు దాదాపు 50 గ్రామాల్లో ప్రచారం చేశాయి. ఏరియావ్యాప్తంగా 70 పోస్టర్లు, 30 బ్యానర్లు, కరపత్రాలు వేశారు. కుంట ఏరియావ్యాప్తంగా 4 చోట్ల బహిరంగసభలు జరిగాయి. నేంద్రలో జరిగిన సభలో 22 గ్రామాల ప్రజలు 2,000 మంది పాల్గొన్నారు. జగ్గవరం మీటింగ్‌లో 18 గ్రామాల నుండి 250 మంది ప్రజలు పాల్గొన్నారు. ఉస్కేవాయలో జరిగిన సభలో 400 మంది ప్రజలు పాల్గొన్నారు.

**శబరి ఏరియాలో**ని దాదాపు 70 గ్రామాల్లో ప్రజలు రాళ్లతో నిర్మించుకున్న స్థూపాల వద్ద జులై 28 నాడు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సంఘ నాయకులు అమరుల త్యాగాలను కొనియాడుతూ వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరుతూ ఉపన్యసించారు.

**దోర్నపాల్:** ఈ ఏరియాలో రెండు చోట్ల బహిరంగ సభలు ఏర్పాటుచేశారు. డిఏకెఎంఎస్, కెఏఎంఎస్‌కు చెందిన ఐదేసి టీములు ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాయి. ఏరియాలోని అనేక గ్రామాల్లో పోస్టర్లు, బ్యానర్లు కట్టారు. రెండు చోట్ల కర్రలతో స్థూపాన్ని తయారు చేసి పెట్టారు. తొంగురి గ్రామంలో జరిగిన సభలో 10 గ్రామాల నుండి 500 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. పాలెమడుగులో జరిగిన అమరుల స్మారక సభకు 9 గ్రామాల నుండి 2,500 మంది ప్రజలు హాజరయ్యారు. కొత్తగా విస్తరించిన ఏరియా అయినందున ఇక్కడ అమరవీరుల వారం జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ సభలు ప్రజలపై బాగా ప్రభావాన్ని కలిగించాయి. అమరుల త్యాగాల గురించి విన్న ప్రజలు అమరుల బాటలో నడుస్తామని ప్రతిన బూనారు.

**జేగురుగొండ:** ఈ ఏరియాలో మొత్తం 5 చోట్ల బహిరంగ సభలు జరిగాయి. సభలకు ముందు డిఏకెఎంఎస్‌కు చెందిన 8 ప్రచార దళాలూ, కెఏఎంఎస్‌కు చెందిన 6 ప్రచార దళాలూ క్యాంపెయిన్ చేశాయి. ఇవి ఊరూరా తిరిగి ప్రజలకు అమరుల ఆదర్శాల గురించి తెలియజెప్పాయి. ఆ తర్వాత జరిగిన సభల్లో – కుమ్మం సభకు 11 గ్రామాల నుండి 833 మంది, బాసగూడెం సభకు 850 మంది, ఇలింగేర్ సభకు 470 మంది, మల్లూగూడెం సభకు 70 మంది, వెదిరె సభకు 520 మంది ప్రజలు హాజరై వాటిని జయప్రదం చేశారు. చింతల్‌నార్‌లో అమరుడు కా. పెంట మల్లేష్ స్మృతిలో ఒక స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

**ఊసూర్ :** ఈ ఏరియాలో రెండు చోట్ల బహిరంగ సభలు జరిగాయి. చిలుకలపల్లి సభలో 17 గ్రామాల నుండి 1,204 మంది ప్రజలు పాల్గొన్నారు. మూరుడుబాకలో జరిగిన సభకు 1000 మంది ప్రజలు హాజరైనారు. ఇక్కడ ప్రజలు అమరుడు సుఖ్‌దేవ్ పేరిట ఒక స్థూపాన్ని నిర్మించుకున్నారు.

**పామేడు:** ఈ ఏరియాలో 4 చోట్ల బహిరంగ సభలు జరిగాయి. ఎర్రపల్లిలో జరిగిన సభకు 1200 మంది ప్రజలూ, కంచాల్‌లో జరిగిన సభకు 400 మంది ప్రజలూ, గుండంలో జరిగిన సభకు 704 మంది మహిళలూ, 815 మంది పురుషులూ, లింగంగిలిలో జరిగిన సభకు

1270 మంది ప్రజలు హాజరైనారు. ఈ సభల్ని విజయవంతం చేయడం కోసం డిఏకెఎంఎస్‌కు చెందిన 7 ప్రచార దళాలు, కెఏఎంఎస్‌కు చెందిన 6 ప్రచార దళాలు క్యాంపెయిన్ నిర్వహించాయి. క్యాంపెయిన్‌లో మొత్తం 65 మంది స్త్రీపురుష కార్యకర్తలు పాల్గొన్నారు. పామేడ్ ఏరియాలో కా. ప్రకాష్ స్మృతిలో ఒక స్థూపాన్ని నిర్మించుకున్నారు.

**బాసగూడెం ఏరియాలో** మొత్తం 65 పోస్టర్లతోనూ, 12 బ్యానర్లతోనూ ప్రచారం చేశారు. ఏరియాలో మొత్తం నాలుగు చోట్ల సిమెంట్‌తో అమరుల స్థూపాన్ని కట్టారు. లింగంగిరి గ్రామంలో భీమదాదా స్మృతిలో, పెంట గ్రామంలో పార్టీ సభ్యురాలు కా. దేవే స్మృతిలో, సిలింగేర్ గ్రామంలో కా. కొర్స లింగాల్ స్మృతిలో స్థూపాన్ని కట్టారు. అమరుల వారం సందర్భంగా ఈ స్థూపాలన్నింటినీ ఆవిష్కరించి ప్రజాయుద్ధంలో నేలరాలిన వీరులందరికీ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సభలన్నింటిలో దక్షిణ బస్తర్ ప్రజలు అమరుల త్యాగాల బాటలో నడుస్తామనీ, వాళ్ళ కన్న కలల్ని నిజం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తామనీ ప్రతిన బూనారు.

## పశ్చిమ బస్తర్ డివిజన్

పశ్చిమ బస్తర్ డివిజన్ నేషనల్ పార్కు ఏరియాలో జూలై 28 అమరవీరుల సంస్మరణ సభలు విజయవంతంగా జరిగాయి. జూలై 28 సందర్భంగా 15 క్యాంపెయిన్ బ్యాచ్‌లు (13 డిఏకెఎంఎస్, 2 కెఏఎంఎస్) ఏరియావ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశాయి. ఈ ప్రచారంలో పోస్టర్స్, బ్యానర్స్ కూడా ఉపయోగించారు. అమరవీరుల స్మృతిలో స్థూపాలను నిర్మించారు.

కర్పే రేంజ్ కమిటీ నాయకత్వంలో కర్పే గ్రామ సమీపంలో అమరుడు కామ్రేడ్ సుఖ్‌దేవ్ స్మారక స్థూపాన్ని 7 గ్రామాల ప్రజలు సమిష్టి శ్రమ ద్వారా నిర్మించారు. ఒక్కో గ్రామం ప్రజలు రెండేసి రోజుల చొప్పున స్థూపనిర్మాణంలో పాల్గొన్నారు. ఈ స్థూప నిర్మాణానికి 12 రోజులు పట్టింది. ఈ స్థూపం ఎత్తు సుమారు 25 ఫీట్లుంటుంది.

స్థూపనిర్మాణం అనంతరం స్థూపం వద్ద స్మారక సభ జరిగింది. సభకు ముందు ప్రజలు అమరవీరులకు జోహార్లు తెలుపుతూ బ్యానర్లూ, ప్లేకార్డులూ పట్టుకుని ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపులో సుమారు 900 మంది ప్రజలు పాల్గొన్నారు. (వీరిలో 250 మంది మహిళలు). ఊరేగింపు అనంతరం జెండానెగురవేసి స్థూపావిష్కరణ చేశారు. అమరవీరుల స్మారకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించిన తర్వాత సభ ప్రారంభమైంది. ఈ సభలో ప్రజా సంఘాల రేంజ్ కమిటీ నాయకులూ, గ్రామ సంఘ నాయకులూ, అమరవీరుల కుటుంబసభ్యులూ అమరవీరుల త్యాగాలను ఎత్తి పడుతూ మాట్లాడారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని శపథం చేస్తూ నినాదాలూ, పాటలూ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో సభ ముగిసింది.

ఆదేడ్‌లో ప్రజాసంఘ నాయకులు కా. సుక్కు, కా. కవిత, కా. దుర్గిబాయిల స్థూపాలను డిఏకెఎంఎస్, కెఏఎంఎస్ రేంజ్ కమిటీ నాయకత్వంలో ప్రజలు నిర్మించారు. వీటి ఎత్తు సుమారు 12 ఫీట్లు. రేంజ్ కమిటీ నాయకత్వంలో జరిగిన ఈ సభలో 7 గ్రామాలకు చెందిన 550 మంది ప్రజలు పాల్గొన్నారు. తోయనార్‌లో జరిగిన స్మారక సభలో 200 మంది ప్రజలు పాల్గొన్నారు. ఎర్రమంగిలో జరిగిన స్మారక సభలో 6 గ్రామాలకు చెందిన 200 మంది ప్రజలు పాల్గొన్నారు. గట్టపల్లిలో జరిగిన సభకు 6 గ్రామాల నుండి 300 మంది ప్రజలు హాజరయ్యారు. డిఏకెఎంఎస్ సెంద్ర రేంజ్‌కమిటీ నాయకత్వంలో 4 చోట్ల స్మారకసభలు నిర్వహించారు. ఒకచోట దళం నాయకత్వంలో సభ జరిగింది. ఎడపల్లిలో 160 మంది . చాపమర్కలో 150 మంది, కచాలారంలో 150 మంది పాల్గొన్నారు. సాగుమెట్టలో దళం నాయకత్వంలో జరిగిన సభలో 360 మంది పాల్గొన్నారు. ఇలాంటి సెంటర్ మీటింగులే కాకుండా ఏరియాలోని అన్ని గ్రామాల్లోనూ ఎర్రజెండాలు ఎగురవేసి అమరవీరులకు ప్రజలు తమ నివాళులర్పించారు.

అలాగే కుట్రు, ఫర్సెగఢ్, వెదిరె, కర్కేలి, బీజాపూర్ రోడ్లపై ఎర్రగుడ్డతో నిర్మించిన రెడీమేడ్ స్థూపాలను కూడా పెట్టారు. ఏరియా మొత్తంగా జరిగిన అమరవీరుల స్మారక సభల్లో 2,890 మంది ప్రజలు పాల్గొన్నారు.

పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని మద్దేడ్ ఏరియాలో ప్రతి సంవత్సరం లాగానే ఈ యేడు కూడా జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు ప్రజలు అమరవీరుల వారాన్ని విప్లవ సంప్రదాయాలకు అనుగుణంగా జరుపుకున్నారు. అమరులు కామ్రేడ్స్ సుఖ్‌దేవ్, రణదేవ్, విజయ్, మల్లేష్, మహేందర్‌లనూ, ఇంకా ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, బీహార్ తదితర ప్రాంతాల్లో అమరులైన వీరయోధులందరినీ గుర్తు చేసుకుంటూ వారి ఆశయసాధనకై పాటు పడతామని ప్రజలు శపథం చేశారు. అమరుల వారానికి ముందే గ్రామగ్రామానా పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు వగైరాలతో విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రజలందరూ మొదట తమ తమ గ్రామాల్లో అమరవీరుల స్మారక సభల్ని జరుపుకొని, ఆ తర్వాత ఏరియాలో విస్తృత స్థాయిలో నిర్వహించిన సభలకు హాజరయ్యారు. ప్రతి సభలోనూ 5 నుండి 10 గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ విధంగా జరిగిన మొత్తం ఆరు బహిరంగసభల్లో దాదాపు 2,500 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఈ సభల్లో వక్తలు అమరుల త్యాగాల్ని కొనియాడుతూ వారిలో కొందరి జీవిత చరిత్రలను పరిచయం చేశారు. అమరుల ఆశయాలను కొనసాగించడానికి మనమంతా నడుం బిగించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు ఆ రోజు తమ పనులన్నింటినీ నిలుపుచేసి, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలనూ, ఈ సభల్ని జరుగనివ్వకూడదని పోలీసులు పెద్ద ఎత్తున అమలు చేస్తున్న నిర్బంధాన్నీ లెక్కచేయకుండా సభలకు హాజరై వాటిని విజయవంతం చేయడం విశేషం. ఒక ఊరిలో జరిగిన అమరుల స్మారకసభను ప్రారంభిస్తూ కెఏఎంఎస్ కమిటీ అధ్యక్షురాలు కా. శారద జెండా ఎగురవేసింది. ఒక అమరవీరుడి కుటుంబసభ్యుడైన కా. లచ్చుమయ్య అమరుల స్మారకస్థూపాన్ని ఆవిష్కరించాడు. వీరు తమ ప్రసంగాల్లో నేడు దేశంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని తుదకంటా కొనసాగించడమే అమరవీరులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## గడ్చిరోలి డివిజన్

గడ్చిరోలిలోని టిప్రాగఢ్ ఏరియాలో ప్రజలు అమరవీరుల వారం జరుపుకొని ప్రజాయుద్ధంలో నేలకొరిగిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలను విఫలం చేయడానికి పోలీసు బలగాలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ప్రజలు పట్టు వదలకుండా, ఎంతో జాగరూకతతో విజయవంతం చేశారు. మొత్తం 1700 కరపత్రాలతో, 300 పోస్టర్లతో ఏరియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. మురుంగాం, గ్యారపత్తి, కొట్గుల్ పోలీస్ క్యాంపులకు ఎదురుగా పోస్టర్లు వేసి ప్రజలు పోలీస్ నిర్బంధాన్ని అపహాస్యం చేశారు. పార్టీ డికెఎస్‌జెడ్‌సి సభ్యుడూ, పిజిఏ ఉత్తర కమాండ్ చీఫ్ కా. సుఖదేవ్ స్మృతిలో ప్రజలు ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు. రెండు చోట్ల జరిగిన అమరుల స్మారక సభల్లో 400 మంది ప్రజలు పాల్గొన్నారు. అమరుల వారాన్ని పురస్కరించుకుని పిజిఏ సైనికులు మురుంగాం పోలీస్ క్యాంపుపై ఏడు రౌండ్లు కాల్పులు జరిపారు. పోలీసులు ఇది నిజమైన దాడిగా భావించి దాదాపు 400 రౌండ్లు తూటాలు వృధా చేసుకున్నారు. అలాగే పక్కనే వున్న రాజ్‌నంద్‌గాం జిల్లాలోని బందూర్‌గాం గ్రామానికి చెందిన బహదూర్ తులావిని పిజిఏ సైనికులు జూలై 30న కాల్చి చంపారు. వీడు ఆ జిల్లా ఎస్‌పికి నమ్మకమైన ఇన్‌ఫార్మర్లలో ఒకడు. ❑

# విజయవంతంగా ముగిసిన డిఎకెఎంఎస్, కెఎఎంఎస్ రేంజ్ మహాసభలు

## గడ్చిరోలి డివిజన్

తీవ్ర నిర్బంధం, పోలీసు గాలింపు చర్యల మధ్యనే డివిజన్ వ్యాప్తంగా జులై, ఆగష్టు నెలల్లో ప్రజాసంఘాల రేంజ్ మహాసభలు జరిగాయి. డిఎకెఎంఎస్ రేంజ్ మహాసభలు 6 రేంజ్‌లలో జరుగగా కెఎఎంఎస్ రేంజ్ మహాసభలు రెండు రేంజ్‌లలో జరిగాయి.

**డిఎకెఎంఎస్ రేంజ్ మహాసభలు:**

ఏటపల్లి ఏరియాలో ఆగష్టు 3, 4 తేదీలలో ఏటపల్లి, కసంసూర్ రేంజ్ మహాసభలు జరిగాయి. ఏటపల్లి రేంజ్ సభకు 32 మంది ప్రతినిధులు హాజరవగా, కసంసూర్ సభకు 38 మంది ప్రతినిధులు హాజరైనారు. సభలను ప్రారంభించడానికి ముందు సంఘం జెండాను ఎగురవేసి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. రెండు సభలలోనూ సంఘం నిర్వహించిన కార్యక్రమాల సమీక్ష, సంఘం ప్రణాళికపై చర్చ, ప్రస్తుత రాజకీయ పరిస్థితి గురించీ, పోలీసులు అమలు చేస్తున్న నిర్బంధంపైనా వివరమైన చర్చలు జరిగాయి. సంఘం కార్యకలాపాల రిపోర్టునూ, ప్రణాళికనూ ప్రతినిధులు ఆమోదించారు. వివిధ సమస్యలపై అనేక నిర్ణయాలూ, తీర్మానాలూ చేశాక రేంజ్ కమిటీలను ఎన్నుకున్నారు. రెండు చోట్లా ఐదేసి మంది సభ్యులను కమిటీలోకి ఎన్నుకున్నారు.

జులై 16-17 తేదీల్లో గడ్చిరోలి రేంజ్ మహాసభ జరిగింది. దీనిలో 27 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. పెరిమిలి రేంజ్ మహాసభ కూడా ఇదే సమయంలో జరిగింది. దీనిలో 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగష్టు 30-31 తేదీలలో జరిగిన గట్ట రేంజ్ మహాసభలో 44 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. జులై 27-28 తేదీలలో మురుగావ్ రేంజ్ మహాసభ విజయవంతంగా జరిగింది. దీనిలో 15 మంది ప్రతినిధులుగా పాల్గొన్నారు. కసంసూర్ రేంజ్ మహాసభలో ఆరుగురు మహిళలూ, పెరిమిలి రేంజ్ మహాసభలో ఏడుగురు మహిళలూ పాల్గొన్నారు. ఈ సభలన్నింటిలోనూ ఉత్సాహపూరితమైన వాతావరణంలో చర్చలు జరిగాయి. ప్రతినిధులు వివిధ అంశాలపై తమ అవగాహనను మరింతగా మెరుగుపర్చుకున్నారు. భవిష్యత్ కార్యక్రమాలను మరింత పట్టుదలగా పూర్తి చేస్తామనే ఆత్మవిశ్వాసంతో వారు తమతమ గ్రామాలకు ప్రయాణమయ్యారు. "ప్రభుత్వ నిర్బంధాన్ని ఓడిద్దాం", "డిఎకెఎంఎస్ జిందాబాద్", "దోపిడీ పాలన నశించాలి", "నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి" వంటి నినాదాలు ఈ సభల్లో మారుమోగాయి.

**కెఎఎంఎస్ రేంజ్ మహాసభలు:**

కసంసూర్ రేంజ్‌లో జులై 27, 28 తేదీల్లో రేంజ్ మహాసభ జరిగింది. దీనిలో 19 మంది పాల్గొన్నారు. ఈ సభ చివరలో ఐదుగురితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మురుంగావ్ రేంజ్ మహాసభ 22 మంది ప్రతినిధులతో జరిగింది. ఈ సభలో కిచెన్, హెల్త్‌సెంటర్, సభాస్థలం వగైరాలకు మహిళా అమరులు కామ్రేడ్స్ మీనా, సురేఖ, నిర్మలల పేర్లు పెట్టుకున్నారు. సభ ఐదుగురితో కూడిన కార్యవర్గాన్నీ, ఇద్దరు ప్రత్యామ్నాయ సభ్యులనూ ఎన్నుకున్నది. సంఘ కార్యకలాపాల సమీక్షను, చర్చించి ఆమోదించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా లోతైన చర్చ జరిపి వివిధ తీర్మానాలు చేశారు. పితృస్వామ్యాన్ని ఓడించాలనీ మహిళలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయించుకుని రెట్టింపు ఉత్సాహంతో తమ తమ గ్రామాలకు తరలి వెళ్లారు.

## దక్షిణ బస్తర్ డివిజన్

దక్షిణ బస్తర్ డివిజన్‌లో మొట్టమొదటి డిఎకెఎంఎస్ రేంజ్ మహాసభ (కాన్ఫరెన్స్) 1989లో జరిగింది. అప్పటి నుండి సంగం ఎందరో సభ్యులను తనలో చేర్చుకుని చాలా బలపడింది. ఈ 13 ఏళ్ల కాలంలో డిఎకెఎంఎస్ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించింది. ప్రజలకు నాయకుడిగా పేరుగాంచింది. 'అడవిపై హక్కు ఆదివాసులదే'నని అది ప్రజలను చైతన్యపరిచింది. తెగ సాంప్రదాయాలలో భాగంగా ఉన్న బలవంతపు పెళ్లిళ్లు, పెళ్లిళ్ల సందర్భంగా దుబారా ఖర్చులు, బహుభార్యత్వం వంటి కాలం చెల్లిన రివాజులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్నది. డిఎకెఎంఎస్ నిర్వహించిన పోరాటాలతో బస్తర్ ఆదివాసుల జీవితాల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి.

1999లో దక్షిణ బస్తర్ డివిజన్‌లో డిఎకెఎంఎస్ 7వ రేంజ్ మహాసభలు జరిగాయి. నిబంధనావళి ప్రకారం 2001లో 8వ మహాసభలు జరగాల్సి వుండె. కానీ అనివార్య కారణాల వల్ల అవి ఈ సంవత్సరానికి వాయిదా పడ్డాయి. 2002 జనవరి నుండి ఫిబ్రవరి మొదటి వారం వరకు ఈ సభలన్నీ విజయవంతంగా జరిగాయి.

సభాస్థలాలన్నింటినీ ఎర్రని తోరణాలతో, పచ్చని పందిళ్లతో అలంకరించారు. సభ కమ్యూన్‌కూ, హాల్‌కూ, గ్రౌండ్‌కూ, కిచెన్‌కూ అమరుల పేర్లు పెట్టుకున్నారు. కమ్యూన్ అంతటా కర్తవ్యాల్ని విశదపర్చే నినాదాల్నీ, కొటేషన్లనీ పోస్టర్లుగా, బ్యానర్లుగా రాసి పెట్టారు. సభల ప్రారంభానికి ముందు నినాదాలతో, విప్లవ గీతాలతో ఊరేగింపులు జరిగాయి. సుత్తీ కొడవలి, ఎక్కుపెట్టిన విల్లంబు గుర్తుగా గల డిఎకెఎంఎస్ జెండాలను ఆయా రేంజ్ కమిటీల అధ్యక్షులు ఎగురవేశారు. ఆ తర్వాత అమరుల జ్ఞాపకంలో నిర్మించిన తాత్కాలిక స్థూపాలను ఆవిష్కరించి సభల్ని ప్రారంభించారు. ప్రతినిధులు ఎన్నుకున్న అధ్యక్ష వర్గం, స్టీరింగ్ కమిటీలు సభల్ని సాఫీగా, నియమబద్ధంగా కొనసాగించాయి.

గడచిన మూడేళ్లుగా డిఎకెఎంఎస్ సాధించిన విజయాల్లో ముఖ్యమైనవి ఇవి – వివిధ రాజకీయ సమస్యలపై ప్రచార క్యాంపెయిన్స్ నిర్వహించింది. ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రజా ఉద్యమాన్ని లేవదీసి ప్రజలకు నాయకత్వం వహించింది. డబ్ల్యుటీవోకి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో జరిగిన ర్యాలీకి ప్రజలను కదిలించింది. పార్టీ 9వ కాంగ్రెస్ తర్వాత కోల్‌కాతాలో జరిగిన ర్యాలీకి ప్రజలను కదిలించింది. జూలై 28 అమరుల వారాన్ని ప్రతి ఏటా జరుపుతున్నది. మార్చ్ 8 (అంతర్జాతీయ మహిళా దినం), ఆగస్టు 15 (బూటకపు స్వాతంత్ర్య దినం), జనవరి 26 (బూటకపు రిపబ్లిక్ దినం), ఏప్రిల్ 22 (పార్టీ స్థాపనా దినం - లెనిన్ పుట్టిన రోజు) వంటి ప్రాముఖ్యత గల దినాలను జరుపుకోవడంలో ప్రజలకు నాయకత్వం వహించింది. అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై జరిపిన దురాక్రమణ దాడికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడింది. ఫాసిస్టు 'పోటా' చట్టానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి నిరసన కార్యక్రమాల్ని నిర్వహించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న బూటకపు సంస్కరణ కార్యక్రమాల గురించి ప్రజలను జాగృతం చేసింది.

పై కార్యక్రమాలే కాకుండా ప్రజల దైనందిన సమస్యలపైనా, కరువు సమస్యపైనా, అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం, తునికాకు కూలి రేట్లపైనా, జంగల్ బచావ్ ***(తరువాయి 24వ పేజీలో .....)***

# కంపోసా (సిసిఎంపిఓఎస్ఏ) రెండవ వార్షిక సమావేశంపై ప్రకటన

దక్షిణాసియా మావోయిస్టు పార్టీలా, సంస్థలా సమన్వయ సమితి (కంపోసా) రెండవ వార్షిక సమావేశం (కాన్ఫరెన్సు) 2002 ఆగస్టులో జరిగింది. దీనిలో దక్షిణాసియాకు చెందిన 11 పార్టీలు ఒక **ఉమ్మడి సాధారణ ప్రకటన**ను ఆమోదించాయి. **ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై తీర్మానం** జారీ చేశాయి. ఈ సమావేశం విజయవంతంగా ముగియడమూ, ఉమ్మడి అవగాహనకు రావడమూ దక్షిణాసియా మావోయిస్టు పార్టీల సమైక్యతలో ఒక ముందడుగు. ఈ సాధారణ ప్రకటన ఈ ఐక్యతను దృఢపర్చుకోవడానికి సైద్ధాంతిక పునాది వేయగా, రాజకీయ తీర్మానం దక్షిణాసియాలోనూ, ప్రపంచంలోని ఇతర భూభాగాలలోనూ జరుగుతున్న ఘటనల గురించి ఒక ఉమ్మడి అవగాహనను కలిగించింది.

**సమావేశంలో పాల్గొన్న 11 పార్టీలు :** 1) పిబిఎస్‌పి (సిసి) [బంగ్లాదేశ్], 2) పిబిఎస్‌పి (ఎంపికె) [బంగ్లాదేశ్], 3) బిఎస్‌డి (ఎంఎల్) [బంగ్లాదేశ్], 4) సిపిఇబి (ఎంఎల్) [బంగ్లాదేశ్], 5) సిపిసి (మావోయిస్టు) [శ్రీలంక], 6) ఎంసిసి (భారతదేశం), 7) సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] [భారతదేశం], 8) సిపిఐ-ఎంఎల్ (నక్సల్బరీ) [భారతదేశం], 9) ఆర్‌సిసిఐ (మావోయిస్టు) [భారతదేశం], 10) ఆర్‌సిసిఐ (ఎంఎల్‌ఎం) [భారతదేశం], 11) సిపిఎన్ (మావోయిస్టు) [నేపాల్].

కమ్యూనిజం సూత్రాలను ఎత్తిపట్టడానికి గాను అన్ని రూపాల్లోని రివిజనిజానికీ, నిర్దిష్టంగా మావో మరణం తర్వాత డెంగ్ రివిజనిజానికీ వ్యతిరేకంగా ప్రపంచంలోని మావోయిస్టులు సాగించిన సైద్ధాంతిక పోరాటం ప్రాముఖ్యతను **సాధారణ ప్రకటన** వివరించింది. ఈ సమావేశం దక్షిణాసియాలో ఈ పోరాటాన్ని సంఘటితపర్చుకోవడంలో కంపోసా ఏర్పాటును ఒక ముందడుగుగా భావించింది.

ఈ **ప్రకటన** ప్రపంచ పరిస్థితిని, నిర్దిష్టంగా సెప్టెంబర్ 11 తర్వాత అమెరికా సామ్రాజ్యవాదుల యుద్ధోన్మాద విధానాల గురించి విశ్లేషించింది. ఇప్పటికీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని వెనుకబడ్డ దేశాలనే ప్రపంచ విప్లవ కేంద్రాలుగా గుర్తించింది. *"మావోయిస్టు పార్టీల నేతృత్వంలో పెరూ, నేపాల్, భారత్, టర్కీ, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్ దేశాల్లోని అణగారిన ప్రజానీకం సాగిస్తున్న ప్రజాయుద్ధాలూ, ఇతర దేశాల్లోని సాయుధ పోరాటాలూ ఈ వాస్తవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి."* అని ఈ ప్రకటన పేర్కొంది.

*"ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని పీడిత దేశాలే కాకుండా సామ్రాజ్యవాద దేశాల్లోని ప్రజలు కూడా 'ప్రపంచీకరణ', 'ప్రైవేటీకరణ' విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ విధానాలు అంతకు ముందెన్నడూ చూడని రీతిలో సామ్రాజ్యవాద దేశాల్లోని శ్రామికవర్గాన్నీ, ఇతర సెక్షన్లనూ సంక్షోభంలోకీ, నిరాశానిస్పృహల్లోకీ నెడుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాల బడా యజమానులకు వ్యతిరేకంగా సియాటిల్, ప్రాగ్, నైస్, వాషింగ్టన్, కాంకున్, గోథెన్‌బర్గ్, జినోవా, కాల్గరీ వంటి సామ్రాజ్యవాదుల కంచుకోటల్లోనే జరిగిన ఘటనలు ప్రజల క్రోధానికి వ్యక్తీకరణలుగా నిలుస్తాయి. వీటన్నింటి ద్వారా సామ్రాజ్యవాద దేశాల్లో విప్లవ పరిస్థితి ఎలా పరిపక్వమవుతున్నదో మనం స్పష్టంగా చూడొచ్చు. ఈ వాస్తవాలు మావో విశ్లేషించినట్టుగా విప్లవమే నేడు ప్రపంచంలో ప్రధాన ధోరణి అనే భౌతిక వాస్తవికతను మరోసారి ధృవీకరిస్తున్నాయి."* అని కూడా ఈ **ప్రకటన**లో వివరించారు.

ఈ **ప్రకటన**లో ఇంకా ఇలా చెప్పారు : **"దక్షిణాసియా అంతటా సాధారణంగా నయా-వలస రూపాల్లో పరిపాలనా, దోపిడీ సాగుతున్నాయి. ఇవి అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య అభివృద్ధి దశను పునరావృతం చేస్తూ దానినే మరింతగా బలపరుస్తున్నాయి. దానితో నూతన ప్రజాస్వామిక విప్లవం మున్నెన్నటికన్నా తక్షణావసరంగా చారిత్రక ఎజెండాపైకి వచ్చింది."** ఈ **ప్రకటన** భారత విస్తరణవాదాన్ని దక్షిణాసియా ప్రజల ఉమ్మడి శత్రువని నిర్ధారించింది. *"బ్రిటిష్ వలసవాదులకు వారసురాలిగా పనిచేస్తున్న కేంద్రీకృత భారత రాజ్యం పొరుగు దేశాలపైనా, వాటి ప్రజలపైనా పెత్తనం చేయడంలోనూ, అలాగే దేశీయంగా వివిధ జాతులకు చెందిన ప్రజలను పీడించి తన దాస్యం కిందకు తెచ్చుకోవడానికి బలవంతపెట్టడంలోనూ ఒక సాధనంగా పనిచేస్తోంది. ఈ ఆంతరంగిక అణచివేతకు మతపర మైనారిటీలతో సహా మైనారిటీ ప్రజలందరినీ అణచిపెట్టే లక్ష్యం కలిగిన పెద్ద దేశ హిందూ దురంహంకారం దానికి అండగా నిలిచింది. సామ్రాజ్యవాద శక్తులకు బంటుగా నిలిచిన భారత విస్తరణవాదం దక్షిణాసియాకు చెందిన జాతులనూ, ప్రజలనూ అణచిపెట్టడానికి గాను ఆధిపత్యం చెలాయించే ప్రాంతీయ ప్రతీఘాతుక శక్తిగా తయారైంది. చాలా దశాబ్దాలుగా ప్రధానంగా సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై పనిచేస్తూ ఉండిన భారత విస్తరణవాదం ఇప్పుడు అమెరికా సామ్రాజ్యవాదం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతోంది."*

ఈ **ప్రకటన** చారిత్రాత్మక నక్సల్బరీ తిరుగుబాటు భారత విప్లవోద్యమంలోనే కాదు, ఆసియా విప్లవోద్యమంలోనే ఒక మలుపు అని పేర్కొంది. *"నక్సల్బరీ పూరించిన శంఖారావం దక్షిణాసియాలోనూ దాని ఆవల కూడా నేటికీ మార్మోగుతోంది. ఇపుడు నేపాల్, భారతదేశాలల్లో (దండకారణ్యా, బీహార్, ఆంధ్రా తదితర ప్రాంతాల్లో) సాగుతున్న ప్రజాయుద్ధాలనూ, దక్షిణాసియాలోని ఇతర ప్రాంతాల్లో చురుకుగా సాగుతున్న సన్నాహాలనూ నక్సల్బరీకీ చారుమజుందార్ బోధనలకూ కొనసాగింపుగానూ, వాటి పరిణామాభివృద్ధిగానూ వస్తుగతంగా అర్థం చేసుకోవచ్చు."* దక్షిణాసియాలో మావోయిస్టుల ఐక్యతా సమస్యను తక్షణ కర్తవ్యంగా ఈ ప్రకటన పేర్కొనింది.

చివరగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఆటుపోట్లను విశ్లేషిస్తూ ఈ **ప్రకటన** దక్షిణాసియాలోని మావోయిస్టు శక్తుల ఐక్యతకు ప్రాతిపదికను తయారు చేసింది. *"మా-లె-మాను సిద్ధాంతంగానే కాకుండా, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడం ప్రధాన కర్తవ్యంగా గల ఆచరణకు దాన్ని అన్వయిస్తూ ఎత్తిపట్టడం పైన్నే మావోయిస్టు శక్తుల ఐక్యత ప్రాథమికంగా ఆధారపడి ఉంటుంది."* అని పేర్కొంది.

సెప్టెంబర్ 11 ఘటనల తర్వాతి ప్రపంచ పరిస్థితిని **రాజకీయ తీర్మానం** ప్రముఖంగా విశ్లేషించింది. ఈ **తీర్మానం**లో ఇలా చెప్పారు: *"ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థలో తీవ్రమవుతున్న సంక్షోభం నేపథ్యంలో, అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాద శక్తులు ఈ దాడులను సాకుగా తీసుకొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త (గ్లోబల్) యుద్ధం పేరుతో ప్రపంచంలోని పీడిత ప్రజలకూ, పీడిత దేశాలకూ వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త దురాక్రమణా యుద్ధాన్ని ప్రారంభించాయి. ఈ అంతర్జాతీయ ఉగ్రవాద కుక్కలు ప్రపంచంలోని వనరులపైనా, మార్కెట్‌లపైనా తమ అదుపును కొనసాగించడం కోసం, దాన్ని మరింతగా పటిష్టం చేసుకోవడం కోసం చేతులు కలిపాయి. లాభాలపైనా, కొల్లగొట్టిన సంపదలపైనా నిర్మించుకున్న తమ తమ పోటీదారు సామ్రాజ్యాలను రక్షించుకోవడానికీ, విస్తరించుకోవడానికీ బరితెగించి కార్మికుల శ్రమశక్తిని మరింతగా*

*దోచుకునేందుకూ, ప్రజల్ని దోచుకునేందుకూ ఈ శక్తులు ఐక్యమయ్యాయి. అదే సమయంలో ఈ ఉగ్రవాద కుక్కలు లాభాల్లోనూ, దోపిడీ సొమ్ములోనూ మరింత ఎక్కువ భాగం దక్కించుకోవడం కోసం ఒకదానితో ఒకటి గొంతులు కోసుకునేంతగా పోటీ పడుతున్నాయి. ఈ సాధారణ పరిస్థితిలో, మధ్య ప్రాచ్యం, కాస్పియన్ ప్రాంతంలోని భారీ చమురు నిల్వలపై నిర్ణయాత్మక అదుపును సాధించడం, పెత్తనం నెరపడం సామ్రాజ్యవాద గ్లోబల్ పెత్తనాన్ని సాగించడంలో కీలక ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.''*

దక్షిణాసియాలోని పరిస్థితిని ఈ **తీర్మానం** ఇలా అంచనా వేసింది: *''అమెరికా దక్షిణాసియా ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవడానికీ, పటిష్ఠం చేసుకోవడానికీ భారతదేశంతో వ్యూహాత్మక కూటమిని ఏర్పర్చుకుంది. ఈ నేపథ్యంలో ఈ వ్యూహాత్మక కూటమి, నేపాల్‌లో సిపిఎన్(ఎం) నాయకత్వంలో ప్రజ్వరిల్లుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని మిలటరీపరంగా అణచివెయ్యడానికి బరితెగించి ప్రయత్నిస్తున్న భూస్వామ్య, దళారీ నిరంకుశ రాజరిక ప్రభుత్వానికి సహాయం అందించడానికి పూనుకుంది. నవంబర్ 2001 తర్వాత ఎమర్జెన్సీ విధించిన నాటి నుండి నేపాల్ ప్రభుత్వం ప్రజలపైన నరమేధ యుద్ధాన్ని ప్రారంభించి రోజుకు సగటున డజను మందిని హతమారుస్తోంది. ఒక సంవత్సర కాలంలో 3,000కు పైగా మంది మరణించారు. నేపాల్ ప్రభుత్వం ఒక వైపు సామూహిక హత్యాకాండలకూ, సామూహిక లైంగిక అత్యాచారాలకూ, అమానవీయమైన చిత్రహింసలకూ పెద్ద ఎత్తున పాల్పడుతూ, మరోవైపు తను సృష్టిస్తున్న రక్తపాతాన్ని మరుగుపర్చడానికి తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నది. నేపాల్ ప్రభుత్వం ప్రాథమికమైన మానవ, ప్రజాస్వామిక హక్కులన్నింటినీ రద్దు చేసి ప్రగతిశీల పాత్రికేయుల్నీ, కార్యకర్తల్నీ హత్య చేయడం, అరెస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నది. ప్రభుత్వాధికారాన్ని కేంద్రీకృతం చేసి దానిపై తన గుత్త పెత్తనాన్ని నెలకొల్పే లక్ష్యంతో రాజరికం పార్లమెంటునూ, తదితర ప్రభుత్వ సంస్థలనూ, ఏజెన్సీలనూ పక్కకు నెట్టివేసింది. మరోవైపు యుఎంఎల్ వంటి తన కీలుబొమ్మ బలగాలను బలోపేతం చేసుకుంటోంది.''*

చివరగా, **రాజకీయ తీర్మానం** దక్షిణాసియా ప్రాంతం ప్రపంచ విప్లవానికి బలమైన తుఫాను కేంద్రాల్లో ఒకటిగా మారిందని అభిప్రాయపడింది.

***సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] సెప్టెంబర్ 15, 2002న విడుదల చేసిన ప్రకటనకు సంక్షిప్త పాఠం***

*(..... 3వ పేజీ తరువాయి)*

ఆదివాసుల ప్రయోజనాలను దెబ్బతీసే 'అటవీ సంరక్షణా చట్టం' అమల్లోకి వచ్చింది 1980 లోనే. ఇప్పుడు 1980 తర్వాత జరిగిన అటవీ భూముల కబ్జా విషయంలోనే ప్రభుత్వం తన భాషలోనే 'కఠోర వైఖరి'ని అవలంబిస్తున్నది. సరిగ్గా 1980 లోనే దండకారణ్యంలో విప్లవోద్యమానికి బీజాలు పడ్డాయి. దేశంలో ఈనాడు ఆదివాసులు అత్యధికంగా సంఘటితపడి ఉన్న అతి పెద్ద ప్రాంతం దండకారణ్యమేనని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఇక్కడికి పార్టీ ప్రవేశించిన నాటి నుండీ ఆదివాసీ ప్రజలను ప్రజా సంఘాలలో సంఘటిత పరుస్తూ, ''అడవిపై హక్కు ఆదివాసులదే'' అనే నినాదంతో వారిని ఉత్తేజపరుస్తూ అనేక పోరాటాలు నిర్వహించింది. చెట్టు నరికినా, ఆకు తెంపినా, గుడిసె వేసుకున్నా, గొడ్లను మేపినా లెక్కలేనన్ని దౌర్జన్యాలకు పాల్పడుతూ, నిండా అవినీతిలో మునిగిపోయిన అటవీ అధికార్ల ఆట కట్టించింది. క్రమంగా దండకారణ్య ప్రజలు తమ అవసరాల కోసం అడవుల్ని నరుక్కొని చాలా భూముల్ని సేద్యం చేసుకున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో ఇలా సాగులోకి తెచ్చుకున్న భూములు కొన్ని లక్షల ఎకరాల్లో ఉంటాయి. ఇక్కడ పాలకవర్గ పార్టీల నాయకులు ప్రజలను మోసం చేయడానికి ప్రతి ఎన్నికల సందర్భంలోనూ అటవీ భూములకు పట్టాలిప్పిస్తామని వాగ్దానాలు చేస్తారు. అయితే విప్లవ ప్రజలు ఇప్పుడు 'మీ ప్రభుత్వం ఇచ్చే పట్టాలు మాకవసరం లేద'ని ప్రకటించారు. ఇప్పుడిప్పుడే ఊపిర్లు పోసుకుంటున్న ప్రజా రాజ్యాధికారపు అంగాలైన విప్లవ ప్రజా కమిటీలే స్వయంగా ప్రజలకు పట్టాలు జారీ చేసే ప్రక్రియను కూడా ప్రారంభించాయి. భూమి సరుకు కాదనీ, భూముల్ని అమ్మడం, కొనడం కూడా సరైంది కాదనీ ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ విధంగా దండకారణ్య ప్రజలు ఇక్కడి అడవులపైనా, భూములపైనా, ఇతర ప్రకృతి సంపదలపైనా తమ అధికారం కోసం జరుగుతున్న పోరాటంలో ఎన్నెన్నో విజయాల్ని సాధించారు. మరిన్ని విజయాల కోసం రక్తతర్పణ చేస్తూ పోరాడుతున్నారు.

దండకారణ్య ప్రజలు విప్లవ పార్టీ నాయకత్వంలో తమకు అవసరమైన భూముల్ని నరుక్కోవడమే గాకుండా, 'ఈ అడవులకు మేమే యజమానులం' అనే చైతన్యంతో వాటిని రక్షించుకునేందుకు కూడా నడుం బిగించారు. మొదటగా, అటవీ శాఖ నిర్వహించే కలప నరికివేతను అడ్డుకునేందుకు వీరోచితమైన పోరాటాలు నిర్వహించి విజయం సాధించారు. ఈనాడు దండకారణ్య ప్రాంతంలో ప్రభుత్వ అటవీ శాఖకు విప్లవ ప్రజా సంఘాల నిర్ణయానికి విరుద్ధంగా కలప నరికించే సాహసమే లేదు. అట్లాగే దండకారణ్య ప్రజలు అవసరానికి మించి అడవుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నరకవద్దనీ, అలాగే ప్రజా సంఘాల అనుమతి లేకుండా ఎవ్వరూ కూడా అడవిని నరకొద్దని నిర్ణయాలు తీసుకున్నారు. కలప వ్యాపారం చేసే స్మగ్లర్లను ప్రజలు అరెస్టు చేసి వివిధ పద్ధతుల్లో శిక్షిస్తున్నారు. ఇప్పుడు దండకారణ్యంలో ప్రభుత్వ ఆదేశాన్ని అమలు పర్చడం అంటే, ప్రజలు గత 22 ఏళ్లుగా నెత్తురు ధారపోసి సాధించిన విజయాలన్నింటినీ వదులుకోవడం అన్నమాట. అడవిపై తమ హక్కుకు వదులుకోవడం అన్నమాట. కానీ ఒకప్పుడు బ్రిటిష్ పాలకుల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటానెగురేసిన ఘనమైన చరిత్ర గల దండకారణ్య ప్రజలు, అడవిని దోచుకోవడానికి పాలకులు ప్రయత్నించిన ప్రతిసారీ ఆ ప్రయత్నాన్ని వమ్ము చేసిన వీరోచిత చరిత్ర గల ప్రజలు, ప్రస్తుత దోపిడీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించే లక్ష్యంతో సాయుధమై దీర్ఘకాలిక ప్రజాయుద్ధ బాటలో నడుస్తున్న ప్రజలు, దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మల్చే తక్షణ లక్ష్యంతో పురోగమిస్తున్న ప్రజలు ఎంఓఇఎఫ్ ఆదేశాలపై తమ భూముల్ని అంత తేలిగ్గా వదులుకుంటారని ఎవరైనా భావిస్తే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదు. వాళ్లు తమ ప్రాణాల్ని బలిపెట్టయినా భూముల్ని కాపాడుకుంటారు.

ఈ సందర్భంగా ఈ సమస్యపై కలిసివచ్చే శక్తులన్నింటినీ కలుపుకొని విశాల ఐక్యసంఘటనను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యపై ఇప్పటికే ఎన్నో ప్రజాస్వామిక సంఘాలూ, ఎన్‌జీఓలూ పోరాటానికీ, ఇతర కార్యక్రమాలకూ ముందుకొచ్చాయి. కొన్ని వామపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో తమ వైఖరిని స్పష్టం చేశాయి. ఇతర పాలకవర్గ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే అయినప్పటికీ ఆదివాసులను అటవీ భూముల్నుండి వెళ్లగొట్టవద్దని డిమాండ్ చేస్తున్నాయి. కాబట్టి దండకారణ్యంలోని విప్లవ ప్రజాసంఘాలు ఈ సమస్యలో కలిసి వచ్చే సంఘాలతోనూ, ఇతర ప్రజాస్వామిక శక్తులతోనూ మమేకమై విశాల ఐక్యసంఘటనను నిర్మించి ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా రాజీ లేకుండా పోరాడాలి. ''అడవిపై హక్కు ఆదివాసులదే''నని ఎలుగెత్తి చాటాలి. ❑

సిద్ధాంత వ్యాసం

# అనుభవవాదాన్ని అధిగమించడం

లెనిన్ రాసిన **"భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శ"** చదివిన తర్వాత తయారు చేసిన నోట్సు – వీ-పు

*(రచయిత పెకింగ్‌లోని యుంగ్‌టింగ్ మెషినరీ ప్లాంట్‌లో డ్రిల్లింగ్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయినాడు)*

## అనుభవానికి సంబంధించిన రెండు వ్యతిరేక సిద్ధాంతాలు

"భావవాదం మరియు యాంత్రిక భౌతిక వాదం, అవకాశవాదం మరియు దుస్సాహసికవాదం వీటన్నిటికీ- భౌతిక వాస్తవికత, స్వీయాత్మకతల మధ్య ఏర్పడ్డ అగాధం, జ్ఞానాన్ని ఆచరణ నుండి విడదీయడం అనే లక్షణాలుంటాయి." అని మావో ఆచరణ వ్యాసంలో పేర్కొన్నాడు. రష్యా పార్టీలోకి చొరబడ్డ బొగ్డనోవ్ మరియు అతనిలాంటి ఇతర వంచనాపరులు అటువంటి అవకాశవాదులే. లెనిన్ తన "భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శ"లో వీరి స్వభావాన్ని చాలా పదునుగా ఎండగట్టడంపై కేంద్రీకరించాడు. ఈ మూర్ఖులు విప్లవాచరణను వ్యతిరేకించి, ఆచరణకు సంబంధించిన భౌతికవాద సిద్ధాంతాన్ని నిరాకరించి భావవాద ఆచరణా సిద్ధాంతాన్ని ప్రబోధించారు. వారు విప్లవ సిద్ధాంతాన్ని వ్యతిరేకించి, గతితార్కిక భౌతికవాదాన్ని 'మాయా వాదమని', 'పిడివాదమని' ద్వేషంతో అవమానపరిచారు. వారి మెదళ్ళలో భౌతికవాదానికి బదులు భావవాదాన్ని, మార్క్సిజానికి బదులు రివిజనిజాన్ని నింపారు. ఈ విషయంలో వారింకెంత మాత్రం ఒంటరివాళ్ళు కాదు; లీషావ్-చీ, ఇతర రాజకీయ మోసగాళ్ళు కూడా ఇదే కోవకు చెందుతారు. 'ప్రతిభ' పేర పిలవబడుతున్న తప్పుడు సిద్ధాంతానికి బాకాలూదుతూ, వారు మనిషి సామర్థ్యం ఆచరణ నుండే పుడుతుందనే భౌతికవాద దృక్పథాన్ని వ్యతిరేకిస్తారు. మార్క్సిజం-లెనినిజం కాలానుగుణంగా లేదని, పనికిరాదని ఉన్మత్తతతో దాడిచేశారు. విప్లవ సిద్ధాంతాన్ని విప్లవ ప్రజారాశుల నుండి వేరుచేసి ప్రక్కదారి పట్టించడానికి, మోసం చేయడానికి ప్రయత్నించారు. ఇదంతా ఏం తెలియజేస్తుందంటే మనం అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు ఆచరణకు ప్రథమస్థానం ఇచ్చే దృక్పథాన్ని ఎత్తిపట్టాలి. భావవాద ఊహలను వ్యతిరేకించాలి. అదే సమయంలో మనని మనం భావవాదం, అధి భౌతికవాదంలోకి కూరుకుపోకుండా నివారించుకోవడానికి, భావవాద ఊహల నుండి రక్షించబడడానికి విప్లవ సిద్ధాంత నాయకత్వ పాత్ర ప్రాముఖ్యతకు కట్టుబడి వుండాలి.

జ్ఞానం వర్గపోరాట ఆచరణ నుండీ, ఉత్పత్తి కోసం పోరాటం నుండీ, మరియు శాస్త్రీయ ప్రయోగం నుండీ వస్తుందని మార్క్సిజం చెబుతుంది. "నిజమైన జ్ఞానం అంతా ప్రత్యక్ష ఆచరణ నుండే పుడుతుంది." (ఆచరణ). నా స్వంత అనుభవం నుండి కూడా ఇది నిజం అని తెలుసుకున్నాను. ఇది ఆకాశం నుండి ఊడిపడలేదు లేదా మనస్సు నుండి ఉద్భవించలేదు. ఇది మా రిసెర్చి గ్రూపు చేసిన దాదాపు ఒక వేయి ప్రయోగాల ఫలితం. వీరు బెంచి వద్ద 12 సం॥ల అనుభవం, స్వదేశంలో, విదేశాల నుండి కూడా మెరుగైన అనుభవాన్ని గడించినవారు. ఇంకోమాటలో ఇది డ్రిల్లింగ్ మిషిన్ ఆపరేటర్ల ఆచరణానుభవం నుండి సృష్టించబడింది.

జ్ఞానానికి సంబంధించిన భౌతికవాద మార్గాన్ని వ్యతిరేకించడంలో, భావవాదులందరూ అనుభవానికి సంబంధించిన విషయాల భౌతిక వాస్తవికతను తేడా లేకుండా నిరాకరిస్తారు. తాము బయట పడకుండా వుండటానికి, ఇతరులను మోసం చేయడానికి వారు తరచుగా 'అనుభవం' అనే పాత బ్యానర్‌ను ఎత్తిపడుతుంటారు. కాని వాస్తవానికి భావవాద దృక్పథం గల అనుభవాన్ని వీరు ముందుంచుతారు. అనుభవానికి సంబంధించిన వీరి దృక్పథాన్ని లెనిన్ స్పష్టంగా బహిర్గతపరిచి విమర్శించాడు. "తత్వశాస్త్రంలో భావవాద, భౌతికవాద మార్గాలు రెండూ బహుశా 'అనుభవం' అనే పదం మాటున దాగి వున్నాయి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు" అని భౌతికవాదం మరియు అనుభవవాద విమర్శలో పేర్కొన్నాడు. అనుభవానికి సంబంధించిన విషయాలపై ఆధారపడి భౌతిక వాస్తవికతకు కట్టుబడి వుండడం అనేది భౌతికవాద మార్గాన్ని ఎత్తిపట్టి దాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి వుండవలసిన ముందు షరతు.

## అనుభవమే సంపూర్ణమైనదని ఎప్పుడూ ఎంచకూడదు

మనం ప్రత్యక్ష (స్వంత) అనుభవంలో వుండడం వల్ల మనంతట మనం భౌతికవాద మార్గంలో మన పనిని కొనసాగిస్తామని అర్థమా? లేదు. ప్రత్యక్ష అనుభవమే సంపూర్ణమైనదని భావిస్తే మనం తప్పులు చేస్తాం. మన పాక్షిక అనుభవాన్నే తిరుగులేని నమూనాగా ఎంచి దానిని అంతటా వర్తింపజేస్తే – పాత అనుభవంతో నూతన విషయాలను, అభివృద్ధి చెందిన లేదా మారిన విషయాలను పరిష్కరింప బూనుకుంటే, మన పాక్షిక అనుభవాన్ని ఎక్కువ అంచనా వేసుకొని ఇతరుల, ప్రజల సరైన అనుభవాన్ని తక్కువ అంచనా వేస్తే లేదా నిరాకరిస్తే మనం అనుభవవాదానికి గురవుతాం. దాని ఫలితంగా మనం ఇంకా బోగ్డనోవ్ ప్రవచించిన భావవాద అనుభవవాద సిద్ధాంతం నుండి పూర్తిగా బయట పడలేక తెలిసిగాని, తెలియకగాని భావవాద బురదగుంటలో మునిగిపోతాం.

ప్రపంచంలోని అన్ని విషయాలు లేదా వస్తువులు పరస్పర సంబంధం కలిగి వుండి అదే సమయంలో ఒకదానితో మరొకటి వైవిధ్యం (తేడా) కలిగి వున్నాయి. ఆచరణలో మనం విషయాల సాధారణత్వంపట్ల మాత్రమే శ్రద్ధ చూపకూడదు. అంతకంటే ముఖ్యమైనది, ప్రతిదాని యొక్క నిర్దిష్టత్వం పట్ల శ్రద్ధ వహించడం. వస్తువులోని ప్రత్యేక వైరుధ్యం ఏదైతే మిగతా వస్తువుల నుండి దానిని భిన్నంగా చూపుతుందో దానికనుగుణంగా వైరుధ్యాన్ని పరిష్కరించడానికి సరైన చర్యలు చేపట్టాలి. దీన్ని సులభంగా "తాళాన్ని తీయడానికి సరైన తాళం చెవిని ఉపయోగించడం"గా చెప్పవచ్చు. అదే విధంగా మనం అన్ని రోగాలను నయం చేయడానికి ఒకే మందు ఉపయోగించలేం. ఒక దాని నుండి పొందిన అనుభవంలో కొన్ని విషయాలు ఇతరులకు తగినవిగా వుండవచ్చు, కొన్ని పాక్షికంగా సరిపోవచ్చు, మరికొన్ని అసలు పూర్తిగా తగినవిగా

వుండకపోవచ్చు. వైరుధ్యాల ప్రత్యేకతను నిర్లక్ష్యంచేసి, యాంత్రికంగా పాత అనుభవంతోనే ప్రతి దానినీ పరిష్కరించబూనడమే 'అనుభవవాదం'.

ప్రపంచంలోని ప్రతి ఒక్కటి మార్పుకు గురవుతున్నది. ఈ మార్పు దాని అభివృద్ధి క్రమంలో ఒక నిర్దిష్ట దశలో దానంతటదే స్పష్టంగా కనపడుతుంది. కాబట్టి మన ఆలోచన భౌతిక పరిస్థితుల అభివృద్ధి దశను దాటిపోవద్దు. భవిష్యత్తులో మాత్రమే చేయగలిగిన దానిని ఇప్పుడే ఒక దెబ్బతో సాధించాలని కలలు కనగూడదు. ఐనప్పటికీ భౌతిక పరిస్థితులు మారినకొద్దీ దానికనుగుణంగా మన ఆలోచనలో తప్పక మార్పురావాలి. ఈ విధంగా మాత్రమే భౌతిక వాస్తవికత యొక్క అభివృద్ధికి వెనుకబడి వుండకుండా, 'పాత అనుభవం'తో కొత్త సమస్యలు పరిష్కరించకుండా వుండగలం. ఆచరణ నుండి వచ్చింది కనుక పాత అనుభవం సరైందని మనం అంటాం. కాని మనం దాన్ని పట్టుకొని వేలాడితే పరిస్థితులు మారినప్పుడు అటువంటి అనుభవం స్వీయాత్మకమై పోతుంది.

ఆచరణ కార్యకలాపం అనేది అత్యంత విస్తృతమయినది. కాని వ్యక్తిగత ఆచరణకుగల అవకాశం ఎప్పుడూ పరిమితమయినదే. మనం వ్యక్తిగత ఆచరణ ద్వారా పొందిన ప్రత్యక్షానుభవానికి గల ప్రాముఖ్యతకు అంటి పెట్టుకొని వుంటూనే ప్రజలు సృష్టించిన అనుభవాలని చాలా విలువైనవిగా ఎంచాలి. అధ్యయనం, పరిశోధనలు చేయడంలో, ఇతరుల అనుభవాలను స్వీకరించడంలో సంసిద్ధంగా వుండాలి. ఆ విధంగా మాత్రమే మన పనిని సరిగా చేయగలుగుతాం.

చున్ డ్రిల్ మిషన్ ఏ విధంగా రూపొందించబడిందో గుర్తు చేసుకుంటే-జ్ఞానమనే సముద్రం ప్రజల ఆచరణ నుండే సృష్టించబడిందనే లోతైన అవగాహనకు వచ్చాను. డ్రిల్లింగ్‌లో ప్రజలు సృష్టించిన వాటిని, వారి విలువైన అనుభవాలను తీసుకొని ఎంతో జాగరూకతతో పరిశోధించిన తర్వాతే మేం చున్ డ్రిల్ బిట్ మీద చెప్పుకోదగ్గ 5 పెద్ద మార్పులను తీసుకు రాగలిగాం. ఏ ఒక్కరు కూడా ప్రతి విషయంలో ప్రత్యక్ష అనుభవం కలిగి వుండరు. వాస్తవానికి చాలా జ్ఞానం పరోక్షానుభవం ద్వారానే వస్తుంది. ఒకవేళ ఎవరైనా ప్రజల అనుభవం కంటే తన వ్యక్తిగత అనుభవం గొప్పదని, పరోక్ష అనుభవం కంటే ప్రత్యక్ష అనుభవం గొప్పదని భావిస్తే అనుభవవాద తప్పులకు గురవుతారు. మావో ఈ విధంగా పేర్కొన్నాడు: "ఇతరుల అనుభవాల నుండి కూడా మొహమాటం లేకుండా నేర్చుకోవడం అవసరం. దానికి బదులుగా మూర్ఖంగా స్వంత అభిప్రాయాలకే కట్టుబడి వుండి ఇతరుల అనుభవాలను తిరస్కరించినా, స్వంత అనుభవమే అన్ని విషయాలకు సరిపోతుందని పట్టుపట్టినా శుద్ధ 'సంకుచిత అనుభవవాదమే' అవుతుంది" (చైనా విప్లవ యుద్ధంలో వ్యూహాత్మక సమస్యల నుండి).

స్వీయాత్మకత, లాంచనవాదాల వ్యక్తీకరణే అనుభవవాదం. సైద్ధాంతికంగా ఇది గతితార్కిక భౌతికవాద, చారిత్రక భౌతికవాదాల మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నడుస్తుంది. అనుభవవాదులు తరచుగా "అతివాద", మితవాద అవకాశవాదాన్ని గుడ్డిగా అనుసరించడానికి ఇదే సైద్ధాంతిక పునాది. ఇటువంటి పరిస్థితుల్లో అనుభవవాదానికి గురైన వారు మార్క్సిజం విప్లవాచరణకు మార్గదర్శి అనే విషయాన్ని నిర్లక్ష్యం చేస్తారు. విప్లవ సిద్ధాంత అధ్యయనం పట్ల శ్రద్ధ పెట్టరు. అప్పుడప్పుడు లభించే విజయాలను, మెరుపులను చూసి సంతృప్తి చెందుతారు. సంకుచిత, సూత్రబద్ధంకాని "ప్రయోజన వాదం" అనే మత్తులో మునిగిపోతారు. భవిష్యత్తులేని "ఆచరణవాదులు"గా వుండి పోతారు. వారు రాజకీయ మోసగాళ్ళ కుహనా మార్క్సిస్టు సిద్ధాంతాలకు సులభంగా బందీలయిపోతారు.

## చైతన్యంతో కూడిన అధ్యయనం ద్వారా అనుభవవాదాన్ని అధిగమించడం

మార్క్సిజాన్ని చైతన్యయుతంగా అధ్యయనం చేయడమే అనుభవవాదాన్ని అధిగమించడానికున్న మౌలిక మార్గం. అనుభవవాదాన్ని సైద్ధాంతికంగా విమర్శించడానికి మనం తత్వశాస్త్రాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. "పనిలో అనుభవం గడించినవారు సిద్ధాంత అధ్యయనాన్ని సీరియస్‌గా చేపట్టడం ద్వారా మాత్రమే వారి అనుభవాన్ని ఒక క్రమ పద్ధతిలో సంశ్లేషించి దానిని సిద్ధాంత స్థాయికి పెంచుకో గలుగుతారు. ఆ విధంగా మాత్రమే వారి పాక్షిక జ్ఞానాన్ని విశ్వజనీన సత్యంగా పొరపడరు, అనుభవవాద తప్పులు చేయరు." (పార్టీ పని శైలిని సరిదిద్దండి).

ఆచరణ నుండి గడించిన ప్రత్యక్ష అనుభవం భౌతిక ప్రపంచానికి సంబంధించిన కొంత వాస్తవాన్ని ప్రతిబింబించినప్పటికీ అది అనుభూతి జ్ఞానం మాత్రమే. అలా ప్రతిబింబించేది పైపైన కనిపించేది, పాక్షికమైనది, అసంపూర్ణమైనది. "సాపేక్షికంగా సంపూర్ణ జ్ఞానం లేకుండా విప్లవాన్ని సరిగా కొనసాగించడం అసాధ్యం" (పార్టీ పనిశైలిని సరిదిద్దండి). అసంపూర్ణ జ్ఞానాన్ని సాపేక్షికంగా సంపూర్ణ జ్ఞానంగా మార్చడానికి విప్లవ సిద్ధాంతాన్ని చైతన్యపూర్వకంగా అధ్యయనం చేయడం తప్పనిసరి. మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం, వైఖరి, పద్ధతులను చేపట్టి ఒకరి ప్రత్యక్ష అనుభవాన్ని ప్రత్యేకంగా వర్గపోరాట, రెండు పంథాల మధ్య పోరాటానుభవాల నుండి అంచనా కట్టాలి. పునర్నిర్మాణం ద్వారా అనుభూతి జ్ఞానం నుండి హేతుబద్ధ జ్ఞానానికి గెంతు వేయడానికి-పనికిరాని దానిని విసర్జించి అవసరమైన దానిని ఎంచుకోవాలి, తప్పులను వదిలించుకొని సత్యాన్ని నిలబెట్టుకోవాలి. ఒకదాని నుండి ఇంకోదానికి, బయటి నుండి లోపలకు పోతూ ముందుకు సాగాలి. ఈ క్రమంలో సరైన వైఖరి, దృక్పథం, పద్ధతులు చేపట్టడం అత్యంత ముఖ్యమైన విషయం. మార్క్సిస్టు వైఖరి, దృక్పథం, పద్ధతులు లేకుండా తెలుసుకోవడంలో గెంతు వాస్తవరూపం ధరించడం సాధ్యం కాదు. ఎవరైనా విషయాలను అనుభవవాద దృక్పథం నుండి చూస్తే అతను అవసరమైన దానికి పనికిరాని దానికి మధ్య తేడా చూడలేడు. కాని సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా మార్చివేస్తాడు.

లెనిన్ ఈ విధంగా పేర్కొన్నాడు: "మార్క్సిస్టు సిద్ధాంత మార్గాన్ని అనుసరించడం ద్వారా మనం భౌతిక వాస్తవికతకు చేరువవుతాం (దాన్ని ఎన్నటికీ విడనాడకుండా వుంటే); కాని ఏ ఇతర మార్గాన్ని అనుసరించినా మనం గందరగోళానికి, అబద్ధాలకు చేరువవుతాం" (భౌతికవాదం మరియు అనుభవవాద-విమర్శ). వర్గ పోరాటం, రెండు పంథాల మధ్య పోరాటం దీర్ఘకాలం ఉనికిలో వుంటాయి. పాత వైరుధ్యాలు పరిష్కారమైన తర్వాత వాటి స్థానంలో నూతన వైరుధ్యాలు ముందుకు వస్తాయి. ఒక యుద్ధంలో గెలిచిన తర్వాత నూతన యుద్ధాల్లో గెలవాల్సి వుంటుంది. భౌతిక ప్రపంచాన్ని మార్చడం అనేది ఎప్పటికీ ముగిసి పోయేదికాదు. మన ఆచరణ నుండి సత్యం అనే జ్ఞానాన్ని తెలుసుకోవడం కూడా ఎన్నటికీ ముగిసిపోదు. కాబట్టి మనం విప్లవాత్మకంగా వుండాలి, మనం బతికి వున్నంతకాలం అధ్యయనం చేస్తూనే వుండాలి. (నంబర్: 43, అక్టోబర్ 27, 1972 పెకింగ్ రివ్యూలోని వ్యాసానికి సంక్షిప్త రూపం). ❑

**కరువు**

# ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుపథంలో ఛత్తీస్‌గఢ్ రైతాంగం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడి రెండేళ్లు దాటింది. సకల సంపదలకు పుట్టినిల్లయిన ఈ గడ్డలో నివసించే నిరుపేదల అభివృద్ధి గురించి గొప్పలు పోయే ముఖ్యమంత్రి అజిత్ జోగి గద్దెనెక్కి రెండేళ్లు దాటింది. ఈ సందర్భంగా అత్యంత దారిద్ర్యంలో మగ్గుతున్న ప్రజలను విజయవంతంగా పాలిస్తున్నందుకు పండగ జరుపుకున్నాడు. మంత్రులూ, ఎమ్మెల్యేలూ, అధికారపక్ష నేతలూ, పెట్టుబడిదార్లూ రాష్ట్ర ఉత్సవంలో తలమునకలయ్యారు. రాబోయే ఎన్నికల్లో లాభాన్ని దృష్టిలో పెట్టుకొని భారతీయ జనతా పార్టీ 'ప్రజా హితాన్ని' ఆశించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా లెక్కకు మిక్కిలిగా ప్రకటనలు గుప్పిస్తోంది. ప్రజలు కన్న కలలను 'పండించడం' కోసం పాలక-ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రైతాంగం మాత్రం తమ పొలాలకు నీళ్లు సాధించుకోవడం కోసం పోరుదారి పట్టక తప్పడంలేదు. అనేక చోట్ల నాయకులను ఘెరావ్ చేసి వాళ్లను బంధీలుగా పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మెడలు వంచి తమ పొలాలకు నీళ్లు సాధించుకుంటున్నారు. అక్టోబర్ 9న రాయపూర్‌కు దగ్గర్లోని లవన్ అనే గ్రామంలో రాంలాల్ భారద్వాజ్ అనే ఎమ్మెల్యేను ప్రజలు బంధీగా పట్టుకున్నారు. దాదాపు ఐదు గంటల పాటు రైతులు అతన్ని కదలనివ్వలేదు. వాళ్ల పొలాలకు నీళ్లు వదులుతామని రాతపూర్వకంగా హామీ ఇచ్చాకే అతన్ని వదిలేశారు.

రెండేళ్ల కిందట, అక్టోబర్ 2000లో లాఖోలి (రాయపూర్‌కు 20 కిలోమీటర్లు) రైతులు చూపిన బాటే ఇవ్వాళ అందరి బాటా అయ్యింది. తమ కళ్ల ముందరే నాశనమైపోతున్న పంటలను చూసి రైతుల హృదయం భగ్గున మండింది. తమ పొలాలకు నీళ్లు అందివ్వాలని కోరుతూ వాళ్లు రోడ్లను అటకాయించారు. ఉత్తుత్తి మాటల్తో నచ్చజెప్పాలని వచ్చిన అధికార్లను తన్ని తరిమారు. ఆవుల్నీ, ఎడ్లనూ అదిలించే రైతులు ప్రభుత్వాన్ని వణికించారు. వెంటనే కాల్వల్లోకి నీళ్లను వదిలారు. పొలాల దాహం తీరడంతో రైతుల ఆగ్రహం కూడా శాంతించింది. అయితే పాలకవర్గాలకు మాత్రం ఇది మింగుడు పడలేదు. శాంతికాముకులైన ఛత్తీస్‌గఢ్ రైతుల కన్నెర్రకు కారణాల్ని పరిశోధించారు. ఒక వారం దాకా ఈ ప్రాంతంలో పోలీసులు భీభత్సం సృష్టించారు. వందలాది రైతుల్ని అరెస్టు చేశారు. పదుల సంఖ్యలో రైతులపై కేసుల్ని మోపారు. ఇప్పుడు రైతులు తమ పొలాలకే కాదు, కోర్టులకు కూడా పోవల్సి వస్తున్నది. పోయిన సంవత్సరం వరుణదేవుడే ప్రభుత్వాన్ని రైతుల కోపాన్నుండి రక్షించాడు. వర్షాలు బాగా పడడంతో పంటలు కూడా బాగా పండాయి. రైతుల శ్రమకు మంచి ఫలితం దక్కింది. ఎటు చూసినా వరి కుప్పలే! కష్టాలు కడతేరగలవని అనిపించింది. అయితే రైతులకు నిరాశే ఎదురయ్యింది.

## అధిక దిగుబడితోనూ ఇబ్బందే ?!

పంటలు బాగా వచ్చినప్పటికీ రైతుల సంతోషం ఎంతో కాలం నిలవలేదు. రైతులు పండించిన పంటలో సగ భాగానికి కూడా ప్రభుత్వ మద్దతు ధర దొరకలేదు. మొదట్లోనే ధనిక రైతులు లాభం కొట్టేశారు. గౌంటియాలూ, మాల్‌గుజార్లూ తమ ధాన్యాన్ని అమ్ముకొని బాగా డబ్బు చేసుకున్నారు. చిన్న, మధ్య తరగతి రైతుల వంతు వచ్చే సరికి ప్రభుత్వం ధాన్యం కొనడాన్ని ఆపేసింది. కొద్ది మొత్తంలో కొనుగోలు చేసినా అది పాత అప్పుల జమ కిందికి మాత్రమే. దానితో తక్కువ ధరకు మధ్య దళారులకు అమ్మక తప్పలేదు. పాత అప్పులూ తీరలేదు. విత్తనాల కోసమూ, ఎరువుల కోసమూ ఏమీ మిగల్లేదు. తిండీ, బట్టా, మందులుమాకులూ వంటి జీవితావసరాలు తీరలేదు. ఓ వైపు వరిధాన్యంతో గోడౌన్లు నిండిపోయాయి. నిల్వ చేయడానికి తగినంత స్థలం కూడా లేదు. కానీ ఆ పంటల్ని పండించిన శ్రమజీవులకు తాగడానికి గంజి కూడా కరువైంది. ప్రభుత్వం ఈ కష్టాలకు కారణం అధిక దిగుబడి అని ప్రకటించింది. దీనికి పరిష్కారం కూడా సూచించింది. దాని పేరే 'పంట మార్పిడి' పద్ధతి (దీన్నే హిందీలో 'ఫసల్ చక్ర్ పరివర్తన్' అనీ, ఇంగ్లీషులో 'క్రాప్ రొటేషన్' అనీ అంటారు). వరి పండించవద్దని ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడు వరి కొనుగోలు చేయనని బెదిరించింది. తోటలు పెంచాలనీ, చెరకు, వేరుశనగ, జనుము, పొగాకు వంటి పంటల్ని వేయాలనీ సలహా ఇచ్చింది.

## పంట మార్పిడి పద్ధతితో లాభం ఎవరికి ?

ప్రభుత్వం తన సామ్రాజ్యవాద యజమానుల ఆదేశాలకు లోబడే, వారి లాభాల కోసమే ఇక్కడి సాంప్రదాయబద్ధమైన పంట మార్పిడికి సంబంధించిన పద్ధతులను నాశనం చేసింది. '60వ దశకంలో ప్రభుత్వం 'హరిత విప్లవం' పేరిట పాత రాయపూర్ జిల్లాలో వరి పంటను బాగా ప్రోత్సహించింది. అయితే, ఇప్పటి మారిన పరిస్థితుల్లో డబ్ల్యూటీవో విధానాలకు అనుగుణంగా ఇక్కడి వ్యవసాయాన్ని సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుతోంది. స్వావలంబనకు విఘాతం కల్గిస్తోంది. పంట మార్పిడి అంటూ ప్రభుత్వం చెబుతున్నవన్నీ స్పష్టంగా దళారీ పెట్టుబడిదార్ల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే. చక్కెర మిల్లుల, జూట్ మిల్లుల, బట్టల మిల్లుల కోసం అవసరమయ్యే ముడి పదార్థాలను పండించడం కోసం, బహుళజాతి కంపెనీల విత్తనాలా, ఎరువులా అమ్మకాలను పెంచుకోవడం కోసం, వాటి యంత్ర పరికరాలకు మార్కెట్‌ను పెంచడం కోసం, రసాన్నిచ్చే ఫలాల ఎగుమతిని పెంచుకోవడం కోసం ప్రభుత్వం ఈ విధానాన్ని బాగా ప్రోత్సహిస్తోంది.

మళ్లీ ఈ ఏడు వర్షాలు సరిగా పడలేదు. పంటల మార్పిడి మాట అటుంచి నాట్లే సరిగా పడలేదు. రైతుల కష్టం మట్టిపాలైంది. రాష్ట్రమంతటా కరువు ఎంత తీవ్రంగా ఉందంటే ప్రభుత్వం రాష్ట్రాన్ని కరువుప్రాంతంగా ప్రకటించక తప్పలేదు.

## కరువు ప్రకృతి వైపరీత్యమా ? లేక పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాల ఫలితమా ?

ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు, మొత్తం దేశమంతటా నెలకొన్న కరువు కేవలం ప్రకృతి వైపరీత్యం కానే కాదు. ఇది పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ఫలితం. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 55 ఏళ్లలో ఎన్నో భారీ ప్రాజెక్టులు కట్టినప్పటికీ ప్రభుత్వం రైతుల మౌలిక సమస్యలను ఏ మాత్రం పరిష్కరించలేదు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దాదాపు 30 లక్షల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. మొత్తం జనాభాలో 83 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలూ, పేద రైతులే. సంవత్సరంలో 12 నెలలూ ప్రవహించే జీవనదులున్నప్పటికీ, రాష్ట్రంలోని

మొత్తం 56 లక్షల హెక్టేర్ల సాగుభూమిలో కేవలం 17 శాతానికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం వుంది. ఈ భూములు కూడా ప్రధానంగా గౌంటియాలవే. మొత్తం సాగుభూమిలో 51 శాతం పేద, మధ్య తరగతి రైతులవి. దాదాపు ఇవన్నీ వర్షాధార భూములే. ఎందుకంటే మొత్తం రాష్ట్రంలో గంగ్రేల్, మాడంసిల్లి, సోండూర్‌లాంటి చెరువులూ, కొన్ని బోర్‌వెల్స్ తప్పితే మరే నీటి సౌకర్యాలూ లేవు. పేద, మధ్యతరగతి రైతులకు నీటి సౌకర్యం లేదు. చెరువుల్నీ, స్టాప్ డ్యాములనూ నిర్మించడానికి ఏ ప్రయత్నం కూడా జరుగలేదు. చిన్న డ్యాముల నిర్మాణం కూడా చేయడం లేదు. గడిచిన 55 సంవత్సరాల పాలనలో పాలకవర్గాలు ప్రజల మేలుకోరే వ్యవసాయ విధానం ఏదీ అమలు చేయలేదు. ఒకసారి కరువు, మరోసారి వరదలు- ఇలా వరుసగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలేమీ చేపట్టలేదు. వ్యవసాయం ప్రధానంగా గల రాష్ట్రంలో వ్యవసాయానికి ప్రోత్సాహాన్నివ్వడానికి బదులు పరిశ్రమలను ఎక్కువగా స్థాపించారు. వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య సమతుల్యాన్ని సాధించే ప్రయత్నం ఏదీ చేయలేదు. దళారీ పెట్టుబడిదార్లకు సౌకర్యాలు సమకూర్చేందుకు భిలాయ్ స్టీలు ప్లాంటు, బాల్కో, ఎన్‌టిపిసి, ఎస్ఇసిఎల్, బైలాడిల్లా వంటి పరిశ్రమలు స్థాపించారు. ఇటీవలే దుర్గ్-రాజ్‌నాంద్‌గాం జిల్లాల సరిహద్దు మీదుగా ప్రవహించే జీవనదియైన శివనాథ్‌కు చెందిన ఒక పెద్ద పాయను ప్రభుత్వం ఒక పెద్ద ప్రైవేటు కంపెనీకి అమ్మివేసింది. ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా రాష్ట్రంలో నీటి సంక్షోభం తీవ్రరూపం దాలుస్తున్నది. రాష్ట్రంలో రాయపూర్ వంటి చోట్ల భూగర్భ నీటిమట్టం 2 మీటర్ల నుండి 4 మీటర్ల వరకు తగ్గిపోయింది.

మరోవైపు భూసంస్కరణల్ని కూడా అమలు చేయలేదు. దీనితో గౌంటియాల వద్దా, మాల్‌గుజార్ల వద్దా భూమి కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రంలో అందుబాట్లో ఉన్న కొద్దో గొప్పో నీటి సౌకర్యాల్ని వీళ్లే అనుభవిస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడే వాళ్లలో అత్యధికులు వ్యవసాయ కూలీలే. వీళ్లకు సంవత్సరం పొడుగూతా పనులుండవు. కరువు సమయంలోనైతే అస్సలుకే పనులు దొరకవు. దానితో వీళ్లు తప్పనిసరై ఉపాధి వేటలో ఇల్లొదిలి పోతుంటారు. ఛత్తీస్‌గఢ్‌లోని పేద ప్రజలు ఉపాధి వెతుకులాటలో వలస పోవడం అనేది బ్రిటిష్ వాళ్ల కాలంలోనే మొదలైంది. నీటి పారుదల సదుపాయాలపై పెద్ద ఎత్తున పన్నులు వసూలు చేసే బ్రిటిష్ విధానాల మూలంగా ప్రజలు వలస పోయేవాళ్లు. ఆ తర్వాత అధికార పగ్గాలు చేజిక్కించుకున్న నల్ల ప్రభువులు వ్యవసాయంపైనా, ప్రజల అభివృద్ధిపైనా ఎలాంటి శ్రద్ధా పెట్టలేదు. వీళ్ల ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగానే కరువుకాటకాలూ, వలసలూ చోటు చేసుకుంటున్నాయి. దీన్ని దోపిడీ పాలకవర్గాలు సృష్టించిన కరువు అనడంలో సందేహించాల్సిన పని లేదు.

## జలాశయాల్లోని నీళ్లు పెద్ద పరిశ్రమలకు - కరెంటు కోత రైతులకు !

జలాశయాల నుండీ, చెరువుల నుండీ పరిశ్రమలకు నీళ్లు సరఫరా చేస్తున్నారు. గంగ్రేల్ జలాశయంలోని నీళ్లను ముందుగా భిలాయ్ స్టీల్ ప్లాంటు కోసం రిజర్వు చేస్తారు. అదే విధంగా వివిధ జిల్లాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో గల పరిశ్రమలకు గ్రామాల్లోని చెరువుల నుండీ, కాల్వల నుండీ నీటిని సరఫరా చేస్తారు. అన్నదాత రైతుకేమో నీళ్లు లేవు. లాఖోలి నుండి బాలోద్ వరకూ రైతులు వీధుల్లోకి వచ్చింది ఈ నీటి కోసమే.

మరోవైపు, అదనపు కరెంటు ఉత్పత్తి చేస్తున్న తొలి రాష్ట్రంగా గొప్పలు పోయే జోగి ప్రభుత్వం పరిశ్రమలకు మాత్రం నిరాటంకంగా కరెంటు సరఫరా చేస్తున్నది. అది కూడా తక్కువ ధరకు. కానీ 11,50,000 గ్రామీణ వినియోగదార్లకేమో అది కరెంటు కోతలతో షాక్ ఇస్తున్నది. అప్రకటిత కరెంటు కోతలతోనూ, లో వోల్టేజీ సమస్యతోనూ రైతులు సతమతమవుతున్నారు. చాలాసార్లు రోజుల తరబడి కరెంటు ఉండనే ఉండదు. దీన్ని చక్కదిద్దడానికి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. కరెంటు సరఫరా అన్ని గ్రామాలకు జరగడం లేదు.

## పంటల భీమా పథకం వలసను ఆపలేదు !

కరువుకాటకాల వల్లా లేదా వరదల వల్లా నష్టపోయే పంటల కోసం ప్రభుత్వం పంటల భీమా పథకాన్ని చాలా ఆర్భాటంగా ప్రకటించింది. విత్తనాలు వేసిన 30 రోజుల లోపు రైతు తన పంటకు భీమా చేయించుకోవాలి. భీమా మొత్తంలో 2.5 శాతం ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. షెడ్యూల్డు కులాలా, తెగలా రైతులు మాత్రం 1.5 శాతం కట్టాల్సి ఉంటుంది. పంటల కోత సమయంలో 37 శాతంకన్నా తక్కువ పంట దిగుబడి అయినట్లు అంచనా వేస్తే రైతులు భీమా డబ్బు పొందడానికి అర్హులవుతారు. కరువు పీడిత రైతులకిది అద్భుతమైన పరిష్కారంగా చెప్పారు. కానీ వ్యవసాయ కూలీలకు దీనితో ఏ విధమైన లాభమూ ఉండదు. పేద రైతులకు లాభం ఉంటుందని చెప్పినప్పటికీ విత్తనాల కోసమే సావుకార్ల ముందు చేయి చాచే రైతులు ప్రీమియం డబ్బు ఎలా చెల్లించగలరో మనం ఊహించుకోవచ్చు. ధనిక రైతులకూ, గౌంటియాలకూ మాత్రమే ఈ పథకంతో లాభం జరుగుతుంది. అందుకే కూలీలు పొట్ట చేతబట్టుకొని వలస పోక తప్పడం లేదు.

గ్రామాల నుండి కూలీలు ఛత్తీస్‌గఢ్‌లోని పట్టణాలకూ, పారిశ్రామిక ప్రాంతాలకూ పనుల కోసం తరలిపోతుంటారు. కానీ అక్కడా వాళ్లకు పనులు దొరకడం లేదు. పట్టణాల పరిస్థితి గ్రామాలకన్నా అధ్వాన్నంగా ఉన్నది. 10-12 గంటలు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. 30-35 రూపాయల కూలీ దొరుకుతుంది. పనికి గ్యారంటీ ఉండదు. మురికివాడల్లో ప్రాణాంతకమైన పరిస్థితుల మధ్య జీవించాల్సి వస్తోంది. ముఖ్య విషయం ఏమిటంటే ఇక్కడ అందరికీ పనులు దొరకవు. మరోవైపు కార్మికులను పనుల్లోంచి తీసేసే ప్రక్రియ చాలా కాలంగానే సాగుతోంది. బిఎస్‌పిలో మొదట్లో 95,000 కార్మికులు పనిచేసే వారు. అలాంటిది ఈరోజున కేవలం 45,000 మంది కార్మికులు మాత్రమే ఉన్నారు. మరో రెండేళ్లలో ఈ సంఖ్యను 25,000కు తగ్గించే పథకం తయారైంది. అన్ని పరిశ్రమలదీ ఇదే దుస్థితి. అందుకే దూరతీరాలకు వలస పోయే ప్రక్రియ ఏ అడ్డూఆపూ లేకుండా సాగుతోంది.

## వలస : డబ్బులు సంపాదించే మోజు కాదు, తప్పనిసరి

కరువుకాటకాలను నివారించేందుకు ప్రభుత్వం వద్ద ఏ విధమైన పరిష్కారమూ లేదు. 'పనికి ఆహారం' పథకంతో లక్షలాది శ్రమజీవుల ఆకలి తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోంది. ఒకప్పుడు 'వరిధాన్యపు పాత్ర' (ధాన్ కా కటోరా) అని పిలిచే ఛత్తీస్‌గఢ్‌లో దాని భూమిపుత్రులు ఇప్పుడు గింజగింజకూ తండ్లాడుతున్నారు. చేతుల్లో 'చిప్ప' పట్టుకొని అటూ యిటూ తిరుగుతున్నారు. పొట్ట కూటి కోసం తమ పెద్దవాళ్లనూ, ఇల్లూవాకిలినీ, మడిచెక్కలనూ వదిలేసి దూరతీరాలకు వలస పోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది రైతులు వలస పోయారు. రాజ్‌నాంద్‌గాం, దుర్గ్, రాయపూర్, ధమ్తరీ, మహాసముంద్, బిలాస్‌పూర్, కవర్ధ జిల్లాల వ్యవసాయ కూలీలూ, పేద రైతులూ, బస్తర్ ఆదివాసులూ ముంబాయి, ఢిల్లీ, కోల్‌కాతా నగరాలకు తరలిపోయారు. తమ పిల్లాజెల్లలను సాకడం కోసం అమాయక ఛత్తీస్‌గఢీయులు అక్కడ

బానిస జీవితం గడుపుతున్నారు. లెక్కలేనన్ని దౌర్జన్యాలకు గురవుతున్నారు. 10-12 గంటలు రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేసినా వాళ్లకు చాలినంత కూలీ దొరకడం లేదు. మహిళా కూలీలను లైంగిక దోపిడీకి గురి చెయ్యడం ఒక సాధారణ విషయం. పురుషులకు తన్నులు, గుద్దులు మరింత సాధారణమైన విషయం. వలసను ఆపడం కోసమూ, వలస పోయేవాళ్లకు సహాయపడడం కోసమూ ప్రభుత్వం 'వలస విధానాన్ని' ప్రకటించాల్సి వచ్చింది. దీన్ని బట్టి సమస్య తీవ్రతను అంచనా వేయవచ్చు. వలస విధానంతో ఒనగూరే లాభాలు ఆఫీసుల్లో కాగితాల్లోనే ఉండిపోయాయి. కరువు పీడిత ప్రజల ఇక్కట్లను రూపుమాపడానికి అజిత్ జోగి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని) వినియోగించనున్నాడు.

## సమాచార విప్లవంతో నగం కడుపైనా నిండేనా ?

ప్రపంచ బ్యాంకుకు నమ్మకమైన దళారీ, ఐఎంఎఫ్‌కు నెంబర్ వన్ ఏజెంటూ, ఆంధ్ర ప్రజలకు నెంబర్ వన్ శత్రువూ అయిన చంద్రబాబు నాయుడి అడుగుజాడల్లో నడుస్తున్న అజిత్ జోగి రాష్ట్రంలోని కరువు పీడిత ప్రజలకు సమాచార విప్లవమనే పగటి కల చూపిస్తున్నాడు. భిలాయ్‌ను హైటెక్ సిటీగా మారుస్తానని ప్రకటించాడు. ఈ-గవర్నెన్స్‌తో కంప్యూటర్ ముఖ్యమంత్రినవ్వాలని అనుకుంటున్నాడు. దేశ విదేశాల్లోని పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలకు స్వాగతం పలుకుతున్నాడు. పట్టెడన్నం కోసం ఎన్నో అగచాట్లు పడుతున్న ప్రజలకు సమాచార విప్లవ మంత్రాన్ని ఉపదేశించే విఫల ప్రయత్నం చేస్తున్నాడు. ఇదే కాకుండా దేశంలోని దళారీ పెట్టుబడిదార్లా, బహుళజాతి కంపెనీలా 'మద్దతు'తో అజిత్ జోగి విదేశీ పర్యటనలు చేస్తున్నాడు – ఛత్తీస్‌గఢ్ రూపురేఖల్ని మార్చడం కోసం!

## విదేశీ పెట్టుబడి 'విధి'ని మార్చగలిగేనా ?

ఛత్తీస్‌గఢ్ అపారమైన ఖనిజ సంపదలకు పుట్టినిల్లు. సున్నపురాయి నుండి బొగ్గు, ఇనుము, బంగారం, వెండి, వజ్రాల వరకు ఇక్కడ దొరకని ఖనిజమే లేదంటే ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఇది అనేక జీవనదులకు నిలయం. పచ్చని అడవులతో విలసిల్లే ఈ నేలపై విలువైన టేకు, గుగ్గిలం తదితర వృక్ష సంపద అపారంగా ఉంది. ఎన్నో అటవీ ఉత్పత్తులు లభిస్తాయిక్కడ. రాష్ట్రం మొత్తం వైశాల్యంలో 40 శాతం వరకు అడవులు ఆవరించి ఉన్నాయి. సారవంతమైన భూములున్నాయి. అయినప్పటికీ ఇక్కడి ప్రజలు బతుకుదెరువు కోసం సకల సంపదలకు నిలయమైన ఈ నేలనొదిలి తరలిపోతున్నారు.

ఈ అపసవ్యమైన పరిస్థితిని మార్చడానికి ముఖ్యమంత్రి అజిత్ జోగి అమెరికాలో పర్యటించి వచ్చాడు! జర్మనీ, జపాన్ ప్రతినిధివర్గాలను కలుసుకున్నాడు. ప్రపంచమంతటా గల బహుళజాతి కంపెనీలను ఛత్తీస్‌గఢ్‌కు ఆహ్వానిస్తున్నాడు. ఇక్కడి ప్రకృతి సంపదలను విచ్చలవిడిగా దోచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాడు. లక్షలాది ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నానని డబ్బా వాయించుకుంటున్నాడు. బైలడిల్లా, బాల్కోలలో ఏం జరిగింది? బిఎస్‌పి అమ్మకం ప్రక్రియ ఏం తెలియజేస్తున్నది? వీటన్నిటితో స్పష్టమవుతున్న విషయం – విదేశీ పెట్టుబడితో గానీ, దళారీ పెట్టుబడితో గానీ పీడిత ప్రజలకు ఒనగూరే మేలేమీ ఉండదనేదే. ఎస్ఇజెడ్ (స్పెషల్ ఎకానమిక్ జోన్) పేరిట జోగి ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌ను బహుళజాతి కంపెనీల జాగీరుగా మార్చాలనుకుంటున్నాడు. ఈ స్థితిని భరించలేక చాలా మంది వలస పోతున్నారు. మరి కొంత మంది ప్రభుత్వంతో తలపడే ప్రయత్నం చేస్తున్నారు.

## బతుకుదెరువు కోనం వలస పోవడం కాదు, ఉద్యమించడం ఒక్కటే మార్గం !

ఛత్తీస్‌గఢ్ రైతులు బతుకుదెరువుకు మార్గం వెదుక్కోవడం అంత సులువైంది కాదు. ఎందుకంటే బతుకుదెరువు సమస్య పంటల సమస్యతో ముడివడి ఉంది. పంటల సమస్య నీటి సమస్యతో ముడివడి ఉంది. ఇది ఒక్క సంవత్సరం సమస్యో, రెండు సంవత్సరాల సమస్యో కాదు. ఇది ఎప్పుడూ ఉంటూ వస్తున్న సమస్య. నిజానికిది వర్గ సమస్య. పాలకవర్గాల దోపిడీ విధానాల సమస్య. నీటి కోసం లాఖోలి రైతులు లక్ష్మణరేఖను దాటి కొత్త బాటను చూపారు. ఇవ్వాళ మిగతా రైతులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. కరువు పీడితులైన ప్రజలకు ఆహార ధాన్యాల సమస్యే అసలు సమస్య. ఆహార గిడ్డంగులపై దాడులు చేసి ఈ ఉద్యమాన్ని మరో మెట్టు ముందుకు తీసుకు పోవల్సి ఉంది. దోపిడీ పాలకవర్గాల రాజ్యాధికారానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటమే అసలైన మార్గం. బస్తర్ ప్రజలు ఈ దారిలోనే నడుస్తూ తమ ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని స్థాపించుకునే దిశగా ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పీడిత ప్రజల ముందు కూడా ఆఖరు ప్రత్యామ్నాయంగా ఇదే మార్గం ఉంది. ❑

*నవంబర్ 2002*

*(..... 17వ పేజీ తరువాయి)*

సమస్యపైనా, సహకార పద్ధతుల సమస్యపైనా అనేక కార్యక్రమాలు తీసుకుంది. కొన్ని గ్రామాలలో డిఏకెఎంఎస్ ప్రజల్ని సమీకరించి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించింది. అది ప్రజల్లో తమ స్వంత శక్తిపై ఆధారపడి అభివృద్ధిని సాధించగలమన్న విశ్వాసాన్ని పెంచింది.

ప్రజల్లో గల మూఢ నమ్మకాల స్థానంలో శాస్త్రీయ అవగాహన పెంపొందేలా, సాంప్రదాయాల పేర పెళ్లి, చావు తదితర సందర్భాల్లో జరిగే దుబారా ఖర్చును తగ్గించేలా డిఏకెఎంఎస్ ప్రచార క్యాంపెయిన్‌లు నిర్వహించింది. గ్రామాలలో ప్రజా ఆరోగ్య కేంద్రాలు నడపడంలో కూడా డిఏకెఎంఎస్ పాత్ర ఎంతో వుంది.

విజయాలతో పాటుగా కొన్ని లోపాలు కూడా జరిగాయి. జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను అర్థం చేసుకుని వాటిపై కార్యక్రమాన్ని నిర్ణయించుకొని సమన్వయించి నడపడంలో లోపం వుంది. పోరాటాల్లో రైతాంగాన్ని విస్తృతంగా కదిలించడంలో లోపం జరుగుతున్నది. సంఘం నిబంధనావళికి అనుగుణంగా కమిటీల సమావేశాలు జరుపుకోవడం లేదు. గ్రామాల్లో ప్రజా పంచాయితీలను ఆయా గ్రామ డిఏకెఎంఎస్ యూనిట్లే నిర్వహించాల్సి ఉండగా రేంజ్ కమిటీ నాయకులే స్వయంగా నిర్వహించడం, వాళ్లలో తామే పెద్దవాళ్లం అన్న అహంభావం పెరగడం వంటి లోపాలున్నాయి. సర్వసభ్య సమావేశాల్ని నిర్వహించడంలో కూడా లోపం జరుగుతున్నది.

డిఏకెఎంఎస్ ఈ లోపాల గురించి గ్రామ, రేంజ్ కాన్ఫరెన్స్‌లలో చర్చించి అవసరమైన గుణపాఠాలు తీసుకుంది. ఈ కాన్ఫరెన్స్‌లలో డిఏకెఎంఎస్ సభ్యత్వాన్ని విస్తృతంగా పెంచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడంతో ఈ కాన్ఫరెన్స్‌లన్నీ జయప్రదంగా ముగిశాయి. ❑

# ప్రజా సంస్కృతిని కలుషితం చేస్తూ, సామ్రాజ్యవాద సంస్కృతికి తలుపులు బార్లా తెరుస్తున్న ప్రభుత్వ దివాళాకోరు పర్యాటక విధానాన్ని వ్యతిరేకించండి !

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వం పర్యాటక (టూరిజం) పరిశ్రమకు సంబంధించి అనేక ప్రకటనలు చేస్తూ వస్తున్నది. అది తన పర్యాటక విధానాన్ని ఇంకా ప్రకటించనప్పటికీ, ఛత్తీస్‌గఢ్‌లో, ప్రత్యేకించి అవిభాజిత బస్తర్‌లో పర్యాటక పరిశ్రమకు పెద్ద పీట వేయాలని నిర్ణయించుకున్న విషయం స్పష్టంగానే అర్థమవుతున్నది. ఇప్పటికే బస్తర్ పర్యాటక రంగానికి రాజధానిగా వెలుగొందుతున్నదంటే ఆశ్చర్యమేమీ లేదు. ఇక్కడి చిత్రకూట్ జలపాతం, కాంగేర్ ఘాటీ, తీరథ్‌గఢ్, కొటంసర్, భైరంగఢ్, బార్సూర్ వంటి ప్రదేశాలను పర్యాటకులకు ఆకర్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. విలాసవంతమైన హోటళ్లనూ, రిసార్టులనూ చాలా వేగంగా నిర్మిస్తున్నారు. టూరిస్టులకు సకల సౌకర్యాలను ఎంతో శ్రద్ధతో సమకూర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ వంటి సౌకర్యాలు ఏర్పరుస్తున్నారు. పర్యాటక రంగానికి బాగా ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా బస్తర్ అభివృద్ధి అవుతుందనీ, అనేక మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయనీ, ఎంతో డబ్బు సంపాదించవచ్చుననీ ప్రభుత్వం తన ప్రచార సాధనాల ద్వారా పెద్దగా ప్రచారం చేస్తున్నది. బస్తర్‌లోని చాలా మంది ప్రజలు ఇది నిజమే కాబోలునని నమ్మేంత బాగా ఈ ప్రచారం నడుస్తున్నది.

వలస పాలన నాటి నుండీ నేటి దాకా పాలకవర్గాలు అనుసరిస్తున్న దోపిడీ ఆర్థిక విధానాల కారణంగా దేశంలోని అతి పెద్ద ఆదివాసీ ప్రాంతాల్లో ఒకటైన బస్తర్ అన్ని రంగాల్లోనూ వెనుకబడిపోయి ఉంది. విలువైన ఖనిజ సంపదలకూ, తరగని అటవీ సంపదలకూ, మరెన్నో ప్రకృతి అందాలకూ నిలయమైన బస్తర్‌ను ఇప్పటి దాకా పాలకులంతా వీలైనంత దోచుకోవడం కోసమే ప్రయత్నించారు తప్ప దీని మౌలిక అభివృద్ధికి సంబంధించిన చర్యలేమీ చేపట్టలేదు. ప్రధానంగా వ్యవసాయంపైనా, ఒక మేరకు అటవీ ఉత్పత్తుల సేకరణపైనా ఆధారపడి బతికే ఇక్కడి మెజారిటీ ప్రజల జీవితాలను మెరుగుపర్చే ప్రయత్నాలు ఏమీ చేపట్టలేదు. ఇక్కడి మొత్తం సాగుభూముల్లో ఒక్క శాతానికే నీటి పారుదల సౌకర్యం ఉందంటే పాలకుల నిర్లక్ష్యం ఎంతగా ఉండిందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి అక్షరాస్యత శాతం దేశ సగటు కంటే చాలా తక్కువ. ప్రతి సంవత్సరం ఇక్కడ వందలాది మంది ప్రజలు అంటురోగాల కారణంగా చనిపోతున్నారు. ఇక్కడి మానవ వనరులనూ, ముడి పదార్థాలనూ వినియోగపెట్టుకోగల పరిశ్రమలను స్థాపించకపోవడంతో ఇక్కడి యువతరం నిరుద్యోగం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నది. ఇలాంటి మౌలిక సమస్యలెన్నో ప్రజల పాలిటి శాపాలుగా పరిణమిస్తుండగా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నది.

ఆకలి, నిరుద్యోగం, కరువు, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి సమస్యలతో బస్తర్ ప్రజలు సతమతమవుతూ ఉంటే ప్రభుత్వం మాత్రం ఇక్కడి అందమైన అడవులనూ, నేషనల్ పార్క్‌లనూ, జలపాతాలనూ, పురాతత్వ అవశేషాలనూ చూసి తరించండంటూ దేశదేశాల పర్యాటకులను ఆహ్వానిస్తున్నది. పత్రికల్లో, టీవీల్లో, ఇంటర్నెట్‌లో బస్తర్ అందాల గురించి రంగురంగుల ఫోటోలతో గొప్పగా ప్రచారం చేస్తున్నది. ప్రజలకు సంబంధించి ఇంతకన్నా అసంగతమైనదీ, అవమానకరమైనదీ మరొకటి లేదు. అసలు దీని వల్ల అభివృద్ధి జరుగుతుందన్న వాదనలో ఏమైనా నిజం ఉందా అని కూడా పరిశీలిద్దాం.

టూరిజం వంటి అనుత్పాదక రంగాలకు ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా ఏ దేశ ఆర్థికవ్యవస్థా నిజమైన అభివృద్ధిని సాధించలేదనేది చరిత్ర తేల్చిన సత్యం. 1970లలో మూడో ప్రపంచ దేశాల్లో, ప్రత్యేకించి ఆసియాలో టూరిజం అభివృద్ధి చెందుతున్న పరిశ్రమగా మారిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, యుఎస్‌ఎయిడ్ వంటి సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు దీన్ని అభివృద్ధి వ్యూహంగా బాగా ప్రోత్సహించాయి. 1960 నుండి 1979 మధ్య ఆగ్నేయాసియా దేశాల్లోకి వచ్చే పర్యాటకుల సంఖ్య 25 రెట్లు పెరిగింది. టూరిజం ద్వారా ఈ దేశాలకు వచ్చే ఆదాయం బాగా పెరిగింది. అయితే ఈ విధానం వల్ల ఈ దేశాలలో మహిళలు ప్రధానంగా ఎగుమతయ్యే వస్తువులుగా మారారు. ఒక రిపోర్టు ప్రకారం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 2-3 లక్షల మంది మహిళలు మసాజ్ పార్లర్లలోనూ, హోటళ్లలోనూ పనిచేసే వాళ్లుగా ఉంటూ సెక్స్ వ్యాపారంలో పని చేస్తున్నారు. మరో అంచనా ప్రకారం బ్యాంకాక్‌లోని 10 శాతం మహిళలు బతుకుదెరువుకై వేశ్యావృత్తిని చేపట్టారు. ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలో దాదాపు ఒక లక్ష మంది వేశ్యలుండొచ్చని ఒక అంచనా. ఇంకా ఇక్కడ సెక్స్ టూరిజం బాగా అభివృద్ధి చెందిన ఫలితంగా ఎయిడ్స్ కేసులు కూడా ప్రమాదకరమైన స్థాయికి చేరుకున్నాయి. మన దేశంలో కూడా గోవా వంటి రాష్ట్రాలలో పర్యాటక పరిశ్రమను బాగా పెంపొందింపజేసిన ఫలితంగా అది సెక్స్ టూరిజంగా ఎలా మారిందో మనం గమనించవచ్చు. ఎందరో మహిళలూ, పిల్లలూ గోవాలో పెద్ద ఎత్తున జరిగే సెక్స్ వ్యాపారానికి బలవుతున్నారు. కాబట్టి టూరిజం పరిశ్రమను పెంపొందిస్తే జరిగే 'అభివృద్ధి' ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. వీటన్నింటిని బట్టి రేపు బస్తర్ గనుక ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారితే జరుగబోయే పరిణామాలేమిటో ఊహించడం అంత కష్టం కాదు.

టూరిజం పరిశ్రమతో చొచ్చుకొచ్చే సామ్రాజ్యవాద సంస్కృతి స్థానిక ప్రజా సంస్కృతిని కబళించివేస్తుంది. ఇప్పటికే వ్యాపించి పోతున్న వస్తువినిమయ సంస్కృతి ప్రభావం మరింత దారుణంగా ఉంటుంది. దీని వల్ల మానవీయ విలువలు మృగ్యమైపోయి స్వార్థం, వంచన, మోసం వంటివి బాగా పెరిగిపోతాయి. శ్రమ సంస్కృతికి గౌరవం తగ్గిపోయి సోమరితనం, భిక్షాటనం వంటివి పెరిగిపోతాయి. ఇక్కడికొచ్చే టూరిస్టుల సెక్స్ కోరికల్ని తీర్చడానికి పేదరికంలో మగ్గుతున్న ఆదివాసీ మహిళలు వేశ్యావృత్తిలోకి ఈడ్వబడతారు. బస్తర్‌లో ఇప్పటికే (మూడు కేసులు జగదల్‌పూర్‌లో) వినవస్తున్న ఎయిడ్స్ కేసులు మరింతగా పెరిగిపోగలవు.

దండకారణ్యంలో భాగమైన బస్తర్ ప్రజలు గత రెండు దశాబ్దాలుగా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో పోరాడుతున్నారు. తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారు. తునికాకు రేట్లు పెంచాలనీ, ఇతర కూలీ రేట్లు పెంచాలనీ, అటవీ భూములకు పట్టాలివ్వాలనీ, ప్రజలను నిరాశ్రయుల్ని చేసే పరిశ్రమలు స్థాపించవద్దనీ, ఇలా అనేక పోరాటాలు చేశారు. ఇప్పుడు మరింతగా సంఘటితమైన విప్లవోద్యమం విముక్తి ప్రాంత లక్ష్యంతో పురోగమిస్తున్నది. పోలీసుల పాశవిక నిర్బంధకాండను ఎదిరించే క్రమంలో ఆవిర్భవించిన ప్రజా గెరిల్లా సైన్యం ప్రజల చేతిలో పదునైన ఆయుధంగా రూపొందింది. ఈ విప్లవోద్యమాన్ని ఎలాగైనా అణచివేయాలని పాలకవర్గాలు పెద్ద ఎత్తున ప్లాన్‌లు వేస్తున్నారు. దీనికోసం మిలిటరీపరంగా ఒకవైపు అన్ని ఏర్పాట్లు చేస్తూనే సంస్కరణల తతంగంతో కూడా ప్రజలను పక్కదార్లు పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. బస్తర్‌ను టూరిస్టుల స్వర్గంగా మార్చి ఇక్కడి ప్రజా సంస్కృతిని దెబ్బ తీయడం కూడా ఈ కుట్రలో భాగమే. ఇక్కడి ప్రజల పోరాటశక్తిని

నిర్వీర్య పరచడం, ప్రజా సంస్కృతిని కలుషితం చేయడం పాలకులకు ఒక తక్షణ అవసరంగా ముందుకొచ్చింది. అలాగే అపారమైన సహజ వనరులకు పుట్టినిల్లయిన బస్తర్‌ను సామ్రాజ్యవాదుల దోపిడీకి నెలవుగా మార్చడం కోసం కూడా దళారీ పాలకులు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. బహుళజాతి కంపెనీలు ఇక్కడి వనరులను చౌకగా, నిరాటంకంగా దోచుకోవాలంటే ప్రజలను సాంస్కృతికంగా దిగజార్చడం, వాళ్ల ఐకమత్యాన్ని విచ్ఛిన్నం చేయడం అవసరం. దీని కోసం సాగే కుట్రలో భాగంగానే పాలకులు బస్తర్‌లో పర్యాటక పరిశ్రమను ముందుకు తెస్తున్నారన్న విషయాన్ని గమనించాలి.

నిజానికి ప్రపంచంలో ఎవరైనా ఏ ప్రాంతానికైనా వెళ్లి అక్కడి ప్రకృతి అందాలను చూసి ఆనందించడంలో ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరమే లేదు. కానీ తీవ్రమైన అసమానతకూ, వివక్షకూ, దోపిడీ-దౌర్జన్యాలకూ, నిర్లక్ష్యానికీ గురైన ఒక ఆదివాసీ ప్రాంతంలోని 'అందాలను' మాత్రమే చూసి ఆనందించాలనుకోవడంలో అర్థం ఏమైనా ఉందా? ఒకవైపు వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోయి ప్రజలు ఆకలిచావుల అంచులకు చేరుకుంటూంటే, తాగడానికి మంచినీళ్లయినా లేక చెప్పనలవికాని ఇక్కట్లు పడుతుంటే చిత్రకూట్ జలపాతం హోరును చూసి ఆనందించాలనుకోవడం న్యాయమేనా? ఇక్కడి ఆదివాసీ స్త్రీపురుషులు పొద్దంతా ఎండలో అడవిలో మూలమూలనా కలెదిరిగి చెమటోడ్చి తెచ్చే తునికాకుకు న్యాయమైన రేటు ఇవ్వండని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నా పెడచెవిన పెడుతున్న ప్రభుత్వానికి అసలు ఈ అడవి అందాలను చూడమని పర్యాటకులను ఆహ్వానించే నైతిక హక్కుందా? ఈ అందమైన ప్రకృతికీ, అపారమైన ఖనిజసంపదలకూ, అటవీ సంపదలకు యజమానులై ఉండి కూడా తినడానికి తిండిలేక ఇక్కడి ప్రజలేమో పొట్టచేత పట్టుకొని ప్రతి ఏడూ దూరతీరాలకు వలసపోయి బతుకెళ్లదీస్తుంటే, ప్రభుత్వమేమో ఎక్కడెక్కడి నుండో పర్యాటకులను ఇక్కడికి ఆహ్వానిస్తూ వాళ్లకు సకల సౌకర్యాలను కల్పిస్తోంది. పర్యాటక కేంద్రాల అభివృద్ధి పట్లా, పర్యాటకులకు సౌకర్యాల పట్లా చూపిస్తున్న శ్రద్ధలో వెయ్యోవంతైనా ఇక్కడి ప్రజల బాగోగుల పట్ల చూపెడుతున్నదా? స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 55 ఏళ్లలో కూడూ, బట్టా, గూడూ వంటి ప్రజల కనీస అవసరాలైనా తీరలేదంటే పాలకుల నిర్లక్ష్యమే కారణం కాదా? ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్నప్పుడు, బస్తర్‌లో ప్రకృతి అందాలను చూసి ఆనందించడం కోసమే అయితే ఇక్కడికి రావద్దని మేం పర్యాటకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే పర్యాటక రంగానికి ఉపయోగపడవద్దని మేం ట్రాన్స్‌పోర్టు పరిశ్రమ వాళ్లకూ, హోటల్ తదితర వ్యాపారాలు చేసే వారికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

### ప్రజాస్వామికవాదులారా ! ఆదివాసీ విద్యార్థి–మేధావులారా !

పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తూ ప్రజల మౌలిక సమస్యల పట్ల ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న ప్రభుత్వ దివాళాకోరు విధానాలను అర్థం చేసుకోవల్సిందిగా మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ పరిశ్రమను అభివృద్ధి చేసినంత మాత్రాన ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావనీ, పైగా అనేక అనర్థాలు రాగల ప్రమాదాన్ని గుర్తించాల్సిందిగా కోరుతున్నాం. ఆదివాసీ సంస్కృతిని దిగజార్చి సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యాపింపజేయడానికి జరుగుతున్న కుట్రను అర్థం చేసుకొని దీన్ని ఓడించేందుకు సమాయత్తం కావాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. విశాల ఐక్యవేదికను నిర్మించి పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్నివ్వడాన్ని నిలిపివేయాలనీ, ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ ఉద్యమించాల్సిందిగా మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

**సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]**

**స్పెషల్ జోనల్ కమిటీ**

*డిసెంబర్ 2002* **దండకారణ్యం**

*(.....41వ పేజీ తరువాయి)*

## మేధావులను కుదిపివేసిన సిపిఎం నిర్బంధ చర్యలు

పాతికేళ్లుగా మేధావుల్లో ఒక సెక్షన్ సిపిఎం ప్రజా వ్యతిరేక పాలనతో సర్దుకుపోతూ వచ్చారు. కానీ జూలై-ఆగస్టు పరిణామాలతో మేధావులంతా అరెస్టులనూ, చిత్రహింసలనూ ముక్త కంఠంతో ఖండిస్తూ సిపిఎంను ప్రశ్నించడం, విమర్శించడం మొదలుపెట్టారు.

జూలై 5న పోలీసులు కోలకాతా నగరంలోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాలలోనూ 75 మంది మేధావుల ఇళ్లపై అర్ధరాత్రి దాడులు చేసారు. రాజ్‌బజార్ సైన్స్ కాలేజీ ప్రొఫెసర్ కౌశిక్ గంగూలీ మరియు సెంట్రల్ ఎక్సైజ్ అధికారి అభిజిత్ సిన్హాలను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు. పోలీసుల క్రూరత్వానికి ఈ అరెస్టులు అద్దం పడతాయి. అరెస్టైన పార్టీ నాయకుల డైరీల్లో వీళ్ల ఫోన్ నెంబర్లున్నయాన్న ఆరోపణతో ఈ దాడులకూ, అరెస్టులకూ పాల్పడ్డారు. అభిజిత్‌ను క్రూరంగా హింసించారు. ఆయన్ను విడిపించడానికి ఆయన భార్య (ఈమె తండ్రి సిఐడి విభాగంలో డిఎస్‌పిగా ఉన్నారు.) చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కానీ ఆయన జూలై 7న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రొఫెసర్ గంగూలీని వారంటు లేకుండానే పట్టుకుపోయి కొట్టి హింసించారు. ఆయన శరీరంపై సిగరెట్‌తో కాల్చిన గుర్తులున్నాయని పియుసిఎల్ ప్రకటించింది. కామ్రేడ్ కౌశిక్ గంగూలీ, టింకూ ఘోష్, పరషార్ భట్టాచార్యలు తమను పోలీసులు చిత్రహింసలకు గురిచేసినట్లుగా మిడ్నాపూర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఇవన్నీ చూసిన కోర్టు పోలీసు కస్టడీ పొడిగింపును తిరస్కరించి కోల్‌కాతాలో ఫోరెన్సిక్ వైద్య పరీక్షలకు ఆదేశించింది. ఇంత జరిగినా తప్పుని అంగీకరించక గంగూలీపై మరిన్ని దొంగ కేసులు బనాయించారు. వీటన్నింటితో విద్యార్థి, ఉపాధ్యాయ వర్గాలలో సిపిఎం బాగా ఒంటరిదై పోయింది. బాగా వ్యతిరేకతకు గురైంది. కోల్‌కాతాలో 15కు పైగా కాలేజీలా, విశ్వవిద్యాలయాలా అకడమిక్ స్టాఫ్ యూనియన్లు జూలై 2వ వారం నుండి ఆందోళనకు దిగాయి. విద్యార్థిలోకమంతా ప్రభుత్వ పాలసీలను ఖండించింది. పశ్చిమ బెంగాల్ కాలేజీ అండ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్‌లో సిపిఎం ఒంటరిదై సమావేశం నుండి బయటకు పోవలసి వచ్చింది.

### ముగింపు

బెంగాల్‌లో సిపిఎం ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధం ఆ రాష్ట్ర పీడిత ప్రజలకు '70 దశకం నాటి రోజుల్ని స్ఫురణకు తెచ్చింది. దాని నిర్బంధ చర్యల పట్ల అన్ని సెక్షన్ల ప్రజలలోనూ అసహ్యత వ్యక్తమవుతున్నది. విద్యార్థి, మేధావులకు చెందిన అనేక సంఘాలు రాజ్యహింసను ఖండించాయి. పీపుల్స్‌వార్ నాయకత్వాన సాగుతున్న న్యాయమైన ప్రజా పోరాటాలకు తమ మద్దతును ప్రకటించాయి. విప్లవోద్యమంపై సిపిఎం ఉక్కుపాదం మోపి తనకు తానుగా ప్రజల నుండి ఒంటరైపోతున్నది. ప్రజలు దాని ప్రజా వ్యతిరేక, విప్లవ ప్రతీఘాతుక స్వభావాన్ని మున్నెన్నటికన్నా బాగా అర్థం చేసుకుంటున్నారు. '70 దశకంలో అమలైన నిర్బంధం మూలంగా అప్పటి ఉద్యమం తాత్కాలిక ఓటమికి గురైంది. కానీ ఇప్పుడు గతం నుండి నేర్చుకున్న గుణపాఠాలతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోకి విస్తరించి, వ్యూహాత్మక ప్రాంతాలను విముక్తి ప్రాంతాలుగా మల్చే లక్ష్యంతో, దేశంలోనే మొట్టమొదటి ప్రజల సైన్యమైన పిజిఏను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్న ప్రజాయుద్ధాన్ని అంతం చేయాలని సిపిఎం కంటున్న కలలు కల్లలు కాకతప్పదు. గొప్ప విప్లవ చరిత్ర గల బెంగాలీ ప్రజలు సిపిఎంకు తగిన విధంగా బుద్ధి చెబుతారనీ, బెంగాల్ విప్లవోద్యమం ఈ నిర్బంధాన్ని ఓడించి పురోగమిస్తుందనీ ఆశిద్దాం. ❑

**సినిమా సమీక్ష**

# ‘లాల్ సలాం’లో ఎరుపెంత?

నక్సలైట్ల ఇతివృత్తంతో తీసిన ‘లాల్ సలాం’ అనే హిందీ సినిమా మార్చి 15, 200న విడుదలై ఎర్ర (విప్లవ) సినిమాగా ప్రచారం అవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీడియోల ద్వారా దాన్ని విస్తృతంగా ప్రదర్శిస్తున్నారు. గడ్చిరోలి విప్లవోద్యమాన్ని ఇతివృత్తంగా తీసుకొన్న విప్లవ సినిమాగా ప్రచారం జరుగుతున్నందున ఈ సినిమాలోని విప్లవ తత్వమెంత? ఇందులోని మంచిచెడులు ఏమిటీ? ఇది ప్రజల చైతన్యాన్ని పెంచేందుకు ఏ మేరకు ఉపయోగపడుతుందనే విషయాల్ని సమీక్షించాల్సిన అవసరం వుంది.

వర్గాలుగా విడిపోయి వున్న ఈ దోపిడీ సమాజంలో అణచివేతకు, దోపిడీకి గురవుతున్న మెజారిటీ ప్రజలకు వాళ్ల సమస్యల్ని పరిష్కరించుకునేలా వారి చైతన్యాన్ని పెంచడానికి ఏ మేరకు ఉపయోగపడినా దాన్ని అభివృద్ధికరమైన సినిమాగానే భావించవచ్చు. దానికి భిన్నంగా ప్రజల చైతన్యాన్ని తప్పుదారి పట్టించేలా వున్నా, ఈ దోపిడీ వ్యవస్థపై భ్రమలు పెంచేలా వున్నా, ప్రజల సమస్యల పరిష్కారానికి సరైన మార్గం ఎంచుకోకుండా తప్పుడు మార్గం వైపు మళ్లించే ప్రయత్నం చేసినా అది అభివృద్ధి నిరోధకమైనదే. ప్రజావ్యతిరేకమైనదే.

పై దృష్టితోనే మనం ఏ సినిమానైనా అంచనా వేయడం సరిగ్గా వుంటుంది. మరీ ముఖ్యంగా విప్లవ సినిమాలుగా ప్రచారం జరుగుతున్న సినిమాలయితే కనీసంగా కొంత మేరకైనా విప్లవకరంగా వుండాలి. లేకుంటే దాని పేరుకు అర్థమే వుండదు. కాబట్టి ఈ లాల్ సలాం సినిమా ఎలా వుందో పరిశీలిద్దాం.

నగ్జల్బరీ మార్గాన్ని ఎత్తిపట్టుకుని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడంలో భాగంగా వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉద్యమ నిర్మాణంపై కేంద్రీకరించాలనే కర్తవ్యంతో 1980లో పీపుల్స్‌వార్ పార్టీ మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ప్రవేశించింది. ఆనాటికి ఇక్కడి ఆదివాసులపై ఫారెస్టు అధికారుల, తునికాకు, వెదురు టేకేదార్ల, షావుకార్ల దోపిడీ చాలా తీవ్రంగా వుండేది. వాళ్లకు మద్దతుగానే ప్రభుత్వం, పోలీసులు నిలబడేవారు. అలాంటి స్థితిలో విప్లవోద్యమం ఆదివాసుల్లో చైతన్యాన్ని కలిగించి దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితపరిచి అనేక పోరాటాలు చేయించింది. ఈ క్రమంలో సంఘటితమై ఈ వ్యవస్థను మార్చకుండా మన బతుకుల్లో మౌలికమైన మార్పు రాదని గ్రహించిన ఆదివాసీలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేయాలనే లక్ష్యంతో పురోగమిస్తున్నారు. గడ్చిరోలి జిల్లా దండకారణ్యంలో భాగం.

ఈ నేపథ్యంలో గడ్చిరోలి జిల్లా పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని కథా వస్తువుగా తీసుకొని ఈ సినిమా నిర్మించారు. చంద్రపూర్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్టు ద్వాదశివార్ రచించిన నవలనూ ఆధారం చేసుకుని గగన్‌విహారా బొరేట్ అనే డైరెక్టర్ ఈ సినిమా తీశాడు. ముందుగా సినిమాలోని సారాంశాన్ని సంక్షిప్తంగా చెప్పుకుని ఆ తర్వాత అందులోని మంచిచెడుల్ని విశ్లేషిద్దాం.

కాందోడి గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని సినిమా నడుస్తుంది. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆ గ్రామ పట్వారీ, ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న డ్యాం మూలంగా మీ భూములన్నీ మునిగిపోతాయి, కాబట్టి మీ భూములకు నష్టం జరగొద్దనుకుంటే ఇంటికిన్ని డబ్బులు ఇవ్వండి. నేను మీ భూముల్ని కాపాడుతానని మాయమాటలు చెప్పి డబ్బూ ధాన్యం వసూలు చేస్తాడు. వెదురు టేకేదార్లు, ఫారెస్టు వాళ్లు పోలీసుల మద్దతుతో కూలీలపై జులుం చేస్తూ వెదురు నరికించుకుంటారు. కూలీ డబ్బులడిగితే విపరీతంగా కొడతారు. ఆదివాసీ మహిళల్ని బెదిరించి లొంగదీసుకోవడం మొదలగు పద్ధతుల్లో దోపిడీ దౌర్జన్యాలు కొనసాగిస్తారు.

ఈ గ్రామానికి చెందిన ఒక ఆదివాసీ యువకుడు కన్నా మడావి నాగ్‌పూర్‌లో ఎమ్‌బిబిఎస్ చదువుతుంటాడు. అతనికి ప్రభుత్వం పట్ల విశ్వాసం వుంటుంది. దేశంలో జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలు, అవినీతి ఇవి ఏవీ అతని దృష్టికి పెద్ద సమస్యలుగా కనిపించవు. మహా అయితే ఇలాంటి చిన్నచిన్న సమస్యల్ని చట్టబద్ధంగా అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చు అనే అవగాహన కల్గి వుంటాడు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసమని తుపాకులు పట్టడం గానీ సాయుధపోరాటం చేయడం గానీ దేశద్రోహం అంటాడు. బయట దేశాలతో యుద్ధం వస్తే తుపాకులు పట్టాలి గానీ, దేశం లోపలి సమస్యల పరిష్కారానికై పోరాడటం అతని దృష్టిలో దేశద్రోహం. పిడికెడు మంది నక్సలైట్లు ఆయుధాలు పట్టుకుని మీరేం సాధిస్తారు? ప్రభుత్వం దగ్గర మీ కంటే చాలా బలమైన ఆయుధాలున్నాయి. మీరు ఎలాగూ గెలవరు. పైగా అనవసర హింస ద్వారా అమాయక ప్రజలు బలవుతారు అని నక్సలైటు నాయకునితో వాదిస్తాడు. స్థూలంగా డాక్టర్ కన్నా మడావిది గాంధేయ మార్గం.

రాజయ్య అనే కమాండర్ నాయకత్వంలో ఒక దళం ఈ ప్రాంతంలోకి వచ్చి దోపిడీకి, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభిస్తుంది. శాంతియుతంగా, చర్చల ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాదు ప్రతి సమస్యకు తుపాకియే జవాబు. మా ఆత్మ విశ్వాసం అంతా ఈ తుపాకీలోనే వుందని రాజయ్య చెబుతుంటాడు. ఎక్కడ అన్యాయం జరుగుతే అక్కడ రాజయ్య దళం ప్రత్యక్షమవుతుంది. ఆ అన్యాయానికి కారకుల్ని అక్కడికక్కడే చీల్చి చెండాడి కాల్చి చంపడం ద్వారా ఆ సమస్యను పరిష్కరిస్తుంటాడు రాజయ్య.

దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేయడం గానీ, సంఘటితం చేయడం గానీ, ప్రజల భాగస్వామ్యంతో పోరాటాన్ని నిర్వహించడం గానీ మచ్చుకు కూడా కానరాదు. రాజయ్య దళంలోని సభ్యులు కూడా కేవలం అనుచరులు మాత్రమే. అంతా రాజయ్య ఏకఛత్రాధిపత్యమే నడుస్తుంది.

ఇక ప్రజావ్యతిరేకుల్ని శిక్షించడంలో ప్రజల పాత్ర ఏమీ లేకపోగా వ్యక్తిగత హీరోయిజంతో బందిపోటు దొంగలకంటే పాశవికంగా హింసించి చంపడం వుంటుంది. మొత్తంగా చూస్తే నక్సలైట్లుగా చెప్పుకుంటూ విప్లవ కార్యక్రమాలు చేస్తున్నట్లుగా చూపించినవేవీ కూడా నిజానికి నక్సలైటు పార్టీలు చేస్తున్న పనులు కానే కావు. ఇందులో చూపించిందంతా వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి ఒక దగ్గర పోగయిన సాయుధ ముఠా చేసే హింసాత్మక చర్యలే.

అదే కాందోడి గ్రామంలో గిస్సు అనే ఆదివాసీ యువకుడూ, రూపి అనే యువతీ వుంటారు. రూపి కన్నా మడావిని ప్రేమిస్తుంది. చదువు పూర్తయ్యాక పెండ్లి చేసుకుందామని కన్నా నాగ్‌పూర్ వెళ్లిపోతాడు. ఈ లోగా వెదురు పని చేసిన చోట డబ్బులు అడిగినందుకు గిస్సు ఫారెస్టు అధికారుల చేతుల్లో తీవ్రంగా దెబ్బలు తిని చావు బతుకుల్లో పారిపోయి వచ్చి రాజయ్య దళంలో కలుస్తాడు.

మరికొద్ది రోజులకు స్థానిక ఎస్ఐ రూపిని మోసం చేసి అత్యాచారం చేయగా ఆ తర్వాత రూపి కూడా రాజయ్య దళంలో చేరుతుంది. తలవెంట్రుకలు కట్ చేసుకుని గెరిల్లా చంద్రక్కగా మారుతుంది. కూలి డబ్బులు అడిగినందుకే గిస్సును చితగ్గొట్టిన ఫారెస్టు రేంజర్‌ను ఒకరోజు రాజయ్య దళం పట్టుకుని విపరీతంగా కొడతారు. గిస్సును కొట్టినప్పుడు రేంజర్ గిస్సు నోట్లో మూత్రం పోసి అవమాన పర్చినట్లుగానే ఇక్కడ కూడా గిస్సుతో రేంజర్ నోట్లో మూత్రం పోయించి గిస్సు చేతనే కాల్చి చంపిస్తారు. ఆ తర్వాత రూపిపై అత్యాచారం చేసిన ఎస్ఐ ఒంటరిగా జీబులో పోతుండగా దాడి చేసి తీవ్రంగా హింసించి రూపి చేతనే కాల్చి చంపిస్తారు. ఈ ఘటన తర్వాత రాజయ్య రూపితో “ఇప్పుడు నీ వ్యక్తిగత ప్రతీకారం తీరింది. కాబట్టి నీకు వుండాలనిపిస్తే దళంలో వుండొచ్చు లేదా ఇంటికెళ్లొచ్చు, నీ ఇష్టం ఆలోచించుకో” అంటాడు. నక్సలైట్లు తమ దళాల్లోకి వ్యక్తిగత ప్రతీకారంతో రగిలి పోయే వాళ్లను తీసుకుంటారనీ, వాళ్ల

వ్యక్తిగత ప్రతీకారాలు తీర్చడంలో సహాయపడతారనీ చూపిస్తారు. ఇది విప్లవకారుల లక్ష్యాన్ని తప్పుగా చిత్రించి వాళ్లు చేసే చర్యలన్నీ మతిలేని హింసాత్మక చర్యలుగా చెప్పడమే.

ఇక ముగింపులో రూపి కోసం వెతుకుతూ తిరుగుతున్న కన్నా మడావికి అడవిలో ఒకరోజు రూపి కలుస్తుంది. ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకుంటారు. "నువ్వెందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నవ్? ఇప్పటికైనా బైటికి రా. నేను చట్టంతో పోరాడుతా. నువ్వు తోడువుంటే ఆదివాసీ సమాజం కోసం శాంతియుతంగా పోరాడుతాను." అంటాడు కన్నా.

అప్పుడు రూపి తాను పోలీసు అధికారి అత్యాచారానికి గురైన విషయాన్ని చెప్పి తప్పని సరై తుపాకీ పట్టుకున్నానంటుంది. తనను పాత రూపిగా ఎవరూ చూడగూడదని భావించి వెంట్రుకలు కత్తిరించుకొని, తుపాకీ ధరించి చంద్రక్కగా మారానంటుంది. నిజానికి రూపి విప్లవాశయంతో కంటే కూడా తనకు వ్యక్తిగతంగా జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకోవడానికీ, అలాగే అత్యాచారానికి గురైన మహిళను సమాజంలో చిన్నచూపు చూస్తారనే ఉద్దేశ్యంతో రాజయ్య దళంలో చేరుతుంది. అంటే విప్లవకారులు తమ వ్యక్తిగత సమస్యల కారణంగానే ఉద్యమంలోకి వస్తారనీ, వాళ్ల వ్యక్తిగత ప్రతీకారాలు తీరగానే అవసరమనుకుంటే వెళ్లిపోవడం కూడా ఉంటుందనీ అపోహ కలిగేలా ఈ సినిమాను చిత్రీకరించారు. చివరన మన గమ్యాలొక్కటే అయినా దారులు వేరని ఎవరి దారిన వారు వెళ్లిపోవడంతో సినిమా ఐపోతుంది.

ఈ సినిమాలోని మరో రెండు విషయాలను కూడా పేర్కొనడం అవసరం. ఒక ఆదివాసీ యువతిపై కన్నేసిన కామాంధుడైన పోలీసు అధికారి ఆదివాసుల నమ్మకాల్నీ, అమాయకత్వాన్నీ ఆసరా చేసుకొని బ్లాక్‌మెయిల్ చేయగా, స్వయంగా ఆ యువతి భర్తే ఆమెను వాడి దగ్గరికి పంపినట్టుగా చూపిస్తారు. ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే ఆ యువతి ఎస్.ఐ.కి లొంగిపోయినట్టుగా చూపుతారు. నిజానికి ఇది ఆదివాసీ మహిళల ఆత్మగౌరవాన్ని ఘోరంగా కించపర్చడమే. ఎందుకంటే గడ్చిరోలి ఉద్యమ చరిత్రలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ ప్రతి సందర్భంలోనూ మహిళలు చివరి దాకా ప్రతిఘటించిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయి. సినిమాలో మాత్రం ఎలాంటి వ్యతిరేకతా ప్రదర్శించకుండానే ఆ యువతి పోలీసు అధికారికి లొంగిపోయినట్లుగా చూపారు. అలాగే ఈ సినిమా ప్రారంభంలో ఆదివాసీ సంస్కృతితో ఎలాంటి పొంతనా లేని విధంగా స్త్రీపురుషులు కలిసి చేసే అసభ్యమైన గ్రూపు డాన్సును చూపుతారు. ఈ డాన్సులో మహిళలను అసభ్యంగా, అశ్లీలంగా చూపెడతారు. ఇది కూడా ఆదివాసీ ప్రజల సంస్కృతిని ఘోరంగా అవమానించడమే.

మరో ఘటనలో కన్నా మడావి కాందోడి గ్రామంలో హాస్పిటల్ పెట్టిన తర్వాత ప్రజల్లో డాక్టరుగా మంచి పేరు సంపాదిస్తున్నాడనీ, ఆయన పలుకుబడి ఇంకా పెరిగితే మనకు ప్రమాదం ఏర్పడవచ్చుననీ, దీని గురించి ఆలోచించాలనీ రాజయ్య దళంలో చర్చ జరుగుతుంది. అంటే ఆదివాసీలు చదువుకోవడం గానీ, డాక్టర్ అయ్యి సమాజానికి సేవ జేయడం గానీ నక్సలైట్లకు ఇష్టం ఉండదు అనే విధంగా చూపెడతారు. కానీ ఇది పూర్తిగా అవాస్తవం.

ఈ సినిమా మొత్తంలో వాస్తవికతకు కాస్త దగ్గరగా ఏదైనా పాత్ర ఉందంటే అది గోంగ్లూ అనే ఆదివాసీ పోలీసు కానిస్టేబుల్‌దే. ఒక ఆదివాసీ అయి ఉండి కూడా పోలీసుల్లో చేరిన గోంగ్లూ అధికారుల చేతుల్లో అనేక అవమానాలకు గురవుతాడు. దీనితో అతను లోలోనే పోలీసు వ్యవస్థపై ద్వేషంతో రగిలిపోతుంటాడు. రూపిపై అత్యాచారానికి పాల్పడ్డ దేశ్‌పాండే అనే ఎస్సైని అంతమొందించడంలో నక్సలైట్లకు సహకరిస్తాడు. నిజానికిప్పుడు గడ్చిరోలి జిల్లాలో చాలా మంది ఆదివాసీ పోలీసుల పరిస్థితి గోంగ్లూ పరిస్థితిలాగే ఉంది. మానవత్వం, ఆత్మాభిమానం గల వ్యక్తిగా గోంగ్లూను చిత్రించిన తీరు బాగుంది. ఇదొక్కటి తప్పితే ఈ సినిమా మొత్తంలో వాస్తవికంగా చిత్రించిన పాత్రలు లేవనే చెప్పొచ్చు.

మొత్తంగా సినిమా సారాంశాన్ని పరిశీలించినట్లయితే, ఆదివాసులపై పట్వారీల లంచగొండితనం, వెదురు టేకేదార్ల, ఫారెస్టు అధికార్ల దోపిడీదౌర్జన్యాలనూ ఒక మేరకు వాస్తవికంగా చూపినప్పటికీ మిగతా అంతా కూడా విప్లవోద్యమం పట్ల ప్రేక్షకులల్లో తప్పుడు అభిప్రాయాలు కలిగించడమే ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఈ సినిమాలో తమపై జరుగుతున్న ఫారెస్ట్ టేకేదార్ల జులుంను చూపించడం, దళం అలాంటి ప్రజా వ్యతిరేకుల్ని తన్ని చంపడం సంతోషం కలిగిస్తే కలిగించవచ్చు. ఎందుకంటే తాము వాళ్ల దౌర్జన్యాలకు బలై పోతున్నందువల్ల వాళ్లను ఎంతగా హింసించి చంపితే అంతగా తగిన శాస్తే జరిగిందన్న అభిప్రాయం సహజంగా ఉంటుంది. అయితే విప్లవోద్యమ లక్ష్యాలను గానీ, విప్లవ కార్యాచరణను గానీ అర్థం చేసుకోవడానికి ఈ సినిమా ఏ మాత్రం తోడ్పడక పోగా, అంతిమంగా అనేక అపోహలు కలిగించడానికే ఉపయోగపడుతుంది. ఇంకా ఉద్యమ ప్రాంతాలకు బైట ఉండే ప్రజానీకంలో, ముఖ్యంగా పట్టణ మధ్య తరగతిలోనూ, విద్యార్థి మేధావుల్లోనూ విప్లవోద్యమంపైనా, విప్లవకారులపైనా నెగిటివ్ అభిప్రాయాల్నే కలిగిస్తుంది ఈ సినిమా.

దోపిడీ వర్గాలు అమలు చేస్తున్న ఘోరమైన హింసా, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనివార్యమైన స్థితిలోనే విప్లవకారులు హింసకు పాల్పడతారు. అంటే హింసను అంతమొందించేందుకు మాత్రమే వాళ్లు హింసామార్గాన్ని చేపడతారు. నిజానికి మానవత్వం పట్లా, మానవజాతి పట్లా ఎనలేని ప్రేమాభిమానాలు కలిగివున్నందుకే మానవులందరి విముక్తి కోసం విప్లవకారులు ఆయుధాలు పట్టి పోరాడుతారు. అంటే హింస చేయడం వాళ్లకు ఒక అనివార్యతే తప్ప ఆదర్శం ఎంత మాత్రం కాదు. అయితే సినిమాలో మాత్రం 'నక్సలైట్లు' పాల్పడే హింసనూ, తీర్చుకునే ప్రతీకారాలను చూస్తే జుగుప్స కలుగుతుంది. వాళ్ల అవతారాలనూ, చర్యలనూ చూస్తే శాడిస్టుల్లాగే కనిపిస్తారు. గీసు రేంజర్ నోట్లో ఉచ్చబోసి ఆ తర్వాత వాడిని చంపడంగానీ, రూపి ఇన్‌స్పెక్టర్‌పై గుళ్ల వర్షం కురిపించడం గానీ, గార్డును తలలో తుపాకీ పెట్టి కాల్చడంగానీ అన్నీ కూడా శాడిస్టు పద్ధతుల్లో అమలుచేసే హింసాత్మక చర్యలనే చూపుతారు. ఇది నిజానికి విప్లవకారులను ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడానికే ఉపయోగపడుతుంది. అంటే పైకి ఎర్రగా కనిపించే ఈ సినిమా సారం అంతా నలుపేనన్నమాట.

అసలు ఈ సినిమాలోని ప్రధాన నక్సలైటు పాత్ర అయిన రాజయ్యను చూడగానే ఎవరికైనా బందిపోటు వీరప్పనే గుర్తుకొస్తాడు. వ్యక్తిగత హీరోయిజం, ప్రజలతో సంబంధం లేని హింసాత్మక చర్యలు, పెత్తందారీ పద్ధతుల్లో ఆజ్ఞలు జారీ చేసే ప్రవర్తన – వీటన్నింటినీ చూస్తే, నక్సలైట్లు వ్యక్తిగత హింసావాదులనీ, వాళ్ల వెనుక ప్రజలు లేరనీ, వాళ్ల చర్యలన్నీ కొద్ది మంది వ్యక్తులు చేసే టెర్రరిస్టు చర్యలేననీ పాలకవర్గాలు చేస్తున్న ప్రచారమంతా నిజమేననే తప్పుడు అభిప్రాయాలు ప్రేక్షకుల్లో కల్గతాయి.

ఎర్ర సినిమాగా ముద్రేసుకున్న ఈ సినిమాలో విప్లవకరమైనది ఏమీ లేకపోగా సారాంశంలో ఇది విప్లవ వ్యతిరేక సినిమానే. దేశవ్యాప్తంగా పెంపొందుతున్న విప్లవోద్యమం ప్రజల్లో బలమైన ప్రభావాన్ని కలుగజేస్తున్న నేపథ్యంలో ప్రజల ఆకాంక్షల్నీ, విప్లవం పట్ల అభిమానాన్నీ సొమ్ము చేసుకోవడానికే నక్సలైట్ ఇతివృత్తాన్ని వస్తువుగా తీసుకున్నారు. కేవలం వ్యాపార దృష్టే కాకుండా విప్లవోద్యమాన్ని ప్రజలలో అభాసుపాలు చేయాలనే విప్లవ వ్యతిరేక దృష్టి కూడా ఈ సినిమా వెనుక ఉంది. ఇలాంటి సినిమాల బండారాన్ని బహిర్గతం చేస్తూ ప్రజల్ని జాగరూకుల్ని చేయడం విప్లవాభిమానులందరి కర్తవ్యం. ❑


*వెలువడింది !*

కామ్రేడ్ పసుల రాంరెడ్డి స్మృతిలో...

**ప్రత్యూష గానం**

(వెల : 5 రూపాయలు)

**ప్రభాత్ ప్రచురణలు**

# తూర్పు తిమోర్‌కు స్వా(హా)తంత్ర్యం !

మే 20, 2002న ప్రపంచ రాజకీయ పటంపైకి తూర్పు తిమోర్ ఒక కొత్త దేశంగా వచ్చి చేరింది. ఈ దేశం ఇలా ప్రపంచ రంగస్థలం మీదకు రావడం రెండో సారి. నాలుగున్నర శతాబ్దాల పోర్చుగీసు ఆధిపత్యం తర్వాత, నవంబర్ 28, 1975న మొదటిసారి దిలీ రాజధానిగా తూర్పు తిమోర్ ప్రజాస్వామ్య రిపబ్లిక్ అవతరించింది. గ్జేవియర్ డో అమరాల్ దాని అధ్యక్షుడిగా అధికారం చేపట్టాడు. డిసెంబర్ 7, 1975న ఇండోనేషియా దురాక్రమించడంతో ఈ మొదటి రిపబ్లిక్ పట్టుమని పది రోజులు కూడా బతికి బట్టకట్టలేక పోయింది. ఆ తర్వాత మళ్లీ మే 19, 2002న జోస్ "గ్జనానా" గుస్మావో తూర్పు తిమోర్‌లో ఐక్యరాజ్య సమితి ట్రాన్సిషనల్ అథారిటీ (యుఎన్‌టిఏయిటి) చేతుల మీదుగా అధికార పగ్గాలు చేపట్టడంతో తూర్పు తిమోర్ రెండో సారి స్వతంత్ర దేశంగా అవతరించింది. ఈ మధ్య కాలంలో ఈ చిరు ద్వీపంలోని ప్రజలు చాలా అనుభవాల్నే పొందారు. ఇవి ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కలచివేసే అనుభవాలు.

కొత్తగా జన్మించిన తూర్పు తిమోర్‌కు సుదీర్ఘ వలస పాలన చరిత్ర ఉంది. పోర్చుగీసు వ్యాపారులు 1515లో తిమోర్ ద్వీపంలో వర్తకం చేయడం కోసం అడుగుపెట్టారు. ఆంగ్లేయులు మన దేశంలో వ్యాపారం చేయడం కోసం ప్రవేశించినట్టు అక్కడ పోర్చుగీసు వర్తకులు అడుగుపెట్టారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల పాటు ఆ ద్వీపం పోర్చుగీసు వారి కబంద హస్తాల్లో మగ్గింది. తర్వాత డచ్ వారు ప్రవేశించారు. దొంగలు దొంగలు కలిసి ఊర్లను పంచుకున్నట్టుగా పోర్చుగీసు వారూ, డచ్ వారూ కలిసి తిమోర్‌ను పంచుకున్నారు. పశ్చిమ భాగాన్ని డచ్ వారు, తూర్పు భాగాన్ని పోర్చుగీసు వారు పంచుకున్నారు. అలా దేశాన్ని నిట్టనిలువునా చీల్చిన తర్వాత తిమోర్ ప్రజల కష్టాలు మరింతగా పెరిగిపోయాయి.

కాగా 1949లో డచ్ వారు తిమోర్ పశ్చిమ ప్రాంతాన్ని పొరుగున ఉన్న ఇండోనేషియాకు అప్పగించి వెళ్లిపోయారు. తర్వాత 1975లో పోర్చుగీసులో చోటు చేసుకున్న పరిణామాల వల్ల పోర్చుగీసు వారు తూర్పు తిమోర్‌ను వదిలిపోయారు. అవకాశం కోసం గుంటనక్కలా కాచుకొని ఉన్న ఇండోనేషియా తూర్పు తిమోర్‌ను స్వాధీనం చేసుకున్నది. ఇండోనేషియా సైనిక పాలకులు తూర్పు తిమోర్‌ను వశం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు అడ్డుకున్న ప్రజలను ఊచకోత కోసారు.

ఇండోనేషియా సైనిక పాలకులు, ప్రపంచ చరిత్రలోనే అరుదైన రీతిలో ఘాతుక, హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. ఇండోనేషియా నియంత సుహార్తో తూర్పు తిమోర్ ప్రజలకు నరకాన్ని చవి చూపిస్తున్నా సుహార్తో తనకు మద్దతునిస్తున్నందున అమెరికా చూసీ చూడనట్లుగా వ్యవహరించింది. తన స్వంత ప్రయోజనాల కోసం నియంతల, సైనిక పాలకుల కొమ్ముకాయడం అమెరికాకు కొత్త కాదు.

మే 20, 2002న స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత తూర్పు తిమోర్‌ను ఇకముందు మిగిలిన 'స్వతంత్ర' దేశాలతో సమానంగా పరిగణిస్తారట. మూడవ ప్రపంచంలోని చిన్న, బలహీన దేశాల్లో ఏ మాత్రం స్వాతంత్ర్య ఛాయలు కనిపించినా వాటిని మింగివేసే ప్రపంచీకరణ పెనుభూతాలున్న ఈ సామ్రాజ్యవాద యుగంలో ఎలాంటి 'స్వాతంత్ర్యం' ఉంటుందో ఊహించవచ్చు. 'స్వాతంత్ర్య' వేడుకల నాడు రాజధాని దిలీలో చేరిన వారిని చూస్తే చాలు ఇది అర్థమవడానికి. వారంతా తూర్పు తిమోర్ ప్రజలపై అణచివేత సాగించిన దేశాల నుండి వచ్చిన వారే. 80 మంది గౌరవ అతిథుల్లో ఇండోనేషియా అధ్యక్షురాలు మేఘావతి సుకర్ణోపుత్రి, అమెరికా మాజీ అధ్యక్షుడు క్లింటన్, ఆస్ట్రేలియా ప్రధాని మొదలైన వారు ఉన్నారు. ఘోరాలు చేసిన వారూ, నేరస్థులకు తోడ్పడిన వారూ తూర్పు తిమోర్ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోగా, ప్రజలకు మాత్రం గతాన్నంతా మరచిపోయి, క్షమించివేయమని సలహా ఇచ్చారు. అంటే, మళ్ళీ ఈ తిమింగలాలు దాతలుగానూ, సహాయమందించే వారుగానూ మారి తూర్పు తిమోర్ ప్రజల భవిష్యత్‌ను కొల్లగొట్టుకోవచ్చు.

8 లక్షల జనాభా కల్గిన తూర్పు తిమోర్ ప్రపంచంలోని అతి పేద దేశాల్లో ఒకటి. 14 వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం గల ఈ దేశంలో 85 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంత నివాసులే. నాలుగు శతాబ్దాలకు పైగా సాగిన పోర్చుగీసు వలస పాలనా, మరో 24 సంవత్సరాల పాటు సాగిన ఇండోనేషియా సైనిక నియంతృత్వపు అక్రమ పాలనా తూర్పు తిమోర్‌ను ఈ దుస్థితికి దిగజార్చాయి. దేశంలో నిరక్షరాస్యత 60 శాతం పైగా ఉండగా, తలసరి జాతీయోత్పత్తి 340 డాలర్లు. సగటు జీవిత కాలం 48 సంవత్సరాలు. ప్రజలకు కాఫీ ఎగుమతే ప్రధాన ఆదాయ వనరు. రాజధాని దిలీలో చాలా మంది రోజువారీ ఆదాయం 55 సెంట్ల (27 రూపాయల) కంటే తక్కువే. స్వాతంత్ర్య వేడుకల నాడు నూతన అధ్యక్షుడు గుస్మావో ప్రసంగించిన వేదికను వెదుర్లతో నిర్మించడం, కాల్చిన బాణాసంచా చైనా, థాయ్‌లాండ్‌లు దానం చేసినవి కావడం ఆ దేశపు పేదరికానికి అద్దం పడతాయి. రానున్న మూడు సంవత్సరాల్లో తూర్పు తిమోర్ 18.4 కోట్ల డాలర్ల బడ్జెట్ లోటును ఎదుర్కోనున్నదని ఒక అంచనా.

ఇప్పటివరకు ఈ దేశాన్ని దోచుకొని విచ్ఛిన్నతకు తోడ్పడినవారే దీని పునర్నిర్మాణానికి 'సహాయం' అందిస్తామంటున్నారు. దేశపు రెవిన్యూ లోటుని పూడ్చటానికి సంసిద్ధత తెలిపారు. అయితే పగ్గాలు మాత్రం ప్రపంచ బ్యాంకు చేతిలో ఉంటాయి. ప్రపంచ బ్యాంకు వంటి సామ్రాజ్యవాద ఏజెన్సీలు ఇక్కడ అడుగుబెడితే షరతులన్నీ వాటి చేతుల్లోనే ఉంటాయి, అంటే, 'సహాయం' పొందే వారి కంటే అందించేవారికే లాభం చేకూరుతుందన్నది స్పష్టం. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన ఈ దేశ నాయకుల విధానాలతోనూ, వ్యవహరించే తీరుతోనూ, గొణుగుళ్ళతోనూ వ్యవహారం ఎలా సాగనున్నదో కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోంది.

## వంచనకు గురైన స్వాతంత్ర్యోద్యమం

16వ శతాబ్దంలో వ్యాపారం కోసం వచ్చి తిమోర్‌ను ఆక్రమించిన పోర్చుగీసు వలస వాదులకు వ్యతిరేకంగా 'ఫ్లాంటిల్' (ఫ్రెటిలిన్) గెరిల్లాలు సాయుధ పోరాటం చేశారు. దాని ఫలితంగా పోర్చుగీసు పాలన నుండి 1975లో తిమోర్‌కు స్వాతంత్ర్యం లభించింది. అయితే కేవలం 10 రోజుల్లోనే దానిపై ఇండోనేషియా దురాక్రమణ జరిపి తన సైనిక నియంతృత్వ పాలనను స్థాపించింది. ఇండోనేషియాను ఎదిరించే ఎత్తుగడల విషయంలో ఏర్పడ్డ భిన్నాభిప్రాయాల కారణంగా డో అమరాల్‌ను ఫ్రెటిలిన్ సెంట్రల్ కమిటీలోంచి బహిష్కరించారు. అతను పూర్తిగా గెరిల్లా పోరాటంపైన్నే ఆధారపడడం కాకుండా రహస్య రాజకీయ ఎత్తుగడలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడనీ, ఇండోనేషియన్లతో సంప్రదింపులు జరపాలని వాదించాడనీ అన్నారు. ఒక రాడికల్ గ్రూపు అతన్ని పదవిలోంచి తొలగించి, బంధించి హింసించింది. ఆ తర్వాత అతన్ని ఇండోనేషియన్లు అరెస్టు చేసి ఫ్రెటిలిన్‌కు వ్యతిరేకంగా ఒక ప్రచార ఆయుధంగా వాడుకున్నారు. డో అమరాల్ పోర్చుగీసుకు పారిపోయేంత వరకూ అతన్ని ఇండోనేషియాలో ఒక ఖైదీగానే ఉంచారు. 2000 సంవత్సరంలో ఇతను తూర్పు తిమోర్‌కు తిరిగి వచ్చాడు.

చివరకు ఫ్రెటిలిన్ సాయుధ పోరాటాన్ని ఆపాలని నిర్ణయానికి రావడం, సామ్రాజ్యవాదుల (ప్రత్యేకించి అమెరికా)తో రాజీపడుతూ ఐక్యరాజ్య సమితిని వేదికగా ఎంచుకోవడం చరిత్రలో విద్రోహానికి మరో ఉదాహరణగా

నిలుస్తాయి. డో అమరాల్ ఏ తప్పుడు పంథాను ఎంచుకున్నాడని ఆరోపణ చేశారో అదే పంథా 1996లో ఫ్రెటిలిన్ నాయకత్వమంతటికీ ఆమోదయోగ్యమైంది. ఫ్రెటిలిన్ నాయకుడు గుస్‌మావో అప్పుడు ఇండోనేషియా జైల్లో ఉండి ఐక్యరాజ్య సమితి, అమెరికన్, బ్రిటిష్ దౌత్యవేత్తలతో గెరిల్లా యుద్ధాన్ని విరమించే విషయంలో మంతనాలు జరపసాగాడు. నెల్సన్ మండేలా వలెనే గుస్‌మావో కూడా పీడకులతో రాజీపడ్డాడు. 1975లో ఐక్యరాజ్య సమితిలో మొదటి రిపబ్లిక్‌కు హక్కుగా దొరకాల్సిన స్థానం విషయంలో వీటో చేసిన అమెరికాయే, విముక్తి యోధుల మిలిటెంట్ రాజకీయాలను సమూలంగా అంతం చేసిన తర్వాత తూర్పు తిమోరీయుల 'విముక్తి' కర్తవ్యాన్ని తన భుజాలపైన వేసుకొని కొత్త దేశాన్ని ఉనికిలోకి తీసుకొచ్చింది.

## సామ్రాజ్యవాదుల ఉక్కు పిడికిట్లో తూర్పు తిమోర్

ఇండోనేషియన్లు తూర్పు తిమోర్‌ను దురాక్రమించడానికి, ఆ ప్రజలను పీల్చి పిప్పి చేయడానికి అమెరికా ఆమోదం, ఆస్ట్రేలియా సహకారాలు ఎప్పుడూ ఉంటూ వచ్చాయి.

1975 డిసెంబరు 7న తూర్పు తిమోర్‌ను ఇండోనేషియా దురాక్రమించడంలో అమెరికా సామ్రాజ్యవాదుల ఆమోదం ఉండింది. అమెరికా అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్, విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్‌లు ఇండోనేషియా పర్యటించి వెళ్ళగానే అది తూర్పు తిమోర్‌ను దురాక్రమించింది. ఈ దురాక్రమణపై ఐక్యరాజ్య సమితి భద్రతా సమితి తీర్మానం చేసినపుడు కూడా అమెరికా వీటో చేసి ఇండోనేషియాకు మద్దతునిచ్చింది. ఆ తర్వాత కాలంలో ఐక్యరాజ్య సమితి తూర్పు తిమోర్ నుండి ఇండోనేషియా వైదొలగాలని చేసిన తీర్మానాలన్నీ అమలుకాకుండా అమెరికా వహించిన పాత్ర గురించి అమెరికా మాజీ రాయబారి డానియల్ పాట్రిక్ స్వయంగా గొప్పలు చెప్పుకున్నాడు. వాస్తవానికి 25 ఏళ్ళ ఇండోనేషియా క్రూర పాలనలో ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేసి, దాని దురాక్రమణను వ్యతిరేకించిన లక్షలాది తూర్పు తిమోరీయులను ఊచకోత కోయడంలో సైనిక నియంతల పాత్ర ప్రపంచ ప్రజల మనస్సుల్లోనూ, చరిత్రలోనూ రికార్డయ్యే ఉంది. 1999లోనే, ఇండోనేషియా అనుకూల మిలీషియా చేసిన విచక్షణారహితమైన దాడుల్లో లక్షలాది మంది నిర్వాసితులయ్యారు, వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దేశాభివృద్ధికి మూలమైన మౌలిక సదుపాయాలలోని మూడింట రెండు వంతులు ధ్వంసమైంది. అమెరికా ఇవేవీ ప్రస్తావించకుండానే సుకర్ణోపుత్రి ప్రభుత్వాన్ని తూర్పు తిమోర్‌కు "స్వాతంత్ర్యం" ప్రసాదించిన దాతగా ఆకాశానికెత్తుతోంది. ఇదీ అమెరికా సామ్రాజ్యవాదం చెబుతున్న ప్రజాస్వామ్యపు అసలు రంగు!

ఆసియాలో అమెరికా వ్యూహాన్ని కొనసాగించడంలో ఆస్ట్రేలియాను దాని పెంపుడు బిడ్డగా చెప్పుకోవచ్చు. అమెరికా తొత్తు పాత్రను నిర్వహిస్తూనే తన స్వప్రయోజనాలు ఈడేర్చుకోవడం దానికి పరిపాటి. అది 1975లో తూర్పు తిమోర్ దురాక్రమణను బలపరచింది. తిమోర్ ఇండోనేషియాకు చెందుతుందని గుర్తింపు ఇచ్చిన అతి కొద్ది దేశాలలో ఆస్ట్రేలియా ఒకటి. 1989లో ఇండోనేషియాతో తిమోర్ జలసంధి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తూర్పు తిమోర్‌లో ఐక్యరాజ్య సమితి ట్రాన్సిషనల్ అథారిటీ పాలనలో ఉండగానే జులై 6, 2001న తిమోర్ సముద్రంలోని చమురూ, సహజ వాయువుల రెవిన్యూ పంపకంపై తూర్పు తిమోర్ ఆర్థిక వ్యవహారాలు చూసే కేబినెట్ కార్యదర్శితో (ఐక్యరాజ్య సమితి కాన్ఫరెన్స్ హాలులోనే) ఒక ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం రెండు దేశాల సముద్ర ప్రాంతం నుండి చమురూ, సహజ వాయువులపై వచ్చే ఆదాయంలో 90 శాతం తూర్పు తిమోర్‌కూ, మిగిలిన 10 శాతం ఆస్ట్రేలియాకూ అన్నది పైకి కనబడేది, కాగా వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంది. తూర్పు తిమోర్ తన ముడి చమురుని చౌకగా అమ్ముతుంది, తర్వాత దాన్ని శుద్ధిపర్చి అమ్ముకోవడం ద్వారా ఆస్ట్రేలియా అధిక లాభాలను గుంజుకుంటుంది. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్లలో తూర్పు తిమోర్‌కు ముట్టేది కేవలం 700 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్లేనని ఒక అంచనా. నిజానికి తిమోర్‌లో అతి పెద్ద చమురు నిల్వలు కల్గియున్న అమెరికాలోని ఫిలిప్స్ పెట్రోలియం అంచనా ప్రకారం, ఈ ప్రాంతంలో 2,100 కోట్ల డాలర్ల విలువ కల్గిన 3 కోట్ల బ్యారెల్ల చమురు మరియు 17.5 కోట్ల బ్యారెల్ల సహజ వాయువు నిల్వలు ఉన్నాయి. అంటే ఆస్ట్రేలియా తూర్పు తిమోర్‌పై ఎందుకు కన్నేసింది, ఇండోనేషియాకు ఎందుకు మద్దతు నిస్తూండింది, దాని దోపిడీ ప్రయోజనాలు ఎలాంటివీ అన్నది సుస్పష్టమే.

అలాగే రిఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ) తర్వాత కూడా, 1999లో తూర్పు తిమోర్ ప్రజలపై ఇండోనేషియా అనుకూల మిలీషియా సాగించిన విధ్వంస నరమేధాల్ని 'మరచిపోవాలి, క్షమించి వదలిపెట్టాలి' అంటూ ఆస్ట్రేలియా ఫ్రెంటిలిన్ గెరిల్లాలను లొంగదీసుకుంది. గెరిల్లా యుద్ధం నుండి ఓట్ల రాజకీయాలకు దిగజారి, సామ్రాజ్యవాద దోపిడీ నుండి, జోక్యం నుండి జాతీయ స్వాతంత్ర్యం కోరే లక్ష్యాన్ని విడిచిపెట్టిన గెరిల్లా సంస్థకు "రాజకీయ పరిణతి" కలిగేలా చేసింది కూడా ఆస్ట్రేలియానే. ఇక్కడితో ఆగక తూర్పు తిమోర్‌లో శాంతి పరిరక్షక బలగాల (సుమారు 5,000) పేరిట ఐక్యరాజ్య సమితి దించిన బహుళ జాతి బలగాలలో కూడా ఆస్ట్రేలియాదే నాయకత్వం. అటు గెరిల్లా సంస్థ సభ్యులనూ (వీరి సంఖ్య 600 అని అంచనా), ఇటు ఇండోనేషియా అనుకూల మిలీషియానూ ఆయుధాలు దించేలా చేయడంలో దాని సైనిక జనరల్‌దే కీలక పాత్ర. అంతర్జాతీయ సామ్రాజ్యవాద కూటమి దోపిడీకి అనువుగా, కమ్యూనిస్టులనే వారు అధికారం చేజిక్కించుకోలేని విధంగా తగిన జాగ్రత్తలు వహిస్తూ, అవసరమైనచోటల్లా సుకర్ణోపుత్రి ప్రభుత్వ సహకారం తీసుకుంటూ, నిర్ణయించుకున్న ప్రకారం వచ్చే 18 నెలల కాలంలో ఆ దేశపు సైనిక బలగాలను నిర్మించి తాము సెలవుతీసుకునే కర్తవ్యంతో సాగుతున్నాడు ఆ జనరల్.

## కార్మికవర్గ నాయకత్వం లేకుండా నిజమైన విముక్తి లేదు !

లక్షలాది తిమోర్ ప్రజల రక్తం అంటిన చేతులతో దాని భవిష్యత్తును రచిస్తున్న సామ్రాజ్యవాదుల అసలు రంగును త్వరలోనే తిమోర్ ప్రజలు తెలుసుకోగలరు. సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలతో లభించే స్వాతంత్ర్యం నిజమైనది కాదని కూడా తెలుసుకోగలరు. తిమోర్ ప్రజలు శతాబ్దాల తరబడి విదేశీ పాలన కింద ఎనలేని బాధలకూ, పీడనలకూ గురైనవాళ్లు. వలస పాలకులకూ, సామ్రాజ్యవాదుల దన్నుతో దురాక్రమణకు పాల్పడ్డ ఇండోనేషియన్ దోపిడీదార్లకూ వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ రక్తతర్పణ చేసిన ఘనమైన చరిత్ర వాళ్లది. లక్షలాది ప్రజలు తమ మాతృదేశ విముక్తి కోసం ప్రాణాల్నే బలిపెట్టారు. ఫ్రెంటిలిన్ నాయకత్వం వాళ్ల ఆకాంక్షలకు తీరని ద్రోహం తలపెట్టి వాళ్ల పోరాటాన్ని నీరుగార్చింది. ఎన్ని త్యాగాలు చేసినప్పటికీ, ఎంత రక్తతర్పణం గావించినప్పటికీ కార్మికవర్గ నాయకత్వం లేకుండా జరిగే పోరాటాలన్నీ అంతిమంగా బలికాక తప్పవని తూర్పు తిమోర్ అనుభవం మరోమారు రుజువు చేసింది. కుట్రలకూ, ద్రోహాలకూ బలైన తిమోర్ ప్రజలు ఈ చేదు అనుభవాల నుండి తప్పక పాఠాలు నేర్చుకుంటారు. తమ పక్కనే ఉన్న దక్షిణాసియా ప్రాంతంలో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధం నుండి వాళ్లకు తప్పక ప్రేరణ లభిస్తుంది. దేశాలు స్వాతంత్ర్యాన్నీ, జాతులు విముక్తినీ, ప్రజలు విప్లవాన్నీ కోరుకుంటున్న విప్లవాల యుగం ఇది. కార్మికవర్గ నాయకత్వంలో తూర్పు తిమోర్ ప్రజలు నిజమైన స్వాతంత్ర్యం కోసం ముందుకు సాగుతారనీ, సామ్రాజ్యవాదుల దోపిడీపీడనల నుండి తమ మాతృభూమిని విముక్తం చేసుకుంటారనీ ఆశిద్దాం. ❑

# దోపిడీ పాలనావ్యవస్థ పునాదుల్ని పెకిలిస్తున్న దక్షిణ బస్తర్ విప్లవ ప్రజలు

*(గ్రామగ్రామాన ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించుకునే దిశలో సాగుతున్న దండకారణ్య ప్రజలు అనేక విజయాలు సాధిస్తూ పురోగమిస్తున్నారు. దోపిడీ పాలనను కింది స్థాయి నుండి కూలదోస్తూ ప్రజారాజ్యాన్ని స్థాపిస్తూ, మొత్తంగా దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మార్చే లక్ష్యంతో దండకారణ్యంలోని అన్ని విప్లవ ప్రజాసంఘాలూ, పార్టీ శ్రేణులూ, పిజిఏ బలగాలూ కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే దాదాపు అన్ని డివిజన్లలోనూ విడివిడిగా కొందరు గ్రామ పంచాయితీ సర్పంచ్‌లపై ప్రజలు వత్తిడి తెచ్చి రాజీనామాలు యిప్పించారు. అయితే గత సెప్టెంబర్ నుండి ముఖ్యంగా దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ డివిజన్లలో ప్రజలు గ్రామపంచాయితీ సర్పంచ్‌లపైనా, సచీవ్‌లపైనా వత్తిడి తెచ్చి వాళ్లతో సామూహికంగా రాజీనామాలు చేయించడంతో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా ఒక పెద్ద చర్చ మొదలైంది. సహజంగానే పాలక వర్గ పార్టీలన్నీ కూడా ప్రజలు తీసుకున్న ఈ చర్యను నిరసించాయి. ప్రజా పక్షం వహించే వాళ్లంతా ప్రజల చొరవను అభినందించారు. ఒక వెల్లువలా సాగిన ఈ రాజీనామాల క్యాంపెయిన్‌ను అడ్డుకోవడానికి పాలకులు పడరాని పాట్లు పడ్డారు. మహేంద్ర కర్మ వంటి 'బస్తరియా' మంత్రులు కూడా రంగంలోకి దిగి ఎలాగైనా రాజీనామాలను ఆపి కూలిపోవడానికి సిద్ధంగా వున్న పంచాయితీ పాలనా వ్యవస్థను నిలిపి ఉంచేందుకు వెర్రిగా ప్రయత్నించారు. అయినా ఇది ఆగలేదు. రిపోర్టు రాసే నాటికి కూడా రాజీనామాల పరంపర ఇంకా సాగుతూనే ఉంది. అయితే మొత్తం ఘటనల క్రమంపై వివరంగా రిపోర్టు మాకింకా అందాల్సే ఉంది. దక్షిణ బస్తర్ డివిజన్‌లోని ఊసూర్ వికాస్‌ఖండ్‌లో జరిగిన రాజీనామాల రిపోర్టు మాత్రమే మాకు చేరినందున దాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాం.*

*– సంపాదకులు)*

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని ఊసూర్ బ్లాక్ (వికాస్ ఖండ్)లో మొత్తం 39 గ్రామ పంచాయితీలున్నాయి. 2000 సంవత్సరం జనవరి-ఫిబ్రవరి నెలల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల సమయంలో ఇక్కడ కేవలం 15 పంచాయితీల్లోనే నామినేషన్స్ వేశారు. మిగతా 24 పంచాయితీలకు అసలు నామినేషన్లే వేయలేదు. వేసిన 15 పంచాయితీల్లో కూడా కొన్ని సింగిల్ నామినేషన్లే- అంటే ఏకగ్రీవంగా ఎన్నికైనవాళ్లన్న మాట. మిగతా 24 పంచాయితీల్లో ప్రభుత్వమే తమకనుకూలంగా ఉన్న కొందరు వ్యక్తులను సర్పంచ్ పదవులకు నామినేట్ చేసింది. వీరిలో కొందరికి తాము సర్పంచ్ అవుతున్నామన్న విషయం కూడా తెలియదు. దీన్ని బట్టి పంచాయితీరాజ్ వ్యవస్థ ఎంత బలహీనమైన పునాదిపై నిల్చి, ఎంతగా ప్రజల నుండి వేరుపడి ఉందో అర్థం చేసుకోవచ్చు.

విప్లవోద్యమాన్ని అణచడంలో భాగంగా ప్రభుత్వం ఎల్ఐసి వ్యూహాన్ని అమలు చేస్తూ ఉద్యమ ప్రాంతంలో అనేక సంస్కరణ కార్యకలాపాలను చేపట్టింది. ప్రజల్లో విప్లవచేవ నశించిపోయేలా, ప్రజలను పక్కదారి పట్టించేలా సంస్కరణలు ఉంటున్నాయి. వీటితో కొందరు వ్యక్తులకు లాభాలు కలిగేలా చూసి వాళ్లు తమ పాలనకు మద్దతుదార్లుగా మారేలా చేయడం, అలాగే ప్రజల ఐక్యతను దెబ్బతీయడం ఈ సంస్కరణల వెనుక ప్రభుత్వ లక్ష్యం. అయితే ఈ సంస్కరణల తతంగాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సర్పంచ్‌లనూ, సచీవ్‌లనూ బాగా ఉపయోగ పెట్టుకుంటున్నది. వీళ్లు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ, అవినీతికి పాల్పడుతూ ఎక్కువ భాగం డబ్బుల్ని కాజేస్తూ లాభపడుతున్నారు. కొందరు పూర్తిగా విప్లవవ్యతిరేకులుగా కూడా మారుతున్నారు.

ఈ కింది స్థాయి పాలనావ్యవస్థను ధ్వంసం చేస్తే తప్ప దోపిడీ ప్రభుత్వ పాలనా పునాదుల్ని బలహీనపర్చలేమని గ్రహించిన ప్రజలు డిఏకెఎంఎస్, కెఏఎంఎస్‌ల నాయకత్వాన ఆగష్టు 10-12 తేదీల్లో మొత్తం 23 మంది సర్పంచ్‌లనూ, 23 మంది సచీవ్‌లనూ సమావేశపర్చారు. వీరికి పై విషయాలన్నీ వివరించి ప్రభుత్వానికి తొత్తులుగా ఉండవద్దనీ, ప్రజల్లో ఒకరిగా ఉండమనీ నచ్చచెప్పారు. అందుకోసం ముందుగా అందరూ రాజీనామాలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. వీరంతా ఆగష్టు 30 వరకు లాంఛనంగా ప్రభుత్వానికి రాజీనామాలు సమర్పిస్తామని ప్రజలకు హామీ యిచ్చారు. ప్రజలకు తమ రాజీనామాలను అప్పటికప్పుడే రాసిచ్చారు. 30వ తేదీ గడువు ముగిసాక ఎవరూ పదవిలో వున్నా సహించబోమనీ ప్రజలు వారిని హెచ్చరించారు. ప్రజల ఐక్యతకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దనీ, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజలతో కలిసి పాటుపడాలనీ, ప్రజలకు శత్రువులుగా మారవద్దనీ వివరించారు. అలా మారితే చరిత్ర క్షమించదని హెచ్చరిక చేసి పంపించారు.

## 'కోవర్ట్' ఎత్తుగడ విఫలం - కోవాసి దేవాకు శిక్ష

విప్లవోద్యమ అణచివేత కోసం పోలీసులు 'కోవర్ట్' ఎత్తుగడను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆంధ్ర పోలీసులు ఈ పద్ధతిలో ఉద్యమానికి చాలానే నష్టం చేయగలిగారు. దండకారణ్యంలో కూడా పోలీసులు ఒకటి అరా ప్రయత్నాలు చేసి సఫలం అయినప్పటికీ ఎక్కువ శాతం ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ప్రజలూ, పార్టీ శ్రేణులూ, గెరిల్లా బలగాలూ అప్రమత్తంగా మెలగబట్టే పోలీసులు వేసిన చాలా ఎత్తుగడలు పురిట్లోనే సంధికొట్టాయి. ఇటీవలే దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందిన గెరిల్లాలు కోవాసి దేవా అనే 'కొవర్ట్'ను హతమార్చి పోలీసులు పన్నిన కుట్రను విఫలం చేశారు. సుక్మ ఏఎస్‌పి నరేంద్ర వీడిని శబరి నదికి ఆవల ఒరిస్సాలోని మోటు ప్రాంతంలో ఒక గ్రామంలో సెటిల్ కమ్మని పంపాడు. వీడికి క్రమంగా గెరిల్లా బలగాల విశ్వాసం చూరగొని దళంలో చేరాలనీ, ఈ తర్వాత ఎస్‌జెడ్‌సి లేదా సిసి సభ్యులెవరినైనా హత్య చేసి రావాలనీ పని అప్పగించాడు. ఈ కుట్రలో భాగంగా వీడు ఫిబ్రవరి 2002లో ఒక గ్రామంలో మకాం వేశాడు. ఏప్రిల్‌లో మన దళాన్ని కల్సి తన యిద్దరు చెల్లెల్లను ఎమ్ఎల్ఏ అందరాం గూండాలు పాత కక్షలతో చంపేశారనీ, తన్ను కూడా చంపాలని ప్రయత్నం చేస్తుంటే పారిపోయి వచ్చినట్లు కథ అల్లి చెప్పాడు. ఆ తర్వాత వీడి గురించి పూర్తిగా వివరాలు సేకరించగా వీడు ఒకప్పుడు గెరిల్లా దళంలో పనిచేసి ఇనాక్టివ్ అయి వెళ్లిపోయిన చంద్రక్క అనే మహిళను పెళ్లి చేసుకున్న వ్యక్తి అని తేలింది. వీడు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నందున గతంలోనే వీడిని శిక్షించాలనీ పక్క ఏరియా పార్టీ కమిటీ నిర్ణయించినట్లుగా కూడా తేలింది. ఇవన్నీ తెల్సిన తర్వాత వీడిని నిలదీసి అడగడంతో వీడు పోలీసుల కుట్రలో ఎలా భాగమయ్యాడో వెల్లడించాడు. దీనితో స్థానిక కమిటీ 15 గ్రామాల ప్రజలనీ, వీడి కుటుంబ సభ్యులను కూడా పిలిచి 800 మంది సమక్షంలో వీడిపై విచారణ జరిపింది. ప్రజలు వీడికి సంబంధించిన వివరాలన్నీ విన్న తర్వాత వీడిని అంతమొందించాలనీ ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. అక్కడికక్కడే పిజిఏ గెరిల్లాలు వీడిని కాల్చి వేశారు.

## పోలీసు ఉద్యోగి పండం రాజాకు శిక్ష

దక్షిణ బస్తర్ డివిజన్, కుంట ఏరియాలోని ఎర్రబోరు గ్రామానికి చెందిన పండం రాజా అనే వ్యక్తి ప్రత్యేక ఆదివాసీ పోలీసు బెటాలియన్‌లో భర్తీ అయ్యాడు. ఇది తెలిసి స్థానిక దళం వీడిని పిలిపించి అందులోంచి బైటికి రావాలని నచ్చచెప్పింది. స్వయంగా ఆదివాసీ అయ్యి ఉండి పీడిత ప్రజా ఉద్యమాన్ని అణచివేసే పాలకవర్గాల కుట్రలో భాగస్వామి కాకూడదని అర్థం చేయించింది. దోపిడీ అణచివేతలు లేని సమాజం కోసం సాగుతున్న పోరులో చేరి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించడానికి సిద్ధం కావాలే తప్ప మన కంటిని మన వేలుతోనే పొడిపించాలని పాలకులు పన్నుతున్న కుట్రల్లో భాగం కావద్దని విజ్ఞప్తి చేసింది. దానితో వీడు యిక పోలీసుల్లో ఉండనని చెప్పి యింటి దగ్గరే ఉండసాగాడు. తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినట్లు నాటకమాడాడు. అయితే ఈలోగా ఎర్రబోరు గ్రామంలో పోలీసు క్యాంపు నెలకొల్పడంతో వీడు మళ్లీ పోలీసులతో కుమ్మక్కయ్యాడు. వాళ్లతోనే ఉంటూ అన్ని విధాలా సహకరించసాగాడు. దానితో స్థానిక పార్టీకమిటీ వీడికి తగిన శిక్ష విధించాలని నిర్ణయించింది. దాని ప్రకారం పిజిఏ గెరిల్లా టీం ఒకటి ఆగష్టు 11 నాడు గ్రామంలోని పోలీసు క్యాంపు పక్కనే ఉన్న వీడి యింటిపై దాడి చేసి మట్టుబెట్టింది.

## దక్షిణ-పశ్చిమ బస్తర్ డివిజన్లలో తునికాకు పోరాటం జయప్రదం

దక్షిణ-పశ్చిమ బస్తర్ డివిజన్లలో ఫిబ్రవరి-ఏప్రిల్ నెలల్లో డిఏకెఎంఎస్, కెఏఎంఎస్‌ల నాయకత్వంలో ప్రచార దళాలు తునికాకు కట్టకు 80 పైసల రేటు కోసం పోరాడాలని విస్తృతంగా ప్రచారం చేశాయి. ఈ పోరాటాన్ని నిర్వహించడం కోసం ప్రజలు రేంజ్ స్థాయిలో మొత్తం 7 పోరాట కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే పోస్టర్లు, కరపత్రాలు, పత్రికా ప్రకటనల ద్వారా కూడా ప్రచారం సాగింది.

ఈ సంవత్సరం కూడా దంతెవాడ జిల్లాలో తునికాకు పనుల్ని ప్రైవేటు కాంట్రాక్టర్లకే యివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత పదేళ్లుగా బస్తర్ ప్రజలు తునికాకు జాతీయీకరణను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. కానీ ప్రభుత్వం మొండి వైఖరిని అవలంబిస్తూ ప్రజల డిమాండ్‌ను నిరాకరిస్తూ వచ్చింది. తునికాకు కూలీ రేట్లు కూడా పెంచకుండా దోపిడీని తీవ్రంగా చేస్తూ వచ్చింది. అయితే గత రెండేళ్లుగా జోగి ప్రభుత్వం ఒక్క దంతెవాడ జిల్లాలో తునికాకు పనులు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నది. అయితే దీన్ని ప్రయోగాత్మకంగానే అమలు చేస్తున్నట్లు చెబుతున్నది.

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల రేట్లను దృష్టిలో ఉంచుకొని 80 పైసల రేటివ్వాలని ప్రజలు కాంట్రాక్టర్లను డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లతో చర్చల కోసం వేలాది మంది స్త్రీపురుషులు కలిసి మీటింగ్‌లు నిర్వహించారు. వీటిల్లోనే పోరాటకమిటీకీ, కాంట్రాక్టర్లకూ మధ్య చర్చలు సాగాయి. ఆఖరుకు కాంట్రాక్టర్లు ప్రజల డిమాండ్లకు తలొంచారు. 80 పైసల రేటు ఇవ్వడానికి సంసిద్ధత తెలిపారు. అలాగే ఉల్టాయి-పల్టాయి (కట్టలు తిర్గమర్లేసుడు) 1,000 కట్టలకు 5 రూపాయలు; కావడి నీళ్లకు 10 రూపాయలు; కల్లేదారుకు 3,000 రూపాయలు; వాచర్‌కు 2500 రూపాయలు; 1,000 కట్టలు గుంటి (చట్టాన్) పెడితే 5 రూపాయలు – ఈ విధంగా రేట్లను పెంచడానికి ఒప్పుకున్నారు. అనేక ఏళ్లుగా ప్రభుత్వంతో పోరాడుతూ వస్తున్న ప్రజలకు గత రెండేళ్లుగా సాధిస్తున్న విజయాలు ఆత్మవిశ్వాసాన్ని యినుమడింపజేస్తున్నాయి. సంఘటిత శక్తితో ఎంత పెద్ద దోపిడీదారున్నైనా ఓడించగలమని ప్రజల్లో నమ్మకం పెరిగింది. ఈ పోరాటంతో ప్రజల మధ్య ఐక్యత మరింత బలపడింది. మొత్తంగానే దోపిడీ అసమానతలు లేని సమాజం కోసం పోరాడితేనే మన సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారమవుతాయనే చైతన్యం పెరిగింది.

## గడ్చిరోలి డివిజన్‌లో తునికాకు పోరాటం జయప్రదం

పోలీసు నిర్బంధాన్ని ఎదిరిస్తూ గడ్చిరోలి జిల్లా ప్రజలు తునికాకు కూలీరేట్ల పెంపుదల కోసం పోరాడారు. ప్రజల సంఘటిత శక్తికి తలవంచిన తునికాకు కాంట్రాక్టర్లు ప్రజల డిమాండు ప్రకారం కట్టకు 145 పైసలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పోలీసులు గ్రామాల్లో గస్తీని పెంచి పోరాటంలో ప్రజలు పాల్గొనకుండా చేయాలని ప్రయత్నించారు. ప్రజలను కొట్టడం, బెదిరించడం చేశారు. అయినా కూడా వేలాది మంది ప్రజలు ఈ పోరాటంలో పట్టుదలతో పాల్గొని విజయవంతం చేశారు. మొత్తం డివిజన్లో ఈ పోరాటాన్ని నిర్వహించేందుకై ప్రజలు 17 యూనిట్‌లలో పోరాట కమిటీలు నిర్మించుకున్నారు. వీటి నాయకత్వంలో కాంట్రాక్టర్లతో 2, 3 విడతలుగా రేటు విషయమై చర్చలు జరిగాయి. వేలాది ప్రజల సమక్షంలో రేటు నిర్ణయమైంది. ముందుగా ఈ పోరాటంపైన కరపత్రాలు వేసి విస్తృతంగా పంచారు.

## ప్రజా మిలీషియా క్లైమోర్ దెబ్బకు పరుగు లంకించుకున్న పోలీసులు

జులై 13న దక్షిణ బస్తర్ డివిజన్ బాసగూడెం పట్టణంలో తాల్పేరు నదిపై గల బ్రిడ్జి మీద ప్రజా మిలీషియా సభ్యులు క్లైమోర్ మైన్ అమర్చారు. ఇక్కడికి ఫర్లాంగ్ దూరంలో పోలీసు స్టేషన్ ఉంటుంది. ఇక్కడి పోలీసులు రోజూ ఉదయం ఈ బ్రిడ్జి మీదుగా పెట్రోలింగ్‌కని వెళతారు. 5 నుండి 10 మంది పోలీసులు సాయుధంగా పెట్రోలింగ్‌కు వెళ్తుంటారు. దీన్ని గమనించిన మిలీషియా దళం దాడికి ప్లాన్ చేసింది. పోలీసులు కిల్లింగ్ జోన్‌లోకి రాగానే మిలీషియా సభ్యులు తమ తడాఖా చూపారు. పెద్ద శబ్దంతో క్లైమోర్ పేలడంతో దిక్కుతోచని పోలీసులు చెల్లాచెదురై పారిపోయారు. కొందరికి గాయాలైనాయి. పోలీసులంతా ఆగకుండా పోలీస్‌స్టేషన్ దాకా పరుగులుతీశారు. శత్రువు కాగితపు పులి స్వభావం ప్రజా మిలీషియాకూ, ప్రజలకూ కళ్లకు గట్టినట్లుగా అర్థమయ్యింది. ఈ దాడి తర్వాత పోలీసులు అనుమానమున్న స్థలాల్లో ప్రతి అడుగూ ఆచితూచి వేస్తున్నారు. శత్రు బలగాలను నిర్మూలించేందుకూ, చికాకు పర్చేందుకూ ప్రజా మిలీషియా మరిన్ని దాడులకు సన్నద్ధమవుతోంది.

## తోయనార్‌లో పోలీస్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ ప్రజల ర్యాలీ

ప్రభుత్వం విప్లవోద్యమాన్ని అణచడానికి ఎల్‌ఐసి వ్యూహంలో భాగంగా ఒక వైపు సంస్కరణలు అమలు చేస్తూనే మరో వైపు నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది. అణచివేతలో పాల్గొనే పోలీసులకు కమాండో తరహా శిక్షణ ఇవ్వడమూ, అత్యాధునిక ఆయుధాలను సమకూర్చడంతో పాటు కొత్త పోలీస్ బెటాలియన్‌ల నిర్మాణం కూడా చేస్తున్నది. వాటితో పాటు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉద్యమాన్ని క్రూరంగా అణచివేయడానికి క్యాంపులనేర్పాటు చేస్తూ, కొత్త పోలీస్ స్టేషన్‌ల నిర్మాణానికి పూనుకుంటున్నది. ఇందులో భాగంగా గత సంవత్సరం పశ్చిమ బస్తర్ డివిజన్‌లో బీజాపూర్‌ను పోలీస్ జిల్లాగా ప్రకటించి, ఒక ఎస్‌పి సహా వందలాది మంది పోలీసులను నియమించింది. ఇటీవలి కాలంలో బీజాపూర్ పోలీస్ జిల్లా పరిధిలోని జాంగ్లా, నెలస్‌నార్, తోయనార్, మోదక్‌పాల్, ఆవపల్లిలలో నూతన పోలీస్ స్టేషన్‌లు స్థాపిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నెలస్‌నార్‌లో పోలీస్ స్టేషన్ ప్రారంభమై పని చేస్తున్నది. నూతనంగా ప్రారంభిస్తున్న ఈ పోలీస్ స్టేషన్‌ల ప్రధాన లక్ష్యం ఆ ప్రాంతంలో ఉద్యమాభివృద్ధిని అడ్డుకోవడం, ఊకెలోని వివిధ

డివిజన్‌ల మధ్య సమన్వయాన్ని దెబ్బతీసి ఉద్యమాన్ని నిర్మూలించడం. ఈ ప్రాంత ప్రజలు వీటికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టిన వాటిని నేలమట్టం చేశారు.

సెప్టెంబర్ 23న నేషనల్ పార్కు ఏరియాలోని పరసగడ్ ఎల్‌జిఎస్ పరిధి గ్రామమైన తోయనార్‌లో నిర్మించాలనుకున్న స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ తోయనార్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చింతన్‌పల్లి, మురిమేడ్, వెచ్చేలి, ఆదేడ్, గుమ్మునేర్, కాకొడ్‌మెట్ట, తోయనార్ తదితర గ్రామాలకు చెందిన సుమారు 600 మంది ప్రజలు తోయనార్ వీధుల గుండా దాదాపు ఒకటిన్నర గంటల పాటు ర్యాలీ నిర్వహించారు.

తోయనార్‌లో జరుప తలపెట్టిన 'జన సమస్య నివారణ్ శివిర్' (కలెక్టర్ నేతృత్వంలో)ని కూడా వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం అక్కడ జరిగిన సభలో కలెక్టర్ తలపెట్టిన 'జన సమస్య నివారణ్ శివిర్' ఉద్దేశ్యాన్ని ఎండగడుతూ వక్తలు మాట్లాడారు. అలాగే తోయనార్‌లో విస్తృతంగా పోస్టర్లు వేశారు. దీనితో శివిర్‌ను నిర్వహిస్తే ప్రజల వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని భయపడ్డ కలెక్టర్ తన మంది మార్బలంతో వెనుదిరిగిపోక తప్పలేదు.

## పిజిఏ దాడిలో చింతల్‌నార్ ఠాణా ఏఎస్సై ఖతం

*(ఈ ఘటన గత సంవత్సరం జరిగినదైనప్పటికీ రిపోర్టు అందడంలో ఆలస్యం అయినందున ఇప్పుడు ప్రచురిస్తున్నాం. – సంపాదకులు)*

దక్షిణ బస్తర్ డివిజన్ బాసగూడెం ఏరియా జేగురుగొండ రేంజ్ చింతల్‌నార్ పోలీసుస్టేషన్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఎస్సైని పిజిఏ బేస్ ఫోర్స్ టీం ఖతం చేసింది. పిజిఏ మొదటి వార్షికోత్సవ దినమైన డిసెంబర్ 2, 2001 (పిజిఏ డే) సందర్భంగా శత్రువుపై ప్రతిఘటనా చర్యలు కొనసాగించాలనీ, ఇన్‌ఫార్మర్లనూ, సింగిల్ టార్గెట్లనూ ఖతం చేయాలనీ దక్షిణ బస్తర్ డివిజన్ పార్టీ తీర్మానం చేసింది. దీనిలో భాగంగా బాసగూడెం ఏసి కూడా ప్రజలకూ, సెకండరీ ఫోర్సుకూ వివిధ ప్రతిఘటనా కార్యక్రమాలు అప్పగించింది. దీనిలో భాగంగా చింతల్‌నార్ ఠాణా ఏఎస్సై నరోటిని ప్రజా మిలిషియా టీం ఒకటి డిసెంబర్ 29, 2001 నాడు చింతల్‌నార్ సంతలో గొడ్డళ్లతో దాడి చేసి ఖతం చేసింది. ఈ సంఘటన శత్రువు బలగాలలో కలవరం రేపింది. పిజిఏ పునాది బలగాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. 'ఎంతటి బలవంతమైన సర్పమైనా చలిచీమల చేత చిక్కి చావక మానదు' అనే నానుడిని ప్రజా మిలిషియా సభ్యులు ఈ ఘటన ద్వారా నిరూపించారు.

## ఇన్‌ఫార్మర్ పూనెం మంగయ్య ప్రజా మిలిషియా చేతుల్లో ఖతం

పోరాడుతున్న ప్రజలపై జెఓసి (సంయుక్త ఆపరేషనల్ కమాండ్) నాయకత్వంలో పాశవికమైన దాడులను కొనసాగిస్తూ మరోవైపు తాగుబోతులనూ, లంపెన్ సెక్షన్‌నూ చేరదీసి డబ్బు ఆశ చూపి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటూ పావులుగా ఉపయోగించుకుంటున్నారు. అలాంటి ఇన్‌ఫార్మర్లలో పూనెం మంగయ్య ఒకడు. ఇతను బైరంగఢ్ ఏరియాలోని ఆవ్‌నార్ గ్రామంలో ఉండేవాడు. సంఘంలో కూడా కొంత కాలం పనిచేశాడు. తాగుబోతైన పూనెం మంగయ్య సంఘ క్రమశిక్షణకు కట్టుబడి ఉండకపోవడంతో గ్రామ సంఘం ఇతన్ని తొలగించింది. గ్రామంలో ఉంటూ ఆంధ్రలోని ఖమ్మం జిల్లాకు చెందిన చర్లకు కూలీ పనికి పోతూ వస్తూ ఉండేవాడు. కొంత కాలం అక్కడే మకాం పెట్టాడు.

చర్ల ఎస్సై దేవరెడ్డి అనేక సార్లు బస్తర్‌లోకి ఇన్‌ఫార్మర్లనూ, సిఐడిలనూ పంపే ప్రయత్నం చేసినప్పటికీ సఫలం కాలేకపోయాడు. దానితో స్థానికులనే ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకునే ప్రయత్నంలో ఉండగా వీడికి మంగయ్య దొరికాడు. డబ్బు ఆశ చూపి అతన్ని లొంగదీసుకున్నాడు. కూలీకి వస్తూ పోతున్నట్టు నటించి అక్కడి సమాచారాన్ని చేరవేయాలనీ, అక్కడి సంఘ సభ్యులు చర్లకు వస్తే చూపించాలనీ చెప్పడంతో తాగుబోతైన మంగయ్య డబ్బు ఆశకు లొంగిపోయాడు. డివిజన్ సిఎన్ఎం (చేతనా నాట్య మంచ్) మాజీ సభ్యుడైన సంజీవ్ చర్లకు వెళ్లగా పోలీసులకు పట్టించాడు. వీడి కార్యకలాపాలను పసిగట్టిన సంఘం వాళ్లూ, ప్రజలూ వీడి గురించి చర్చ లేవనెత్తగా పార్టీ వీడిని ఖతం చేయాలని తీర్మానించింది. ఈ బాధ్యతను మిలిషియాకు అప్పజెప్పింది. ఒకరోజు రాత్రి వీడు తన గ్రామానికి వచ్చిన సమాచారాన్ని తెలుసుకొన్న మిలిషియా సభ్యులు వాడి ఇంటిపై దాడి చేయగా తప్పించుకో ప్రయత్నించాడు. కానీ చివరకు ప్రజల సహకారంతో మిలిషియా సభ్యులు వీడిని అరెస్టు చేశారు. వీడిని విచారించగా గతంలో తను చేసిన ప్రజా వ్యతిరేక కార్యకలాపాలన్నీ ఒప్పుకున్నాడు. సిఎన్ఎం సభ్యున్ని పట్టించింది కూడా నిజమేనని ఒప్పుకున్నాడు. ఈ ప్రజాద్రోహికి మరణశిక్ష విధించి పీడ విరగడ చేశారు.

## పూల్‌సింగ్ భూమి స్వాధీనం

మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలో ప్రజలు సంఘాలు నిర్మించుకొని సంఘనాయకత్వంలో గ్రామ పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తాకిలోడ్ గ్రామంలో ఒక పోరాటం జరిగింది. తాకిలోడ్ గ్రామానికి చెందిన మాజీ పటేల్ పూల్‌సింగ్‌కు 35 ఎకరాల భూమి ఉంది. (ఇది 5గురు అన్నదమ్ములది) దీనిలో పూల్‌సింగ్ వాటా వదిలి మిగిలిన భూమిని గ్రామంలోని భూమిలేని వారికి పంచివ్వాలనీ గ్రామ సంఘం ప్రజా మీటింగ్‌లో తీర్మానించింది. ఈ తీర్మానానికి పూల్‌సింగ్ ఎదురుతిరిగాడు. దీనితో ప్రజలందరూ గ్రామ సంఘం ఆధ్వర్యంలో వాడి భూములలో ఎర్రజెండాలు పాతి 20 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిని 80 నాగళ్లతో దున్ని విత్తనాలు వేశారు. దీనిలో రెండు ఎల్‌జిఎస్‌లు, 125 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సంఘటన తర్వాత పూల్‌సింగ్ ప్రజల ముందు లొంగిపోయాడు. ఈ ఘటన ప్రజలలో పోరాడే స్వభావాన్ని పెంచింది. పెత్తందార్లకు జడుపు పుట్టించింది.

## ఎస్‌పి కాన్వాయిపై పిజిఏ గెరిల్లాల దాడి

గడ్‌చిరోలి డివిజన్‌లో దినదినం అభివృద్ధి చెందుతున్న విప్లవోద్యమాన్ని క్రూరంగా అణచి వేయడంలో భాగంగా జిల్లాలోని కీలకమైన ప్రాంతాల్లో ఈ మధ్యనే కొన్ని కొత్త పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటైన కోటి పోలీస్ క్యాంపుకు చెందిన పోలీసులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపులు జరుపుతూ దళాల జాడ చెప్పమని ప్రజల్ని వేధిస్తున్నారు. సెప్టెంబరు 14న ఒక పోలీస్ బ్యాచ్ బామ్రాఘడ్ ఏరియాలోని పద్దూర్ గ్రామానికి వచ్చి సర్పంచ్ ఇంటిలో పడుకోగా ఆ విషయాన్ని తెలుసుకొన్న పిజిఏ గెరిల్లాలు అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు పడుకున్న ఇంటిపై దాడి చేసి కాల్పులు జరపడంతో శత్రువు చాలా గాబరాకు గురైనాడు. ఈ ఘటన తర్వాత ఎంక్వైరీ కోసం అదనపు బలగాలు వస్తాయనే అంచనాతో భామ్రాగఢ్ నుండి కోటికి వచ్చే డాంబర్ రోడ్డుపై మందుపాతరలు పాతి ఆంబుష్ ఏర్పాటుచేశారు. ఊహించినట్లుగానే, పద్దూర్ సంఘటనను పరిశీలించడానికి, ఆ ఘటనలో పాల్గొన్న పోలీసుల మనోస్థైర్యం పెంచడానికి సెప్టెంబరు 18న 50 మంది కమాండోల్ని వెంటబెట్టుకుని ఆరు జీప్సీల్లో గడ్‌చిరోలి ఎస్‌పి కోటికి బయలుదేరాడు. మధ్యాహ్నం 12½ గంటలకు పిడిమిలి-కోటి గ్రామాల మధ్య ఈ ఎస్‌పి కాన్వాయిపై గెరిల్లాలు ఆంబుష్ చేశారు. ఇందులో ఐదుగురు కమాండోలు తీవ్రంగా గాయపడగా ఎస్‌పి

మాత్రం 'బాల్ బాల్ బచ్ గయా' అని ఊపిరి పీల్చుకున్నాడు. ఇంకా ఎప్పుడేమి జరుగుతుందోనని ఆందోళనకు గురై రాత్రికి రాత్రే అదనపు బలగాలతో రోడ్డంతా చెక్ చేయించుకొని గడ్చిరోలి వెళ్లిపోయాడు. ఆ తర్వాత మరో రెండు రోజులకు, 20వ తేది రాత్రి కోటి పోలీస్ స్టేషన్‌పై పిజిఏ గెరిల్లాలు డమ్మీ రెయిడ్ చేయగా పోలీసులు వందల తూటాలు వృధాగా కాల్చారు. వరుసగా జరిగిన రెండు మూడు ఘటనలతో శత్రువు భయానికి గురై కొద్ది రోజులు గాలింపు చర్యలు మానుకోగా ప్రజలు మాత్రం పోలీసుల ఆందోళననూ, మేకపోతు గాంభీర్యాన్నీ చూసి ఉత్సాహం పొందడమే గాక, గ్రామాల్లోకి వెళ్లిన దళాలతో 'ఎస్పిగాని జీపు కింద బాంబు పేల్చి ఎస్పిని చంపాల్సి వుండె'నని పోలీసు అధికారులపై తమ కసినీ, కోపాన్నీ వ్యక్తం చేశారు.

## బాలాఘాట్ జిల్లాలో పిజిఏ గెరిల్లాల దాడి : పేలుడు పదార్థాలు స్వాధీనం

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో గల మలాజ్‌ఖండ్ రాగి గనులకు సరఫరా అవుతున్న పేలుడు పదార్థాలను పిజిఏ గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. వార్తా పత్రికల కథనం ప్రకారం బాలాఘాట్ జిల్లాలోని లౌంగూర్ గ్రామానికి దగ్గర్లో పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న ట్రక్కును గెరిల్లాలు అడ్డుకున్నారు. అక్కడి నుండి ట్రక్కునూ, ట్రక్కు డ్రైవర్ క్లీనర్లను కూడా తమతో పాటే అడవిలోకి తీసుకెళ్లి అందులోంచి మొత్తం 9 టన్నుల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రక్కు డ్రైవర్ క్లీనర్లను నాలుగు రోజుల తర్వాత వదిలేశారు. ఇంత పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు గెరిల్లాల వశమవడంతో పాలక వర్గాలు గడగడా వణికిపోయాయి. వెంటనే గోందియాలో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పోలీస్, ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారులు సమావేశమై పెద్ద ఎత్తున పోలీసు బలగాల్ని దించి గాలింపు చర్యలను చేపట్టాలని నిర్ణయించారు. అవి మిగతా రాష్ట్రాలకు రవాణా కాకుండా చూడాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్ద ఎత్తున జరిపిన గాలింపు చర్యల మూలంగా పేలుడు పదార్థాలలో చాలా భాగం తిరిగి పోలీసుల చేతికి చిక్కినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ సందర్భంగా పోలీసులకూ, గెరిల్లాలకూ ఎదురు కాల్పులు కూడా జరిగినట్లుగా వార్తలొచ్చాయి. శత్రువు బలహీనతలను బాగా గమనించి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న ఈ ఘటన విప్లవ శ్రేణులకూ, వివిధ రాష్ట్రాల్లోని పిజిఏ బలగాలకూ ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. మరో వైపు ముఖ్యంగా దండకారణ్య ప్రాంతంలోని పోలీస్ అధికారులు "ఆ పేలుడు పదార్థాలు ఇటువైపు రాక తప్పదు, మా ప్రాణాలు బలిగాక తప్పవు" అనే బెంగతో తలలు పట్టుకున్నారు.

## పశ్చిమ బస్తర్ డివిజన్‌లో పిజిఏ ఆంబుష్

అక్టోబర్ 12న పశ్చిమ బస్తర్ డివిజన్ భూపాలపట్నం సమీపంలో చెరపల్లి వద్ద పిజిఏ పేల్చిన మందుపాతర దెబ్బకు ఎస్ఏఎఫ్ ప్లటూన్ కమాండర్ సహా ముగ్గురు పోలీసులు చనిపోగా కనీసం 8 మంది పోలీసులు గాయపడ్డారు. అయితే ఈ ఘటనలో బిఆర్ఓకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ప్రాణాలు కోల్పోయారు. గత నాలుగేళ్లుగా విప్లవ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం బిఆర్ఓ (బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ – దేశ సరిహద్దులలో రోడ్లను నిర్మించే సంస్థ) సహాయంతో రోడ్ల నిర్మాణానికి పూనుకుంది. పెద్ద సంఖ్యలో పోలీసుల్ని మొహరించి రోడ్డు నిర్మాణాన్ని వేగంగా సాగిస్తున్నది. ఈ నిర్మాణానికి రక్షణగా వస్తున్న పోలీసుల బృందంపై పిజిఏ గెరిల్లాలు మందుపాతర పేల్చి ఆంబుష్ చేశారు. అయితే పోలీసులతో పాటు బిఆర్ఓ ఉద్యోగులు కూడా కలగలిసి ఉండడంతో వారు కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.

## ట్రాక్టర్ రేట్లు నిర్ణయించుకున్న గడ్చిరోలి ప్రజలు

ఏటపల్లి ఏరియాలో వ్యవసాయం కొంత అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలలో ట్రాక్టర్లతో పొలాలను దున్నడం చేస్తున్నారు. కసంసూర్ రేంజ్‌లో కొందరు బెంగాలీ శరణార్థులు తమ ట్రాక్టర్లతో కిరాయికి పొలాలను దున్నుతారు. ఆదివాసులు కూడా కొందరు ట్రాక్టర్లు కొనుక్కొని కిరాయికి దున్నిపెట్టడం చేస్తున్నారు. అయితే దీనిపై ఎవరి అదుపూ లేకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చిన రేటు వాళ్లు వసూలు చేసుకుంటున్నారు. గంటకు 300 రూపాయల నుండి 400 రూపాయల దాకా వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టాలని డిఏకెఎంఎస్ నిశ్చయించింది. రేంజ్ కమిటీ నాయకత్వాన గత మార్చ్ నెలలో 10 గ్రామాలకు చెందిన 150 మంది ప్రజల సమక్షంలో ట్రాక్టర్ల యజమానులను పిలిపించి వారితో చర్చలు జరిపారు. గంటకు 225 రూపాయలు మాత్రమే తీసుకోవాలని నిర్ణయం జరిగింది. ఈ నిర్ణయంతో ఇష్టమొచ్చినంత కిరాయి తీసుకునే పద్ధతి నిలిచిపోయింది.

## భూపంపకం ఉద్యమం

గడ్చిరోలి డివిజన్‌లోని ఏటపల్లి ఏరియాలో గల జీజవండి గ్రామం నుండి చాలా కాలం కింద ఒక ఆదివాసీ వ్యక్తి వేరే గ్రామానికి వెళ్లిపోయాడు. అతను తన ఏడెకరాల భూమిని ఒక బెంగాలీ వ్యక్తికి సేద్యానికి అప్పజెప్పి వెళ్లిపోయాడు. ఆ బెంగాలీ వ్యక్తి కూడా చాలా పేదవాడు. అతను భూమిని బాగు చేసుకొని బతుకసాగాడు. ఈలోగా ఉరావ్ ఆదివాసులు వచ్చి భూమిని సేద్యం చేయడం కోసం అడవుల్ని నరుకసాగారు. ఒకవైపేమో బెంగాలీ రైతుల వద్ద గ్రామానికి చెందిన ఏడెకరాల భూమి ఉండడం, మరోవైపు ఎలాంటి భూములూ లేని రైతులు గ్రామంలో కొందరుండడం – ఇవన్నీ గమనించిన సంఘం గ్రామంలో ఒక మీటింగ్ ఏర్పాటు చేసింది. ప్రజలందరూ కొత్తగా అడవుల్ని నరకవద్దని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే బెంగాలీ రైతు ఆధీనంలోనున్న భూమిలో నుండి 4 ఎకరాలూ, పడీత్‌గా ఉన్న మరో 12 ఎకరాలూ కలిపి మొత్తంగా ఆరుగురు భూమిలేని రైతులకు పంచారు. అడవుల నరికివేతను పూర్తిగా నిలిపివేయాలని ప్రజలు నిర్ణయించారు.

## గోపనీయ పోలీసు బివా కేరామ్ ఖతం

టిప్రాగఢ్ ఏరియా భూక్‌మర్క (ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఉంది)కు 8 కి.మీ.ల దూరంలోని ఉచాపూర్ గ్రామానికి చెందిన బివా కేరామ్ వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. లంపెన్ స్వభావం కలిగిన ఇతను బాగా తాగేవాడు. ప్రజల్ని దారుణంగా కొడుతూ, భయపెడుతూ దొంగ కేసుల్లో ఇరికించేవాడు. అలా ఐదుగురు వీడి కారణంగా జైల్లో ఉన్నారు. టిప్రాగఢ్ దళం అక్కడికి పోయినప్పుడల్లా వీడు మాన్‌పూర్ పోలీసు స్టేషన్‌కు రిపోర్టు చేసేవాడు. పోలీసులకు నీళ్ళ జాగాలన్నీ చూపెట్టాడు. వీడి భార్య వీడి దుశ్చర్యలతో విసిగి వేసారి వీడినొదిలి వెళ్లిపోయింది. తర్వాత వీడు తాను మారానని భార్యను నమ్మించి తీసుకువస్తూ దారిలో తన తండ్రితో కలసి ఆమెపై అత్యాచారం చేశారు. మాన్‌పూర్ స్టేషన్‌కు పోయి ఈ విషయంపై ఫిర్యాదు ఇవ్వబోగా బివా తమ తొత్తైన కారణంగా పోలీసులు నిరాకరించారు. వీడి అరాచక చర్యలన్నింటినీ తెలుసుకున్న గెరిల్లా దళం ప్రజల అభీష్టం మేరకు ఊళ్లో నుండి వెళ్ళగొట్టింది. అయితే వీడు పోలీసులు ప్రత్యేక అభియాన్‌లు నడిపినప్పుడల్లా ముఖంపై ముసుగు వేసుకొని పోలీసు డ్రెస్సు తొడుక్కొని తోడుగా వచ్చేవాడు. దానితో ఫిబ్రవరి నెలలో వీడిని గెరిల్లాదళం మట్టుపెట్టి పీడ వదలించింది.

## ప్రజావ్యతిరేక పోలీసు ఉద్యోగి ధర్మా హలామి ఖతం

మురుంగావ్‌కి 5 కి.మీ. దూరంలోని కుల్‌భట్టి గ్రామం 1990-91లో పోరాట కేంద్రంగా ఉండేది. ఇదే గ్రామస్థుడైన ధర్మా హలామి 12వ తరగతి చదివి రహస్యంగా పోలీసు ట్రైనింగ్ చేశాడు. ఈ విషయం దళంకు తెలియగా, వద్దని అర్థం చేయించినా వినకుండా పోలీసు ఉద్యోగంలోకి పోయాడు. అంతకు ముందు దళం కదలికల గురించి పోలీసులకు సమాచారం చేరవేసింది కూడా వీడేనని తర్వాత బయటపడింది. వీడు ఉద్యోగంలో చేరి మురుంగావ్, గ్యారపత్తి, కార్‌వాప్ప పోలీసు క్యాంపులలో పనిచేసి ఆయా ప్రాంతాల ప్రజల్ని తిట్టడం, కొట్టడం, బెదిరించడంలో ముందుండేవాడు. వీడి కుటుంబ సభ్యుల ముందే వీడికి నచ్చజెప్ప ప్రయత్నించినా వీడి ఆగడాలు ఆగకపోవడంతో గెరిల్లా దళం మే 6న చంపివేసింది. దీనితో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

## పోలీసు ఇన్ఫార్మర్ పెంటా ఖతం

పెంటా అనేవాడు గడ్‌చిరోలి జిల్లా, భామ్రాఘడ్ తహశీల్, లహిరి ప్రాంతంలోని నేల్‌గొండ గ్రామస్థుడు. గతంలో డివికెఎంఎస్ రేంజి కమిటీ సభ్యుడిగా పనిచేశాడు. 1992 నిర్బంధంలో వీడు పోలీసు ఇన్ఫార్మర్‌గా మారాడు. నెలనెలా 1200 రూ.లు తీసుకుంటూ గత 10 సంవత్సరాలుగా రహస్యంగా పనిచేస్తున్నాడు. గతంలో మరో రేంజ్ కమిటీ సభ్యుడైన పూసుని చంపించి పోలీసుల నుండి 10 వేల రూపాయలు బహుమానంగా పొందాడు. తన గ్రామం వారినే గాక పొరుగు గ్రామస్థులను కూడా బెదిరిస్తూ ఉండడంతో వీడి గురించిన పై వివరాలన్నీ బయటపడ్డాయి. దానితో పిజిఏ గెరిల్లాలు వీడిని శిక్షించాలని నిర్ణయించి ఏప్రిల్ 26న ప్రజల ముందు విచారించి హతమార్చారు.

## ప్రజాద్రోహియైన పోలీసు పటేల్ ముత్తా ఖతం

సిరొంచ ఏరియాలో దుర్మవాడ గ్రామ పోలీసు పటేల్ ప్రజలను దోపిడీకి గురిచేసి, వారిపై పెత్తనం చలాయించేవాడు. పోలీసులతో చిత్రహింసలు కూడా పెట్టించేవాడు. దళం ప్రవేశించినప్పటి నుండి దళానికి వ్యతిరేకంగా పనిచేస్తూండేవాడు. 1993 నాటి నిర్బంధంలో రహస్యంగా తిరుగుతూ తన బంధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్న డివికెఎంఎస్ రేంజి కమిటీ నాయకుడు కా.లింగన్నను వీడు తన తొత్తులయిన ఆత్రం, బూధులతో కలసి పోలీసులకు పట్టించాడు. పోలీసులు కామ్రేడ్ లింగన్నను క్రూరంగా చంపేశారు. వీడికి 10 వేల రూపాయలు ముట్టాయి. ఈ ఘటన తర్వాత వీడు అహంకారంతో ప్రజలపై మరింత పెత్తనం చలాయించసాగాడు. దళానికి అన్నం పెట్టారని 12 మందిపై కేసు పెట్టించి జైలుకి పంపించాడు. మరోసారి చందాలు ఇచ్చారంటూ జైలు పాల్జేశాడు. వీడి కొడుకు కూడా గూండాగా తిరుగుతూ, అమ్మాయిలపై అత్యాచారం చేసేవాడు. అలాంటి ఒక కేసులో గ్రామస్థులు పోలీసు రిపోర్టు ఇస్తే దాన్ని పోలీసులు నమోదు చేసుకోలేదు. మధ్యలో చాలా ఏళ్ల పాటు ఈ ప్రాంతంలో గెరిల్లా దళం లేకపోవడంతో వీడు ఆడింది ఆటైంది, పాడింది పాటైంది. మళ్లీ సిరొంచ ఏరియాలో గెరిల్లా దళం ప్రవేశించిన తర్వాత జూన్ 21, 2002 నాడు అంటే 8 ఏళ్ళ తర్వాత వీడికి మరణశిక్ష విధించారు. వీడికి సహకరించిన ఇద్దరు వ్యక్తులకు ప్రజా తీర్పు మేరకు దేహశుద్ధి చేసి హెచ్చరించారు.

## పోలీసుల బారి నుండి సంఘ నాయకులను కాపాడుకున్న ఎర్రె గ్రామస్థులు

పెరిమిలి, దామరంచ పోలీసు స్టేషన్లకు చెందిన 40 మంది పోలీసులు మే 28 నాడు అహిరి ఏరియాలోని ఎర్రె గ్రామంపై ఐదుగురు సంఘ నాయకుల కోసం దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన గ్రామస్థులు ఆ నాయకులను ముందే దాచిపెట్టారు. దీనితో పిచ్చెక్కిన పోలీసులు ఐదుగురు వృద్ధులను పట్టుకొని ముసలివారని కూడా చూడకుండా చిత్రహింసలు పెట్టారు. దీన్ని సహించలేని గ్రామ ప్రజలు 'ముసలివారిని ఎందుకు కొడుతున్నార'ని నిలదీశారు. వాళ్లు నక్సలైట్ల పోస్టర్లు వేస్తున్నారంటూ, నక్సలైట్లకు అన్నం పెడుతున్నారంటూ పోలీసులు తప్పుడు ఆరోపణలతో బుకాయించబోతే. "వారు మీ ముందే పోస్టర్లు వేస్తే అప్పుడే ఎందుకు పట్టుకోలేదు? దళానికి తిండి పెడితే తప్పేమిటి?" అంటూ ఎదురు ప్రశ్నించి వాళ్లను అరెస్టు చేస్తే మాత్రం తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ప్రజల ప్రతిఘటనను చూసి గుండెజారిన పోలీసులు తోక ముడిచారు.

## పోలీసుల్ని ప్రతిఘటించి సంఘ నాయకులను విడిపించుకున్న మిచ్చుగుండ ప్రజలు

13 ఇండ్లున్న మిచ్చుగుండ గ్రామంపై పోలీసులు దాడిచేసి సంఘ నాయకుల అరెస్టుకై ప్రయత్నించగా ప్రజలు ఎదిరించి అడ్డుకున్నారు. దొంగచాటుగా తీసుకుపోవడానికి ప్రయత్నించగా విడిపించుకున్నారు. అయినా పోలీసులు రెండు బ్యాచీలుగా విడిపోయి, ఒక బ్యాచీ ప్రజల్ని మాటల్లోకి దించి రెండో బ్యాచీ వాళ్లు ఇద్దరు సంఘ నాయకులను పట్టుకొని ఫరారైనారు. ఇది గమనించిన 20 మంది స్త్రీపురుషులు కాలిబాట గుండా పోలీసులకన్నా ముందే పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఇనస్పెక్టర్‌ను నిలదీశారు. వాళ్లను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పోలీసుల బ్యాచీ అరెస్టు చేసిన సంఘ నాయకులతో పాటు స్టేషన్‌కు చేరుకుంది. ఇన్‌స్పెక్టర్‌ని హెచ్చరించి తమ నాయకుల్ని విడిపించుకున్నారు. పోలీసులు వారవారం స్టేషన్‌కు వచ్చి రిపోర్టు చేయాలని షరతు విధించగా ప్రజలు దాన్ని నిరాకరించి 'మీరు మా గ్రామానికి రావద్ద'ని ఖరాఖండిగా చెప్పేశారు. ❑

### పాఠకులకు విజ్ఞప్తి

- 'ప్రభాత్'కు రెగ్యులర్‌గా, వెంటవెంట రిపోర్టులూ, వ్యాసాలూ రాసి పంపించండి. రిపోర్టులు కాగితానికి ఒకవైపే రాసి పంపితే మంచిది. రిపోర్టులో పేర్కొంటున్న ఘటన/కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం, డివిజన్ వంటివి తప్పక రాయండి.
- వివిధ ప్రజా కార్యక్రమాలకు సంబంధించి 'ప్రభాత్'కు పంపించే ప్రతి ఫోటోకు వెనుక అది ఏ డివిజన్‌లో, ఏ ఏరియాలో, ఏ సందర్భంగా, ఏ తేదీన తీసిందో తప్పక రాసి మాకు సహకరించగలరు. చాలా ఫోటోలు కలగలిసిపోయి ఏది ఏ డివిజన్‌దో, ఏ కార్యక్రమానికి సంబంధించినదో, ఎప్పటిదో తెలువకుండా పోతున్నది.
- 'ప్రభాత్'ను ఈ-మెయిల్ ద్వారా కాంటాక్టు చేయవచ్చు.

మా ఈ-మెయిల్ అడ్రస్ :
**prabhat_dk@yahoo.com**

*– సంపాదకవర్గం*

# బూటకపు స్వాతంత్ర్యదినానికి నిరసనగా 'కాలా దివస్'

1947 ఆగస్టు 15 నాడు వచ్చిందని చెప్తున్న స్వాతంత్ర్యం ఒక బూటకమని ప్రకటిస్తూ దండకారణ్య ప్రజలు వివిధ డివిజన్లలో 'స్వాతంత్ర్య' దినం నాడు 'కాలా దివస్' (నిరసన దినం) జరుపుకున్నారు. వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున కదిలి నల్లజెండాలు ఎగురవేసి బూటకపు స్వాతంత్ర్యాన్ని నిరసించి నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని నినదించడం విశేషం.

## గడ్చిరోలి డివిజన్

పార్టీ టిప్రాగఢ్ ఏరియా కమిటీ మురుంగాం రేంజ్‌లో బూటకపు స్వాతంత్ర్యం గురించి పెద్ద ఎత్తున ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించింది. గెరిల్లా దళం ఒక స్కూల్లో నల్లజెండా ఎగురవేసి సభ నిర్వహించగా ఇందులో 25 మంది విద్యార్థులు సహా గ్రామ ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సభలో బూటకపు స్వాతంత్ర్యాన్ని నిరసిస్తూ వక్తలు మాట్లాడారు. ఇంకో గ్రామంలో జరిగిన బహిరంగ సభలో 70 మంది మహిళలు సహా 180 మంది ప్రజలు పాల్గొన్నారు. మూడు గంటల పాటు సాగిన ఈ సభలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులూ, గ్రామ పార్టీ కమిటీ సభ్యులూ ప్రసంగించారు. నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని విజయవంతం చేసినప్పుడే ప్రజలకు నిజమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభిస్తాయని వాళ్లు తమ ప్రసంగాల్లో నొక్కి చెప్పారు. దండకారణ్యంలో నడుస్తున్న ప్రజాయుద్ధంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వక్తలు కోరారు.

బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎండగడ్తూ రెండు చోట్ల విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)ల నాయకత్వంలో ఊరేగింపులూ, సభలూ జరిగాయి. మొదటి ఆర్‌పిసి కిందకు వచ్చే 8 గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక ఊళ్లో మొదలైన ఊరేగింపు బూటకపు స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రెండో గ్రామానికి చేరుకుంది. ఆ ఊరి ప్రజలను కలుపుకొని అది మూడో గ్రామానికి వెళ్లింది. ఇలా అన్ని గ్రామాలు పూర్తయిన తర్వాత అది చివరి గ్రామంలో బహిరంగ సభగా రూపుదాల్చింది. సభలో ఆర్‌పిసి అధ్యక్షుడితో పాటు వివిధ సబ్ కమిటీల అధ్యక్షులు ప్రసంగించారు. వారు తమ ప్రసంగాలలో దండకారణ్యంలో నేడు గ్రామస్థాయిలో ఊపిర్లు పోసుకుంటున్న ప్రజా రాజ్యాధికారాన్ని పటిష్టం చేసుకుంటూ దేశవ్యాప్త రాజ్యాధికార స్వాధీనానికై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పుడే పీడిత ప్రజలందరికీ నిజమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభిస్తాయని వారు వివరించారు. ఈ సభలో 8 గ్రామాలకు చెందిన 2,500 మంది ప్రజలు పాల్గొన్నారు.

ఇదే విధంగా మరో చోట కూడా ఆర్‌పిసి నాయకత్వంలో ప్రజలు బూటకపు స్వాతంత్ర్యం పట్ల నిరసన వ్యక్తం చేశారు. 10 గ్రామాల పరిధి గల ఈ ఆర్‌పిసి నాయకత్వాన జరిగిన సభలో మొత్తం 3,000 మంది ప్రజలు పాల్గొన్నారు. మరో చోట ఆర్‌పిసి నాయకత్వాన జరిగిన సభలో 6 గ్రామాలకు చెందిన 300 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ మొత్తం కార్యక్రమాలలో మహిళల సంఖ్య 40-45 శాతంగా ఉండడం మరో విశేషం.

30 మంది పిజిఏ సైనికులు ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్య దినానికి వ్యతిరేకంగా ఆరు గ్రామాలలో క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిజిఏ సైనికులు యువతీయువకులను పోలీసు బలగాల్లో చేరవద్దని విజ్ఞప్తి చేశారు. పిజిఏలో చేరి భూస్వామ్య విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్నీ అంతమొందింపజేసినపుడే ప్రజలందరికీ సుఖశాంతులూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలూ లభిస్తాయని వివరించారు. యువతీయువకులు చరిత్ర తమపై ఉంచిన బాధ్యతలకు న్యాయం చేయడానికి సిద్ధం కావాలని కోరారు. ఇదే సందర్భంగా ఆగస్టు 15కు నిరసనగా పిజిఏ సైనికులు కోట్గుల్ పోలీసు క్యాంపుపై కాల్పులు జరిపారు. బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎండగడ్తూ ఏరియాలో మొత్తం 300 పోస్టర్లు అంటించారు. నల్ల బ్యానర్లు కట్టారు.

## మాడ్ డివిజన్

మాడ్ డివిజన్ ప్రజలు ఆగస్టు 15న నిరసన దినం పాటించి పాలకవర్గాలు చెప్పే మేడిపండు స్వాతంత్ర్యాన్ని నిరసించారు. బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా బస్తర్ ప్రజలు చేసిన వీరోచిత తిరుగుబాట్లను గుర్తు తెచ్చుకొని వాటికి నాయకత్వం వహించిన గేందసింగ్, గుండాదూర్ వంటి త్యాగధనులకూ, మరెందరో వీరయోధులకూ జోహార్లు తెలిపారు. బస్తర్ నేలను విదేశీ పాలన నుండి విముక్తి చేసి ప్రజారాజ్యం స్థాపించాలని వారు కన్న కలలు నేటికీ పూర్తి కాలేదని ఈ సందర్భంగా జరిగిన సభల్లో వక్తలు మాట్లాడారు. నిజమైన స్వాతంత్ర్యం కోసం ఇప్పుడు దండకారణ్యంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రతినిధులు బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై విద్రోహానికి పాల్పడిన ఫలితమే ఈ అర్ధరాత్రి స్వతంత్రమని వక్తలు ప్రజలకు వివరించారు. కోహ్కామెట్ట గ్రామంలో జరిగిన నిరసన దినం సభకు స్త్రీపురుషులూ, విద్యార్థులూ, ఉపాధ్యాయులూ కలిసి మొత్తం 150 మంది హాజరయ్యారు. నల్లజెండా ఎగరేసిన తర్వాత కా. కౌసల్య, కా. నవీన్‌లు ప్రసంగించారు. ఇరుకుబట్టి గ్రామంలో డిఏకెఎంఎస్ నాయకత్వాన జరిగిన నిరసన సభలో 300 మంది ప్రజలు పాల్గొని బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎండగట్టి నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రతిన బూనారు. ఇదే విధంగా సోన్‌పూర్‌లో 200 మంది, కిహ్కాడ్‌లో 100 మంది, వెచ్చలో 80 మంది, ముర్‌నార్‌లో 100 మంది, మొహందిలో 300 మంది, హిక్‌పాడ్‌లో 100 మంది, ఆకబేడలో 80 మంది స్త్రీపురుషులూ, స్కూలు విద్యార్థులూ, ఉపాధ్యాయులూ కలిసి ఆగస్టు 15ను నిరసన దినంగా జరుపుకున్నారు. ❑

---

*(..... 39వ పేజీ తరువాయి)*

తెలువకుండా పోతూ పోతూ తాము 'ప్రతిఘటన' గ్రూపు వాళ్లమని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూశారు.

భామ్రాగఢ్ దళ ఏరియాలో పిజిఏ గెరిల్లాలు భామ్రాగఢ్ పోలీసు స్టేషన్‌పై డమ్మీ దాడి చేయగా పోలీసులు సామాన్య రైతులను అరెస్టు చేసి దాడికి పాల్పడింది వారేనని కేసుపెట్టి జైలుకి పంపారు. అలాగే గెరిల్లాలు లహిరి పోలీసు స్టేషన్‌పై దాడి చేయగా, పోలీసులు 11 మంది గ్రామస్తులను పట్టుకుపోయి అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేశారు.

గడ్చిరోలి జిల్లాలో నిర్బంధం రోజురోజుకూ పెచ్చరిల్లిపోతున్నది. ప్రభుత్వం ప్రజల న్యాయమైన పోరాటాలను అణచివేస్తూ పోలీసు రాజ్యం నెలకొల్పుతోందంటే ఆశ్చర్యపోవల్సిందేమీ లేదు. ప్రజల జీవించే హక్కును కూడా కాలరాచి వేస్తూ అసలు పౌరహక్కులనేవే లేకుండా చేస్తోంది. నిర్బంధం ద్వారా విప్లవోద్యమాన్ని సమూలంగా నాశనం చేయగలమని పోలీసులు విర్రవీగుతున్నారు. కానీ నిర్బంధం ప్రతిఘటనకు దారితీయక తప్పదు. ప్రజలు మరింత మిలిటెంట్‌గా పోరాడి ఈ నిర్బంధాన్ని ఓడించి తీరుతారు. ❑

# దండకారణ్యంలో పోలీసు నిర్బంధం – ప్రజా ప్రతిఘటన

## ఉత్తర బస్తర్ డివిజన్

ఉత్తర బస్తర్ డివిజన్‌లో ప్రభుత్వ పోలీస్ బలగాలు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి వివిధ ఎత్తుగడలు అనుసరిస్తున్నాయి. ప్రధానంగా ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పెంపొందించుకొని దళాలను నిర్మూలించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే, ప్రజా సంఘాల నాయకులనూ, సానుభూతిపరులనూ, సాధారణ ప్రజలనూ అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో నిర్బంధిస్తున్నారు. వారిని విపరీతమైన చిత్రహింసలకు కూడా గురి చేస్తున్నారు.

గత వేసవిలో పిజిఏ బలగాలూ, ప్రజలూ ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌ను నిర్వహించి దాదాపు 10 మంది గోపనీయ్ సైనికులను హతమార్చారు. ఇంకా అనేక మంది ఇన్‌ఫార్మర్లకూ, ప్రజావ్యతిరేకులకూ వివిధ రకాల శిక్షలు విధించి వాళ్లను అదుపులోకి తెచ్చుకున్నారు. దీనితో శత్రువు వేసుకున్న ప్లానులు చాలా వరకు బెడిసికొట్టాయి. దానితో కొత్తకొత్త పద్ధతుల్లో ఇన్‌ఫార్మర్లను తయారు చేసుకోవడం ద్వారా, కోవర్టులను దళాలలోకి చొప్పించడం ద్వారా విప్లవోద్యమాన్ని అణచివెయ్యాలని శత్రువు తన ప్రయత్నాలు మొదలు పెట్టాడు. పోలీసులు కొండగావ్ ఏరియాలో దినకర్ అనే వాడినీ, అలాగే రైజు అనే డిఏకెఎంఎస్ మాజీ నాయకున్ని కోవర్టుగా మార్చుకొని దళంలోకి పంపించడానికి ప్రయత్నించారు. అయితే దళం ఈ కుట్రను ముందుగానే పసిగట్టి ప్రజల మద్దతుతో వారిని శిక్షించింది. కేస్కాల్ ఏరియాలో రాంప్రసాద్ అనే వాడు ఒకప్పుడు మన సానుభూతిపరుడిగా ఉండేవాడు. తర్వాత వాడు గోపనీయసైనిక్‌గా మారాడు. వీడు తాను పోలీసుల్లో ఉండలేక పోతున్నాననీ, దళంలో చేరుతాననీ స్థానిక ఏరియా కమిటీకి వర్తమానం పంపాడు. ఇది కూడా నాటకమని తేలిపోయింది.

మొత్తం డివిజన్‌లోని 60-70 మంది యువకులకు పోలీసులు దంతెవాడలో ట్రైనింగ్ ఇచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో ఇస్తే వారు ప్రజల దృష్టిలో పడి ఎక్స్‌పోజ్ అవుతారనీ డివిజన్‌కు దూరంగా ఉన్న దంతెవాడలో వీరికి ట్రైనింగ్ ఇచ్చారు. వీరికి ఏకే-47 వంటి ఆటో రైఫిల్లను ఉపయోగించడంతో పాటు గ్రెనేడ్స్ విసరడంలోనూ, రివాల్వర్స్ వాడడంలోనూ ట్రైనింగ్ ఇచ్చారు. గ్రామాలకు దళాలు వచ్చి డేరాలు వేసినపుడు ఎలా దాడి చేయాలో, దళాలు రోడ్లు దాటేటపుడు ఎలా దాడి చేయాలో నేర్పించారు. రెగ్యులర్‌గా గ్రామాల నుండి దళాల సమాచారం సేకరించడానికి గానూ గ్రామగ్రామాన చిన్నచిన్న ఇన్‌ఫార్మర్లను తయారుచేసుకొని వారితో రహస్యంగా కాంటాక్టు పెట్టుకోవడం వంటి పద్ధతుల్లో వీరికి శిక్షణనిచ్చారు.

ఈ ఇన్‌ఫార్మర్లు చాలా మట్టుకు గ్రామాల్లోకి రాత్రి పూటే వస్తారు. ఊరి చివరన ఉండే ఇండ్లలో గానీ, సమీపంలోని అడవిలో గానీ ఉండి ఇతర ఇన్‌ఫార్మర్లను కల్సుకుంటారు. పండుగలూ, పెండ్లిళ్ల సందర్భంగా చుట్టాల రూపంలో వచ్చి ఇన్‌ఫార్మర్లను కలిసి పోతారు. లోతట్టు గ్రామాల్లోకి బీరకాయ చుట్టం ఆధారంతో వచ్చి పోతుంటారు. అలాగే గ్రామాల్లోని పెత్తందార్లను చేరదీసి వాళ్లను పార్టీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టి ర్యాలీలు తీయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు కోయిలిబేడ, కేస్కల్ ఏరియాల్లో జరిగాయి. కొండగాం ఏరియాలో గతంలో జరిగి, ప్రజా ప్రతిఘటన కారణంగా వాళ్లు మళ్లీ అదుపులోకి వచ్చారు.

ఇకపోతే పోలీసులు ఈ డివిజన్‌లో నల్లదండు ముఠాలను బాగా ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ ముఠాలలో ముగ్గురి నుండి ఐదారుగురు వరకు సభ్యులుంటారు. వీరికి ఆటో రైఫిల్స్, రివాల్వర్లూ, గ్రెనేడ్స్ ఇస్తున్నారు. వీరికి కొంత ఏరియా కేటాయిస్తున్నారు. ఈ ముఠాలు రాత్రి పూట గ్రామాల్లో తిరుగుతూ చిన్నచిన్న ఇన్‌ఫార్మర్లనూ, గెరిల్లా దళాల చేతుల్లో శిక్షలు పొందిన కుటుంబాలను కలుస్తూ సమాచారం సేకరిస్తాయి. వీళ్లు ఇచ్చే సమాచారాన్ని బట్టి డబ్బులు ముట్టజెప్పుతుంటాయి.

ఉత్తర బస్తర్ ప్రజలు పోలీస్ నిర్బంధాన్ని దృఢంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. వేసవిలో పోలీసులు ప్రారంభించిన గుండాదూర్ కీ జయ్ అభియాన్‌లో భాగంగా జార గ్రామానికి చెందిన ఊసెండిని హత్య చేసి చాలా గ్రామాల్లో అక్రమ అరెస్టులకు పూనుకోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున కదిలి నిర్బంధానికి వ్యతిరేకంగా గొంతు విప్పారు. నారాయణపూర్ థానేదార్ అమృత్ కెర్‌కెట్ట ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నందున వాడిని సస్పెండు చేసి చట్టప్రకారం శిక్షించాలని ప్రజలు ఆందోళనకు దిగారు. దీనితో ప్రభుత్వం తప్పనిసరై అమృత్ కెర్‌కెట్టను బదిలీ చేసి చేతులు దులుపుకుంది.

## ఆగని అరెస్టుల పరంపర

పెత్తందార్ల, తెగపెద్దల అధికారం కూలిపోతూ, ప్రజలు మిలిటెంట్‌గా కదిలి పోలీస్ బలగాలను సాయుధంగా ఎదిరిస్తున్న నేపథ్యంలో శత్రువు తన క్యాంపు మనోస్థైర్యాన్ని నిలబెట్టేందుకై గుండాదూర్ అభియాన్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ అభియాన్‌లో భాగంగా గత ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు మొత్తం డివిజన్‌లో పోలీసులు 81 మందిని అరెస్టు చేశారు. వీరిలో సంఘ సభ్యులూ, ప్రజల పట్ల సానుకూలంగా వ్యవహరించే సర్పంచ్‌లూ, సాధారణ ప్రజలూ ఉన్నారు. ఈ 81 మందిలో ప్రస్తుతం 34 మంది జైల్లో ఉన్నారు. మిగిలిన వారినీ జమానత్‌పై విడిచి పెట్టారు. అయితే వాళ్లింకా కేసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

కొండగాం ఏరియాలో మైమగవాడిలో ఇద్దరిని, హేమదళ్‌లో ఒకరిని, గాయితపారలో సంఘ సభ్యులు సుఖ్‌మన్, బీర్‌సింగ్‌లనూ, సానుభూతిపరుడైన రాజ్‌మన్‌నూ అరెస్టు చేసి జైల్లో నిర్బంధించారు. అలాగే పర్సగాంలో 9 మందిని అరెస్టు చేసి వారిలో నలుగురిని జైలుకి పంపారు. ఈ నలుగురూ సాధారణ ప్రజలు. వీరిలో రాము అనే వ్యక్తి స్కూల్లో చప్రాసీగా పని చేస్తున్నాడు. ఇతను హాస్టల్‌కు అవసరమైన సామాన్ల కోసం నారాయణపూర్ వెళ్లి వస్తుండగా అరెస్టు చేసి ఇతనిపై 23 కేసులు మోపారు. సెప్టెంబర్‌లో మలాజ్‌కట్ట గ్రామానికి చెందిన ఇద్దరు సంఘసభ్యులు డోంగుర్ సంతకు వెళ్లగా పోలీసులు వాళ్లకు అక్కడే అరెస్టు చేసి కేసు పెట్టి జమానత్ మీద వదిలేశారు. కోసల్‌పారకు చెందిన మాజీ సంఘ సభ్యుడు మైను చేపలు పట్టడానికి చెరువు దగ్గరికి వెళ్లగా అక్కడే అరెస్టు చేసి అక్రమ కేసు బనాయించారు. విత్తనాల కోసం జార గ్రామానికి చెందిన కొందరు రైతులు బడ్‌గాం వెళ్లగా పోలీసులు "మీరు నక్సలైట్లకు సమాచారం తీసుకెళ్లడానికే వచ్చారంటూ" ఆరోపిస్తూ అరెస్టు చేశారు. వారిని బాగా కొట్టి రెండు రోజుల తర్వాత వదిలిపెట్టారు.

కోయిలిబేడ ఏరియాలోని కడిమె గ్రామ డిఏకెఎంఎస్ అధ్యక్షున్నీ, ఇంకా ఇద్దరు సంఘ సభ్యులనూ పోలీసులు అరెస్టు చేశారు. కూర్సబొడ్డి గ్రామానికి చెందిన రామేశ్వర్‌ను అరెస్టు చేసి చంపుతామనీ బెదిరించి అతనితో బలవంతంగా కడిమెలో పోలీసులపై పిజిఏ జరిపిన దాడిలో దళం డిప్యూటీ కమాండర్ నిర్మల చనిపోయిందని అబద్ధపు ప్రకటన యిప్పించారు.

మేంఢ్రలో 8 మందినీ, కొద్దపాకలో ఐదుగురినీ అరెస్టు చేశారు. సోదెలో 9 మందిని రోడ్డుమీద పనుందని తీసికెళ్లి అరెస్టు చేశారు.

మేండ్రలో జరిగిన అరెస్టుల విషయంలో ప్రజలు రాయపూర్ వెళ్లి అధికార్లతో మాట్లాడారు. కేస్కల్ ఏరియాలోని సరండిలో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఒక డ్రైవర్‌పై నక్సలైట్లకు తుపాకులు ఇస్తున్నాడనీ ఆరోపణ మోపి అతన్ని జైలుకు పంపారు. ఆమగాంలో ఇద్దర్నీ, చిప్పాండీలో ఒకర్నీ, ముర్‌నార్‌లో ఒకరినీ పట్టుకున్నారు. ముర్‌నార్‌లో వారు సంఘ సభ్యున్ని పట్టుకోవడానికి ప్రయత్నించినపుడు అతను పారిపోగా పోలీసులు తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ అరెస్టులను ఎదిరించినందుకు గానూ పోలీసులు గ్రామ మహిళలపై కూడా చేయి చేసుకున్నారు. సాలడుగుమెట్టలో ఇద్దరినీ, కొడ్వార్‌లో ఇద్దరినీ పట్టుకొని తర్వాత వదిలిపెట్టారు. ఊచకోట్ గ్రామంలో హీరాసింగ్‌ను అరెస్టు చేశారు. గోటియా గ్రామ పటేల్, సర్పంచ్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. గతంలో వీళ్ల పోలీసులకు సమాచారం చేరవేసే వాళ్లు. వీళ్లపై సంఘం పంచాయితీ జరిపి హెచ్చరించడంతో వీళ్లు తటస్థులయ్యారు. వీళ్లు తటస్థులుగా మారడం మింగుడుపడని పోలీసులు వీళ్లను పట్టుకుని కొట్టి వదిలి పెట్టారు. సంతలోకి వచ్చే వాళ్లలో ఎవరు ఏ ఊరి వాళ్లో, ఎవరు సంఘం వాళ్లో ఇన్‌ఫార్మర్ల ద్వారా తెలుసుకొని సంతలోనే అరెస్టు చేస్తున్నారు. దానితో జనాలు సంతలకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎడ్క గ్రామానికి ముగ్గురు పోలీసులు వచ్చి తాము నక్సలైట్లమని చెప్పుకొని ఒక రైతును దళం పిలుస్తున్నదంటూ మోసగించి తీసుకెళ్లారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మహిళా పోలీసులు కావడంతో ఆ రైతు నిజమేననుకున్నాడు.

ఈ అరెస్టుల పరంపరకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటన కూడా పలురూపాల్లో వ్యక్తమవుతున్నది. గ్రామాల్లోకి వస్తున్న గూఢచారులను పట్టుకొని శిక్షించడం, గస్తీకి వస్తున్న పోలీసులపై బర్మార్లతో ఫైరింగ్ చేసి చికాకు పర్చడం వంటి చర్యల్ని ప్రజలే చొరవగా చేపడుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న బూటకపు సంస్కరణ పథకాలను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ పోలీస్ అణచివేత విధానాలను ఎదిరిస్తూ పోరుపథంలో ముందడుగు వేస్తున్నారు. అణచివేత చర్యల్లో భాగంగా ప్రభుత్వం నారాయణాపూర్‌ను పోలీస్ జిల్లాగా ప్రకటించగా ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి దీనిపట్ల తమ వ్యతిరేకతను ప్రకటించారు.

## దక్షిణ బస్తర్ డివిజన్

'ఆపరేషన్ గుండాదూర్ కీ జై' పేరిట పోలీసులు మొదలుపెట్టిన నిర్బంధ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రజలను తీవ్రమైన నిర్బంధానికి గురి చేస్తున్నారు. దక్షిణ బస్తర్ డివిజన్‌లోని జేగురుగొండ, చింతల్‌నార్, చింతగుప్ప పోలీసులు 3 గ్రామాలపై దాడులు జరిపి 15 మంది చిన్న వ్యాపారులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారు. వారు నక్సలైట్లకు సామాన్లు అందజేస్తున్నారనీ, నక్సలైట్లతో సంబధాలున్నాయనీ ఆరోపించారు. సంతసంతకూ తిరిగితే తప్ప పొట్టగడవని ఈ వ్యాపారులను అరెస్టు చేయడంతో వాళ్ల కుటుంబసభ్యులు అనేక బాధలు పడుతున్నారు. కుండేర్ అనే గ్రామంపై రాత్రింబవళ్లు 5, 6 సార్లు పోలీసులు పదుల సంఖ్యలో దాడి చేసి ముగ్గురు డివికెఎంఎస్ సభ్యులను అరెస్టు చేశారు. మరో యిద్దరు సంఘ నాయకులు పోలీసుల హింసలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు.

సిలింగేర్ గ్రామ ప్రాథమిక ఆశ్రమ పాఠశాల చప్రాసీని కూడా నక్సలైట్లతో సంబంధాలున్నాయనీ చెప్పి అరెస్టు చేశారు. ఆ తర్వాత తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారు. చింతల్‌నార్ పోలీసులు కొత్తగూడెం గ్రామానికి చెందిన ఒక యువకున్ని ఏఎస్సై హత్యలో ఉన్నాడనే ఆరోపణతో అరెస్టు చేశారు. దొంగల్లా అర్ధరాత్రి అతన్ని అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. కుంట పోలీసులు కాంగూడెం గ్రామానికి చెందిన కడ్డి ముత్తాల్‌ను అరెస్టు చేసి అతనిపై ఎర్రబోర్‌లో పట్వారీ బంగ్లాను పేల్చిన కేసు పెట్టి జైలుకు పంపారు. జూలై మొదటివారంలో కుంట పోలీసులు కామరాజ్ అనే గ్రామంలో డివికెఎంఎస్ మాజీ రేంజ్ కమిటీ సభ్యుడు మెర్కో లచ్చాలు యింటిపై రాత్రి 12 గంటలకు దాడిచేసి గ్రెనేడ్ లాంఛర్‌తో గ్రెనేడ్ వేశారు. ఆ తర్వాత తుపాకులతో కాల్పులు జరిపారు. చింతల్‌నార్ పోలీసులు పెద్ద బోడికల్ గ్రామం మీద దాడి చేసి ఛోటు అనే యువకుణ్ని అరెస్టు చేశారు. అతన్ని స్టేషన్‌లో నాలుగు రోజులపాటు తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. బాసగూడెం పోలీసులు ముర్కినార్ గ్రామంలో దాడి చేసి కోసాల్ అనే మాజీ డివికెఎంఎస్ నాయకున్ని అరెస్టు చేసి ఒక రోజు స్టేషన్‌లో బంధించి వదిలారు. దోర్నపాల్ పోలీసులు 60 మంది బొడ్డికుంట అనే గ్రామం మీద జూన్ 23న దాడి జరిపారు. అయితే ఈ దాడిని ముందుగానే పసిగట్టిన సంఘనాయకులు తప్పుకోగా యిళ్లల్లో ఉండిపోయిన స్త్రీలను నానా బూతులు తిట్టి వెళ్లిపోయారు.

పైన పేర్కొన్న దాడులన్నీ జూన్ 10 నుండి జూలై ఆఖరు వరకూ చేశారు. ఈ నిర్బంధ క్యాంపెయిన్ ద్వారా ప్రజల్లో భయభ్రాంతులు కలగజేసి వారిని ఉద్యమం నుండి వైదొలగిపోయేలా చేయడం పోలీసుల లక్ష్యం. అందుకే అమాయకులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా మహిళలపై చేయిచేసుకోవడం, అత్యాచారాలు చేయడం వంటి దారుణాలకు పాల్పడ్డారు. అరెస్టయిన వారి నుండి వేలాది రూపాయలు లంచాలు గుంజారు. ఇండ్లపై దాడులు చేసినప్పుడు విలువైన వస్తువుల్ని కాజేసి బందిపోట్లను మరిపించారు. అయితే ఈ నిర్బంధాలు దక్షిణ బస్తర్ ప్రజలకు కొత్తకాదు. నిర్బంధం ప్రతిఘటనకు తప్పక దారితీస్తుందని నిరూపిస్తూ దక్షిణ బస్తర్ ప్రజలు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తారనీ, నిర్బంధాన్ని ఓడిస్తారనీ ఆశిద్దాం.

## పశ్చిమ బస్తర్ డివిజన్

'ఆపరేషన్ గుండాదూర్ కీ జయ్' పేరిట ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రారంభించిన నిర్బంధ క్యాంపెయిన్ ప్రజలపై విరుచుకుపడుతున్నది. ఎందరో అమాయకులను పోలీసులు అరెస్టు చేసి పాశవిక హింసలకు గురిచేస్తున్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని మద్దేడ్ ఏరియాలో బీజాపూర్ ప్రత్యేక పోలీసు జిల్లా ఎస్.పి., భూపాలపట్నం ఎస్.డి.ఎం.ల నేతృత్వంలో స్థానిక పోలీసులూ, ఎస్ఏఎఫ్ జవాన్లూ కలిసి జూన్ 1 నుండి 10వ తేదీ వరకు గ్రామాలపై రాత్రింబవళ్లు విచ్చలవిడిగా దాడులు జరిపి అనేక మందిని అరెస్టు చేశారు. ప్లటూన్, కంపెనీ ఫార్మేషన్లలో ఒక యుద్ధానికి కదలి వెళ్లినట్లుగా గ్రామాలపై బడి దొరికిన వారినల్లా చితకబాదడం, నక్సలైట్ల కార్యకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఆరోపిస్తూ వారిని ఈడ్చుకెళ్లడం, తీవ్ర చిత్రహింసలకు గురి చెయ్యడం, జైళ్లకు పంపడం చేస్తున్నారు. ఈ విధంగా పోలీసులు మద్దేడ్, భూపాలపట్నం ఏరియాలో 20 గ్రామాల్లో 100కు పైగా మందిని అరెస్టు చేశారు. 30 మందిని బెయిల్‌పై విడుదల చేశారు. అయితే వీరిపై ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. మరో 25 మందిని దంతెవాడ జైల్లో బంధించారు. పోయిన ఎండాకాలంలో 'పనికి ఆహారం' పథకాన్ని అమలు చేసి ప్రజలకు మేలు చేసినట్లుగా గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం, ఈసారి వర్షాకాలంలో రైతాంగాన్ని అరెస్టు చేయించి భూముల్ని కూడా దున్నుకోనీకుండా చేసింది. దానితో చాలా కుటుంబాలు కనీసం నాట్లైనా వెయ్యలేకపోయాయి.

## మాడ్ డివిజన్

మాడ్ డివిజన్‌లోని పరాల్‌కోట్ ఏరియాలోని బీనగుండ ప్రాంతంలో పోలీసుల నిర్బంధం తీవ్రంగా కొనసాగుతున్నది. ఈ ప్రాంతంలో బలపడుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచడానికి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర

ప్రభుత్వాలూ కలిసి ఆదివాసీలపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. పోలీసులకు అధునాతన ఆయుధాలు సమకూర్చుతూ, రకరకాల కొత్త పద్ధతుల ద్వారా ఇన్‌ఫార్మర్ మెకానిజాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి.

ఈ ఏరియాలోని పోదెవాడ గ్రామంలోకి పోలీసులు రెండు బ్యాచీలుగా వచ్చి గ్రామాన్ని చుట్టుముట్టి యువకులను విచక్షణా రహితంగా కొట్టి, బీభత్సం సృష్టించి ఇద్దరిని అరెస్టు చేశారు. బీనగుండలో 7గురిని, బట్టువాడలో 8 మంది సంఘం వాళ్లని అరెస్టు చేశారు. పోదంగొటి పారాలో దాడి చేసి ఇళ్లలో సామానంతా ధ్వంసం చేసి ఒక ఇంట్లోంచి 250 రూపాయలు కూడా ఎత్తుకుపోయారు. ఇలా గ్రామాలపై దాడులు చేస్తూ, ఆదివాసీ ప్రజలపై, సంఘనాయకులపై తప్పుడు కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారు. ఈ రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రజలపై అమలు చేస్తున్నారు. ఈ దోపిడీ ప్రభుత్వ అణచివేతను ప్రజలు సాయుధంగానే ప్రతిఘటిస్తూనే అరెస్టయిన తమ నాయకులను విడిపించుకుంటున్నారు.

## గడ్చిరోలి డివిజన్

మహారాష్ట్ర పోలీసులు గడ్చిరోలి డివిజన్‌లో గాలింపులూ, దాడులూ చెయ్యడమనేది నిరంతరాయంగా సాగుతున్నదే అయినా, ఈసారి వేసవిలో తీవ్రస్థాయిలో కొనసాగిన నిర్బంధం 1992 కాలం నాటి నిర్బంధాన్ని మరిపించింది. చాలా అంతరం తర్వాత విప్లవ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమైన సిరొంచ ప్రాంతం నుండి మొదలుకొని మాడ్ సరిహద్దులో వున్న భామ్రాగఢ్ ప్రాంతం వరకూ విప్లవోద్యమాన్ని అణచడానికి శత్రువు చేయని ప్రయత్నం లేదు. అయినా ప్రజలు పోరాటాన్ని విడువలేదు. శత్రు ఏజెంట్లనూ, ప్రజాద్రోహులనూ వివిధ పద్ధతుల్లో శిక్షిస్తూ, అదుపుచేస్తూ పార్టీని ఎప్పటిలాగే కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

## నిర్బంధం

సరిగ్గా 10 ఏళ్ళకు మరోసారి శత్రువు డివిజన్ వ్యాప్తంగా విరుచుకుపడ్డాడు. పోలీసు బలగాలను మోహరించి ఉద్యమాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కరపత్రాలు వేసి, సాంస్కృతిక సంస్థల కార్యక్రమాలతో దుష్ప్రచారం సాగించాడు. ఉద్యమాన్ని దెబ్బతీయడానికి సంస్కరణల గురించి, ముఖ్యంగా భూసంస్కరణలు, పాన్‌లోడ్ సంఘాల గురించి ప్రచారం బాగా చేస్తున్నాడు. వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, రోడ్లు-భవనాల నిర్మాణంలో కూలీ పనులు కల్పించడం, ఎస్ఐబి మరియు ఎస్ఎఫ్ బలగాల్లో యువతకు ఉద్యోగాలివ్వడం వంటి సంస్కరణ కార్యక్రమాలు చేపట్టి ప్రజలను మోసగిస్తున్నాడు. లొంగిపోయిన వారిని జైలుకు పంపి వారి సంఖ్య తగినంతగా పెరగ్గానే పాత్రికేయుల సమక్షంలో వారందరిని విడుదల చేసి పార్టీ బలహీనపడిపోయిందంటూ ప్రచారం సాగిస్తున్నాడు. గ్రామాలకు గ్రామాలనే (500 నుండి 1000వరకు జనాభా గలవాటిని) దత్తత తీసుకోవడం ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తన మనుషులతో గ్రామాల్ని అదుపు చేస్తూ గెరిల్లా దళాలను గ్రామాల్లోకి రాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. అలాగే ప్రతి గ్రామంలో ముగ్గురి నుండి ఐదుగురు వరకు ఇన్ఫార్మర్లను తయారు చేసుకొని వారికి వాకీటాకీలూ, సెల్‌ఫోన్‌లూ సమకూరుస్తున్నాడు.

ఈ నిర్బంధం ప్రజల పోరాట చేవను నీరుకార్చలేక పోయిందని గత 3 నెలల చరిత్ర స్పష్టం చేస్తోంది. ఏరియా మొత్తంలో 44 గ్రామాల నుండి 500 మందిని అరెస్టుచేసి 175 మందిపై తప్పుడు కేసు బనాయించి జైలుకి పంపడం పాలకవర్గాలా, పోలీసులా ప్రజావ్యతిరేక స్వభావానికి నిదర్శనం. నిజానికి అరెస్టయిన వారి సంఖ్య ఇంకా ఎక్కువే. పోలీసులు పురుషులందరినీ పలు రకాల చిత్రహింసలకు గురిచేసిన తర్వాత వారిని జైలుకు పంపకుండా విడుదల చేసినందుకు వారి నుండి వేలాది రూపాయల లంచాలు వసూలు చేశారు. అదే సమయంలో పోలీసులు విడివిడి బ్యాచ్‌లుగా తిరుగుతూ గాలింపు చర్యలు సాగించారు. చాముర్షి, అహిరి, భామ్రాగఢ్ దళ ఏరియాల్లో కొందరు ప్రజలు ఈ చిత్రహింసలు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గడ్చిరోలి పోలీసులు ఏప్రిల్ 2-13 తేదీల మధ్య డివిజన్‌వ్యాప్తంగా 'శిశిర్' పేరుతో నిర్బంధ అభియాన్ నడిపారు. అలాగే ఏప్రిల్ 31 - మే 8 మధ్య 'సర్చ్' అభియాన్ నడిపారు. దీనిలో బయట నుండి వచ్చిన బలగాలూ, ఇక్కడి బలగాలూ కలిపి మొత్తం 300-400 మంది పోలీసులు డివిజన్‌వ్యాప్తంగా గాలింపు జరిపారు. భామ్రాగఢ్ ఏరియాను కేంద్రం చేసుకొని ఒక్కో గ్రామంలో మూడేసి రోజులు మకాం వేశారు. పరాల్‌కోట నది నుండి, భామ్రాగఢ్-ఆల్లపల్లి రోడ్డు, అలాగే ఇంద్రావతి నది వరకూ కవర్ చేస్తూ ప్రతి గ్రామంలోనూ 20-25 మంది పోలీసులు ఉండి మొత్తం ఏరియాను బ్లాక్ చేశారు (మూసివేశారు).

సిరొంచ దళ ఏరియాలో పోలీసులు 12 గ్రామాల నుండి 133 మందిని (15 మంది మహిళలు సహా) అరెస్టుచేసి కేసులు పెట్టి 71 మందిని (నలుగురు మహిళలు సహా) జైలుకి పంపారు. సేతపల్లిలో ఒక మహిళను మోసం చేసిన గ్రామస్థుడిపై సంఘం పంచాయితీ చేసినందుకు పోలీసులు 80 మంది గ్రామస్థులను అరెస్టు చేసి, వీరిలో 33 మందిపై అక్రమ కేసుపెట్టి జైలు పాల్జేశారు.

అమరవీరుల వారాన్ని విఫలం చేసే లక్ష్యంతో ఏటపల్లి దళ ఏరియాలో పోలీసులు జూలై 28 సందర్భంగా "పోస్టర్లు వేస్తే తొలగిస్తాం, స్థూపాలు కడితే కూలగొడతాం" అని బెదిరిస్తూ ముందే ప్రచారం సాగించారు. పోలీసులు గాలింపులు సాగిస్తూ రోడ్ల దగ్గర ఆంబుష్ కూర్చోవడం, రాత్రిపూట గ్రామాల్లోకి చొచ్చి తెల్లారకముందే పోతుండడం, దళం గురించి సమాచారం ఇమ్మని ప్రజల్ని బెదిరించడం వంటి నిర్బంధ పద్ధతులను అమలు చేశారు. 12 గ్రామాలలో 180 మందిని అరెస్టు చేసి వ్యక్తిగత పూచీపై విడిచిపెట్టి వారానికి రెండు సార్లు స్టేషన్‌కు రిపోర్టు చేయాలనే షరతు విధించారు. రిపోర్టు చేయడానికి వెళ్ళినపుడు పగలంతా నిర్బంధ వెట్టి చేయించుకుంటున్నారు. కనీసం పగలు తిండి కూడా పెట్టడం లేదు. 4 చోట్ల ప్రజలు అమరుల జ్ఞాపకంలో కట్టుకున్న స్థూపాలను పోలీసులు కూల్చివేశారు.

చాముర్షి దళ ప్రాంతంలో ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో జూలై 23న కోర్‌కోటి గ్రామంపై దాడికి వచ్చి దళం దొరక్కపోవడంతో గ్రామంపై బడ్డారు. 96 మంది రైతుల్ని నిర్బంధించి స్టేషన్‌కు రిపోర్టు చేసే షరతుపై జామీను మీద విడుదల చేశారు. అలామిటోల రైతును చిత్రహింసల పాల్జేసి జైలుకి పంపారు. అహిరి దళ ప్రాంతంలో పోటిగాం క్యాంపు పోలీసులు 12-14 మందితో బ్యాచ్‌లుగా జూలై మధ్యలో అడవిలో గాలింపులు ఉధృతం చేశారు.

అహిరి ఏరియాలో గత సంవత్సరం నుండే నిర్బంధం తీవ్రంగా కొనసాగుతోంది. దళం నుండి పారిపోయి పోలీసుల ముందు లొంగిపోయిన ద్రోహి ఆనంద్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు వందలాది మంది ప్రజలను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. అనేక అవమానాలకు గురిచేశారు. ఈ మూకుమ్మడి అరెస్టుల పరంపర తర్వాత, ఇప్పుడు తాజాగా విప్లవకారుల కుటుంబాలపై దాడులు చేస్తూ వారి ఇండ్లను కాలబెట్టే దుర్మార్గానికి పాల్పడుతున్నారు. మేడిపల్లి గ్రామంలో పోలీసులు పార్టీ డివిజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ దినేష్ తల్లిదండ్రులు ఉంటున్న ఇంటిపై దాడిచేసి కుటుంబ సభ్యులను బైటికి పంపించి ఇల్లు కాలబెట్టారు. అయితే కాలబెట్టింది పోలీసులని ***(తరువాయి 36వ పేజీలో .....)***

# సిపిఎం ఉక్కుపాదాన్ని ధిక్కరిస్తూ వెల్లువెత్తుతున్న ప్రజా పోరాటాలు

ఈ మధ్య కాలంలో పశ్చిమ బెంగాల్‌లో విడుదలైన ఒక సర్క్యులర్‌లోని ఆదేశాలు ఈ విధంగా ఉన్నాయి.

*1. పీపుల్స్‌వార్ కేడర్, సానుభూతిపరుల కదలికలపై నిఘా ఉంచండి.*

*2. పీపుల్స్‌వార్ గురించి ఎలాంటి సమాచారం దొరికినా పోలీసులకు వెంటనే తెలియజేయండి.*

*3. పోలీసులను ముందుంచండి. వెనుక నుండి వారిని గైడ్ చేయండి.*

పై ఆదేశాల్ని చూసి వాటిని ఏ ఇంటలిజెన్స్ అధికారులు జారీ చేసిన ఆజ్ఞలుగానో, రణవీర్‌సేన లాంటి భూస్వాముల ప్రైవేటు సేన జారీ చేసిన ఆదేశాలుగానో, హిందూ మతోన్మాద సంస్థలయిన బిజెపి, విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్, శివసేన మొదలైన పార్టీలు తమ క్యాడర్‌కు జారీ చేసిన సర్క్యులర్‌లోని విషయాలుగానో భావిస్తే పప్పులో కాలేసినట్లే. ఎర్ర ముసుగేసుకొని, మార్క్సిజం జపం చేస్తూనే మార్క్సిజానికి తూట్లు పొడిచి ప్రజా పోరాటాల్ని నెత్తుటేర్లలో ముంచుతున్న 'ఘనమైన' చరిత్ర గలిగిన సిపిఎం పార్టీ తన కేడర్‌కు జారీ చేసిన సర్క్యులర్‌లోనివి ఇవి.

వాస్తవానికి సిపిఎం నాయకత్వం పుట్టుక నుండే అవకాశవాదాన్నీ, నయవంచననూ పునికిపుచ్చుకుంది. పార్లమెంటరీ పంథాలో విప్లవం రాదనీ, వ్యవస్థ మారాలంటే సాయుధ తిరుగుబాటే మార్గమనీ తన ప్రణాళికలో రాసుకుంది. అయితే ఆచరణలో మాత్రం విప్లవానికి పరిస్థితి ఇంకా పరిపక్వం కాలేదనే పేరుతో తన కేడర్‌నూ, ప్రజానీకాన్నీ మోసపుచ్చుతున్నది.

భారత విప్లవోద్యమ చరిత్రనే ఒక మలుపు తిప్పిన నక్సల్బరీ సాయుధ పోరాట పంథాను వ్యక్తిగత హింసావాదమనీ, టెర్రరిజమనీ నిందిస్తూ, దాన్ని క్రూరంగా అణచివెయ్యడంలో ముందు భాగాన నిలిచింది సిపిఎం. నాటి నుండి నేటి వరకూ అది తన కేడర్‌ను భ్రష్టు పట్టించి, ప్రజా వ్యతిరేకులుగా మారుస్తూ తనకంటూ ఒక సామాజిక పునాదిని (దోపిడీ వర్గాల) ఏర్పాటు చేసుకుంది. ఈ మార్క్సిస్టులు తమ 25 ఏండ్ల పాలనలో పాలకవర్గంగా తమ పునాదుల్ని బలపర్చుకొని సోషల్ ఫాసిస్టులుగా అవతారమెత్తారు. జ్యోతిబాసు పాతిక సంవత్సరాల ఏకఛత్రాధిపత్యం ముగిసిన తర్వాత ప్రస్తుతం బుద్ధదేవ్ భట్టాచార్య ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నాడు.

నక్సల్బరీ పోరాటం సెట్‌బ్యాక్‌కు గురయ్యాక ఎం-ఎల్ పార్టీ చీలికలకు గురి కావడంతో, రెండు దశాబ్దాల పాటు సిపిఎం రివిజనిస్టు రాజకీయాల్ని ఎండగడ్తూ దృఢంగా పోరాడేవాళ్లు లేకపోవడంతో అది తిరుగులేని మొనగాడుగా అవతారమెత్తింది. గత కొద్ది సంవత్సరాలుగా పీపుల్స్‌వార్ నాయకత్వంలో విప్లవోద్యమం బలపడుతూ ప్రజా పోరాటాలు పెల్లుబుకుతుండడంతో వాటిని అణచడానికై అది తన సోషల్ ఫాసిస్టు కోరల్ని చాస్తున్నది.

## ప్రజా పోరాటాలపై తీవ్రమవుతున్న 'మార్క్సిస్టు' పాలకుల నిర్బంధం

పశ్చిమ బెంగాల్‌లో మిడ్నాపూర్, బంకూరా, పురూలియాలు మూడూ వెనుకబడ్డ జిల్లాలు. డెబ్బయిలలో అప్పటి ఎం-ఎల్ పార్టీ ఇక్కడ ఉద్యమం ప్రారంభించినా, తప్పుడు ఎత్తుగడల కారణంగా ముందుకు సాగలేదు. ఎంసిసి పార్టీ '80లలో తన బీహార్ ఉద్యమ నాయకత్వం కింద ఈ మూడు జిల్లాలలో కొంత కృషి చేసింది. ఈ నేపథ్యంలో మునుపటి పీపుల్స్‌వార్ '95 తర్వాత కాలం నుండి గెరిల్లాజోన్ పర్‌స్పెక్టివ్‌తో ఈ మూడు జిల్లాల ప్రాంతంలో సన్నాహక కృషిని ప్రారంభించింది. ప్రజా పోరాటాలు చేపట్టింది. దాని నాయకత్వంలో మిడ్నాపూర్‌లో కొనసాగుతున్న పోరాటం ప్రజలను విశేషంగా ఆకర్షించింది.

వ్యూహాత్మకంగా అటవీ ప్రాంతాలలో, ముఖ్యంగా వర్గ వైరుధ్యాలు తీవ్రమైన ప్రాంతాలలో కేంద్రీకరించి పనిచేయాలనే అవగాహనతో 1998 చివరి నుండి పీపుల్స్‌వార్ పార్టీ గోర్బెత ఏరియాపై కేంద్రీకరించింది. పార్లమెంటరీ పార్టీలైన టిఎంసి, బిజెపిలు ఒక పక్షం, సిపిఎం మరో పక్షంగా ఉండి ప్రజల ఉనికికే ప్రమాదంగా మారి వారిని బతుకనివ్వని స్థితికి నెట్టాయి. పీపుల్స్‌వార్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి ఈ స్థితిని అదుపులోకి తెచ్చింది. టిఎంసి-బిజెపిలు నిర్వీర్యం కాగా, సిపిఎం నాయకులు గ్రామాలు వదిలి పారిపోయారు. ఆ తర్వాత క్రమంలో సిపిఎం తమ సాయుధ మూకలకు ఆయుధాలు, తర్ఫీదు అందించి అక్టోబర్ 2000 నాటికి గోర్బెత నుండి కేశపూర్ వరకే గాక మిడ్నాపూర్, హుగ్లీ, బంకురా జిల్లాలను కూడా తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుంది.

సిపిఎం తన సాయుధ మూకతో పీపుల్స్‌వార్ పార్టీపైనా, ఇతర ప్రజా సంఘాలపైనా దాడిచేసి మే 2001 అసెంబ్లీ ఎన్నికలకు ముందే గ్రామాలన్నింటిలో తెల్ల భీభత్సం సృష్టించింది. దీనిలో భాగంగా జనవరి 4, 2001న ఛోటా అంగారియా గ్రామంలో ఇంట్లో షెల్టర్ తీసుకున్న ఐదుగురు పీపుల్స్‌వార్ దళసభ్యులను సజీవంగా దహనం చేసింది. అక్కడే ఉన్న ఇతర కామ్రేడ్స్ తప్పించుకోగలిగారు. ఈ దాడుల్లో సిపిఎం సాయుధ మూకలే ముందు నిలిచాయి. పోలీసు బలగాలు వీటికి మద్దతుగా వచ్చేవి. పీపుల్స్‌వార్ ఈ దాడులను ప్రతిఘటించాలని నిర్ణయించి జాపూర్ గ్రామంలో తన కార్యకర్తలపై సిపిఎం జరిపిన దాడిని వీరోచితంగా తిప్పికొట్టింది. మోటారు సైకిళ్లపై వచ్చిన సిపిఎం సాయుధ మూకలు, పీపుల్స్‌వార్ దళం నాలుగు గంటల పాటు సాగించిన వీరోచిత ప్రతిఘటన తర్వాత పలాయనం చిత్తగించాయి. అయితే 500కు పైగా ఇఎఫ్‌ఆర్, ఆర్‌ఏఎఫ్, బెంగాల్ ప్రత్యేక సాయుధ బలగాలు దళం కోసం ఆ రాత్రంతా అడవిని గాలించాయి. అయితే ప్రజల సహకారం గల గెరిల్లాల ముందు వారి ప్రయత్నం నిష్ఫలమైంది.

ఈ ఘటనల తర్వాత సిపిఎం సాయుధ గుండా గ్యాంగులు శల్బనీ ప్రాంతంలో ఇలాంటివే మరో 3, 4 ప్రయత్నాలు చేసి గెరిల్లాల ప్రతిఘటనతో కాలికి బుద్ది చెప్పాయి. ప్రజలు పీపుల్స్‌వార్‌తో దృఢంగా నిలిచారు. ప్రజల మద్దతుతోనే జూన్ 2001 వరకు గోర్బెత, శల్బనీ, సరెంగ ప్రాంతాలలో పీపుల్స్‌వార్ గెరిల్లాలు 3, 4 దాడులు సాగించారు. సిపిఎం ముఖ్య నాయకులను శిక్షించారు. ఈ కాలంలోనే సిపిఎం పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దించి పీపుల్స్‌వార్ గ్రామాలపైనా, తన ప్రతికక్షులైన ఇతర పార్లమెంటరీ పార్టీలపైనా విచక్షణారహితంగా దాడులు చేసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం చేజిక్కించుకున్నప్పటి నుండి ఇలా పోలీసు, అర్ధసైనిక బలగాల మోహరింపు పెరుగుతూ వచ్చింది. అయితే పెద్ద ఎత్తున దాడికి పాల్పడింది లేదు. 2001 జూలై-నవంబర్‌ల మధ్య శల్బనీ, బెల్‌పహాడీ, గ్వాలతోర్, సరెంగ, పంచమూర, లాల్‌గఢ్, రాయగఢ్, రాయపూర్, శ్యాల్దా, రాణిబంద్ మొదలగు ప్రాంతాలన్నింటా వేర్వేరు సమస్యలపై ప్రజలు కదిలి పోరాడసాగారు. పోలీసు నిర్బంధాన్ని ధిక్కరించారు. పోలీసుల సమక్షంలోనే సిపిఎం నాయకత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాలవారీగా ప్రజలు తమ తమ సమస్యలపైనా, సిపిఎం ప్రజా వ్యతిరేక చర్యలపైనా పోరాటాలు సాగించారు. పీపుల్స్‌వార్ పార్టీకి లభించిన కాలం తక్కువే (3 నెలలే) అయినా అది ప్రజా సమీకరణను సంఘటితపర్చుకొని తన వెనుక నిలబెట్టుకోగల్గింది.

ఈ పరిస్థితిని ఇలా కొనసాగనీయవద్దనీ, తన పునాదిని కదలించే అవకాశం ఇవ్వకూడదనీ భావించిన సిపిఎం నాయకత్వం తన సాయుధ గూండా మూకల ద్వారా డిసెంబర్ 2000-జూన్ 2001 మధ్య సాగించిన అణచివేత క్యాంపెయిన్

విఫలం కావడంతో కేంద్ర-రాష్ట్ర సాయుధ బలగాలను దింపి అక్టోబర్ 2001-ఆగస్టు 2002ల మధ్య రెండు అణచివేత క్యాంపెయిన్లను సాగించింది.

## సిపిఎం ఉక్కుపాదం

జులై 5 నుండే రాజ్యం పశ్చిమ మిడ్నాపూర్‌లో ఉక్కుపాదం మోపసాగింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ఇఎఫ్ఆర్, ఆర్ఏఎఫ్, బిఏఎఫ్ బలగాలను వెంట బెట్టుకుని మిడ్నాపూర్ జిల్లా యంత్రాంగంతో కలిసి కోల్‌కాతా మహానగరంలోనూ, దాని సబర్బన్ ప్రాంతాలపైనా విస్తృతంగా దాడులు జరిపారు. అన్ని సెక్షన్‌ల ప్రజలు ఈ క్రూర నిర్బంధాన్ని ఖండిస్తూ, తమ నిరసన కార్యక్రమాలను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఇలాంటి నిరసనను సిపిఎం నాయకత్వం డెబ్బయ్యవ దశకం నుండి ఎన్నడూ చూడలేదు. దీనితో అల్లాముద్దీన్ వీధిలో ఉన్న సిపిఎం అధికార భవనం తన కాళ్లకింద భూమి కదలడంతో మొదటిసారి కలవరపడింది. టీవీ ఛానల్స్‌లోనూ, ప్రింట్ మీడియాలోనూ ఈ మొత్తం వ్యవహారాన్ని చూడ్డం, వినడం, చదవడంతో పశ్చిమ బెంగాల్ ప్రజలు ఏ పక్షం వహించాలో నిర్ణయించుకోసాగారు.

అదే సమయంలో వామపక్ష సంఘటన (ఎల్ఎఫ్) లోని మూడు పార్టీలు ఆర్ఎస్‌పి, ఎఫ్‌బి, సిపిఐ సహా అన్ని పార్టీలూ, సంస్థలూ సిపిఎం రాష్ట్ర నాయకత్వాన్నీ, దాని ఆధీనంలోని పోలీస్ యంత్రాంగపు స్వైర విహారాన్నీ ముక్తకంఠంతో ఖండించసాగాయి. దీనితో సిపిఎంలోని ఒక సెక్షన్ కూడా గొంతు విప్పి దాడులను ఖండిస్తోంది. వెంటనే అల్లాముద్దీన్ భవనం నుండి పత్రికాముఖంగానే ఆజ్ఞలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి చేబట్టే పాలసీలపై గానీ, పార్టీ అధికార పాలసీలపై గానీ పార్టీలోని వారు ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేసినా సహించేది లేదని 'మార్క్సిస్టు' నాయకత్వం హుకుం (సర్క్యులర్) జారీ చేసింది. దీని కొనసాగింపుగా సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసిసిల కార్యకలాపాలనెదుర్కొనే ఎత్తుగడల్లో భాగంగా మరో సర్క్యులర్ (వ్యాసం ప్రారంభంలో ఉటంకించినది) కూడా జారీచేసింది.

పోలీసు ఇన్ఫార్మర్లుగా సిపిఎం కేడర్ పోషిస్తున్న పాత్రను ఈ ఆజ్ఞలు నగ్నంగా బైటపెడుతున్నాయి. మరోవైపు బుద్దదేవ్ ప్రభుత్వం అభివృద్ధి కార్యకలాపాల పేరుతో పోరాట ప్రాంతానికి తన బలగాలు త్వరితంగా కదలడానికి వీలుగా రోడ్లను విస్తృతపరుస్తోంది. ఏభై ఏళ్ల క్రితం మొదటి పంచవర్ష ప్రణాళికలో మంజూరయి నిధులకు నోచుకోక నిలిచిపోయిన కాషావతి నదిపై బ్రిడ్జి కోసం ఇప్పుడు నిధులు మంజూరు చేసింది. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభమైనాయి. దీని నిర్మాణం పూర్తయితే పోలీస్ బలగాలు పీపుల్స్‌వార్ పార్టీ పోరాట ప్రాంతాన్ని చేరుకోవడానికి 22 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇది రాజ్యం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకూ, అమలుపరుస్తున్న అణచివేత రూపాలకూ అద్దం పడుతుంది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ ప్రజలకు స్వానుభవం ద్వారా నిజమైన మార్క్సిస్టులకూ, 'మార్క్సిస్టు'లుగా చెప్పుకునే సోషల్ ఫాసిస్టులకూ మధ్య తేడా ఏమిటో అర్థమవుతున్నది.

## సిపిఎం సాగించే దుష్ప్రచార పద్ధతి - దాని ప్రతీఘాతుక దాడులు

సిపిఎం, దాని పోలీసు యంత్రాంగం పీపుల్స్‌వార్‌నూ, ఎంసిసినీ, కెఎల్ఓ (కాంతాపూర్ విమోచనా సంస్థ)నూ యుద్ధ ప్రాతిపదికన అణచడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. అలాగే నేపాల్ సరిహద్దుల నుండి మావోయిస్టుల చొరబాటు ప్రమాదం ఉందనే నెపంతో రాష్ట్రంలో అదనపు బలగాలు మోహరించారు. 'మార్క్సిస్టు' ప్రభుత్వం భారత సైనిక ఇంటెలిజెన్స్ రిపోర్టులను ఆర్ఏడబ్ల్యు, సిఎంఓ తదితర సంస్థల రిపోర్టుల పేర ప్రచారం చెసి ఒక రకమైన ఉద్రిక్తతను సృష్టించి ప్రజలను రెచ్చగొట్ట సాగింది.

అలాగే, "పీపుల్స్‌వార్, ఎంసిసి, కెఎల్ఓల సాయుధ ప్రతిఘటనకు కరకుగానే జవాబు చెబుతాం, మా కేడరును రక్షించుకోవడం కోసం మేం పోరాటం ప్రారంభిస్తాం" అని సిపిఎం పార్టీ వివిధ స్థాయిల నాయకత్వం ప్రకటనల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే నిండా సాయుధం అయి ఉన్న తన సాయుధ గ్యాంగులా, పోలీసులా సమైక్య దాడికి చట్టబద్ధతను కల్పించడం కోసం సిపిఎం చేస్తున్న ప్రచారం ఇది. తాను చేసే (అంతః కలహాలతోనూ, స్వార్థపూరితంగానూ సాగించే) దాడులకు పీపుల్స్‌వార్ రంగు పులిమి ప్రచారం చేసిన చరిత్ర ఎంతో ఉంది దానికి.

డెబ్బయి దశకంలో కాంగ్రెస్ పార్టీ-పోలీసులు ఏర్పర్చిన నల్లదండు ముఠాలు మూకుమ్మడి హత్యలకు పాల్పడ్డాయి. టార్గెట్ చేసి విప్లవకారుల కుటుంబాలను నాశనం చేశాయి. ఇపుడు సిపిఎం సాయుధ మూకలూ, పోలీసులూ అదే విధంగా దాడులు చేస్తున్నాయి. ప్రజలే వీటన్నింటిని ఎదిరించి ఉద్యమాన్ని కాపాడుకుంటారు.

## దక్షిణ బెంగాల్ నుండి ఉత్తర బెంగాల్‌కు పాకిన నిర్బంధం

పశ్చిమ బెంగాల్ ఉత్తర ప్రాంతంలోని నదియా, ముర్షిదాబాద్, మాల్డాలలో పీపుల్స్‌వార్ పార్టీ చాలా కాలంగా పనిచేస్తున్నది. ఇక్కడ 2002 జూలై నుండి ఆగస్టు చివరి వరకు ప్రభుత్వ బలగాల భీభత్సకాండ రాజ్యం ఏలింది. మిడ్నాపూర్ నుండి కోల్‌కాత మీదుగా నదియా, ముర్షిరాబాద్, మాల్డాలపై ఉక్కుపాదం మోపబడింది. విప్లవ ప్రజా సంఘాల నాయకులను పోలీసు స్టేషన్లకు పిలిపించి వారు విప్లవ కార్యక్రమాలన్నీ మానుకోవాలని హెచ్చరించసాగారు. పార్టీ, ప్రజాసంఘాల నాయకుల కదలికలపై నిఘా పెట్టారు. 32 మందిపై నిఘా ఉంచినట్టు స్వయంగా నదియా పోలీసులే గత ఆగస్టులో ఒక ప్రకటన జారీ చేశారు. మిడ్నాపూర్ తదితర జిల్లాలలో పార్టీ పేర పోస్టర్లు పడడంతో గ్రామాలలో పోలీసుల మోహరింపు ప్రారంభమైంది.

ఈ ఆగస్టులో ముర్షిదాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలో ఆర్ఎస్ఎఫ్ నాయకురాలు కామ్రేడ్ శంపనూ, ప్రజా సంఘ కార్యకర్తలు శంకర్, అజిత్‌లనూ పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసల పాల్జేశారు. శంప చదువుతున్న కోల్‌కాతాలోని గురుదాస్ కాలేజీ అధ్యాపకులూ, విద్యార్థులూ ఆమె అక్రమ అరెస్టును ఖండించారు. ఆమె తల్లిదండ్రులు కూడా తమ కూతురు ఏ క్రిమినల్ కేసులోనూ లేదనీ, అరెస్టు అక్రమమనీ నిర్భయంగా ప్రకటించారు. ఈ అరెస్టులను ముర్షిదాబాద్ జిల్లా ఆర్ఎస్‌పి నాయకత్వం మొదలు ఏపిడిఆర్ వరకు అన్నీ ఖండించాయి. పీపుల్స్‌వార్‌పైనా, ప్రజా సంఘాలపైనా నిషేధం లేదని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రజా సంఘాల కార్యకలాపాలను కొనసాగనివ్వకపోవడం, అక్రమ అరెస్టులూ, దాడులూ కొనసాగిస్తూ పోలీసు బలగాలను మోహరించడం తిరిగి '70 దశకం నాటి పరిస్థితిని సృష్టించడమేనని లెఫ్ట్‌ఫ్రంట్‌లోని భాగస్వామ్య పక్షమైన ఆర్ఎస్‌పి బహిరంగంగా ప్రకటించింది.

ఆగస్టు 26న నదియా జిల్లా నాకశిపార, ముర్షిదాబాద్ జిల్లా నవదాల్లో దాదాపు 25 మందిని అరెస్టు చేశారు. వాళ్ల వద్ద దొరికిన విప్లవ పార్టీలా, ప్రజా సంఘాలా కరపత్రాల ఆధారంగా, అభ్యంతరకర సాహిత్యం దొరికిందని కేసు పెట్టారు. మార్క్సిజం పేరుతో 'మార్క్సిస్టు ప్రభుత్వం' అమలు చేస్తున్న సోషల్ ఫాసిజం, ప్రజా వ్యతిరేక చర్యలు ఇలాంటివి.నదియా, ముర్షిదాబాద్, మాల్డాలలో సంఘటితమవుతున్న ప్రజలపై సిపిఎం ప్రభుత్వం ఆరంభించిన ఈ దాడిని ఆ ప్రాంత ప్రజలు తమకు గల పోరాట అనుభవంతో తట్టుకోగల్గడమే గాదు, తప్పక ఎదుర్కొని ఓడిస్తారు.

*(తరువాయి 26వ పేజీలో .....)*

*(..... చివరి పేజీ తరువాయి)*

## శత్రువుపై దాడుల్లో మిలీషియా పాత్ర అభినందనీయం!

ఈ సంవత్సర కాలంలో డికే వ్యాప్తంగా మిలీషియా సంఖ్య వందల్లో పెరగడమే కాకుండా సంఘటితపడింది. దాడుల్లో పెద్ద సంఖ్యలో క్రియాశీలంగా పాల్గొన్నది. గత సంవత్సరం దక్షిణ బస్తర్‌లో బాసగూడెం సంతకు వచ్చిన పోలీసు బ్యాచ్ ఏమరుపాటుగా వుండడాన్ని చూసి, ఒంటరిగా మూత్రానికి వెళ్లిన ఒక పోలీసుపై గొడ్డండ్లతో దాడి చేసి ఎస్ఎల్ఆర్ గుంజుకున్న ఘటన ప్రజల్ని ఎంతగానో ఉత్తేజపర్చింది. చింతల్‌నార్ సంతకు వచ్చిన దుష్టుడైన ఒక ఏఎస్ఐని మిలీషియా చంపివేసింది. జేగురుగొండలో కూడా సంత రోజు ఎస్ఐపై చేసిన దాడిలో మిలీషియా పాత్ర వుంది. ఈ ఘటనలతో శత్రువు ఒంటరిగా మల మూత్రాలకు పోవాలన్నా, సంతలకు వచ్చి ప్రజలపై మునుపటి లాగా దౌర్జన్యం చేయాలన్నా సాహసించలేకపోతున్నాడు. శత్రువుపై దాడి చేయాలనే వర్గకసి, పట్టుదల, సాహసం, చొరవ, ఉపాయం వుంటే మన మిలీషియా చేతుల్లోని గొడ్డండ్లే పోలీసుల ఎస్ఎల్ఆర్‌లను కూడా ఓడిస్తాయని బాసగూడెం ఘటన రుజువు చేసింది. గత జూన్‌లో టిప్రాగఢ్ ఎరియాలో (గడ్చిరోలి) మౌల పోలీసులు స్కూటర్లపై పెట్రోలింగ్ చేస్తుండగా బర్మార్లతో కూడిన మన మిలిషియా టీము క్లేమోర్ పేల్చి ఒక ఏఎస్సైని చంపి, మరో హెడ్ కానిస్టేబుల్‌ను గాయపర్చింది. సెప్టెంబర్ నెలలో పశ్చిమ బస్తర్ డివిజన్‌లో గంగులూర్ ఎస్సై స్కూటర్‌పై వెళ్తుండగా వాగు దాటే చోట మిలిషియా టీం దాడి చేసి చంపింది. ఇలా మిలిషియా తల్చుకుంటే చొరవగా మరెన్నో ఘటనలు చేయగల్గుతుందనేది స్పష్టం. శత్రువుపై సాగిన దాడుల్లో చురుకుగా పాల్గొన్న మిలిషియాకు అభినందనలు తెలుపుతున్నాం. రాబోయే రోజుల్లో మరింత చురుగ్గా శత్రువుపై దాడుల్లో పాల్గొంటూ, శత్రువు అడుగడుగునా భయంతో వణికి చచ్చే లాగా తమ వీరత్వాన్ని ప్రదర్శిస్తారని ఆశిస్తున్నాం.

> - *పిజిఏలో భర్తీ అవుదాం! వందల సంఖ్యలో ఉన్న పిజిఏ బలగాల్ని వేల సంఖ్యలోకి పెంపొందిద్దాం!*
> - *గ్రామగ్రామాన మిలిషియాను నిర్మిద్దాం! ప్రతి గ్రామాన్ని ఒక యుద్ధ రంగంగా మారుద్దాం!*
> - *చేతికి దొరికిన ఆయుధంతో శత్రువుపై తిరగబడదాం!*

**కామ్రేడ్స్,**

మన పిజిఏ నిర్మాణం వార్త జరిగినప్పటి నుండి గత రెండు సంవత్సరాలుగా అది చేసిన చిన్నపాటి యుద్ధ చర్యలకే శత్రువు బెంబేలెత్తిపోతున్నాడు. పోలీసు స్టేషన్లపై మన మిలిషియా పేల్చే బర్మార్ దెబ్బలకే దడుసుకుంటున్న శత్రువు భయంతో వందలాది తూటాలు వృథాగా కాలుస్తున్నాడు. ఈ రకంగా శత్రువు అమ్యునిషన్‌ను నష్టం చేయగల్గుతున్నాం. రాత్రులందు స్టేషన్ పరిసరాల్లో జంతువులు నడిచినట్లు చప్పుడైనా, టపాకాయలు పేలినా, రోడ్డున పోయే వాహనాల టైర్లు పంచరైనా శత్రువు భయానికి గురై విచ్చలవిడిగా కాల్పులు చేస్తున్నాడు. కొన్ని బలహీనంగా ఉన్న పోలీసు స్టేషన్లలోని పోలీసులు తమకు తామే రాత్రంతా గాలిలోకి కాల్పులు జరిపి నక్సలైట్లు దాడి చేసారని అబద్ధపు ప్రచారం చేసుకుంటూ స్టేషన్‌కు రక్షణ లేదు గనుక ఎత్తివేయాలనీ లేదా బందోబస్తు ఏర్పాట్లైనా చేయాలనీ పై అధికారులను కోరుతున్నారు. ఉదాహరణకు, గత సంవత్సరం పిజిఏ వారం సందర్భంగా ఐరి ఏరియాలోని రేగుంట పోలీసులు ఈ సంవత్సరం జూన్ నెలలో టిప్రాగఢ్ ఏరియాలోని మౌల పోలీసులు పిరికితనంతో ఇలా ప్రవర్తించారు. రాత్రంతా స్టేషన్లో నిద్రపోకుండా కాపలా ఉంటున్నారు. అడవుల్లోకి పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసు బ్యాచ్‌లు కూడా కొన్ని లోతట్టు ప్రాంతంలోకి వచ్చే ధైర్యం లేక ఎక్కడో ఒక చోట తిరిగి మొత్తం వాగులూ, గుట్టలూ గాలించినట్లు అధికార్లకు తప్పుడు రిపోర్టు ఇచ్చుకుంటున్నారు. ఇదంతా శత్రువు పిరికితనాన్నీ, వాడి కాగితపు పులి స్వభావాన్ని తెలియజేస్తున్నది. నేటి మన చిన్న స్థాయి సైనిక చర్యలకే అంతగా బెంబేలెత్తుతున్న శత్రువు రేపు మన సమ్మెట పోట్ల వంటి భారీ దాడులకు ఏమవుతాడో వూహించవచ్చు.

మిలిషియా, ప్రజలూ, గెరిల్లా బలగాలూ తమ శక్తినంతా వెలికి తీసి శత్రువుపై దాడుల్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారా శత్రువు అనుక్షణం భయంతో వణికి చచ్చేలా చేద్దాం. మనకు బలమైన ప్రాంతాల్లోని శత్రు క్యాంపులపై గట్టి దెబ్బలు తీసి తన్ని తరుముదాం.

**కామ్రేడ్స్,**

కామ్రేడ్ మావో చెప్పినట్టుగా, శత్రువును వ్యూహాత్మకంగా కాగితపు పులిగానూ, ఎత్తుగడల రీత్యా నిజమైన పులిగానూ భావించి మనం యుద్ధ సన్నాహాలు చేసుకోవాలి. శత్రువు పిరికితనాన్ని మాత్రమే చూసి వాడిలోని బలమైన అంశాలను చూడకుంటే మనమే ఎదురుదెబ్బలు తింటాం.

శత్రువు మన దాడులతో ఒక వంక భయంతో వణికి చస్తూనే మరో వంక మన పార్టీని సమూలంగా దెబ్బతీయడానికి అవసరమైన దీర్ఘకాలిక వ్యూహంతో సన్నాహాలు చేసుకుంటున్నాడు. పోరాటం బలంగా ఉండి మనకు కీలకమైన ప్రాంతాలు అనుకునే చోట శత్రువు బలమైన రక్షణ దుర్గాలను ఏర్పర్చి పెద్ద సంఖ్యలో బలగాలను మొహరిస్తున్నాడు. కీలకమైన స్థలాల్లో కొత్తగా పోలీసు క్యాంపుల్ని ఏర్పాటు చేస్తున్నాడు. ఉదాహరణకు పశ్చిమ బస్తర్‌లో తోయనార్, నెల్లీస్‌నార్, మోద్దుపాల్; గడ్చిరోలిలో నేలిగొండ, కోటి, తోడ్‌గట్ట; మాడ్‌లో చిత్రం, కోహ్కామెట్ట మొదలగు ప్రాంతాలలో కొత్త క్యాంపుల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నాడు. మన వ్యూహాత్మక ప్రాంతాల చుట్టూరా ప్రత్యేక పోలీసు జిల్లాలను ఏర్పాటుచేసి ప్రత్యేక శిక్షణ పొందిన బలగాల్నీ, అధికారుల్నీ నియమిస్తూ వారికి అధునాతన ఆయుధాల్ని సమకూర్చి చక్రబంధాన్ని ఏర్పరుస్తున్నాడు. ఇప్పటికే బీజాపూర్, నారాయణపూర్‌లను పోలీసు జిల్లాలుగా ప్రకటించాడు. భవిష్యత్తులో పఖాంజూర్, భామ్రాగఢ్‌లను కూడా పోలీసు జిల్లాలు చేయాలని చూస్తున్నాడు. డాంబర్ రోడ్ల నిర్మాణం చేస్తూ కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపర్చుకుంటున్నాడు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకునే మనం శత్రువు పథకాల్ని దెబ్బతీసే ఎత్తుగడలు రూపొందించుకోవాలి.

> - *శత్రు సప్లైలను అడ్డుకుందాం! శత్రు కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేద్దాం!*
> - *పోరాట ప్రాంతంలోని ప్రతి ఊరు ఒక ఉక్కు కోటగానూ, ప్రతి కుటుంబం ఒక విప్లవ కేంద్రంగానూ, ప్రతి యువతీ యువకుణ్నీ ఒక సాయుధ యోధగానూ తయారు చేద్దాం!*

మరో వంక ప్రజల్లో దినదినం పెంపొందుతున్న విప్లవానుకూల పరిస్థితిని సరిగ్గా అంచనా వేసుకొని విజయం పట్ల పూర్తి విశ్వాసంతో పురోగమించాల్సిన అవసరం ఉంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని భూభాగంతో కూడుకొని ఉన్న మన దండకారణ్యంలోని పరిస్థితిని గమనిస్తే ఛత్తీస్‌గఢ్‌లోని ప్రజలు రెండేళ్ల జోగి పరిపాలనలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ద్వారా తమకేమీ ఒరుగలేదనే విషయం గుర్తిస్తున్నారు. ప్రజలు కరువుకాటకాలతో సతమతమవుతూ ఉంటే జోగి ప్రభుత్వం నూతన రాజధాని నిర్మాణానికీ, స్థాపనా దినోత్సవ వేడుకలకూ కోట్లాది డబ్బు వృధాగా ఖర్చు చేస్తున్నది. టూరిజం అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని సామ్రాజ్యవాద దోపిడీకి నిలయంగా మారుస్తున్న జోగి దోపిడీ విధానాలను ఈ రెండేళ్ల పరిపాలనలో ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటూ వివిధ పోరాటాలలో మరింత చురుగ్గా కదులుతున్నారు. బస్తర్ ప్రాంతంలోని ప్రజలు మన పార్టీ నాయకత్వంలో దోపిడీ పాలకవర్గాల గ్రామస్థాయి ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేస్తూ (సర్పంచ్, సచివ్‌లచే రాజీనామాలు ఇప్పించి) ప్రజా రాజ్యాధికార అంగాలైన 'నాటెన సర్కార్' సంస్థలను ఏర్పర్చుకుంటూ ముందుకు వెళ్తున్నారు. కేంద్ర సర్కార్ ఈ మధ్యనే రిజర్వు భూముల్లోంచి ఆదివాసులను తొలగించాలని విడుదల చేసిన జీ.వో.ను గడ్చిరోలిలో అమలు చేయడం కూడా ప్రారంభించారు. పీపుల్స్‌వార్ నాయకత్వంలో గత 20 ఏళ్లుగా ప్రజలు ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్న వేలాది ఎకరాల భూముల్లోంచి ఆదివాసుల్ని ప్రభుత్వం బలవంతంగా బేదఖలు చేస్తున్నది. దీనితో ప్రభుత్వ దోపిడీ వర్గ స్వభావాన్నీ, ఆదివాసీ వ్యతిరేక స్వభావాన్నీ మరింత స్పష్టంగా అర్థం చేసుకుంటూ వేల సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వస్తున్నారు. రోజురోజుకూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజాయుద్ధం తప్ప మరో మార్గం లేదనే విషయాన్ని మరింత స్పష్టంగా గుర్తిస్తూ పోరాటంలో కదులుతున్నారు. ఈ మధ్య శత్రువుపై మనం చేపట్టిన టిసిఓసి క్యాంపెయిన్‌లో వందలాది యువతీయువకులూ, వేలాది మంది ప్రజలూ పాల్గొనడం కూడా ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నది.

> ➢ *పోరాట ప్రాంతంలోని ప్రతి అంగుళం భూమిని యుద్ధ రంగంగా మార్చి శత్రువును తన్ని తరుముదాం! ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పుదాం!*
>
> ➢ *'మహిళలేని విప్లవం గెలువబోదు' అనే స్ఫూర్తితో ఆకాశంలో సగమైన మహిళలను ప్రజాయుద్ధంలోనూ సగభాగం చేద్దాం!*

ప్రజాయుద్ధాన్ని పెంపొందించడానికి పరిస్థితి అద్భుతంగా, అనుకూలంగా ఉందనే విషయాన్ని గ్రహించి ప్రజల శక్తిపై పూర్తి విశ్వాసంతో పురోగమించాలి. శత్రువు పాలనను ధ్వంసం చేస్తూ ప్రజల రాజ్యాధికార నిర్మాణానికై విముక్తి ప్రాంత నిర్మాణ తక్షణ కర్తవ్యంతో ఈ కింది కార్యక్రమాలను అమలు చేద్దామని పిజిఏ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిన బూనుదాం.

## కర్తవ్యాలు

1. *గ్రామగ్రామాన మిలిషియాను నిర్మిద్దాం. వందలాది యువతీయువకుల్ని మిలిషియాలో చేర్చుకుందాం. మిలిషియాలో తర్ఫీదు పొందుతున్న సభ్యులను రెగ్యులర్ గెరిల్లా బలగాల్లో చేర్చుకుంటూ వందల సంఖ్యలో గల పిజిఏను వేల సంఖ్యలోకి పెంచుకుందాం. సెక్షన్స్, ప్లటూన్స్ స్థాయిలో గల పిజిఏను కంపెనీలు, బెటాలియన్లుగా అభివృద్ధి చేద్దాం.*
2. *ప్రజల దగ్గరున్న కత్తులు, గొడ్డండ్లు, విల్లంబులు, బర్మార్లు, గుంటేలు మొదలగు సాంప్రదాయ ఆయుధాలన్నింటినీ శత్రువుపై ప్రయోగిద్దాం. జంతువుల వేటకోసం ఉపయోగిస్తున్న భర్మార్లను శత్రు బలగాలపై గురిపెడదాం. శత్రువు ఆయుధాల్ని గుంజుకోవడానికి ఏ చిన్న అవకాశం దొరికినా ఉపయోగించుకొని పిజిఏ సాయుధ శక్తిని పెంచుకుందాం.*
3. *పోలీసు స్టేషన్లలోని, క్యాంపులలోని పోలీసులపై నిరంతరాయంగా దాడులు చేసి శత్రువుకు నిద్రపట్టకుండా చేద్దాం. శత్రువుకు తన క్యాంపుల రక్షణే పెద్ద పనిగా మారేలా చేద్దాం. గాలింపుల కోసం వచ్చే పోలీసు బలగాలపై మాటుదాడులు చేయడం ద్వారా శత్రువులో అభద్రతను పెంచి వాడి మనోస్థైర్యాన్ని దెబ్బతీద్దాం. పోరాట ప్రాంతంలోని ప్రతి అంగుళాన్నీ యుద్ధ రంగంగా మారుద్దాం.*
4. *మన బలమైన ప్రాంతాల నుంచి శత్రువును పూర్తిగా నిర్మూలించి తన్ని తరుముదాం.*
5. *గ్రామాల్లో ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేసి ప్రజల అధికారాన్ని నెలకొల్పుకుందాం.*

## యువతీయువకుల్లారా! ప్రజలారా!

మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకూ, బాధలకూ ప్రజాయుద్ధం మినహా మరో పరిష్కార మార్గం లేదు. పీపుల్స్‌వార్ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధం మనది. మనందరి విముక్తి కోసం జరుగుతున్న యుద్ధం కూడా. పీడిత ప్రజల కొడుకులూ, బిడ్డలతో ఏర్పడ్డ ప్రజా గెరిల్లా సైన్యం ఇప్పటి వరకు ప్రజలు సాధించిన చిన్నా పెద్దా విజయాలన్నింటిలోనూ ప్రజలకు అండగా నిలుస్తోంది. 'ప్రజా సైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు' అన్న వాస్తవాన్ని గ్రహించి పిజిఏను మరింత బలోపేతం చేసుకోవడం ద్వారానే, ప్రజాయుద్ధంలో ప్రజలంతా క్రియాశీలంగా పాల్గొనడం ద్వారానే మనం విముక్తిని సాధించగలం.

యువతీయువకుల్లారా! వందల సంఖ్యలో పిజిఏలో భర్తీ కండి. చేతికి దొరికిన ఆయుధాలతో సాయుధం కండి. ఏ చిన్న అవకాశం చిక్కినా శత్రువు ఆయుధాల్ని గుంజుకోండి. శత్రువుకు ఊపిరిసల్పనివ్వకుండా దాడులకు సిద్ధం కండి.

ప్రజలారా! మీ కొడుకుల్నీ, బిడ్డల్నీ పిజిఏలో చేరేలా ప్రోత్సహించండి. పిజిఏకు అన్ని విధాలా సహకరించండి. శత్రు దాడుల్నుండి పిజిఏ బలగాల్ని కంటికి రెప్పలా కాపాడుకోండి. శత్రువుపై యుద్ధానికి పిజిఏతో భుజం భుజం కలిపి నడువడానికి సిద్ధం కండి.

*విప్లవాభినందనలతో*

స్పెషల్ జోనల్ కమిటీ

సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]

*తేది : 02-12-2002* దండకారణ్యం

**సందేశం**

# పిజిఏ రెండవ వార్షికోత్సవానికి జేజేలు

## మన పోరాట ప్రాంతాల్లోకి అడుగు పెట్టడానికి దడుసుకునేలా శత్రువుపై గట్టి గెరిల్లా దెబ్బలు తీద్దాం !

## శత్రువు ఆయుధాల్ని గుంజుకోవడం ద్వారా పిజిఏ సాయుధ శక్తిని పెంపొందిద్దాం !!

## గ్రామగ్రామాన్ని యుద్ధ రంగంగా మార్చి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం !!!

*ప్రియమైన గెరిల్లా యోధులారా ! మిలీషియా సభ్యులారా ! ప్రజలారా !*

పిజిఏ రెండవ వార్షికోత్సవం జరుపుకోవడానికి తయారవుతున్న మీ అందరికీ మా విప్లవాభినందనలు. గత డిసెంబరు 2న పిజిఏ మొదటి వార్షికోత్సవం జరుపుకున్నప్పటి నుండి నేటి వరకు గడిచిన సంవత్సర కాలంలో శత్రువును దెబ్బ తీయడానికీ, ఆయుధాలు స్వాధీనం చేసుకోవడానికీ వేసవిలో జరిగిన టిసిఓసి (ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్) లోనూ ఇతర సందర్భాల్లోనూ నిర్వహించిన దాడుల్లో శత్రువుపై వీరోచితంగా పోరాడుతూ తమ నెత్తుటితో పిజిఏ జెండాను మరింత ఎరుపెక్కించి పిజిఏ కీర్తిప్రతిష్టల్ని ఉన్నతంగా నిలిపిన అమరులకు (డికెఎస్‌జెడ్‌సి సభ్యుడు కా. సుఖదేవ్, పిఎల్-2 సెక్షన్ కమాండర్ కా. జోగ (తిరుపతి–సన్ను) మిలీషియా కామ్రేడ్స్ జోగ వంజామి (ఉత్తర బస్తర్) బీమా లేఖామి (దక్షిణ బస్తర్) లకు ఈ సందర్భంగా వినమ్రంగా జోహార్లర్పిద్దాం!

భారత నూతన ప్రజాస్వామిక యుద్ధంలో పిజిఏ అవతరించి ఈ డిసెంబర్ 2తో రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. ఈ సందర్భంగా పిజిఏ మన దండకారణ్యంలో సాధించిన జయాపజయాల్ని నెమరేసుకుని, ఇంకా మనం సాధించాల్సిన కర్తవ్యాల్ని ముందుంచుకొని, అమరుల త్యాగాల స్ఫూర్తితో కర్తవ్య నిర్వహణకై ప్రతిన బూనుదాం.

2000 సంవత్సరం డిసెంబర్ 2న పిజిఏ ఏర్పాటుచేసిన వార్త ఎంతోమంది యువతీయువకుల్నీ, విప్లవ సానుభూతిపరుల్నీ, ప్రజానీకాన్నీ ఎంతగానో ఉత్తేజితుల్ని చేసింది. వారిలో విప్లవ విజయం పట్లా, పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వం పట్లా మరింత విశ్వాసాన్ని పెంచింది. అదే సమయంలో దోపిడీ వర్గాలకూ, ప్రభుత్వానికీ, దాని కిరాయి సైన్యాలకూ గుండెల్లో గుబులు పుట్టించింది.

తన మొదటి వార్షికోత్సవం సందర్భంగా పిజిఏ చేసిన విస్తృత ప్రచారం, దాడుల ద్వారా పిజిఏ యొక్క అవసరం, ప్రాముఖ్యతలతో బాటు పిజిఏ లో భర్తీ కావాలనే పిలుపు విస్తృతంగా ప్రచారం అయింది. డికెలో మనం పిజిఏలోకి భర్తీ చేసుకోవాలనే క్యాంపెయిన్‌ను సంవత్సర కాలం సాగించడం ద్వారా 350 మంది యువతీయువకుల్ని రిక్రూట్ చేసుకుని పిజిఏను సంఖ్య రీత్యా బలోపేతం చేసుకున్నాం.

గ్రామ గ్రామాన ప్రజా మిలీషియాను నిర్మించి శత్రువుపై యుద్ధాన్ని విస్తరింపజేయాలనే కర్తవ్యాన్ని తీసుకుని కృషి చేయడం ద్వారా పదుల సంఖ్యలో గల మిలీషియాను వందల సంఖ్యలోకి పెంచుకోగలిగాం. అనేక గ్రామాల్లో మిలీషియా నిర్మాణాలు ఏర్పడి పని చేస్తున్నాయి.

రెండు సార్లు శత్రువుపై "ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్" నిర్వహించడం ద్వారా, పిజిఏలోని ప్రధాన బలగాల్నీ (పిఎల్‌లు), సెకండరీ బలగాల్నీ (ఎస్‌జిఎస్‌లు, ఎల్‌జిఎస్‌లు), బేస్‌ఫోర్స్‌నీ (మిలీషియా) ఎలా సమన్వయంతో కదిలించాలనే విషయంలో అనుభవం పొందాం. వేసవి టిసిఓసి సందర్భంగా శత్రువుపై చేసిన వివిధ రకాల దాడుల్లో వందలాది మంది మిలీషియా సభ్యుల్నీ, వేల సంఖ్యలో ప్రజల్నీ భాగస్వాముల్ని చేయగలిగాం.

గత సంవత్సర కాలంగా మన పిజిఏ ప్రజలతో కలిసి శత్రువుపై వివిధ రకాల దాడులను నిర్వహించింది. ఇందులో ఏప్రిల్ నుండి జూన్ వరకు 3 నెలల కాలంలోనే (ఎత్తుగడల ఎదురుదాడి) శత్రువుపై 96 చర్యలు (యాక్షన్స్) చేసింది. ఇందులో ఆంబుష్‌లు, గ్రామాల్లో పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసుల మకాంలపై అపార్చునిటీ రెయిడ్స్, పోలీస్ స్టేషన్లపై కాల్పులు, ఇన్‌ఫార్మర్లను, సింగిల్ టార్గెట్స్‌ను ఖతం చేయడం, భూస్వాముల, ప్రజావ్యతిరేకుల ఆస్తులు జప్తు చేసుకుని ప్రజలకు పంచడం, వివిధ రకాల ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడం లాంటి ఘటనలున్నాయి. ఆ తర్వాత ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో 3 చోట్ల (వెదిరె, కోటి, పద్దూర్) రెయిడ్స్, 4 చోట్ల (ఉసికపట్నం, చెర్‌పల్లి, కర్కెలి, కోటి) ఆంబుష్‌లు చేసింది. ఇందులో గడ్‌చిరోలిలో కమాండో బలగాలతో ప్రయాణిస్తున్న ఎస్‌పి కాన్వాయిపై కోటి వద్ద ఆంబుష్ చేయగా 5గురు కమాండోలు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ బస్తర్‌లో భూపాలపట్నం సమీపంలోని చెర్‌పల్లి వద్ద బిఆర్‌ఓకు రక్షణగా వచ్చిన పోలీసులపై ఆంబుష్ చేయగా 5గురు చనిపోయి మరికొందరు గాయపడ్డారు. మొత్తంగా ఈ సంవత్సర కాలంలో పిజిఏ చేసిన దాడుల్లో ఒక ఏకె సహా 7 ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నాం. *(తరువాయి 42వ పేజీలో .....)*

***శత్రువును దెబ్బతీసే ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుందాం !***

***పోరాట ప్రాంతాల్లోకి వచ్చే శత్రువును వదలకుండా దెబ్బతీద్దాం !***